
# ఎన్ని కోణాలు! ఎన్ని చూపులు!

(జయకాంతన్ కథలు)



మూలం: తమిళం

అనువాదం:
ఏండీ
సుందరేశన్

# ఎన్ని కోణాలు! ఎన్ని చూపులు!

## (జయకాంతన్ కథలు)

**మూలం: తమిళం**

**అనువాదం: ఏండీ సుందరేశన్**

**Published By**

**Kurinji Publications**
**10944 San Pablo Avenue #610**
**El Cerrito, CA 94530-2377**
**Email:**
**rangan.sundaresan@gmail.com**

**ENNI KONALU! ENNI CHUPULU!**
(Jayakanthan's short Stories)
**ఎన్ని కోణాలు! ఎన్ని చూపులు!  (తెనుగు అనువాదం)**

First Edition, 2022
D.Jayakanthan/Andy Sundaresan

**Cover Design:**
Amir Butt

The translator acknowledges with thanks the permission to use the author's photographs/contents from the **Jayakanthan Pavazavizah Malar**, published by Nakkeeran Gopal.

**Printed at:**

The Copy World
1375 University Avenue
Berkeley, CA 94702
Telephone: 1-800-690-2679(Toll Free)

# ఎన్ని కోణాలు! ఎన్ని చూపులు!

## (జయకాంతన్ కధలు)

### మూలం: తమిళం

### అనువాదం: ఏండీ సుందరేశన్

**Published By**

**Kurinji Publications**
**10944 San Pablo Avenue #610**
**El Cerrito, CA 94530-2377**
**Email:**
**rangan.sundaresan@gmail.com**

# ఇందులో

ముందు మాట

పేకాట

ముట్టడి

సతీసహగమనం

పాతివ్రత్యం

అంతరంగం పవిత్రమైనది

ఒక హీరోకి ఒక హీరోయిన్

కొత్త ప్రతిమలు

కొత్త యుగంవైపు తొలి అడుగులు

ఎన్ని కోణాలు! ఎన్ని చూపులు!

నేనేం చెయ్యాలి, చెప్పండి!

# ముందు మాట

ఈ సంపుటంలోని కథలన్నీ స్త్రీజాతి మహిమని చాటే కథలు. ఇవన్నీ 1960 -1969 మధ్యకాలంలో జయకాంతన్ రాసారు.

ఇందులోని ***ఎన్ని కోణాలు!, ఎన్ని చూపులు!*** కథని ఈ సంపుటంకి సూచనగా పేరుబెట్టడం గమనార్హం. ఈ కథల్లో స్త్రీ పాత్రలని వివిధ కోణాల్లో, నానావిధమైన కథాంశాలలో - ఈ ఆధునిక ప్రపంచంలో ఎన్నో ఆటుపోట్లని ఎదురుకొంటూ తమని తామే రక్షించుకుంటూ తమ ఇంటినీ, తమ పిల్లల్ని మాత్రమే కాకుండా తమలోని సంస్కారాన్ని, సంప్రదాయాలని కూడా రక్షించుకుంటూ ముందుకు పోతున్న స్త్రీ జాతి ప్రతినిధులని - రచయత జయకాంతన్ సునిశితంగా ఆవిష్కరించారు.

ఎన్ని విభిన్నమైన పాత్రలు! స్త్రీ పురుషుల ఎన్ని మధ్య అంతరంగ సంఘర్షణలు, అసమానతలు!

తమిళ రచయత, విమర్శకులు నవభారతి (1944-2017) ఈ పాత్రలగురించి రాసినది ఇక్కడ గుర్తుచేసుకోవాలి:

> ". . . జయకాంతన్ సృష్టించిన పాత్రలన్నీ ఉత్తికే అతని కథల్లో వచ్చేవికావు, వాటికి ఉండేది సాహిత్యసంబంధం మాత్రమేకాదు. ఆ పాత్రలన్నీ ఆ కథల అవతల - మనలో, మన మధ్య - జీవిస్తున్నారు. వాళ్ళకి అన్ని విధాల ప్రశ్నలున్నాయి, అవి కథలతో ముగించిపోవు, ఆ తరువాత కూడా సాగుతాయి. ఆ ప్రశ్నలు వ్యక్తిగత భావనలు, కొఱతలుగా ఆరంభించి, ఆఖరికి సామాజిక అవస్థని బాధించే సమస్యలుగా కనిపిస్తాయి . . ."

ఈ పాత్రలని ఆ ఆ కథల నేపధ్యంలో పరిశీలించి చూద్దాం:

- మీనా ***(సతీసహగమనం)*** ఒక తీవ్రవాదిగా ఈ ఆధునిక యుగంలో మనం చూస్తున్న ఒక పాత్ర. ఆమె అక్కయ్య రాజం ***(పాతివ్రత్యం)*** ఆమెకి పూర్తిగా వైరుధ్యం.

  ఈ రెండు కథలూ వరుసగా చదవాలి, అప్పుడే ఆ భిన్నత్వం మనకి బాగా బోధపడుతుంది.
- జానకి ***(పేకాట),*** సీత**(ముట్టడి)**, రమణీ అమ్మాళ్ (***అంతరంగం పవిత్రమైనది***), రాజంలాగే సామాజిక, కుటుంబ నియమాలు గౌరవించే గృహిణులు. దాంపత్యంలో సరిపడని, పరస్పర విరుద్ధమైన ప్రశ్నలని సహనంతో భరించి, ఆమోదించుకున్న తరువాత వాళ్ళ కుటుంబాలు కూలిపోకుండా సాగుతున్నాయి. తన భర్త అనిష్టమైన పనులు చేస్తున్నారని తెలిసినా, రమణీ అమ్మాళ్ అతన్ని వదులుకోదు. ఎందుకు? ఉలికిపడిన తన కొడుకికి ఆమె చెప్పిన మాటలివి: "అతనికి నన్ను మించిన సహకారి మరెవరూ లేరు . . . ." అంటే తన ఉనికి అతనికి ఎంత అగత్యమని ఆమెకి తెలుసు. తనొక భార్య, ఇల్లాలు, ఇంటి యజమాని. కాని భర్త అంతరంగంని గౌరవించడం ఒక 'సభ్యత' అని ఆమె నివ్వెఱపోయిన తన కొడుక్కి చెప్తోంది.
- మధురం ***(ఒక హీరోకి ఒక హీరోయిన్)*** వంటి ఇల్లాలు సహజంగా ప్రదర్శించే దృక్పథంకి ఒక అవధి, హద్దు ఉందని భర్త సీతారామన్ గ్రహించక పోవటం చాలామందికి వింతగా కనిపించదు. ఆఖరికి, సామాజిక విలువల మీద తిరగబడిన ఆమెకి, ఆ 'హీరో'ని తన ఇంటినుంచి శాస్వతంగా వెళ్ళగొట్టిన తరువాత, ఎంతైనా గుర్తింపు వస్తుందని ఆశిద్దాం!
- యువతులు మాత్రమే కాదు; 'కాలం మారుతోంది, కొత్తయుగం వచ్చేసింది!' అనే ప్రజ్ఞతో వయస్సు చెల్లిన నానమ్మ(**కొత్త ప్రతిమలు)**,శంకరి అవ్వ(***ఎన్ని కోణాలు! ఎన్ని చూపులు!),*** గౌరి

అవ్వ(***కొత్త యుగంవైపు తొలిఅడుగులు***),నవతరాల అభిలాషలకి దోహదం చేస్తున్నారు.

- ఆఖరికి, నా మనసులో పాతుకుపోయిన, సరసమైన రెండు అంశాలు చెప్పాలనివుంది: ఈ ఆదునిక యుగంలో, స్వచ్ఛందంగా వైధవ్యం పూనుకున్న మీనా తన నిర్ణయంకి వివరించిన న్యాయోచితత్వం; లాటరీలో లక్షరూపాయలు గెలిచిన చీటీని చెయిలో పెట్టుకొని పెనుగులాడే ఆ ఇల్లాలు(***నేనేం చెయ్యాలి, చెప్పండి!***) చివరకి ఏం చేసిందనే మనకి చెప్పని రచయత: అతను దాన్ని మన కల్పనకే వదిలేసారు!

ఇంతకుముందు రచయత జయకాంతన్ అనుమతితో ఈ కథలన్నీ నేను ఇంగ్లీషులో అనువదించాను. ఇప్పుడు అతని కొమార్తె దీపలక్ష్మి అనుమతితో మీకు తెలుగులో అందిస్తున్నాను. ఆమెకు నా కృతజ్ఞతలు.

నా తెలుగు అనువాదాలు ఓపికతో చదివి, సలహాలిచ్చిన అక్కయ్య శెల్వి విశ్వనాధన్ కి నా ధన్యవాదాలు.

July 30, 2022 ఏండీ సుందరేశన్

# అనువాదకుని సందేశం

- ఇందులోని కథలు తెలుగులో అనువదించడానికి నాకు అనుమతి ఇచ్చిన జయకాంతన్ కొమార్తె దీపలక్ష్మికి నా కృతజ్ఞతలు;
- ఇందులోని జయకాంతన్ ఫోటోలు నక్కీరన్ సంస్థ అనుమతితో ప్రచురిస్తున్నాం;

********

# పేకాట

జానకి ఒక కొత్త వాయిల్ చీర కట్టుకొని గోడమీదున్న అద్దంముందు నిలబడి తను దువ్వుకున్న జుత్తుని ఇంకొకసారి సరిచూసుకుంది. చెమటవలన సెత్తిమీద కుంకుమబొట్టు కొంచెం తారుమారుగా కనిపించడం చూసి చేతివ్రేలుతో చీర మొన అందుకొని దాన్ని చిన్నదిగా దిద్దుకుంది. 'ఇదీ బాగానే ఉంది' అని తృప్తిపడుతూ, గాజుల డబ్బాలోనుంచి తను జాగ్రత్తగా నాలుగుసార్లు మడతబెట్టి కాపాడిన రెండురూపాయల నోటు బయటకి తీసింది. అప్పుడే రవి - ఆమె రెండేళ్ళ పిల్లవాడు - పలుచబాటిన తన రెండు కాళ్ళతో నేలమీద పాకుతూ వచ్చి, తల్లికాళ్ళముందు నిలబడి ఒక ఎగురు ఎగిరాడు.

పిల్లవాడిని ఎత్తుకొని, జానకి కిటికీ పక్కన కూర్చోబెట్టి, తను ఉతికిన ఒక కొత్త చొక్కాయి వాడికి తొడిగించింది. జుత్తుని లాలించి, కొంచెం తైలం రుద్ది, దువ్విన తరువాత నెమ్మదిగా పౌడరు పిల్లవాడి మొహంలో తట్టింది. బుగ్గలు తాకి మద్దాడిన తరువాత దిష్టి తీసింది. పిల్లవాడిని చంకలో ఎత్తిబెట్టుకొని గడియారం చూసినప్పుడు రెండు గంటలని తెలిసింది.

"ఏమే, ఈ మండుటెండలో పిల్లవాడిని ఎత్తుకొని సినిమాకి వెళ్తున్నావా?" తను అడిగిన ప్రశ్నకి జానకి ఎలా చిఱచిఱలాడుతుందో అని భయపడుతూనే, పొడినవ్వుతో సరస్వతమ్మగారు నిలబడ్డారు.

"అవును . . . వెళ్తున్నాను . . . మీకేం?"

"సరేలే, వెళ్ళమ్మా, నేను వద్దనను . . . ఎండ తీవ్రంగా ఉందని అన్నాను . . . అంతలోనే నేనేదో అత్తగారి స్థానంలో అధికారం చెలాయించుతున్నట్టు మండిపడుతున్నావే?"

"అత్తగారి స్థానంలో అధికారం చెలాయించవద్దని ఎవరన్నారు? కాని దానికిముందు మీ అబ్బాయికి భర్త స్థానం అంటే ఏమిటో నేర్పించండి."

జానకి నోటినుంచి ఇలాగే - కాల్చినట్టు - తీక్ష్ణమైన మాటలు తరచుగా వస్తూంటాయి. 'అదీ న్యాయమేకదా?' అని సరస్వతమ్మ సహించుకుంటారు.

"నేనేం చెయ్యను? 'కన్నతల్లి, నా కర్మ!' అని ఏడవలసిందే!" అని ఆవిడ తనలో గొణుక్కుంటారు.

'ఏమే, వాడికేం తక్కువ? వాడిని పెళ్ళి చేసుకొని ఒక పిల్లవాడికి తల్లైన తరువాతకూడా నీకెందుకు వాడంటే ఉదాసీనత?' అని ఒకసారి కోడలిని అడిగి దాని ఫలం ఏమిటో ఆవిడ బాగా అనుభవించారుగా? ఒకటా, రెండా, ఎన్ని మాటలు! అబ్బబ్బా!

"అవును, మీరే కన్నారు, ఆ బాధ మీరు పడవలసింది న్యాయం. దానితోబాటు నాకు చేసిన పాపంకి కలిసి ఏడవండి! . . . బాబూ, రారా, మనం వెళ్దాం" అని జానకి పిల్లవాడిని తీసుకొని బయలుదేరింది.

"ఏమైనా, . . . నీ మొగుడితో ఒక మాట . . . " అని అనాలని ఆవిడకి అనిపించింది, కాని నోట ఏ మాటా రాలేదు. జానకికి అదే ఆలోచన వచ్చిందేమో?

'అవును, మహా గొప్ప మొగుడు! అని గొణుక్కుంటూ ఆమె వీధిలోకి దిగి నడిచింది.

సరస్వతమ్మ ఆమెను చూస్తూ గడపదగ్గర నిలబడ్డారు.

మే మాసం, వేసవి కాలంలో, నల్లటి తారు రోడులో, పాదరక్ష లేకుండా, పిల్లవాడిని చంకలో పెట్టుకొని జానకి నడుస్తోందే? అసలు సినిమా అంటే దానికి అంత పిచ్చా?

కొన్ని సమయాల్లో జానకి ఇలాగే మతిమీరి ఏమైనా చేస్తుంది. అది వికలాంగులకి ఏర్పడే వెట్టిలాగ; దాన్ని ఒక విధంగా ఇతరులకి తెలియజేయాలని ఆవేశం కలుగుతుంది; అప్పుడే ఆమె మనసుకి శాంతి కలుగుతుంది.

అసలు జానకి జీవితంలోని వైకల్యం ఏమిటి?

గడపలో నిలబడుతూ జానకి స్వరూపం తన కళ్ళనుంచి మాయమైన తరువాత సరస్వతమ్మ ఒక నిట్టూర్పు వదిలి మళ్ళీ ఇంట్లోకి ప్రవేశించినప్పుడు గోడలో వేలాడుతున్న జానకి - శివస్వామి పెళ్ళి ఫోటో చూసారు.

శివస్వామి ఆవిడ కొడుకే; కాని అతన్ని పెళ్ళికొడుకుగా చూడడంలో ఆవిడకి ఎటువంటి సంతోషమూ లేదు.

అందగత్తె జానకికి పక్కనే, పొట్టిగా, లావుగా, ఇదేం అవలక్షణం! మకమకలాడే ఆ కళ్ళూ, ఆ వెర్రి నవ్వూ, ముందుకు తోసుకొని వచ్చే ఆ పళ్ళూ . . .ఎంత ఘోరం!

'పాపం జానకి!'

పెళ్ళికి ముందు అమ్మాయి ఎన్ని కలలు కన్నదో ఎవరికి తెలుసు? అంతరాత్మలో లేచిన అన్ని మధుర అభిలాషలూ చెరుపుకొని వాడిపక్కన ఎలాగ నిలబడిందో!

'నేనే పాపిని . . . నా కొడుకు కోసం ఈ అందాల అమ్మాయి బతుకు నాశనం చేసాను!' అని అంటూ సరస్వతమ్మ చీరమొనతో కన్నీళ్ళు తుడుచుకున్నారు.

శివస్వామికి లభించిన భార్యను చూసి ఊరంతా విస్తుపోయింది. పిల్లకాయలుకూడా అతన్ని 'శివస్వామి' అని ఉత్తికే పిలవరు. అతని పేరంటేనే అంత నవ్వులాట! 'జడ్డి శివస్వామి', 'మంకు శివస్వామి', 'పిచ్చి శివస్వామి', 'జపాను శివస్వామి' - అని అందరూ అతన్ని ఎగతాళి చేసినప్పుడు ఆ తల్లి మనసు ఎలా నొచ్చుకుంది!

అటువంటి శివస్వామికి, రూపవతి, పేదయైన జానకిని పెళ్ళిచేసి పగతీర్చుకున్నందుకు సరస్వతమ్మ సంతోషించింది. కాని కొన్నిరోజుల తరువాత తను చేసినది మహా పాపమని గ్రహించి ఆవిడ రోజూ కన్నీరు కార్చుచున్నారు.

శివస్వామి ఒక జడ్డి, అందగాడు కాదు అనే తలవంపు మాత్రం కాదు. అతనిలో మోటుతనం, సహజంగా చిరచిరలాడే గుణం ఉందని గ్రహించిన జానకి, తన బతుకు నరకమైపోయిందని ఆత్మహత్య గురించికూడా ఆలోచించేది. అటువంటి సమయాల్లో సరస్వతమ్మ జానకికి ఇచ్చిన ఆశావాదం - ఆదరణ, ధైర్యం - ఆమెను కాపాడాయి.

జానకి శాశ్వతంగా జీవించడానికి ఆమెకు ఒక కొడుకు పుట్టాడు. ఆ బిడ్డ వచ్చిన తరువాత ఆమెలో అహంకారం, మోటుతనం గూఢంగా చోటుచేసుకున్నాయి. శూన్యం, అంధకారం నిండిన జీవితంలో తనొక దీపం వెలిగించుకొని నిలబడిన గర్వం ఆమెకి కలిగింది.

జీవితంలో తనకేర్పడిన - తన మనసుకిమాత్రం తెలిసిన నిరాశని - పగతీర్చుకోవాలనే పథకంలో జానకి అందరినీ అలక్ష్యం చేసింది. ఆమె భర్త? అసలు

అతనికీ భార్య అంటే ఉపేక్షే కదా? ఆమె తన్ను నిర్లక్ష్యం చెయ్యడం అతనికి తెలుసు. ఎప్పుడైనా ఒకసారి అధికారం చెలాయించడమే పురుషలక్షణం అని అతని ఉద్దేశం. అటువంటి సమయాల్లో జానకి భర్తని సముచితంగా ఎత్తిపొడిచి మాటాడుతుంది. భార్య చెప్పేదేదో వినకుండానే, ఆ మాటల్లోని గూఢార్థం గ్రహించకుండానే, జానకి తనకి ఎదురుగా మాటాడుతోందని అనే భావనలో శివస్వామి ఆమెతో మూర్ఖంగా మొత్తులాడేవాడు.

"ఇవన్నీ చూడాలనేగా మీరు ఈ పెళ్ళి చేసారు? చూడండి! తనివితీరా చూసి ఆనందించండి!" అని జానకి బొబ్బలు పెడుతుంది.

'అవును, అది చెప్తున్నది న్యాయమేకదా?' అని సణుగుతూ సరస్వతమ్మ ఆ దంపతుల జగడం అంతమయేవరకూ మరెక్కడో వెళ్ళిపోతారు.

ఐతే ఈ గొడవ చెదురువాటుగా జరిగేదే. తక్కిన రోజుల్లో శివస్వామి తనంతట తనే పిచ్చిగా ఏదో వాగుతూంటాడు; అదెవరూ లెక్కచెయ్యరు.

శివస్వామి ఆఫీసునుంచి రాగానే అతని ఇంటి వసారాలో పేకాట ఆరంభమౌతుంది. అతన్ని తప్పిస్తే ఆడేవాళ్ళందరూ వేరే వేరే వీధుల్లో కాపురమున్నారు. ఆ గుంపులోని రామభద్రన్ శివస్వామి ఆపీసులో సహోద్యుడు. అతనుండేది తాంబరంలో. అతనుగాని పేకాటకి వచ్చాడంటే 'ఆఖరి ఎలెక్ట్రిక్ ట్రెయిన్ కి ఇంకా పది నిమిషాలే ఉన్నాయి' అని ఎవరైనా చెప్పగానే ఆట ఆపుతారు.

రాత్రి ఎనిమిది గంటలవగానే జానకి మరెవరినీ ఎదురుచూడక, ఒంటరిగా, పిల్లవాడిని కౌగిలించుకొని నిద్రబోతుంది. సరస్వతమ్మ గడపదగ్గర నిలబడి సగం నిద్రలో "శివస్వామి, టైము పదకొంటు అవబోతుందిరా!" అని అన్నతరువాతే అతను లేచివస్తాడు. అందరూ నిష్క్రమించిన తరువాత తల్లి అన్నం వడ్డించినప్పుడుకూడా పేకాట గురించే - తను ఆటలో ఏం తప్పు చేసాడో, తనెందుకు ఓడిపోయాడో - శివస్వామి వాగుతూంటాడు.

** ** **

"అమ్మా, అదేంటి, నువ్వు ఆ ఫోటో చూస్తూ నిలబడిపోయావ్? ఇంకొకసారి పెళ్ళి సంబరాలు చూడాలని ఉందా? నాకూ ఇష్టమే, కాని ఇప్పుడు కాఫీ కావాలి, నాలుగు

గ్లాసులు!" అనే మాటలు విని సరస్వతమ్మ తిరిగి చూసారు. వసారాలో పేకాటకి గుంపు జమా ఐంది.

"ఓ, ఇవాళ శనివారం కదూ? దానికేం, కాఫీ చేస్తానులే . . .  పాలవాడు ఇంకా రాలేదు, ఇది వచ్చే సమయమే . . . " అని అంటూ కొడుకు హాస్యం లెక్కచెయ్యకుండా, మూతి ముడుచుకొని సరస్వతీ అమ్మాళ్ వంటగదికి వెళ్ళారు.

"జానకి ఎక్కడ?"

"సినిమాకి వెళ్ళింది."

"ఎవరికి చెప్పి వెళ్ళింది?"

"ఎవరికి చెప్పాలి? నాకే చెప్పింది."

"లేదు. దానికి రానూ రానూ పొగరు ఎక్కువై పోయింది! ఆ పొట్ట పిల్లవాడిని తీసుకొని ఈ మండుటెండలో . . . హూం, అది రానీ . . . " అని శివస్వామి గర్జించాడు.

"ఏం, అదేం తప్పు చేసిందని? ఈ ఎండలో గాలి కూడా లేదు . . . 'ఇంటిలో ఉక్కగా ఉంది, నువ్వు వెళ్ళిరావమ్మా!' అని నేనే చెప్పాను."

"సరేలే, అదెలాగైనా పోనీ! . . . " అని విసుగ్గుంటూ పేకముక్కలు పోగుచేసుకొని, రెండు జమ్ముచాపలు మోసుకొని శివస్వామి వసారాకి వెళ్ళాడు.

"రామభద్రన్ ఎక్కడ? ఇవాళ కనిపించడేం?" అని గుంపులో ఎవరో అడిగారు.

"మనం నాలుగుమంది ఉన్నాం, వాడిగురించి ఎందుకు బాధ?"

శివస్వామి పేకముక్కలు పంచిపెట్టాడు; ఆట ఆరంభమైంది.

** ** **

'సరైన ఈడూ జోడూ అంటే మనం చూసేది సినిమాలో మాత్రం కాదు! అదిగో, ఆ జంట ఎంత ఆనందంగా ఆడుతూ పాడుతూ . . . ' చంకలో బిడ్డతో నడుస్తున్న జానకిని తాకుతూ ఒక పట్టు చీర ముందుకు నడిచింది; జానకి తలెత్తి చూసింది.

ఆ జన సమూహంలో ఒక యువ జంట; యువకుడు తన చెయిని యువతి నడుందగ్గర పోనిచ్చి - ఆమెను కౌగిలించే ధోరణిలో - నడుస్తున్నాడు. అతను

నడుస్తూంటే - అతనూ చూడడానికి సొగసుగానే ఉన్నాడు - అతని భుజం మీద, తళతళలాడే బుష్ కోటుని తాకుతూ ఆ యువతి సిల్కుచీర ముందుకు సాగుతోంది.

'వాళ్ళు ఎంత హాయిగా కనిపిస్తున్నారు! సినిమాల్లో మనం చూస్తున్నట్టు నిజ జీవితంలోనూ మనుషులు ఉన్నారు! నేను పాపిని . . . అటువంటి జీవితం సాధ్యం అనికూడా నేను కల్పన చెయ్యలేను, అందుకు నా బతుకే కారణం.' జానకికి బిగ్గరగా ఏడవాలనిపించింది. సినిమా చూస్తున్నప్పుడు ముందువరుసలలోని ప్రేక్షకులు తెరలో ప్రేమ సన్నివేశాలలో ఈల వేసి సందడి చేసినప్పుడు జానకికూడా ఆతురతగా చూసి ఆనందించింది. కాని మనసులో ఈర్ష్య, నిరాశ చోటుచేసుకున్నాయి. కొన్నిసార్లు కన్నీరు కార్చిందికూడా! అవును, దానికి పేరు వైకల్యం! ఆ పరిస్థితిలో ఏడ్చినా, అసూయపడినా ఒక విధమైన సుఖముంది. అందువలనే జానకికి సినిమా పిచ్చి పట్టుకుంది.

సినిమా కాంపౌండు వదిలి బయటికి రాగానే జానకి ఎదుటనున్న హోటలుకి దారితీసింది.

హోటల్లో ప్రవేశించగానే, ఒక మూలనున్న మేజాలో కూర్చొని ఒక స్వీట్ ఆర్డరు చేసింది.

సర్వర్ తెచ్చిన జిలేబిని మెల్లమెల్లగా పిల్లవాడికి తినిపించింది. ఆ తరువాత తన కాఫీని చల్లారించినప్పుడే తన్ను ఇంతసేపూ ఎవరో - ఒక వేళ తన భర్తేమో? - తేరిచూస్తున్నట్టు ఒక భావన కలిగింది. తలెత్తి చూడగానే రామభద్రన్ కనిపించాడు.

'ఎక్కడో చూసిన మొహం . . . ' అని జానకి తనలో చెప్పుకుంది. తన భర్తతో పేకాటకి తరచుగా వచ్చేవాడని జ్ఞాపకం రావడానికి కొంచెం సమయం పట్టింది.

రామభద్రన్ ఒక చిరునవ్వు నవ్వాడు. జానకి లేతగా నవ్వింది.

ఇవాళే రామభద్రన్ని జానకి పూర్తిగా చూస్తోంది; మనిషి ఎంత సొగసుగా ఉన్నాడు!

చాలా రోజులుగానే రామభద్రన్ జానకి అందచందాలు చూస్తున్నాడు.

చెయి కడుక్కోవాలని జానకి లేచినప్పుడు ఆమె పక్కన వచ్చి నిలబడి, చాలా పరిచయంవున్నట్టు " సినిమాకి వెళ్తున్నారా?" అని అడిగాడు.

"లేదు. సినిమా చూడడమైంది."

"అబ్బాయీ, నువ్వూ సినిమా చూసావా? నీకు నచ్చిందా?" అని ముద్దాడుతూ రవిని తన చేతులతో ఎత్తి మేజామీద రామభద్రన్ నిలబెట్టాడు; పిల్లవాడి రెండు కాళ్ళూ కింద వాలిపోయాయి.

"ఏమైందని? వీడికి నిలబడడం చేతకాదా?"

"అదేమో నాకు తెలీదు . . . రెండేళ్ళు నిండాయి, ఇంకా అలాగే ఉన్నాడు . . . మందులూ, టానిక్కులూ ఇస్తున్నాం . . . దేహంలో ఏదో దోషం ఉందని డాక్టరు అంటున్నారు . . . వాళ్ళ నాన్నగారు వాడిని సొట్టబ్బాయి అనే పిలుస్తున్నారు . . . వాడి బతుకు అలాగే ఐపోతుందేమో అని నాకు బెంగగా ఉంది."

"మీకేం భయం వద్దు! . . . ఇంకా ఆరుమాసాలలో పిల్లవాడు నడుస్తాడు - ఇది body weakness! అంతలోనే ఆ జడ్జి వీడిని సొట్ట అని పిలుస్తున్నాడా, బాగుంది! అబ్బాయీ, ఇంకొకసారి మీ నాన్న నిన్ను సొట్ట అని పిలుస్తే 'నేను మీలాగ సొట్ట కాదు!' అని చెప్పేయ్ . . . తెలిసిందా?" అని రవికి చెప్పి జానకిని చూసి రామభద్రన్ ఒక చిరునవ్వు నవ్వాడు.

అతని మాటలు జానకి మనసుని పొడిచాయి; కాని నవ్వేసి ఊరుకుంది.

సర్వరు బిల్ తీసుకొనివచ్చి మేజామీద పెట్టాడు. జానకి దాన్ని అందుకున్నప్పుడు రామభద్రన్ "నేను ఇస్తాను" అని ముందుకున్నాడు. ఇద్దరి వేళ్ళు తాకటంతో బిల్ మేజానుంచి నేల వాలింది. రామభద్రన్ వోంగి దాన్ని తీసుకున్నాడు.

జానకి మోహం ఎఱ్ఱబడింది. 'ఇంత త్వరలో ఇంత చనువు ఎలా ఏర్పడింది?' అని నివ్వెరపోయి, నవ్వుతూ, పిల్లవాడిని ఎత్తుకుంది.

హోటలు గడప దాటి బయటకి వచ్చేవరకు జానకి మొహంలోని ఎఱ్ఱదనం పోలేదు. వెనుకనుంచి రామభద్రన్ మాటలు వినిపించాయి: "మీరేం కంగారు పడవద్దు. బీచుకి వెళ్ళి రోజు పిల్లవాడిని ఒక గంటసేపు నడుంవరకు ఇసుకలో నిలబెట్టారంటే, ఒక నెలలో వాడు నడుస్తాడు. కాలుకి బలం వస్తుంది."

"అలాగా?"

"అవును. కావాలంటే మీరు చేసి చూడండి. ఇప్పుడు మీరు తిన్నగా ఇంటికి వెళ్తున్నారా? ఇప్పుడే వెళ్ళి . . . . అబ్బాయీ, నువ్వు బీచ్ కి వస్తావా?" అని పిల్లవాడిని ముద్దాడుతూ రామభద్రన్ జానకిని చూసాడు.

'వద్దు!' అని అనాలని ఆమెకు ముందు అనిపించింది. కాని రామభద్రన్ కంఠధ్వని వినడంలో, అతని నవ్వుతూంటే చూడడంలో ఒక విధమైన ఆకర్షణ, సుఖమూ ఉన్నాయని గ్రహించి, జానకి సరేనంది.

సమయం ఆరుగంటలే ఐంది. ఎండ ఇంకా తీవ్రంగానే ఉంది. ఒక పడవ నీడలో పిల్లవాడు నడుంవరకు నిలబడడానికి ఒక పల్లం తవ్వి, వాడిని అందులో నిల్చోబెట్టి, జానకి, రామభద్రన్ ముఖాముఖిగా, మౌనంగా కూర్చున్నారు.

జానకికి ఎందుకో ఏడవాలనిపించింది. 'ఒక పరాయి మగవాడి ముందు ఏడవడమా?' అని తలుచుకొని కలవరపడింది. ఆతనూ ఏదో జ్ఞాపకంలో ఆకాశాన్ని చూస్తూ కూర్చున్నాడు. మాటిమాటికీ నిట్టూర్పులు వదిలాడు; నుదుట రుద్దుకున్నాడు.

"ఇవాళ శనివారంకదా? మీకు ఆఫీసునుంచి తిన్నగా ఇంటికి వెళ్ళాలనిపించలేదా?"

"రెండురోజులుగా నాకు మనసే సరిగ్గాలేదు. నేను ఇంటికి వెళ్ళలేదు, ఆఫీసుకీ వెళ్ళలేదు!"

"అయ్యయ్యో, అలాగ ఉంటే ఎలాగ? మీ ఆవిడ ఊరులో లేదు కాబోలు!" అని అంటూ జానకి నవ్వింది.

"అలాగైతే మంచిదే, నేనూ హాయిగా ఉంటాను . . . కాని అది ఇంట్లోవుంది, నా ప్రాణం తీస్తోంది . . . నా కర్మ!"

"అయ్యో, తిట్టకండి . . . మీ ఆవిడని మా ఇంటికి తీసుకురండి . . . "

"ఇదేం గొడవరా!" అని రామభద్రన్ విసుగ్గున్నాడు.

"ఏం, మేం ఎవరూ మీ ఆవిడని చూడకూడదా? మేం ఆవిడని పేకాటకి పిలుస్తాం అని మీకు భయమా? ఆ భయం వద్దు!" అని జానకి మళ్ళీ నవ్వింది.

"తప్పకుండా చూసితీరాలంటే నా మాట వినండి . . . మీ శివస్వామికి చీరకట్టి చూస్తే ఎలాగుంటుంది? అదే నా భార్య . . . నా కర్మ!"

ఒక క్షణం జానకి స్తంబించిపోయింది.

"మరెందుకు పెళ్ళిచేసుకున్నారు?"

"కర్మంటే అదే . . . వాళ్ళ నాన్నగారే నన్ను చదివించారు . . . బోలెడు ఆస్తి . . . ఒకే ఒక కూతురు, వారసు."

"ఏది ఎలాగైనా మీకు ఓదార్పు ఉంది . . . " అని జానకి చెప్పడం ఆరంభించి నాలిక కఱచుకొని మౌనం వహించింది.

"చెప్పండి . . . మీ మనసులో ఏముందో చెప్పండి! . . . నేను అపార్థం చేసుకోను!"

"మరేంలేదు!"

"మీరేదో చెప్పదలచుకున్నారు, కాని దాచుకుంచున్నారు . . . మనిద్దరి పరిస్థితి ఒకటే అని మీ ఉద్దేశం కదూ? మీ ఇంటికి వచ్చిన మొదటిరోజే మిమ్మల్ని చూసి నా మనసు ఏడ్చింది . . . మీ ప్రశ్నకూడా నాలాగే అనిపించింది . . . నేనంటున్నది అదే."

"అవును . . . . కాదు, అసలు నా పరిస్థితి మీకంటే మరీ అధ్వాన్నం . . . మీరు మగవారు, నేను ఆడదాన్ని . . . అంతేకాదు . . . మీరు రేపు మీకు రాబోయే ఆస్తికోసం . . . . నాకేం ఉంది? . . . నేనెందుకిలా తికమకలు పడాలి?"

తను అంటున్న మాటల్లో కొన్ని రామభద్రన్ వినాలని, మరికొన్ని తన హృదయంలోనే నిష్ఫలంగా ఉండిపోవాలనే భావనతో జానకి మాటాడింది.

ఆ తరువాత ఇద్దరూ మౌనంగా ఇసుకమీద ఏవో గీతలు గీసుకుంటూ కూర్చున్నారు.

ఇద్దరూ తమతమ మనసులో, జీవిత వర్ణనలో కనిపించే రూపాన్ని చెఱిపేసి, దానికిబదులు ఎదుట కనిపించే వ్యక్తిని కల్పన చేసుకున్నారు.

జానకి తను సినిమాలో ప్రేమ సన్నివేశాల్లో చూసిన ఆ జంటని గుర్తుచేసుకుంది. ఇక ఈడూ, జోడూ అన్న ఆలోచన రాగానే ఆ జంటని మించిన జత, దాన్ని మేటిల్లే ఇంకొక జత - ఒకటి తరువాత ఒకటి - ఆమె కల్పనలో లేచాయి.

"మీ వయస్సు?" రామభద్రన్ అడిగాడు.

"ఇరవైనాలుగు . . . మీకు?"

"ఇరవై ఏడు . . ." అని చెప్పి రామభద్రన్ ఒక నిట్టూర్పు వదిలాడు. జానకి తన మనసులో ఒక నిట్టూర్పు వదులుకుంది. ఇద్దరూ తమతమ మనసుని తీర్చి దిద్దుకున్నట్టు ఇసకమీద ఏమేమో రాసుకుంటున్నారు.

గభీమని జానకి పకపక నవ్వింది. ఒక నిమిషం రామభద్రన్ అదిరిపడ్డాడు. నవ్వుతూనే జానకి చెప్పింది:

"చూసారా, జీవితం ఎంత చిత్రవిచిత్రంగా ఉందో? మీరందరూ ఆడుతున్నారే, ఆ పేకాటలాగ!"

"ఏమంటున్నారు మీరు?"

"మీకు కావలసిన పేకముక్కలన్నీ మీ దగ్గర ఉంటే, నాకు కావలసిన పేకముక్కలన్నీ నాదగ్గర ఉంటే ఆట సాగుతుందా?"

"జానకి, నువ్వు ఎంత చక్కగా మాటాడుతున్నావ్?"

'మా ఆయన ఇలా చెప్పివుంటే? . . . ' ఆ ఊహలోనే జానకి ఆహ్లాదపడింది.

"జానకి . . . " అని పిలుస్తూ రామభద్రన్ ఆమె దగ్గరకి వచ్చాడు. అతని కళ్ళు తడిసిపోయాయి, కంఠధ్వని గరగరమని మారిపోయింది.

"జానకీ, మనమేకదా ఆ పేకముక్కలు? ఆట ఆడేది శివస్వామి, లక్ష్మి! పరస్పరంగా పేకముక్కలు మార్చుకోడమేకదా పేకాట! జానకి, You are a smart woman! నేను ఏమంటున్నానో నీకు బోధపడిందా?"

జానకి కళ్ళు సగం నిద్రలో ఉన్నాయి; ఉహాలోకంలో మైమరిచి ఆమె తేలుతున్న ఆ సమయంలో పిల్లవాడు రవి రామభద్రన్ కోటుని పట్టుకొని "నాన్నగారూ!" అని అరిచాడు.

జానకి కళ్ళుతెరిచి పిల్లవాడిని, తన్నూ, ప్రపంచాన్ని చూసింది.

"బాబూ, ఇది నాన్నగారు కాదురా . . . ఇది అంకుల్ . . . నాన్నగారు మనింట్లో మనకోసం కాచుకొనివున్నారు . . . రా, వెళ్దాం!" అని రవిని జానకి ఎత్తి కౌగిలించుకుంది.

"నాకు మీ ఆలోచన నచ్చిందండి . . . ఇలా చేస్తే ఒక నెలలో రవి బాగా నడుస్తాడని నాకూ నమ్మకం కలుగుతోంది. ఇక రేపటినుంచి రోజు మా ఆయనతో బీచ్ కి వచ్చేస్తాను . . . రానూ రానూ అతనికీ ఈ పేకాట పిచ్చి మితిమీరి పోయింది!" అని అంటూ జానకి లేచింది.

రామభద్రన్ ఏమీ బోధపడక, మౌనంగా, ఆమె వెంట నడిచాడు. గభీమని ఆమెపక్కన చేరుకొని "మీకు నామీద కోపమా?" అని గొణిగాడు.

"బాగుంది. నాకెందుకు మీమీద కోపం? నేను పేకాటగురించి మీకు పూర్తిగా చెప్పలేదు . . . మీరన్నారుగా ఆడేది మా ఆయనా, మీ భార్యా అని? అదే పొరబాటు. వాళ్ళుకూడా పేకముక్కలే . . . ఆడేది మనుషులెవరూ కాదండి, ఆడేది దేవుడు! అతను ఆటలో పొరబాటు చేసాడని అనడానికి మనకేం హక్కు ఉంది, చెప్పండి?"

"జానకి, మీరెంత బాగా మాటాడుతున్నారు!" అని రామభద్రన్ విస్తుపోయాడు.

"రేపు ఆదివారంకదా, లక్ష్మితో మా ఇంటికి రండి, చాలా సంగతులు మాటాడుకుందాం, . . . నేను మీ ఆవిడకి ఎలా మాటాడాలో నేర్పుతాను . . . బాబూ, అంకుల్ కి నమస్తే చెప్పు . . . సరే, మేం వస్తాం!" అని అంటూ రాజం ఇంటికి నడిచింది.

రాత్రీ కాదు, పగలూ కాదు అనే ఆ సంధ్యాకాలంలో 'రాత్రి వచ్చేసింది!' అని దృఢంగా ప్రకటించినట్టు బీచ్ రోడ్డులో అన్ని దీపాలూ నిగనిగమని వెలిగాయి.

ఎక్కడచూసినా కాంతి. అదేం బయట మాత్రమేనా?

********

**(మూలం: ప్రచురణ, ఆనంద వికటస్, 1960)**

# ముట్టడి

రెండు గంటలుగా ఎవరో ఆ 'మిస్' కోసం తన మేడగదిలో వాసు కాచుకొనివున్నాడు. ఇక తాళలేక, ఎట్టిపాటిన ముఖంతో కూర్చున్నవాడు, కోపంతో లేచి వెళ్ళి అల్మారా తెరిచాడు.

అందులో అందమైన స్వరూపాల్లో మద్యం తాగడానికి రకరకాల గాజు గ్లాసులూ, పావు నిండిన ఒక విస్కీ సీసా కనిపించాయి. ఒక కళాత్మక ప్రదర్శన చూసి మురిసిపోయినట్టు వాసు ఆహ్లాదించాడు.

ఆ గాజుకుప్పె, గ్లాసులు చూస్తే మద్యం విరోధులనుకూడా తాగమని పురికొల్పే ఒక కళాసౌందర్య దృష్టి వాటిలో కనిపించింది.

'అదృష్టవశంగా లేక దురదృష్టవశంగా నైతిక బాధ్యత అనే వంకలో 'ఇవన్నీ విష పదార్థాలు!' అని తిరస్కరింపబడినవి ఈ ప్రపంచంలో ఉన్నత శోభలుగా మారిపోయాయ్!' అని గొణుక్కుంటూ, తన మనసులో బొబ్బలుపెట్టే భావనలు అణచుకోవాలనే ఆవేశంతో వాసు తనకి దొరికిన ప్రసాదంలాగ ఆ సీసాలోని సారాయం ఒకే గుక్కలో మింగేసి, మళ్ళీ ఇంకొక గ్లాసుని నింపుకొని వరండాకి వచ్చాడు.

ఆ వరాండా, అతని ఏర్ కండిషన్ గది రెండూ పాశ్చాత్య రీతిలో ఉన్నాయి. వాసు చింతన, దృక్పథం కూడా చాలామట్టుకు పాశ్చాత్య శైలినే అనుసరించాయి.

వెదురు తడికలలాగ, ప్లాస్టిక్ లో కట్టిన తెరలు తొంగుతున్న ఆ వరాండా మూల ఒక రేడియోగ్రాంని వాసు చేరుకున్నాడు. తన గ్లాసుని దానిమీద ఒక పక్క పెట్టి, ఒక రికార్డు ఎంచుకొని రేడియోగ్రాంలో పెట్టాడు.

మరుక్షణం 'Number fifty-four, the house with the bamboo door . . . ' అనే పాటని, దాని తాళంకి అనుగుణంగా తన వేళ్ళ ధ్వనితో మెల్లగా కొట్టుతూ, వాసు ఆ వరండాలో కిందా మీదా తిరగసాగాడు.

అక్కడ రెండు దిండు సోఫాల మధ్య ఉన్న టీపాయ్ లో ఒక చెస్ బోర్డులో వరుసగా నిలబెట్టిన పావులని ఆ పాట ముగింపు వరకూ అతను చూడసేలేదు. పాట అంతమవగానే కిటికీద్వారా బయటకి తొంగి చూసాడు; ఆ తరువాత హాలులోని

గడియారం చూసాడు; ఆ తరువాత మధ్యాహ్నం రెండుగంటలనుంచి తను ఆపేసి, కాచుకొనివున్న ఆటనీ, ఆ చదురంగ పావులని చూసాడు. ఆ 'మిస్' తను మూడు గంటలకి వస్తానని చెప్పిందే!

నిన్న రాత్రి ఒక విందులో వాసు ఆమెను కలుసుకున్నాడు. ఆమెను ఆకర్షించి, తనూ ఆమె వలన ఆకర్షించబడి, ఇక్కడ వస్తానని వాగ్దానం ఇచ్చిన ఆమె పేరుకూడా వాసు ఇప్పుడు మరిచిపోయాడు.

అతనికి పేర్లు ముఖ్యంకాదు; చుట్టరికం ప్రధానం కాదు; వాసు భావనలని అనుచరిస్తాడు; అందాలని ఆరాధిస్తాడు; కేవలం శారీరక ఆకర్షణకే సులభంగా మైమరచిపోతాడు. అలా వశమైపోవడం తప్పుకాదని వాదిస్తాడు. ఇతరులని ఆకర్షించాలని తన రూపం, నడత, ఆచారవ్యవహారాలు, సంభాషణలలో, ఒక విధమైన శోభనం పెంచుకోవాలనే లక్ష్యంతో తన జీనితశైలిని వాసు తీర్చిదిద్దుకున్నాడు. ఆ నమ్మకం అతని ఈ ముప్పైఐదు సంవత్సరాల జీవితంకి బాగా దోహదం చేసింది. తనతో మెలిగినవారికి ఎది ఇష్టమో, ఎది కావాలో, అవన్నీ వాసు ఎలాగైనా సమకూర్చుతాడు. కాని చాలామట్టుకు అతనికి కావలసినవన్నీ ఎటువంటి శ్రమలేకుండా వాసు అందుబాటులోనే ఉన్నాయి.

నిన్న అలాగే ఆ 'మిస్' తో మాటాడుతూ ఆమెకి ఎది చాలా ఇష్టమైన ఆట అని అడిగి, ఆమె ఒక చెస్ చాంపియన్ అని తెలుసుకొని వాసు సంతోషించాడు. ఎందుకంటే అతనికీ ఆ ఆటతో పరిచయముంది; అందువలనే తమాషాగా ఆమెకి ఒక సవాలు వదిలాడు.

"నాతో ఆడి నన్ను గెలుస్తావా?" అని కొంచెం అహంకారంతోనే వాసు అడిగినప్పుడు ఆమె "I will try my best!" అని ఆ సవాలుని తీసుకుంది.

"ఆటలో గెలవడం ఎంత సహజమో అంత సహజమే ఓడిపోవడమూ," అని ఒక వేదాంతిలాగ వాసు పలికిన మాటలు ఆమెకి నచ్చాయి.

తన సవాలుని ఆమె అంగీకరించడమే తనకొక పెద్ద విజయమని వాసు భావించాడు. అతని లక్ష్యమంతా ఆమె రాకగురించేగాని, ఆమె వచ్చినతరువాత జరుగబోయే ఆటలో 'ఎవరు గెలుస్తారు, ఎవరు ఓడిపోతారు?'అని కాదు. ఒక ఆడది,

ఒక మగవాడు మధ్య జరిగే పోటీ అది. 'గెలిచేవారు ఓడిపోవడం, ఓడిపోయినవారు గెలవడం ఎప్పుడూ జరిగేదే!' అని అతనికి తెలుసు.

** ** **

ఇప్పుడు వాసు అనుభవించే చికాకుకి తన పిలుపుని అంగీకరించి ఆమె రాకపోవడంతో ఏర్పడిన నిరాశే కారణం.

రేడియోగ్రామ్ మీదున్న మద్యం తీసుకొని ఆవేశంతో వాసు గతుక్కుమని మింగాడు.

మూడుగంటలకి వస్తానని మాట ఇచ్చి, ఐదున్నరవరకూ రాకుండా, టెలిఫోనులోనూ ఏ కారణం తెలియజేయకుండా, ఆమె తన్ను మోసం చేసిందని వాసు మండిపడ్డాడు. ఇంతసేపూ ఆమెకోసం తను కాచుకొనివున్నందుకు సిగ్గు పడి, ఆ అవమానం భరించలేక ఆ రెండు సోఫాలమధ్యవున్న టీపాయ్ ని ఒక తన్ను తన్నాడు.

తెలుపు, నలుపు రంగుల చదరంగం పావులు చెల్లాచెదరి, లినోలియం పరచిన నేలమీద వాలాయి.

తన కోపంని తనే వశం చేసుకోవాలనే ప్రయత్నంలో వాసు ఆ సోఫాలో కూర్చొని కళ్ళు మూసుకున్నాడు.

నిశ్చలమైన ఆ క్షణాల్లో అతని చెవుల్లో వీణ ధ్వని మెల్లగా వచ్చి మ్రోగింది.

ఆ ఇంటి మిద్దెక్రింద - రెండు గంటలు కాదు, రెండు సంవత్సరాలుగా - అతనికోసం కాచుకొనియున్న ఆ యువతి - అతని భార్య సీత - జ్ఞాపకం ఆ సాధారణ వీణ నాదం వలన అతనికి వచ్చింది.

రెండు సంవత్సరాలముందు తనకిష్టం వచ్చినట్టు జీవితం గడుపుతున్న వాసుని ఒక కుటుంబ భారం అనే అదుపులో ఉంచాలని అతని తల్లిదండ్రులు అతనికి భార్య అనే ఒక చుట్టరికం ఏర్పరచారు.

సరేనని వాసు ఒప్పుకున్నాడు; అంతమట్టుకు అబ్బాయి మంచివాడని తల్లిదండ్రులు సంతోషించారు.

"నా అభిలాష నేనొక స్వతంత్ర పురుషుడుగా మెలగాలి; దానికి మించి నాలో మరేం దురలవాటు ఉంది?" అని అతను అడిగిన ప్రశ్నకి సరైన జవాబు ఇవ్వడానికి ఆ కుటుంబంలో ఎవరూ లేరు.

తన చాతుర్యం, సమర్ధతతోనే వాసు - పూర్వార్జిత ఆస్తి ఎంతో ఉన్నా, దాన్ని ఎదురుచూడక - Building Contract వృత్తిలో మంచి పేరు సంపాదించాడని అతని తండ్రికి చాలా సంతోషం. కాని ఎటువంటి కట్టుబాటు లేని ఆ కొడుకు జీవిత శైలి అతనికి ఒక పెద్ద కొఱతగా కనిపించింది.

భార్య అని ఒకర్తె వస్తే అబ్బాయి మారుతాడేమో అనే వాళ్ల నమ్మకం వలనే సీత వాసుకి భార్యగా వచ్చింది. అతనింకా అలాగే ఉన్నాడంటే అందుకు అతని భార్యే కారణం అని అతని తల్లిదండ్రులు నిశ్చయించేసారు.

సీత మనసులో ఏముందో? తన భర్త తన్ను నిర్లక్ష్యం చేసినట్టు ఆమెకూడా అతని కార్యకలాపాలేవీ పట్టించుకోకుండా - ఏకాంత జీవితం - గడుపుతోంది.

ఏకాంత జీవితమా?

మనసు కలిసిన ఇద్దరు జీవులు వేరే వేరే ప్రపంచాల్లో విడి విడిగా జీవించినా ఆ అనుభవంకూడా దాంపత్యమే! ఇద్దరు జీవులు పొత్తు లేకుండా రెండు శరీరాలు కలిసి మెలిగినా అది ఏకాంత జీవితమే!

అలాగే, ఒకే ఇంటిలో జీవిస్తూ, భర్త పిలిచిన వెంటనే, ప్రతీ క్షణం అందుకే కాచుకొనివున్నట్టు, పరుగెత్తుకొని వెళ్ళి, అతని ఎదుట నిలబడి, అతని కోరిక ఏదో దాన్ని నిరవేర్చి, ఒక హిందు భార్యకి ఉండవలసిన సంప్రదాయాలు పాటించినా ఆ ఏకాంత జీవితం వలన సీత కళ్ళలో నిత్యమూ నిదానమైన శోకమే కనిపిస్తుంది.

ఎన్నో రోజులు రాత్రివేళ, చాలాసేపు, ఆడవారూ, మగవారూ, మేడమీద భర్తతో కలిసి గలభా, ఒడలు తెలియని తంతనాలు చేసినప్పుడు ఇంటి వంటమనిషి - ఆ ముసలమ్మ - ఆ కూతలు, సందడి భరించలేక, "ఇదేం గొడవరా? వీరేం మనుషులో?" అని అదిరిపడినప్పుడుకూడా సీత, దూరాన ఒదిగివుండి జీవితం లోని ఘటనలు చూస్తున్న ఒక జ్ఞానిలాగ ఒక చిరునవ్వు నవ్వి ఊరుకుంటుంది; ముసలమ్మతో ఏమీ మాటాడదు.

వాసు అవగాహనలో సీత ఒక సామాన్యమైన, దీనమైన స్త్రీగా కనిపించింది. తన భార్యగా వచ్చిన సీత పేరులో రహస్యంగా దాగియున్న, తనకి తెలియని మహత్వమైన అర్థాలు, వాసు ఎరుగడు. ఐతే ఇప్పుడు అతను ఆమెను గుర్తుచేసుకోడానికి కారణముంది.

ఇవాళ ఉదయం వాసు పిలిచాడని సీత మేడమీదకి వచ్చింది; చాకలికొట్టుకని అతని మరికిగుడ్డలు ప్రోగుచెయ్యడానికి ఆమె వచ్చింది. అప్పుడు ఆ మురికిగుడ్డలతోబాటు అతని కోటు జేబులో ఆ ఎవరో 'మిస్' ఇచ్చిన visiting card తను పెట్టినట్టు వాసు గుర్తు చేసుకున్నాడు.

వీణ ధ్వనిని అనుసరించి సీత, దాని తరునాత తన మురికిగుడ్డలు, వాటిలో ఒకటిగా ఆ 'మిస్' visiting card - ఇవన్నీ జ్ఞాపకం రాగానే వాసు తనలో నవ్వుకున్నాడు.

పక్కనేనున్న calling bell నొక్కాడు; వీణ నాదం ఆగింది.

భార్యనికూడా calling bell ద్వారా పిలవడానికి కారణం అతను ఏమైనా సరే ఆ ఇంటి మిద్దెక్రిందకి వెళ్ళకూడదని నిశ్చయం చేసుకున్నాడు. అందుకు కారణం తనకిష్టం లేకపోయినా ఇతరుల భావనలకి వాసు చూపే నాగతికత, మర్యాద. అతను ఒక సారి కాళ్ళలో చెప్పులతో, చెయిలో సిగరెట్టుతో ప్రవేశించినప్పుడు భారత నాగరికత ఒక స్త్రీ రూపంలో పైబడినట్టు సీత అతన్ని ఆపి కోపంతో "ఇది పూజ గది!" అని గర్జన చేసింది. అనుచితమైన తన ప్రవర్తనకి క్షమాపణ కోరుతూ "I am sorry!" అని గొణుక్కుంటూ వాసు వెనకాడాడు. ఆ తరువాత ఈ రెండు సంవత్సరాలలో అతన్ని ఎవరూ అక్కడకి రమ్మని పిలవలేదు, అతనూ వెళ్ళలేదు. వెళ్ళినా అక్కడున్నవి - తులసీ కోట, పూజ గది, ఆవు పేడతో పూతపూసిన నేల, రంగుల ముగ్గులు - చూసి అతను తీదరపడివుంటాడు.

అతను కావలసినప్పుడు ఉన్నచోటునుంచే భార్యని పిలవడానికి ఈ ఆధునిక యుగంలో ఎన్ని వసతులున్నాయి!

అదిగో, సీత మెట్లు ఎక్కి అతని ముందు వచ్చి నిలబడింది.

అప్పుడు అక్కడ వ్యాపించిన వాసనలో అతని మనస్స్థితి ఆమె ఊహించకలిగింది. కాని ఆమె మొహం చిట్లించుకున్నట్టు ఏ సూచనా కనిపించలేదే? చిరునవ్వుతో ఎదుట నిలబడే భార్యని ఎర్రకన్నులు తెరిచి వాసు చూసి తనూ నవ్వాడు.

"Laundry కి బట్టలు వేసినప్పుడు పాకెట్లన్నీ చూడాలని చెప్పాను, నీకు జ్ఞాపకం ఉందా?"

"అవును, మీరు చెప్పారు."

"ఇవాళ చూసావా?"

"చూసాను . . . ఇదే ఉంది. మీరడిగితే ఇద్దామనుకున్నాను" అని అంటూ ఆమె అందించిన visiting card తీసుకొని, ఒక సారి దాన్ని చూసి వాసు, ఆమెకి thanks చెప్పాడు. సీత ఇంకొక చిరునవ్వు నవ్వి వెనకాడింది.

"సీతా . . . " అని ఏదో ఆలోచనతో వాసు ఆమెను పిలిచాడు.

ఆమె తిరిగి అతన్ని చూసింది.

"ఇక్కడికి రా," అని ఆమెని దగ్గరకి పిలిచాడు. "నువ్వు మీ ఊరులో పదవ క్లాసువరకూ చదివున్నావ్ కదా? ఏదీ, ఇది చదువు చూద్దాం!" అని ఆ visiting card అందించాడు.

"Miss. Suguna . . . Lecturer in English," అని దానితోబాటు ఒక స్త్రీల కాలేజీ పేరుకూడా చదివి, సీత ఆమె ఇంటి ఫోను నంబరు వల్లించింది.

దాన్ని చదివినతరువాత ఆమె మొహంలో ఏమైనా చలనముందా అని వాసు ఆరసించి చూసాడు. ఎప్పటిలాగే చిరునవ్వుతూ సీత నిలబడివుంది. ఆ మొహంలో ఎటువంటి బాధకంకి వశంకాని భావన చూసి 'దీనికి ఇదెలాగ సాధ్యం?' అనే ప్రశ్నే ముందుగా అతని మనసులో చోటుచేసుకుంది.

అతను ఆమె కళ్ళు తేటిచూసాడు. అందులో అణచుకున్న శోకం అతనికి బోధపడిందో లేదో? 'నాకెందుకు దీనితో గాఢమైన పొత్తు లేదు?' అనే కారణం ఇప్పుడే అతను ఆలోచించాడు. ఆ తరువాత 'నాతో దానికి ఏదైనా పొత్తు ఉందా?' అని తన్నే అడుక్కున్నాడు. ఆఖరికి, 'పొత్తు ఉందో లేదో, చట్టం ప్రకారం అది నా భార్య!' అని తృతీయ పక్షం ధోరణిలో తనకున్న మూర్ఖపుపట్టు గుర్తుచేసుకున్నాడు.

చాలాసేపు తోడు కావాలని కాచుకొని వాసుకి విసుగు పుట్టేసింది; అందుకే అతనిప్పుడు సీతని తోడుకి పిలిచాడు.

సీత అతని ఎదుట ఇంకొక సోఫాలో కూర్చుంది. నేలమీదున్న చెదరిన పావులలో ఒకటి ఆమె కాలుని తాకింది. దాన్ని చెయిలో తీసుకొని, తల వొంచి చూసింది.

"అదేంటో చెప్పు చూద్దాం!" అని ఒక బాలికని అడుగుతున్నట్టు వాసు అడిగాడు.

"Chess piece."

"హూం . . . " అని ఆమెని శ్లాఘించి, "అదేం chess piece అని నీకు తెలుసా?" అని అడిగాడు.

'White Bishop."

"నీకు chess ఆడడం తెలుసా?"

"ఏదో కొంచెం తెలుసు."

"Let us see! బోర్డు తీసుకొని arrange చెయ్!" అని చెప్పి వాసు ఒక సిగరెట్ వెలిగించుకున్నాడు.

సీత వొంగి నేలమీదున్న పావులు పోగుచేస్తూంటే వాసు ఆమెనే చూస్తున్నాడు. కొన్ని క్షణాలతరువాత తను ఆమె అందాన్ని చూసి ఆనందిస్తున్నట్టు గుర్తుచేసుకున్నాడు.

ఆమె chess board సిద్ధం చెయ్యగానే దాన్ని పరీక్షించి చూసి వాసు "నీకేం కావాలి? Black or White?" అని అడిగాడు.

"Black!" అని చెప్పి వాసు తన పావులని కదల్చాలని సీత కాచుకొనివుంది.

అతనొక సారి పావు కదల్చగానే ఆట ఆరంభమైంది; సీతకూడా పావులని కదల్చింది. ఇలాగ నాలుగైదు కదలికలు సాగాయి.

వాసు ఆమెను అడిగాడు: "నువ్వేం theory చదివున్నావా?"

"లేదు. ఎప్పుడో ఆడిన అలవాటే."

అప్పుడే టెలిఫోను మ్రోగింది. రెండు మూడు సార్లు దాని ధ్వని లెక్కచెయ్యక ఆటలో నిమగ్నమైపోయిన వాసు, "అదెవరో కనుక్కో," అని సీతకి చెప్పి పంపాడు. సీత లేచి వెళ్ళి టెలిఫోను రిసీవర్ అందుకుంది.

"Hello . . . yes, yes, Mr. Vasu's house . . . I am his wife . . . సరే, చెప్తానులేండి . . . No mention, please . . . " అని రిసీవర్ని పెట్టేసి తిరిగివచ్చిన సీత తన మొహంలో ఎటువంటి చలనమూ కనిపించకుండా వాసుకి ఈ సందేశం అందించింది:

"మిస్ సుగుణా . . . నిన్న ఎక్కడో పార్టీలో మీరు కలుసుకున్నారట . . . ఇవాళ మూడు గంటలకి వస్తానని చెప్పారట . . . కాలేజీలో ఏదో తొందరగా పని . . . ఇప్పుడు వెంటనే వస్తున్నారట . . . " అని చెప్పి ఆటని కొనసాగించడానికి సోఫాలో కూర్చుంది సీత.

ఆమె తన పావుని కదలించిన తరువాత కూడా వాసు ఆమెనే తేటిచూస్తూ కూర్చున్నాడు.

"ఇక మీ move!" అని సీత అతనికి గుర్తు చేసింది. అదేం వినిపించుకోకుండా వాసు ఆమెని అడిగాడు:

"నా గురించి నువ్వేమనుకుంటున్నావ్?"

"నేనేం అనుకోవాలి? మీరు నన్ను పెళ్ళాడారు - అంటే నా భర్త అని అనుకుంటున్నాను . . . "

వాసు నుదుటని గోక్కుంటూ తల వంచాడు. కొంచెం సేపు ఆగి మళ్ళీ అడిగాడు: "నీకు నా మీద కోపమా?"

"లేదు."

"బాధగా ఉందా?"

"హూం, లేదు!"

"బెంగగా ఉందా?"

"లేదు."

"ఎందుకు లేదు?"

“ఎందుకు ఉంటాలి?”

అతని ప్రశ్నలకన్నిటికీ ఆమె జవాబు ఇచ్చింది. కాని ఒక ప్రశ్నకి జవాబుగా ఆమె ఇంకొక ప్రశ్న అడగ్గానే వాసు ఏ జవాబూ ఇవ్వలేకపోయాడు.

‘నా గురించి ఈమె మనసులో ఏముంది?’ అని తెలుసుకోవాలని వాసుకి ఆతురత. దానికి ‘ఏమీ లేదు,’ అనే జవాబు ఇంపుగా లేదు. ఆ జవాబు విన్నప్పుడే అతనికి సీత తనవలన ఏకాంతంగా ఎంత శోకం అనుభవిస్తోందని, రహస్యంగా ఆమెకి భర్తమీదున్న అత్యంత ద్వేషం, విరోధభావం బోధపడింది. ఇప్పుడుకూడా ‘సరే, నా గురించి మీ మనసులో ఏముంది?’ అని సీత తన్ను అడుగుతుందని వాసు ఆశించాడు. కాని అటువంటి ప్రశ్న అడగాలనే తలపుకూడా ఆమెకి లేదని ఇప్పుడు గ్రహించాడు. ఆవిధంగా తన దాంపత్యంలో దాగియున్న నిజం - శూన్యత, కటుత్వం - బట్టబయలైన తరువాత దాన్ని అంగికరించాలో లేక తిరస్కరించాలో తెలియక వాసు పెనుగులాడాడు. ఆ కారణంవలనే అతన్ని ముట్టడిస్తూ ఒక వ్యూహం చోటుచేసుకుంది.

‘నేను పిలుస్తే ఈమె వస్తోంది; నేను కూర్చోమంటే కూర్చుంటుంది; పోమంటే పోతుంది; నవ్వమంటే నవ్వుతుంది. కాని . . . ఈమె నన్నేం అడగదు . . . నేనూ దీనికోసం ఏమీ చెయ్యడం లేదు . . . ఇది నా అధికారంలో ఉంది . . దీనికి నేనంటే ప్రేమా లేదు, పగా లేదు . . . ప్రేమా, పగా చూపాలంటే ఒక విధమైన బాంధవ్యం ఉండాలి; దీనికి నాతో ఎటువంటి బాంధవ్యమూ లేదు . . . విరక్తి, ఉపేక్ష తోనే ఈమె నాతో కాపురం చేస్తోంది . . . ‘

“నేనంటే నీకేం లెంగ లేదు; అలాగే నేనుకూడా నీ గురించి నిర్లక్ష్యంగా ఉండాలంటున్నవా? అదే నీకు వసతి, అవునా? నేను నాకిష్టం వచ్చినట్టు ఎది చేసినా నీకు అభ్యంతరం లేదు! దానికి అర్థం నువ్వు నీకిష్టం వచ్చినట్టు ఎదైనా చెయ్యవచ్చు! అదేనా నీ వాదం?” అని తాగిన మైకంలో వాసు ఆమెని ఎత్తిపొడిచాడు.

సీత కళ్ళు చెమ్మగిల్లాయి, కాని ఆమె ఏడవలేదు. ‘ఇదే ఆడజన్మ కర్మ అంటే! ఎది చేసినా తప్పే!’ అని తనలో గొణుక్కుంది. తరువాత చెప్పింది: “నేనొక హిందీ స్త్రీని. ఎవరూ ఎవరినీ చెడగొట్టలేరు. చెడిపోయేవాళ్ళని ఎవరూ ఏమీ చెయ్యలేరు!”

ఆమె మాటలు విని వాసు మనసులో ఆరాటం కలిగింది. 'ఇంకొక గ్లాసు మద్యం తాగుదాం!,' అని లేవబోయాడు. కాని ఎందుకో "వొద్దు!" అని నిశ్చయించి తన చెయిని మొహంకి ఎదురుగా విసురుతూ మళ్ళీ కూర్చున్నాడు.

ఏవేవో ఆలోచనలలో పడిపోయి, చాలాసేపు మౌనంగా కూర్చొని, ఆఖరికి "Yes, let's play . . . " అని వాసు నిట్టూర్పు విడిచాడు.

"మీదే next move!" అని సీత అతనికి గుర్తుచేసింది.

'దీన్ని ఎలాగైనా గెలవాలి!' అనే గురితో వాసు పావులు కదల్పసాగాడు.

అటలో సీత తన శక్తివంతమైన పావులన్నీ వరుసవరుసగా కోల్పోతూ వచ్చింది. వాసు పావులన్నీ బోర్డులో ముందుకుపోతూ సీత పావులున్న గళ్ళని ఆక్రమించుతూవున్నాయి.

ఆఖరికి సీత ఒక తెల్ల పావుని బోర్డునుంచి తీసి "Check & Mate!" అని అంటూ ఆటని ముగించింది.

వాసు బోర్డులో మిగిలివున్న ఉన్న తన తెలుపు పావులని - వేరే వేరేగా - పరీక్షిస్తూ వాటిలో ఏద్దైనా తన 'రాజు' విముక్తికి సాయం చేస్తుందా అని చూసాడు. అన్నీ 'ముట్టడి' లోనే ఉన్నాయి. అతని పావులు బోర్డులో ముందుకి సాగినా, శక్తివంతమైన సీత పావులని అవి సాధించినా, ఆఖరికి వాసు 'రాజు' సీత పన్నిన ముట్టడిలో చిక్కుకున్నది అనివార్యమైన సత్యం.

"Well done, Sita!" అని వాసు ఉత్సాహంతో ఆమె భుజం తట్టాడు.

ఎప్పటిలాగే సీత మొహంలో నిదానమైన చిరునవ్వే చోటుచేసుకుంది.

అప్పుడు క్రిందనించి calling bell ధ్వని వినిపించింది.

"సీతా . . . అదే వచ్చివుంటుంది . . . నేనింట్లో లేనని చెప్పేయ్!" అని వాసు భయంతో ఒక అబద్ధం చెప్పగానే సీత కటువైన చిరునవ్వుతో మేడమెట్లు దిగి వెళ్ళింది.

"దాన్ని పంపేసి నువ్వు రా" అని చెప్పిన తరువాత వాసు రెండవ ఆడకి చదురంగ బోర్డులో పావులు అమర్చసాగాడు.

కొంచెంసేపు తరువాత మేడమెట్లమీద మెట్టెల సందడి విని అతని దేహం పులకరించింది. ఇప్పుడు ఆమె అతనికి ఎదుట వచ్చి నిలబడినప్పుడు వాసు కళ్ళలో

ఇంతవరకూ అతను అనుభవించని ఒక నూతన భావన తళతళమని మెరిసింది. కాని ఆమె కళ్ళలో నిత్యమూ పదిలమైన ఆ శోకం మారనేలేదు.

అతను ఆమెని ఆటకి పిలిచాడు; ఆమెకూడా ఆడింది.

********

**(మూలం: ప్రచురణ, ఆనంద వికటన్, 1965)**

# సతీసహగమనం

అప్పుడే కట్టిన మల్లిపూల సరంతో రాజం మేడమీదకి పరుగెత్తుకొని వచ్చింది; ఆమె దాన్ని తన తలలో అలంకరించుకోలేదు. ముందు చెల్లెలు మీనా జుత్తుకి పెట్టి మిగతాది తనకి ఉంచుకోవాలని ఆమె ఉద్దేశం. అదే సంప్రదాయం. మీనావే పెళ్ళికూతురు; పెళ్ళికి ఇంకా నాలుగురోజులే ఉన్నాయి. పెళ్ళికొడుక్కి కలకత్తాలో ఉద్యోగం. పెళ్ళయిన తరువాత అతను మీనాతో వెళ్ళిపోతాడు. ఆ తరువాత రాజం మాత్రం ఒంటరిగా ఈ ఇంటిలో ఉండాలి.

"మీనా . . . మీనా . . . ఏమిటే సాయంకాలం నాలుగు గంటలకి ఇలా నిద్రపోతున్నావ్?" అని అడుక్కుంటూ రాజం హాలుకి వచ్చింది.

కళ్ళు మూసుకొని నిద్రపోతున్నట్టు ఏటవాలు కుర్చీలో పడుకున్న మీనా చిరునవ్వుతో కళ్ళు తెరిచి, "నిద్ర పోలేదు . . . ఉత్తికే పడుకున్నాను . . . " అని లేచింది. ఆమె శరీరంలోని బద్ధకం అలాగే ఉంది. రెండు చేతులూ బాగా వెనక్కి చాచి దేహాన్ని మలుపుతుంటే మనసులో ఒక విధమైన ఆహ్లాదం; దేహాన్ని బలంతో ఒక సారి దులపగానే ఆ బద్ధకం పోయింది. "నా జుత్తుని దువ్వడానికి వచ్చావా? సరే, కొంచెం ఆగు . . . నేను కిందకి వెళ్ళి మొహం కడుక్కొని, తైలం, దువ్వెనతో వస్తాను . . . " అని ఒక గెంతు గెంతి మీనా కిందకి దూకి పరుగెత్తింది.

మీనా వీపుని చూస్తూ నిలబడిన రాజం 'దేవుడా, ఇదైనా తన భర్తతో నిత్యమూ జీవించనీ . . . ' అని తన మనసులో వేడుకుంది.

పది సంవత్సరాలకు ముందు రాజం కూడా, మీనా లాగే, కొత్త పెళ్ళికూతురుగా ఉండి, భర్తతో అత్తవారింటికి వెళ్ళి, రెండు నెలలు కాపురం చేసి తిరిగి వచ్చేసింది. ఆమె ఆదర్శ భర్త మనసులో వేరొక స్త్రీ ఉంది; ఒక రోజు అతను ఆమెతో పారిపోయాడు. కాని అతను తప్పకుండా తిరిగివస్తాడని ఈ పదిసంవత్సరాలూ రాజం నమ్ముతోంది.

అప్పుడు మీనా పన్నెండేళ్ళ బాలిక. మీనాకి, రాజంకి వయస్సులో ఆరేళ్ళ భేదం కాని ఇద్దరూ అన్యోన్యమైన స్నేహితుల్లాగే ఉన్నారు. మీనా స్వభావం అటువంటిది; ఆమెకు ఎదీ మనసులో దాచుకోవడం తెలీదు.

ఒక రోజు, భర్తకి దూరంగా జీవించినా అతనిపై ఉన్న అనురాగం వలన రాజం ప్రేమతో అతనిగురించి మాటాడింది. గోర్లు పీక్కుంటూ ఆమె మాటలు మౌనంగా వింటున్న మీనా, తల వొంచి, నిశ్చలంగా రాజం, "నువ్వు అసలు ఆడపిల్ల కానే కాదు, నీకు బుద్ధి, జ్ఞానం లేదు! నేనైతే అతన్నిగురించి ఏమీ మాట్లాడను, ఇలాగ ఉత్తికే ఏమీ చెయ్యకుండా కూర్చొని ఉండను . . ." అంది.

"ఏం, ఎందుకు? నువ్వేం చేసివుంటావ్?" అని రాజం అడిగింది.

"వాడు నిద్రపోతున్నప్పుడు ఒక భారీ పొత్తరంతో వాడి తలని బద్దలుచేసి ఉంటాను . . . అవును, తప్పకుండా అలా చేస్తాను . . . నేను చెప్పేది నిజం . . . " అని మీనా తలెత్తి చూసినప్పుడు రాజం 'అవును, ఇది అలాంటి మనిషే' అని తనలో అనుకుంది.

మీనాకి రాజం భర్తపై కలిగిన ద్వేషం వలస కాబోలు తనకి పెళ్ళి వద్దని నిర్ణయం చేసుకుంది. నిశ్చయం చేసుకున్న తరువాత ఆమె మనసుని మార్చడం అసాధ్యమని అందరికీ తెలుసు. కాని కిందటి నెల వాళ్ళ నాన్నగారు భయపడుతూ, భయపడుతూ, ఒక వరుడుగురించి ప్రస్తాపించినప్పుడు, అతన్ని చూడకుంటానే మీనా "మీకు ఇష్టమైతే నాకూ ఇష్టమే . . . " అని పెళ్ళికి అంగీకరించినప్పుడు అందరికీ ఆశ్చర్యం కలిగింది. "సరేలే, దానికి ఇరవైరెండు నిండాయి, ఆఖరికి పెళ్ళికి సరేనంది . . . " అని తల్లిదండ్రులు సంతోషించారు. ఆ తరువాత పెళ్ళికొడుకుని పెళ్ళి చూసారు. అమ్మాయిని వాళ్ళు వచ్చిచూసారు. అమ్మాయి ఫోటో వరుడికి పంపారు. వరుడు ఫోటో చూడకుండానే "మీకు నచ్చితే నాకూ సరే!" అని మీనా చెప్పేసింది; కాని పెళ్ళికి ఏకీభవించిన నిమిషంనుంచి ఆమె అంతులేని సంతోషంతో కనిపించింది. మనసులో తీయని కలలు కంటూ, నిత్యమూ మూసుకున్న కన్నులతో, మొహంలో చిరునవ్వుతో ఉంది. దేహంలో అటువంటి ఉత్సాహం, నడకలో ఆతురత . . . 'ఎందుకిలా మీనాలో మార్పు వచ్చింది? గభీమని ఆమె పెళ్ళికి ఏకీభవించడానికి కారణం ఏమిటి? వరుడు ఫోటోని ఎందుకు ఆమె చూడనేలేదు?' అనే ఆలోచనలతో రాజం మనసుకి మీనా ఒక

మర్మంగా కనిపించింది. 'ఇదేమో ఒక సామాన్య పిల్ల కాదు, ఒక వింతైన సృష్టి' అని రాజం తనలో చెప్పుకుంది.

కింద హాలులో ఎవరో మాటాడుతున్నారు; రాజం తొంగి చూసింది. మేజా దగ్గర కూర్చొని, పెళ్లికి కొనవలసినవి నాన్నగారు ఒక జాబితాలో రాస్తున్నారు; అమ్మ అతని పక్కనే నిలబడి ఉంది. ఇద్దరూ గబగబమని మెట్లు దిగివస్తున్న మీనాని చూసి నవ్వుతున్నారు.

తైలం సీసా, సబ్బుతో మేడమీదకి వచ్చిన మీనా మొహం శుభ్రంగా, శోభతో కనిపించింది. కళ్ళలో చిరునవ్వు, బుగ్గల్లో సిగ్గువలన ఎర్రదనం వ్యాపించివుంది.

"రాజం, చూసావా? నాన్నగారు నన్ను ఎగతాళి చేస్తున్నారు . . . "

"ఏమంటున్నారు, నాన్నగారు ఏమంటున్నారు?"

"అదెలాగో పోనీలే . . . ముందు నువ్వు నాకు తల దువ్వుతావా, లేదా?" అని కొంచెం కఠినంగా అధికార ధ్వనిలో మీనా అడగ్గానే, రాజం మళ్ళీ ఆమెను చేరుకొని మీనా శిఖ అలంకరణకి పూనుకుంది; మీనా హాలుమధ్య కూర్చోంది.

"ఇలా రావే, హాలు మధ్య కూర్చుంటే ఎలాగ?" అని రాజం మీనా జుత్తుని వదలకుండా ఆమెని ఒక కిటికీకి రమ్మని లాగింది.

"అబ్బా, ఏం బాధ! ఏమిటే, నువ్విలాగ మోటుగా లాగుతే, నువ్వు నాకు దువ్వనక్కరలేదు! పో!" అని తటలున మీనా తన జడని చెయిలో తీసుకొని కోపంతో కిటికీ పక్క నిలబడి వీధిని చూసింది.

"ఎందుకే నీకు మాటమాటికీ ఇంత కోపం?" అని మీనా భుజాన్ని పట్టుకొని తిరిగిచూసిన రాజం అదిరిపడింది; మీనా కనుబొమ్మల్లో నీళ్లు తేలుతున్నాయి.

"మీనా!" అని హడలు పడిన రాజం భుజంమీద తలని అణచుకొని మీనా వెక్కి వెక్కి ఏడ్చింది.

"నాకీ పెళ్ళిగురించి తలచుకుంటేనే భయంగా ఉందే! మిమ్మలందరినీ వదిలేసి నేనెక్కడో వెళ్ళాలంటే నాకు కడుపు తిప్పుతోంది . . . ఆ తరువాత నాన్నగారు, అమ్మ, నువ్వు, నాకు బంధువులు కారు! మిమ్మల్ని వదిలేసి మరెవరినో నమ్ముకొని, అతనే అన్నీ అని . . . "

"ఇవేం జడ్డి మాటలు! నువ్వు చదువుకున్న అమ్మాయికదూ? విను, ఈ చుట్టరికాలన్నీ నువ్వు త్వరలో మరిచిపోవడానికి అతను దోహదం చేస్తారు."

"ఎవరు?"

"ఉండు, చూసి చెప్తాను . . . " అని రాజం కిటికీ పక్కన ఉన్న ఆహ్వాన పత్రికని చెయిలో అందుకొని, చదివి " మిస్టర్ సూర్యనారాయణన్" అని చెప్పి నవ్వింది. అది విని మీనాకీ హృదయంలో ఆహ్లాదం లేచింది, కాని "నాకిప్పుడు నువ్వు జడ అల్లుతావా లేదా?" అని సంభాషణని మళ్ళించింది.

"ఎవరు కాదన్నారు? ఇలా తిరిగి చూడు . . . "

తల తిప్పినప్పుడు దూరంలో కనిపించే గోపురం చూసిన మీనా "రాజం, ఇవాళ సాయంకాలం కోవిలకి వెళ్దామా?" అని అడిగింది.

"ఓ, తప్పకుండా!"

మీనా మౌనంగా ఆకాశంలోని దృశ్యం చూస్తూ తనలోనే లీనమైపోయింది. తటాలున మొహంలో చిరునవ్వు మెరపులాగ వచ్చి మాయమైంది. ఆమె హృదయంని భావోద్యేగాలు నింపేసాయి. గభీమని కొన్నిసార్లు నవ్వడం, కొన్నిసార్లు ఏడవడం, చిరచిరలాడడం, లాలించడం, ముద్దులాడడం, నిమ్మళంగా ఒక చోట కూర్చొని గడ్డ కట్టిపోవడం - ఇక ఏంచెయ్యాలో తెలియనట్టు - ఆమె కలవరపడుతూ కనిపించింది.

"మీనా, నిన్ను ఒకటి అడగాలి . . . " అంది రాజం, జడ అల్లుతూ.

"అడుగు." మీనా మొహంలో చిరునవ్వు మాయమై, వెలుగు చోటుచేసుకుంది.

"నువ్వు ఎందుకు గభీమని ఈ పెళ్ళికి సమ్మతించావ్? . . . నేను నమ్మలేకున్నాను!"

రాజం ఏం అడుగబోతుందని మీనాకి బోధపడింది.

"రాజం, నీకు పెళ్ళయినప్పుడు నీ వయస్సు పదహారు కదూ?"

"అవును."

"అసలు పెళ్ళంటే ఏమిటి? ఒక అమ్మాయికి, ఒక మగవాడితో తప్పనిసరిగా సహవాసం కావాలా అని ఆలోచన రావడానికి ముందు, ఈ పెళ్ళి అనేది ఒక ఆటలాగ అనిపిస్తుంది. అప్పుడు పెళ్ళంటే ఆమెకి తోచేవి పట్టు చీరలు, నగలు, తినుబండారాలు,

బాజాబజంత్రీలు, బంధువులు వచ్చి చేసే అన్ని ముచ్చటలూ, గుసగుసలు . . . చూడడానికి  చాలా మజాగా ఉంటుంది . . . ”

- ఇలాగే, చాలా సేపు మౌనం వహించిన తరువాత మీనా మాట్లాడడం ఆరంభించిందంటే, ఆమె తల్లిదండ్రులుకూడా నోరు పెగల్లకుండా వింటూనే ఉంటారు - ‘అవును’, ‘కాదు’ అని ఏమీ అనరు.

“‘పెళ్ళి సందడిలో పెళ్లికొడుకు తాలిబొట్టు కట్టడం మరిచిపోయాడని ఎవరో అన్నారే, అలాగే ఇది కూడా. ఈ పెళ్ళి కోలాహలంలో అమ్మాయికి భర్తగురించి, పెళ్ళి తాత్పర్యం గురించి ఆలోచించడానికి టైమెక్కడ ఉంది? ఆ రోజుల్లో నాకు పెళ్ళయివుంటే అదీ ఒక ఆటలాగే అయివుంటుంది.

“కాని ఆ ఆటలో ముప్పావు వంతు నేను నీ పెళ్ళిలోనే అనుభవించేసాను. అప్పుడేమో ఆ ఆట మనసుకి చాలా హాయిగా కనిపించింది. ఎందుకంటే అది పిల్లలు మాత్రం ఆడే ఆట కాదు కదా,  పెద్దలూ  ఆడారు . . . కాని ఆ తరువాత నువ్వు పడిన బాధ! అప్పుడు నువ్వు మాత్రం ఏడవలేదు, పెద్దలందరూ కలిసి ఏడ్చారు . . . ఒక రోజు మూటా ముల్లెలతో నువ్వు మద్రాసునుంచి ప్రయాణం చేసి, బండినుంచి దిగి, హోరున ఏడుస్తూ ఇంటిలోకి వచ్చావ్ . . . నీ భర్తే అందుకు కారణం, అతనే అంత పనీ చేసాడు! నాకప్పుడే అనిపించింది - వాడు నీ చెయి పట్టుకొని అగ్నిహోత్రుని చుట్టూ రాగానే, బాజాబజంత్రీలు మ్రోగుతుంటే నీకు తాళిబొట్టు కట్టి అగ్ని సాక్షిగా ముక్కోటి దేవతలు సాక్షిగా ‘నువ్వు నా భార్య!’ అని అనడం ఎంత పెద్ద అబద్ధం, బూటకం, అపవిత్రమైన మోసం అని . . . ఆ వయస్సులో నాకలా అనిపించడం ఆశ్చర్యమే, కాని నీకా ఆటలో కలిగిన అనుభవం చూసి నేనొక మంచి పాఠం నేర్చుకున్నాను. ఆ ఆటని చూసి నాలో పగ, ద్వేషం, పెరిగాయి. ‘అసలు పెళ్ళి వద్దేవద్దు!’ అనే ఆలోచనతోనే నేను జీవించాను . . . ”

రాజం మీనా మాటలు వింటూనే జడ అల్లడం ముగించింది; మల్లిపూల సరంతో ఆమె తలని నిండుగా అలంకరించిన తరువాత కొంచెం తన జుత్తులోనూ దోపుకుంది. ఇవన్నీ గమనించకుండా మీనా మాటాడుతోనే ఉంది.

"నాకు మగవాళ్ళంటే విసుగు. నీ భర్తకి ఎవరూ అసమానులు కారు; ఊరులో తిరిగే యువకులందరూ అలాంటివారే అనిపిస్తోంది . . . ఈ పాపిష్టి ప్రపంచంలో ఒక మంచి మగవాడిని నమ్మి అతని దగ్గర నా జీవితం అప్పగించడం ఎలాగ? ఇందులో మనం ఏ పరీక్ష ఐనా చెయ్యగలమా? ఒక యువతి దేహం చూసి ఆతురపడే మగవాడి మొహం మాత్రమే నేను నిత్యమూ చూస్తున్నాను. యువతికీ మనసని ఒకటి ఉందనే తలంపుతో ఏ మగవాడున్నాడు? అలాంటి ఆలోచనలు రాగానే నాకు చాలా భయంగా ఉంది. కాని ఇలాగే ఒంటరిగా జీవితం గడపడం సాధ్యమని తెలిసినా అటువంటి జీవితంకి ఒక అర్ధం లేదని నాకు తరచుగా అనిపిస్తోంది . . . నాకోసం మాత్రం నేను జీవిస్తే నేను నన్నే నాశంచేసుకున్నట్టు అర్ధం . . . తన మనసులోని ఆశలు, దేహం, జీవితం నాకు అప్పగించే మగవాడికి నా మనసు, ఆశ, దేహం, జీవితం వదులుకుంటే నా జీవితం ఎంత సార్ధకంగా ఉంటుందని నేను ఆలోచించాను. అతను ఎవరు? 'అతను తప్పకుండా ఎక్కడైనా పుట్టివుంటాడు, నన్ను వెతుక్కుంటూ వస్తాడు' అని ఒక గట్టి నమ్మకం కలిగింది. ఆ నమ్మకం వలనే . . . "

"మీనా, ఇలా తిరుగు, బొట్టు పెడతాను" అని మీనా భుజాన్ని తన వైపు మళ్ళించి, ఆమె చుబకంని చెయిలో ఆనుకొని, నుదుటమీద సిందూరంతో తిలకం పెట్టి, రాజం ఆమె కళ్ళు చూస్తూ అడిగింది: "నిన్నొకటి అడుగుతాను, కోపం రాదుకదా?"

"అడుగవేం?"

"నీ మాటలు వింటే . . . నువ్వు ఎవరినైనా . . . "

"ఎవరినైనా?"

"ప్రేమించావో అని . . . "

మీనా నవ్వింది. ". . . అవును, నేను ఒకతన్ని ప్రేమిస్తున్నాను . . . కాని ఆ ప్రేమికుని మొహం కూడా నేను సూటిగా చూడలేదు . . . "

"అంటే, అతన్ని ఫోటోలో చూసావా?"

"హూం, లేదు . . . ఎందుకంటే ఒక అందమైన ఫోటో చూసి ఒకతన్ని ప్రేమించలేం . . . అతని రూపం నా మనసులో ఉంది. అతన్ని నమ్మి నేను నన్ను అతనికి అర్పణ చేస్తున్నాను. అతనూ అలాగే చేస్తారు. ఆ తరువాత అతన్ని నా మనసులోని రూపంతో

సరిపోల్చి చూస్తాను, అది సరిగ్గానే ఉంటుంది! ఆ తరువాతే అతన్ని ప్రేమిస్తాను, అప్పుడే మేమిద్దరమూ పరిపూర్ణంగా ప్రేమికులవుతాం . . . ఇందులో నాకు అపజయం కలిగితే జీవితంలో ఓడిపోయానన్నమాట . . . మన దేశంలో ఒక ఆడది తన జీవితంకని ఇంతకన్నమరేం చెయ్యడం సాధ్యం? అంతకు మించి, నన్నడిగితే, 'ప్రేమ, వలపు, ఇవన్నీపచ్చి అబద్ధాలు' అని అంటాను; నాకు వాటితో ఏ పొత్తూ లేదు. నాకిప్పుడు ఇరవైరెండు నిండాయి, నేనిలాగే ఇక ఉండగలనా? 'నాకు పెళ్ళి వొద్దు!' అని నేను చెప్పడానికి కారణం నాకొక మంచి జీవితం కావాలనే కోరిక, సన్యాసినిగా జీవించాలని కాదు! అందువలనే పూర్ణమైన నమ్మకంతో ఈ పెళ్ళికి నేను సమ్మతించాను. 'మంచి మనసుతో ఈ ప్రపంచంలో ఆడవారు మాత్రమే ఉంటారా? నాలాంటి ఒక మగవాడు ఉండకూడదా? ఇంతవరకూ అతను నాకోసం రాలేదంటే ఇక అతను వస్తాడని ఏమైనా ఆధారం ఉందా?' నేనిలాగ తికమకలు పడుతుంటే నాన్నగారు ఈ వరుడుగురించి నాతో మాటాడారు. నేను వెంటనే 'సరే' అన్నాను. అసలు జీవితమనేది ఒక పరీక్ష, అవునా? సరే, చూద్దాం, దేవుడు మీదనే నాకు నమ్మకం ఉంది" అని మీనా అనగానే రాజం అభిమానంతో ఆమెను తన ఛాతీలో అణచుకుంది. "విను, నీకు మరేం అనుమానం వద్దు . . . అతను నీకు తగిన భర్తగా ఉంటారు" అని చెప్పింది.

"ఎలాగ?"

"నువ్వు అనలేదూ - తన మనసు, ఆశలు, దేహం, జీవితం నీకు అప్పగించడానికి ఒక మగవాడు ఉంటాడని? అతను అలాంటివారే . . . "

ఆ మాటలు ఇంకొకరు చెప్పడం విని మీనాకి ఆహ్లాదం కలిగింది. అప్పుడు సమయం ఐదు గంటలు.

"సరేలే, నువ్వు చీర మార్చుకొని రెడీ అవు . . . మనం కోవిలకి వెళ్దాం" అని రాజం అంది.

బీరువానుంచి ఒక పట్టు చీర ఎంచుకొని, ధరించుతూ, మీనా మాటాడింది. "చూసావా, ఈ వాగుడు నన్ను బాగా పట్టుకుంది . . . నేను మరేం చెయ్యగలను,

చెప్పు! మనసులో ఉన్నదంతా ఒలకబోస్తే నాకు చాలా హాయిగా ఉంది! . . . నువ్వు ఏమీ అనలేదు . . . అసలు నీ మనసులో ఏముందో నాకు తెలీదే?"

"బాగా చెప్పావ్! నువ్వు ఏం చెప్పినా తొమ్మిది రోజులకి దానిగురించే నా ఆలోచన అంతా! మరేం చెప్పమంటావ్? నాయనా, ఇవన్నీ ఎక్కడ నేర్చుకున్నావో? పుస్తకాలు చదివి, చదివి, నువ్వు బాగా చెడిపోయావ్! . . . ముందు మీ ఆయనతో ఒకటి చెప్పాలి - నువ్వింక ఇక పుస్తకాలు చదవడం ఆపాలని ఆర్డరు ఇవ్వాలి!" అని చెప్పి రాజం నవ్వింది.

"సార్, టెలిగ్రాం" అనే మాటలు విని రాజం మెట్లదగ్గరకి వచ్చింది. రవిక ధరించి, పైనకొంగుని సర్దుకుంటూ మీనా ఆమె వెనుక వచ్చి నిల్చుంది. కింద, మేజా పక్కన కూర్చొని, పెళ్ళికి కావాలసిన సామగ్రి జాబితాని చూస్తున్న మీనా తండ్రి తంతివార్త చదువుతున్నారు. ఆమె తల్లి వంటగదినుంచి పరగెత్తుకొని వచ్చి ఆతురతతో అతన్ని చూస్తూ నిలబడింది. అతను మౌనంగా దాన్ని చదివిన కొన్ని క్షణాలలో ఆ తంతి అతని చెయినుంచి జారింది; సామగ్రి జాబితా గాలిలో తేలి నేల వాలింది.

'సూర్యనారాయణన్ హఠాత్తుగా గుండెపోటులో కన్నుమూసాడు' అనే ఆ తంతివార్త విని ఇల్లంతా దుఃఖంలో మునిగిపోయింది. మీనా మొహాన్నికూడా చూడడానికి ధైర్యంలేక ఒక మూల కూర్చొని రాజం వెక్కి వెక్కి ఏడ్చింది. కింద నాన్నగారు మేజామీద వాలి తలమీద చెయితో కూర్చొని ఉన్నారు; తల్లి వంటగదినుంచి బయటకి రానేలేదు.

మీనా మేడ వరండాలో ఒక స్తంభంపై ఆనుకొని, రెండు చేతులు స్తంభం వెనుక అలుముకొని, ఆకాశంవైపు తలెత్తి, కళ్ళు మూసుకొని నిలబడింది; మొహంలో ప్రకాశించే ఆ చిరునవ్వు ఇప్పుడు లేదు. ఆమె ఏడవలేదు, కాని మూసివున్న కనురెప్పలలోనుంచి - రెండు పక్కలా - ధారధారగా కారుతున్న కన్నీళ్ళు ఆమె దేహాన్ని తడిపేసాయి. ఆమె కళ్ళు ఆ రూపంని - తన మనసులో ఉందని రాజంకి చెప్పిందే, ఆ ఆకృతిని, ఒక నెలముందు తన కలలో కనిపించి, 'నా మనసు, ఆశలు, దేహం నీకు అప్పగించాలని కాచుకొని ఉన్నాను!' అని స్థిరపరచిన ఆ మూర్తిని, ఒక

నెలగా కళ్ళు మూసుకొని నిద్రపోతున్నట్టు ఆ ఊహ ప్రపంచంలో తను చూసి ఆనందించిన అతన్ని - గుర్తుచేసుకొని బాధపడింది; గభీమని కళ్ళు తెరచింది.

'నేనిలాగే నిల్చుంటే ఎలాగ? నేను ఏమైనా చెయ్యాలి . . . కాని ఏం చెయ్యగలను? అసలు, ఏమిటి చెయ్యాలి'

మీనాకి అంతా గడబిడగా ఉంది. వరాండాలో ఒక చివరనుంచి ఇంకొక చివరకు రెండు మూడుసార్లు నడచింది. కిటికీ దగ్గర నిలబడి కిటికీ పట్టెలని గట్టిగా పట్టుకొని దూరంలో కనిపించే గోపురం శిఖర కుంభంని తేటిపార చూసింది. కిటికీ దగ్గర ఉన్న ఆ పెళ్ళి పత్రిక - ఇంకా నాలుగు రోజుల తరువాత తనకీ, అతనికీ జరుగబోయే పెళ్ళికి బంధు మిత్రులందరూ రావాలనే సందేశంతో పంపపడిన ఆ శుభ ముహూర్త ఆహ్వాన పత్రిక - కనిపించింది. దాన్ని తీసుకొని చదివింది.

'నా కనిష్ట కొమార్తె సౌభాగ్యవతి మీనాక్షిని, చిరంజీవి సూర్యనారాయణన్ B.Sc., కి కన్యాదానం చెయ్యడానికి పెద్దలు . . . '

"దౌర్భాగ్యురాలంటే ఇదే! ఏమీ అనకుండా . . . ఏమీ అనకుండా, గభీమని, ఇన్ని సంవత్సరాల తరువాత పెళ్ళి చేసుకుంటానని చెప్పిందే, ఆ వేళలోనే వాడు కన్ను మూసాడు! . . . దౌర్భాగ్యురాలు!" అని తల్లి ఏడుస్తూ ముక్కు తుడుచుకుంది; తండ్రి మాటలు మేడనుంచి వినిపించాయి.

"దాన్నెందుకే దౌర్భాగ్యురాలంటావ్? అదృష్టవంతురాలు అని చెప్పు . . . మెడలో తాలిబొట్టుకట్టిన నాలుగు రోజుల తరువాత కన్ను మూయకుండా, ఇప్పుడే పోయాడు . . . ఇది దాని అదృష్టం అనాలి . . . "

'ఎంత ఘోరం, మనుషులకి ఎంత స్వార్థం!'

'అమ్మా, నాన్నగారూ ఇలాగ ఏమైనా చెప్పుకొని తృప్తి పడతారు. రాజం ఏదో ఒక మూల నాకోసం, తన కొరతలకోసం ఏడుస్తూ ఉంటుంది. కాని నేను? నేను ఏదైనా చెయ్యాలి? . . . ఏం చెయ్యాలి?'

మీనా మళ్ళీ చేతులు అదుముకుంది. ఏంచెయ్యాలో తెలియక స్తంభంపై మళ్ళీ ఆనుకొని కళ్ళు మూసుకుంది. చాలా సేపు తరువాత ఆమె కళ్ళు తెరిచి చూసినప్పుడు చీకటి బాగా కప్పేసింది.

ఆమె సావధానంగా మెట్లు దిగి కిందకి వచ్చింది. ఆమె రావడం చూసి నాన్నగారు మౌనంగా -అమెను తలెత్తి చూడలేకుండా - అలాగే కూర్చున్నారు. ఆమె అతని ఎదుట వచ్చి నిలబడింది; ఆమె తన్ను దాటి వెళ్ళాలని అతను వొంగి ఆమె నీడని చూస్తూ ఉన్నారు.

నీడ అలాగే నిలకడగా ఉంది.

"నాన్నగారూ!" అతను ఎదురుచూసినట్టు వెక్కు, ఏడ్పు లేకుండా విషాదఘటనని మనసులో అణచుకొని, తడబడని కంఠంతో మీనా అతన్ని పిలిచింది.

నీడనుంచి దృష్టి మళ్ళించి తలెత్తి చూసినప్పుడు ఆతని ఎదుట ప్రకాశవంతమైన మొహం కనిపించింది.

"నాన్నగారూ, బయలుదేరండి, మనం వెళ్ళాలి!"

"ఎక్కడికి?" అతను తడబడుతూ అడిగారు.

"మద్రాసుకి . . . టెలిగ్రాం వచ్చిందిగా? మనం వెళ్ళిరావాలి . . . "

వాళ్ళ సంభాషణ విని తల్లి జోక్యం చేసుకుంది. "ఏమిటే నీ వాగుడు? మనకీ వాళ్ళకీ ఏం పొత్తు ఉందని? సంబంధం ఏర్పడడానికి ముందే అతను పోయాడుగా!"

"పొత్తు ఉండి తీరాలా ఏమిటి? సంబంధంకి పూనుకున్నవారు గభీమని పోయారంటే సామాన్య మనోభావం లేకపోతే ఎలాగ? చావుకీ, సంబంధంకి ఏం పొత్తు ఉందని? వాళ్ళు టెలిగ్రామ్ పంపించారే, మనం వెళ్లవద్దా?"

"పరామర్శకి నాన్నగారు వెళ్తారు, నువ్వెందుకు?" అన్న తల్లి మొహం మీనా తేరిపార చూసింది. ఆమె చూపు ఆ తల్లి కళ్ళని పొడిచి, వాటిని మించి వ్యాపించింది. పళ్ళు కొరుకుతూ, మెల్లగా, నిశ్చింతగా, మాటాడింది:

"నేను తప్పకుండా వెళ్ళాలి . . . మీతో వెళ్ళనా, లేకపోతే, నేనే . . . "

"నాన్నగారూ, దానితో వెళ్ళండి . . . దాని మనసు నాకు తెలుసు . . . " అని అంటూ రాజం మెట్లు దిగివచ్చింది. తల్లి మొహం ముడుచుకొని వంటగదికి వెళ్ళింది; నాన్నగారు మద్రాసుకి వెళ్లే రైలుబండికి ఇంకా ఎంత సమయముందని గడియారం చూసారు.

** ** **

పరమేశ్వర్ అయ్యర్ ఇంటిముందు ఒక గుఱ్ఱం బండి వచ్చి ఆగింది. రాత్రంతా ప్రయాణం చేసిన అలసటతో, ఈ పెళ్ళి ఆగిపోవడంతో ఏర్పడిన వేదనతో కృంగి పోయిన మొహంతో, మీనా తండ్రి బండినుంచి దిగారు. ఉదయం సూర్యకిరణాలలో తన నల్ల పట్టుచీర అంచు మెరుస్తుంటే, నూతనత్వం తగ్గకుండా, ఆ ముందు దినం రాజం అలంకరించిన మల్లెపూల సరం కొంచెం కూడా వాడకుండా, పెళ్ళి జరుగుతున్న ఇంటికి వచ్చినట్టు మీనా దిగివచ్చింది. నాన్నగారు బండివాడికి డబ్బు ఇవ్వబోయారు.

“బండి ఉండనీ . . . ” అని మీనా అంది.

ఆమె ఏమంటోంది, ఎందుకలా అంటోంది అని నాన్నగారికి అర్థం కాలేదు. కాని అతనెందుకు ఆమెకి ఎదురు చెప్తారు? బండివాడిని ఉండమని చెప్పి అతను కూతురుతో ఇంట్లోకి ప్రవేశించారు.

ఇంటి ముందు నిలబడివున్న జన సమూహం గుసగుసలతో కదులుతూ వాళ్ళకి దారి చూపారు. వసారాలో కూర్చొని ఉన్న పరమేశ్వర్ అయ్యర్ వీళ్ళని చూడగానే “నాయనా . . . సూర్యా . . . ” అని గోలపెట్టి ఏడ్చారు. మీనా నాన్నగారు పరుగెత్తుకొని వెళ్ళి అతన్ని అణచుకున్నారు. మీనా విగ్రహంలాగ నడిచి వచ్చింది. ఆమె లోపలికి ప్రవేశించగానే అమ్మలక్కలు - సానుభూతి కలవారు, గతించిన వాడితో రక్త సంబంధం ఉన్నవారు - విలపించే ధ్వనితో ఏడవసాగారు; కొందరు మీనాన్ని లాగి పట్టుకొని ఏడ్చారు.

“వెళ్ళండి, నన్నెవరూ ముట్టుకోవద్దు! నేనేం మీతో కలిసి ఏడవడానికి రాలేదు!” అని మీనా నిమ్మళంగా, కాని తీవ్రంగా వాళ్ళకి చెప్పింది.

“ముప్పైయేళ్లు నిండాయేమో? దీని జాతకఫలం వలనే పోయాడు!” అని ఎవరో ఒకావిడ క్రూరంగా గుసగుసలాడింది.

“ముప్పైయ్యా? చూస్తే అలాగ కనిపించదే?” అని ఇంకొక స్త్రీ అంది.

ఇవన్నీ మీనా చెవికి అందాయి; ధారధారగా కన్నీళ్ళు కారుతుంటే, ఎదుట కనిపించే ఆ రూపంతో ఆమె తన మనసులోని రూపంని సరిపోల్చుకుంది.

అతను దుమ్ములో పారేసిన ఒక స్వర్ణ విగ్రహంలాగ పడుకొని ఉన్నాడు: ఒక శిశువులాగ; యౌవనంకి చెందిన ఉపద్రవాలు ఎరుగని ధోరణితో; మొహంలో

యోగ్యమైన ఒక మగవాడి చిరునవ్వుతో; అతని అంతరంగ సత్యంని ప్రకటించే ఆ ఎఱ్ఱ పెదిమలు; దీర్ఘమైన ముక్కుపైన దట్టంగా, చుట్టలు చుట్టలుగా పెరిగిన కేశం. ఆ మూసిన కళ్ళలో ఒక సందేశం: 'నన్నే నీకు అప్పగించాలని కాచుకొని, నా కోరిక నెరవేరింది.'

మీనా కళ్ళు తుడుచుకుంది; ఆమె కళ్ళు ప్రకాశించాయి. మొహంలోని చిరునవ్వు మాయమై, శోభ చోటుచేసుకుంది. ఇక తను ఏం చెయ్యాలని ఆమె నిర్ణయం చేసుకుంది.

చాపుకున్న అతని రెండు పాదాలముందు సూటిగా వచ్చి నిలబడి కళ్ళు తెరిచి మీనా అతన్ని ఒకసారి బాగా చూసింది. వొంగి అతని పాదాలు నమస్కరించింది. ఆమె తలలోని మల్లిపూలు నేల రాలాయి. నమస్కరించి తలెత్తినప్పుడు ఆమె కళ్ళు మూసివున్నాయి. తలెత్తగానే, గభీమని తలమీదున్న మల్లెపూల సరంని పీకి, అతని పాదాలముందు పడేసి, లోకప్పుని ఎక్కడో చూస్తూ ఉన్న మీనా తన అరచెయితో నెత్తిమీదున్న తిలకంని తుడిచివేసింది.

ఆ దృశ్యం చూసి అందరూ అదిరిపడ్డారు. ఇంటిలో ఉన్నవారందరూ - పరామర్శకి వచ్చినవారు - ఏమీ బోధపడక - ఏడవడం మరిచిపోయారు. మీనా గభీమని లేచి, తిరిగి, వీధిలో ఉన్న బండికి నడిచింది. నాన్నగారు పరుగెత్తుకొని వచ్చి, ఆమెను ఓదార్చి, ఆమెతో నడిచారు.

"మీనా, ఎందుకమ్మా ఇలా చేసావ్?" అని అతను ఏడుస్తూ అడిగారు.

ఆమె జవాబు చెప్పలేదు. బండిలో కూర్చున్నతరువాత, అది పోతుంటే, మీనా మొహంలో చిరునవ్వు మాయమై, కాంతి చోటుచేసుకుంది.

"నాన్నగారూ, అతనికి . . . అతని వితంతువుగా జీవించడంలో ఒక అర్థముంది."

"అతను నీ మెడలో తాళిబొట్టు కట్టలేదే? నీకెందుకమ్మా ఈ అవస్థ?"

"హూం . . . " మీనా లేతగా నవ్వింది. తరువాత తన అరచెయిలో పదిలమైన సిందూరం చూస్తూ మాటాడింది. "అతనుగాని నా మెడలో తాళిబొట్టు కట్టివుంటే నేను అతనితో సతీసహగమనం చేసివుంటాను."

"మీనా . . . " అని నాన్నగారు ఆమె చెయిని పట్టుకున్నారు.

బండివాడు ఆకాశాన్ని చూసి దండం పెట్టాడు. "అయ్యగారూ, ఇలాంటి ఆడవాళ్ళు ఉండడం వలనే ఈ భూమిలో వానలు కురుస్తున్నాయి, పంటలు పండుతున్నాయి . . . సంవత్సరాలు, సంవత్సరాలు కాపురం చేసి తాళిబొట్టు పోయినవారు కూడా పూలు, పవుడరుతో ముస్తాబు చేసుకుంటున్నారు . . . " అని ఏదో చెప్పడానికి వచ్చినప్పుడు మీనా జోక్యం చేసుకుంది. "ఎన్ని సంవత్సరాలు జీవించినా ఆ భార్య అతనితో జీవించలేదని అర్థం. ఆమెకోసం పుట్టిన వాడితో ఆమె జీవించకపోవడం ఎంత పెద్ద పాపం! అతనికోసం ఆమెని బలి ఇవ్వడం మరొక పాపం కదా? ఇవన్నీ వ్యక్తిగతంగా మనుషుల స్వభావంపై ఆధారపడివుంటుంది. నన్నడిగితే, నేను చేసినది నావరకూ సరే. కాని దీన్ని ఒక సామాజిక ధర్మమని అంటే మహా పాపం . . . " అని ఆమె చెప్తూ పోతుంటే బండివాడు తనేదే దైవ సందేశం వింటున్నట్టు ఆమె మాటలు గమనించాడు.

మీనాకి ఇరవైయేళ్ళు పెరిగినట్టనిపించింది. ఆమె మాటలు వింటున్న నాన్నగారికి . . .

బండి వెళ్తూనే ఉంది; జీవితం మాత్రం పారకుండా నిలిచిపోయింది!

********

**(మూలం: ప్రచురణ, ఆనంద వికటన్, 1960)**

# పాతివ్రత్యం

నిశ్చయం చేసిన భర్త కన్ను మూసిన తరువాత, ఇంతకు ముందు మొహం కూడా చూసి ఎరుగని ఎవడో ఒక  యువకుని మృతదేహం చూసి, అతని పాదాలకి తన తలలోని పువ్వులని అర్పణ చేసి, నెత్తిలోని తిలకంని చెరుపుకున్న మీనా, బాహటంగా తన్ను ఒక వితంతువుగా ప్రకటించుకున్న సంగతి ఆ ఊరులో అందరికీ తెలిసిపోయింది.

ఈ అమ్మాయి వెర్రితనం చూసి ఎగతాళి చేసిన అభ్యుదయకర గుంపులు, భర్తకాని ఒకతనికి వితంతువు అవడం మన శాస్త్రాలకి విరుద్ధమని అని సానుభూతితో చెప్పుకున్న సనాతనులు - వీళ్ళందరూ  'ఇదొక అమ్మాయి వ్యక్తిగత మనసు' అనే నిజంని నిరాకరించి, ఆమె మనసు, భావోద్వేగాలు పూర్తిగా మరిచిపోయి, తమ తమ అవగాహనకి తగినట్టు, ఆవేశంతో, ఆమె గురించి తమలో విమర్శించుకున్నారు.

కాని మీనా ఆ విమర్శకుల కూతలు తన చెవుల్లో పడని దూరంలో నిల్చొనివుంది.

భర్త త్యజించిన భార్యగా పుట్టింటికి తిరిగి వచ్చి పది సంవత్సరాలు ఆ బంధం గురించి ఆలోచిస్తూ తప్పకుండా తన భర్త ఒకరోజు తిరిగి వస్తాడనే నమ్మకంతో జీవించే రాజం తన ప్రియమైన చెల్లెలుని చూసినప్పుడెల్లా వాపోయింది; ముందులాగ తోబుట్టువులు ఎక్కువగా మాట్లాడడం మానుకున్నారు. మీనాని చూసినప్పుడెల్లా రాజంకి ఒక విధమైన భయం కలగడంతో  ఇద్దరిమధ్యా సాన్నిహిత్యం తక్కువైపోయింది. మీనాగాని తనే ఏమైనా మాటాడితే రాజం కూడా మాటాడుతుంది; ఇప్పుడు రాజం కంఠంలో భవ్యం, అనురాగం చోటుచేసుకున్నాయి; చెల్లెలంటే ఆమెకి చాలా గౌరవం.

వాళ్ళ తల్లిదండ్రులు - లక్ష్మి అమ్మాళ్, కృష్ణయ్యర్ - ఇద్దరు పిల్లలు కని, రెండు విధాల శోకాలు అనుభవిస్తున్నారు. 'అంతా కర్మ, కర్మ!' అని విసుగ్గుంటూ కాలం గడుపుతే ఎవరికి తృప్తి?

ఇతరులకి తమ మనోభావం తెలియజేస్తే ఏమవుతుందో అనే భయంతోనే ఆ ఇంటిలో అందరూ మెలగడం అలవాటు చేసుకున్నారు. అసలేం దుర్ఘటన జరగనట్టూ, జరిగినదేదో మరిచిపోయినట్టూ అందరూ మౌనం వహించారు; గత మూడు మాసాలూ ఇల్లు శాంతంగానే ఉంది.

ఈ వేసవికాల శెలవుల తరువాత, ఇంటర్ తో ఆపుకున్న మీనా మళ్ళీ కాలేజీ చదువులు సాగించబోతుందని వినికిడి; ఆమె నిర్ణయంకి అడ్డు చెప్పేది ఎవరు?

“ఏదైనా సరేలే అమ్మా, నువ్వు సంతోషంగా . . . ” అని ఏదో చెప్పబోతూ కృష్ణయ్యర్ గడ్డ కట్టిన కంఠంతో మరే మాటా అనలేకపోయారు; పక్కనే చీర ఎండబెట్టుతున్న రాజం అతని మాటలు విని మౌనంగా కన్నీరు కార్చింది.

“నాన్నగారూ, నేను చాలా సంతోషంగా ఉన్నాను . . . రాజం, నాకేం తక్కువ? నువ్వు నా గురించి బాధపడితే అందుకు అర్థం లేదు . . . ఛీ, ఛీ, నేను నిమ్మళంగా ఉన్నప్పుడు ఎందుకిలా . . . ” అని నవ్వుకుంటూ మీనా రాజంని తనలో అణచుకుంది.

రాజం తన మెడలో తాళిబొట్టు ఉండడం వలన, దాన్ని కట్టిన భర్త బతికివుండడం వలన, అతని ప్రేమ, సహవాసం తనకి తప్పకుండా మళ్లీ దొరుకుతాయనే నమ్మకం వలన పసుపు పూసుకుంటుంది, నెత్తిలో తిలకం పెట్టుకుంటుంది. కాని మీనా జీవితంలో ఏర్పడిన మార్పు వలన రాజం ముందులాగ పువ్వులు పెట్టుకోవడం మానుకుంది. చెల్లెలు తలని పూలతో నిండుగా అలంకరించి తను మిగిలిన పూలు పెట్టుకొనే ఆ అలవాటు వదలుకున్న తరువాత కోవిలలో, లేక ఇంటిలో పూజ తరువాత ఒక రెండు పూలు మాత్రం తీసుకొని రాజం జుత్తులో దోపుకొని, దాచుకుంటుంది.

ఒక శుక్రవారం ఉదయం తులసీ మఠంకి రాజం కుంకుమం పెట్టుతుంటే వీధిలో ఒక గుఱ్ఱం బండి వచ్చి ఆగడం గమనించింది.

బండినుంచి ఒకతను సూటూ, బూటూ ధరించి, ఒక చెయిలో తోలు పెట్టె, పుస్తకంతో దిగి, బండివాడికి చిల్లర ఇచ్చి, ముందుకు నడిచాడు. చుట్టలు చుట్టలుగా పెరిగిన అతని శిఖలో రెండు అంగుళాల వెడల్పుకి జుత్తు నెరసిపోయింది. అతని మంచి

పొడుగాటి ఆకారం దగ్గరకి వచ్చేవరకూ  స్తంభించిపోయి నిల్చున్న రాజం గభీమని ఒకే దూకులో ఇంట్లోకి పరుగెత్తింది. వంటగదిలోకి వెళ్ళి “అమ్మా . . . అమ్మా” అని మరేం అనలేక తన్నులాడింది. కళ్ళంట నీళ్ళు రాలాయి; పెదిమలు వొణికాయి; మొహంలో చిరునవ్వు చోటుచేసుకుంది.

తల్లికి ఒక నిమిషం ఏమీ అర్థం కాలేదు. తరువాత తెలిసింది. భుజంమీదున్న చీరకొంగుని బిగించుకొని ఆవిడ బయటికి వచ్చారు. హాలులో నిలుచున్నతని చూడగానే ఆవిడకి ముందు ఏడ్పు వచ్చింది, కాని సముదాయించుకొని  నిదానంతో అల్లుడికి స్వాగతం చెప్పారు.

“రండి, రండి . . . పది సంవత్సరాల తరువాత ఎలాగో మీకు జ్ఞాపకం వచ్చిందే, దారికూడా తెలిసిందే!” అని అంటూ ఆవిడ కళ్ళు తుడుచుకున్నారు.

“మీనా, మీ బావగారు వచ్చారు!” అని ఉత్సాహంతో రాజం మేడమీదకి పరుగెత్తింది.

“బావగారా?” మీనా కనుబొమ్మలు పైకి యెగిరాయి.

“Rascal . . . వాడెందుకు వచ్చాడు, ఇప్పుడు?” అని అడుగుతూ మేడమీద తన గది నుంచి కృష్ణయ్యర్ బయటకి వచ్చారు.

“నాన్నగారూ . . . ” అని పరుగెత్తుకొని వెళ్ళి రాజం అతని చేతులు పట్టుకొని బతిమాలింది; అతనూ తనకేర్పడిన ఆవేశంని తలచుకొని తల వొంచారు.

“నాన్నగారూ, దయచేసి అతనితో దెబ్బలాడవద్దు . . .” అని వెక్కుతున్న కంఠధ్వనిలో రాజం తండ్రిని వేడుకుంది.

“ఛీ! పిచ్చిదానా! నేనెందుకు దెబ్బలాడతాను? మన కర్మకి ఇంకొకరితో దెబ్బలాడితే ఏం లాభం?  . . . అవును, ఇప్పుడు ఎందుకు వచ్చాడు? వీడు మద్రాసులో ఆమెతో కాపురం చేస్తున్నాడని వినికిడి,  మైలాపూర్లో ఉన్న తన సొంత ఇంటికి కూడా అరుదుగా వెళ్తున్నాడట! మరి ఇప్పుడు నీతో వెళ్ళి అక్కడ . . . ” అని అతను ఆలోచించారు.

“నాన్నగారూ, అతను ఏంచెయ్యబోతున్నారని, నేను అతనితో వెళ్ళడం గురించి మీరేం అడగవద్దు . . .  అతనికి ఇష్టం ఉంటే, నాకు భాగ్యం ఉంటే, అది జరగనీ . . .

ఎవరో ఒక మూడవ మనిషి మన ఇంటికి వస్తే, “రండి” అని అతన్ని పిలిచి మీరు మాట్లాడరా? అలాగ ఉంటే చాలు . . . ” అని చెప్పి రాజం కళ్ళు తుడుచుకుంది.

తత్‌క్షణమే కృష్ణయ్యర్ ధోరణి పూర్తిగా మారిపోయింది; “రండి, రండి” అని అల్లుడికి స్వాగతం చెప్తూ అతను మెట్లు దిగి వచ్చారు.

అల్లుడూ ఉయ్యాలనుంచి లేచి, నిలబడి అతన్ని నమస్కరించాడు. “కూర్చోండి” అని చెయితో సైగ చేస్తూ కృష్ణయ్యర్ అతని ఎదుట కుర్చీలో కూర్చున్నారు. ఇక ఏం మాటాడాలని బోధపడక ఇద్దరూ మౌనంగా ఉన్నారు; కృష్ణయ్యర్ ఎదుటనున్న అల్లుడిని చూసి అంచనా వేసారు.

‘ముప్పైఐదే నిండాయేమో - అప్పుడే జుత్తు బాగా నెరసిపోయింది! పెద్ద చదువు . . . బుద్ధిమంతుడు . . . ఇరవైరెండు దాటకముందే M.A., చదువైపోయింది, ఇరవైఐదులో ప్రొఫెసరు ఉద్యోగం! అందువలనేకదా నా అమ్మాయిని వాడికి ఇచ్చాను? ఆ ముక్కుని చూస్తే చాలు, ‘నేను ప్రొఫెసరు!’ అని చెప్తోందే!’

అవును, ఒకప్పుడు కృష్ణయ్యర్ తన అల్లుడు గురించి ఎంత గొప్పగా చెప్పుకొనేవారు! కర్మ అంటే అదే కాబోలు! . . .

చెయిలోని పుస్తకం మూసేసి శంకర్ కృష్ణయ్యర్ని చూసాడు. కళ్ళద్దాలు తీస్తూ “మరేం లేదు . . . ఇక్కడ అణ్ణామలై యూనివర్సిటికి ఒక పనిమీద వచ్చాను . . . అలాగే ఇక్కడికి వచ్చాను . . . మీనా ఎక్కడ?” అని అడిగి అతను తిరిగి చూసినప్పుడు మెట్లమీద తెల్లని చీర ధరించిన మీనా బొట్టూ, పువ్వులూ లేకుండా కనిపించింది.

పది సంవత్సరాలముందు తన పెళ్ళి సమయంలో, పట్టు పరికిణీ, జాకెట్టు ధరించి పసిపాప ధోరణిలో పిచికలాగ ఎగిరివచ్చిన మీనాని ఇప్పుడు తిమిరెక్కిన ఆవేశాలతో, నిలకడగా, తన్ను తానే ధ్వంసం చేసుకునే బైరాగిలాగ, ఒక విగ్రహంలాగ చూడగానే అతని దేహం పులకరించింది, కళ్ళు తడిసిపోయాయి.

“నమస్కారం” అని మీనా మర్యాద చూపగానే శంకర్ కూడా చేతులు కలిపాడు.

అప్పుడు రాజం వచ్చి ఇచ్చిన కాఫీని చల్లార్చుకుంటూ శంకర్ అన్నాడు: “మీనా, నేను అన్ని కబుర్లూ విన్నాను; కాని ఏదీ నమ్మలేకున్నాను!”

మీనా లేతగా నవ్వింది: "నేనూ ఇంతకుముందు మీగురించి రాజం చెప్పినదేదీ నమ్మలేదు. ఇలాంటి భర్త ఎవరైనా ఉంటారా అని ఆలోచించాను. ఆ తరువాతే మగవారందరూ ఇలాగే అని తెలుసుకున్నాను."

'బాగా అడిగింది, దానికి తెలుసు, వాడికి బాగా బుద్ధి చెప్తోంది ' అని తలపోసుకుంటూ కృష్ణయ్యర్ "మీరు మాట్లాడుతూ ఉండండి . . . ఇదిగో, నేను వస్తున్నాను" అని కుర్చీనుంచి లేచి మేడమీదకి వెళ్ళారు.

"మీనా, ఎందుకు నిలబడతావ్? . . . ఇలా వచ్చి కూర్చో . . . "

"పరవాలేదు . . . " అని ఛాతీమీద రెండు చేతులు పెట్టుకొని అతన్ని సూటిగా చూస్తూ మీనా నిలబడింది.

"Please sit, నాకు నీతో చాలా కబుర్లు మాట్లాడాలనివుంది."

మీనా మర్యాదగా ఆ కుర్చీలో కూర్చుంది. "నిన్ను గెంతులెత్తి ఆడుతున్న పిల్లగా చూసిన తరువాత ఇలా చూడడం నా మనసుకి ఎంత బాధగా ఉందో తెలుసా?" అని అడిగినప్పుడు శంకర్ కళ్ళు చిమ్మగిల్లాయి.

'హూం, నీకూ హృదయం ఉందా?' అని రాజం మనసులో అనుకుంది.

"మీనా, నాగురించి నువ్వు విన్న సంగతులు అలాగ ఉండనీ . . . దాని గురించి తరువాత మాటాడుదాం . . . కాని, నువ్వెందుకు ఇలా చేసావ్? ఈ స్థితి, నిర్ణయం, నీకు తప్పనిసరి అంటున్నావా?"

మీనా తన అరచెయిని చూస్తూ, తల వొంచి మాటాడింది.

"మరేం చెయ్యమంటారు? మీలాంటి మగవారు ఉన్నంతవరకూ ఒక ఆడది తనకి తోచినట్టు జీవించాలంటే ఇదే గతి; కన్యగానే, వితంతువుగా జీవించాలి." ఆమె మాటల్లోని అర్థం బోధపడకపోయినా ఆమె తన్ను ఎత్తిపొడిచి మాటాడుతోందని శంకర్ గ్రహించాడు.

"మీనా, నీకు నామీద చాలా కోపం అని నాకు తెలుసు, అది ఒక పక్క అలాగే ఉండనీ . . . నేనిక్కడ రావడం నాకు - ఏం, నీకు కూడా - వింతగా ఉంటుంది. నిజంగా నిన్ను చూసి మాటాడాలనే వచ్చాను . . . నువ్విలా నీ జీవితం పాడు చేసుకోవడం మంచిదికాదు, మీనా . . . "

మీనా తలెత్తి అతన్ని చూసింది. కళ్ళలో కటోక్తి, ఆగ్రహం చోటుచేసుకున్నాయి. 'చాలా thanks! నా జీవితం గురించి బాధపడుతున్నారే, ముక్కోటి దేవతల సాక్షిగా, అగ్ని సాక్షిగా, తాళిబొట్టు కట్టారుగా - ఆ భార్య జీవితం గురించి మీరు ఆలోచించారా?" ఆమె శాంతంగానే మాటాడడం ఆరంభించింది. క్రమేణ స్వరం పెరుగుతూ, 'ఆలోచించారా?' అని ఆమె అడిగినప్పుడు ముద్దాయిని కోర్టులో వకీలు బెదరించినట్టు చెయ్యూపి ఆక్రోశనతో అరిచింది.

మీనాలోని ధర్మావేశ భావన శంకర్ తెలుసుకునే రీతిలోనే ఉంది. "నీగురించి ఇంతగా ఆలోచించినప్పుడు నాగురించి నేను ఆలోచించకుండా ఉంటానా? అంతేకాదు, నీలాంటి ఇతరుల గురించికూడా నేను ఆలోచిస్తున్నాను. కొన్ని పిచ్చి భ్రమలతో జీవితంని పాడుచేసుకోవడంలో వివేకం లేదంటున్నాను. నేనిది రాజంకీ చెప్పివున్నాను. నా సంగతి అలా ఉండనీ, తరువాత మాటాడుదాం అని చెప్పానుగా? నువ్వెందుకు పెళ్ళి వద్దని తిలకవతి[1] వాలకం పూనుకున్నావ్?"

"పెళ్ళి . . . " అని మీనా కటువుతో సణుక్కుంది.

"పెళ్ళి . . . మా రాజం మీవలన మోసపోయిన తరువాత పెళ్ళన్నది ఒక అర్థంలేని ఆచారంగా నాకు కనిపిస్తోంది. మన శాస్త్రాలూ, మత నియమాలు, జాతీ, చట్టం- ఇవేవీ పురుషుల యోగ్యతని కాపాడలేదే? పెళ్ళి మూలంగా స్త్రీల ధార్మిక జీవితంకి ఏ హామీ లభించలేదే? తన్ను ఆమెకి అప్పగించని ఒక మగవాడికి తన పరిశుద్ధ ఆత్మని బలి చేసి, గాయపడి, ఇక తన జీవితమంతా ఆ ఆబద్ధంకోసం కాచుకోవడంకి బదులు ఆ పెళ్ళి అనే ఆచారంని ఆమె తిరస్కరించడం ఎంత ఉత్తమం!" మీనా మూర్ఖంగా తన మాటలు బాంబులుగా విసురుతున్నా వాటిని భరించే త్రాణతో వింటూ, గూఢంగా ఆలోచిస్తూ, శంకర్ ఆమె వార్తలు విన్నాడు.

మేడమీద తన గదిలో కిటికీ తలుపుని కొంతవరకు తెరిచి కృష్ణయ్యర్, వంటగదిలో తలుపువెనుక నిల్చొని రాజం, లక్ష్మి అమ్మాళ్ వాళ్ళ సంభాషణ గమనిస్తున్నారు. అందరి మనసులోనూ అతని ధోరణిని మీనా మార్చాలని, మీనా నిర్ణయంని శంకర్

[1] తమిళులు ఋషితుల్యమైన స్త్రీగా కొనియాడే, ఆరవ శతాబ్దిలో జీవించిన సేవికరాలు

మార్చాలనే కోరిక అధికంగా ఉండడం వలన, ఆ ఇద్దరి వాదనలు సరిగ్గానే ఉన్నట్టు వాళ్ళకి అనిపించింది.

"నేనొక పాపాత్ముడనే అనుకుందాం. అందువలన మగవాళ్ళందరూ . . . " అని శంకర్ చెప్పబోయేది తెలుసుకొని ఆవేశంతో మీనా జోక్యం చేసుకుంది.

"లేదు. స్త్రీల విషయాల్లో పురుషులు యోగ్యతతో మెలగరు. ఆడదికి నిత్యమూ మోసంపోవడమే జరుగుతోంది. అది లెక్కచెయ్యక, మరేం గతిలేక జీవించేవారు ఎలాగో కాలం గడుపుతారు, నాకది వీలుకాదు. కాని మీరన్నట్టు నా జీవితం స్వార్ధం లేకుండా పోకూడదని బాగా ఆలోచించి నాలాంటి మనసున్న ఇంకొకతను ఈ మగవారి ప్రపంచంలో ఉన్నాడనే గుడ్డినమ్మకంతోనే నేను ఈ పెళ్ళికి సమ్మతించాను. మన దేశంలో స్త్రీలకి పెళ్ళి ఒక పరీక్ష, trial లాగ. సరే, నాలాగ ఒకతను ఉంటే నా అదృష్టం, లేకపోతే నేను గాయపడాలన్నమాట! జన్మ అని ఈ భూమిలో పుట్టినతరువాత మనం మరేం చెయ్యగలం, చెప్పండి! ఇంతకీ ఆఖరికి, ఏం జరిగిందంటే అతను . . . అతను పోయారు . . . నాకు ఎటువంటీ గాయంకి అగత్యం లేకుండా పోయింది, అదే నా కర్మ!

"నాకు విరుద్ధంగా నేను చేసిన నిర్ణయంని దైవఘటన అంగీకరించలేదని నాకు తెలిసిపోయింది. ఆ నిర్ణయం ఒకే ఒకసారి చెయ్యాలి. ఒకతన్ని పెళ్ళిచేసుకోవాలని నేను నిశ్చయం చెయ్యగానే నాకా పెళ్ళి అయిపోయింది; అతను కన్ను మూసినతరువాత నేనతని వితంతుగా మెలగడం నా ధర్మం. నాకోసం ఎవరూ బాధపడవద్దు . . . దానికి ఈ ప్రపంచంలో అర్థం లేదు . . . " అని చెప్పేసి మీనా తన దృష్టిని నిమ్మళంగా వీధివైపు మళ్ళించింది.

శంకర్ ఒక చెయిని గుండెమీద ముడుచుకొని, కుడిచెయితో చుబుకంని పట్టుకొని, అంతా విన్నాడు. ఆమె సందేశం గ్రహించడం ఒక ధ్రువం నుంచి మరొక ధ్రువంకి ఎగిరి అందుకున్నట్టు అతనికి శ్రమగా కనిపించింది. కాని అంతర్గతంగా ఆమె వాదనలో లోపం ఉందని గ్రహించి, మెల్ల మెల్లగా, సతర్కంగా దాన్ని చెడగొట్టడం సాధ్యమనే నమ్మకంతో, అతను గొంతుని సవరించుకున్నాడు.

"మన సమాజంలో కూడా వితంతువులు పెళ్ళి చేసుకుంటున్నారు - దానిగురించి నీ అభిప్రాయం ఏమిటి?" అని అడుగుతూ శంకర్ తన కళ్ళద్దాలు తుడుచుకున్నాడు.

"నా నిర్ణయం అందరికీ అని నేననను. ఒక ఆడది ఎన్ని సంవత్సరాలు ఒకతనితో జీవించినా, ఆ తరువాత ఇంకొకతనితో జీవించాలని ఆమె ఆశించుతే, తనకింకొక జీవితం ఉందని ఆమె ఆలోచిస్తే, అదేం పొరబాటు కాదు. కన్ను మూసిన ఆ భర్త ఆమె ఎన్నుకున్న భర్త ఐనా సరే - అది సందర్భవశాత్తూ చేసిన నేరం. ఎందుకంటే ఆమెకోసం పుట్టినతనితో ఆమె జీవించలేదన్నమాట. అతనికోసం - అతను పోయిన తరువాత - అతన్ని తృప్తితో తలుచుకుంటూ జీవించడం ఎలా సాధ్యం? ఆమెకోసం పుట్టినవాడితో ఆమె జీవించలేదనే పాపం చాలదా? అందుకోసం ఆమెని బలి ఇవ్వడం ఎంత ఘోరం! వాళ్ళకి మనం అడ్డుచెప్పకూడదు. వాళ్ళు ఇంకొక పెళ్ళి చేసుకుంచే ఏం తప్పు?"

మళ్ళీ కళ్ళద్దాలు తొడుక్కొని అంతరంగికంగా పరిశోధించే ధోరణిలో శంకర్ అడిగాడు.

"నీకోసం పుట్టిన మగవాడని అంటున్నావ్; మరెందుకు అతను నిన్ను వదిలేసి, నీతో జీవించకుండా, ఏ సంబంధమూ లేకుండా వెళ్ళిపోయాడు? 'వితంతువు ఇంకొక పెళ్ళి చేసుకోవచ్చు, కన్ను మూసిన భర్త ఆమెకోసం పుట్టలేదు' అని నువ్వు అంటున్నావ్. మరి పెళ్ళికాని భర్తతో, ఒక రోజుకూడా జీనించని నువ్వు, ఆతను నీకోసం పుట్టాడని అంటున్నావ్, అది సరేనా?"

"'పెళ్ళి','పెళ్లి' అని మీరు పదే పదే అంటున్నారు, కాని మీలాంటివారివలన దానికున్న అర్థం పూర్తిగా పోయిందే! పాతివ్రత్యం అని అన్నప్పుడు పెళ్ళే దాన్ని నిర్ణయించాలా ఏమిటి? 'అతను నా భర్త!' అనే నిర్ణయంలోనే దానికి ఆ అవస్థ వచ్చేసిందికదా? మరొక నిర్ణయం అంటే పాతివ్రత్యంకి మరేం అర్థం ఉందని?"

"అంటే పునర్వివాహం చేసుకునే వితంతువులకి పాతివ్రత్యం లేదంటున్నావా?"

"నూరు సంవత్సరాలముందు అలాగే. నేను నాగురించి మాటాడుతున్నాను, మీరెందుకు స్త్రీలగురించి సామాన్యంగా మాటాడుతున్నారు?"

"సామాన్యంగా స్త్రీల వర్గం గురించి మాట్లాడినప్పుడు నిన్ను మినహాయించడం ఎలాగ? మీనా, అదే నాకది అర్థం కావటంలేదు!"

"వినండి, నాకని ఒక మనసుంది. అది నా నిర్ణయంతో సంతోషంగా ఏకీభవించుతోంది. వితంతువుగా, ఎవరి బలవంతం లేకుండా, గతించిన భర్త జ్ఞాపకంతో నిండుగా జీవించే యువతులు లేరని మీరు అంటున్నారా?"

“ఉన్నారు.”

“వాళ్ళదగ్గరికి వెళ్ళి ‘నువ్వు నీ జీవితంని పాడుచేసుకుంటున్నావ్. నువ్వు తప్పకుండా ఇంకొక పెళ్ళి చేసుకోవాలి!’ అని మనం బలవంతం చేస్తే, అది సరేనా? బలవంతపు వైధవ్యం కంటే అది ఎంత ఘోరం!”

శంకర్ కొంచెంసేపు మౌనం వహించి, ఒక దీర్ఘమైన నిట్టూర్పు వదలి మాట్లాడాడు: “మీనా, నాకిప్పుడు బాగా బోధపడింది. నువ్విలాగ అవడానికి నేనే కారణం. బాల్యంలో నీ అక్కయ్య జీవితం పాడవడం చూసి నీకు నా మీదా, మగజాతిమీదా ద్వేషం వచ్చేసింది. నీతిమంతుడైన మగవాడు ఎవడూ ఈ ప్రపంచంలో లేడని నీ అభిప్రాయం. అందువలనే పెళ్ళే వద్దని నువ్వు నిశ్చయించావ్. కాని అటువంటి జీవితంకి అర్థం లేదని ఈ పెళ్ళికి సమ్మతించావ్, అప్పుడుకూడా నువ్వు అతన్ని పూర్తిగా నమ్మలేదు - నువ్వన్నట్టు గుడ్డినమ్మకంతోనే సమ్మతించావ్ . . . పెళ్ళి ఒక పరీక్ష, అందులో నువ్వు అపజయమే ఎదురుచూసావు. ఆఖరికి విజయం, అపజయం, రెండూ లేకుండా - ఆ పరీక్ష జరగనేలేదని ఇప్పుడు నువ్వు నిన్ను ఓదార్చుకుంటున్నావ్ . . . అందువలన నీకు కొంచెం సంతోషం కూడా అని నాకనిపిస్తోంది . . . కాని, చివరకి, నువ్వొకటి గుర్తించాలి: నిన్ను నువ్వే మోసం చేసుకుంటున్నావ్; నీకు ఏ ఆదర్శాలమీదా నమ్మకం లేదు. అవి యీడేరవనే భయంతో, నీ ఆదర్శాలన్నీ ఒక చచ్చిపోయిన మగవాడితో కలిసి దహనం చేసుకోవాలని నీ కోరిక. దీనివలన నువ్వు భవిష్యత్తులో చాలా బాధ పడతావ్ . . . ” అని చెప్పి శంకర్ ఆగాడు. తరువాత శోకమైన కంఠధ్వనితో మాట్లాడాడు.

“మనసన్నది నీకు మాత్రం కాదు. అది నాకూ ఉంది. మనోభావం అందరికీ ఉంది. నువ్వు ఇంత విరివిగా వాదిస్తావని నేను ఎదురుచూడలేదు. నీకూ నీ అక్కయ్యలాగ మంచి హృదయం ఉందని మాత్రం నేను అనుకున్నాను. నువ్వు చాలా పుస్తకాలు చదివావ్, నీకు మంచి జ్ఞానం ఉంది. దాన్ని subjective గా పెంచుకోవడం వలన ఆదర్శాలనే కొన్ని భ్రమలకి నువ్వు బానిసగా ఐపోయావ్ . . . జ్ఞానం అన్నది క్రమేణ పెరుగుతూ ఉండాలి, , అప్పుడే మనం మన అభిప్రాయాలు మార్చుకుంటాం. ఇంతకు ముందు సరైనది ఇప్పుడు తప్పనిపిస్తుంది . . . అది కాలం మనకి తెలియజేస్తుంది . .

. సరే, ఇప్పుడు నీ అవస్థకి - సూటిగా, లేక జాడగా - నేనే కారణమని నా అభిప్రాయం. అందువలన నాగురించి విపులంగా చెప్తాను, విను. ఆ తరువాత నువ్వే ఏం చెయ్యాలో ఆలోచించు . . . ” అని అంటూ శంకర్ రిస్టువాచీ చూసుకున్నాడు.

“నాకు టైమయింది. కాని నీతో మాట్లాడాలని ఉంది. బుద్ధిజీవులు ఎక్కువగా లేనప్పుడు, ఎది తప్పు, ఎది సరి అని తెలియనివారు మాట్లాడితే నేను చురుకుగా వింటాను. ఎందుకంటే చింతించుతూ కాలం గడిపేవారు ఆఖరికి నిజమేమిటో తెలుసుకుంటారు. నేను చూసిన యువతుల్లో నువ్వు రెండవ యువతి. ఇంకొక యువతి - ఆమె గురించి ఇక్కడ మాటాడడం కొంచెం హద్దు మీరినట్టు కనిపించవచ్చు, ఐనా చెప్తాను, విను. నీ రాజంకి ఆమె అంటే రోత. ఆమెకీ అలాగే! నిత్యమూ, ఆలోచించి, ఆలోచించి, ఎలాగో ఐపోయింది! కాని, ఆమె నీకు మంచి contrast! ఆమె నూరు సంవత్సరాల తరువాత పుట్టివుంటే, ఒక వేళ, లోకం ఒప్పుకొనివుంటుంది, ఆమె తత్వం అటువంటిది! నువ్వేమో నూరు సంవత్సరాలముందు పుట్టవలసిన యవతి . . . ఇప్పుడు పుట్టి నీకు నీ వలనే హింస . . .

‘‘నాకూ రాజంకి పెళ్ళవడానికి ముందే నాకు ఆమెతో స్నేహం ఉండేది. మేమిద్దరం కలిసి చదివాం. కాని ఆమెకి పెళ్ళంటే అదొక ఉత్తి ఆచారం అనే అభిప్రాయం ఉండేది. పెళ్ళనే బంధం వలనే ప్రేమ నశించిపోతుందని ఆమె ఉద్దేశం. నేను ఆమెతో ఎంత వాదించానో తెలుసా? ఆ రోజుల్లో . . . కొన్ని సమయాల్లో ఆమె చెప్పినదంతా న్యాయమనిపించేది, కాని బాహటంగా చెప్పడానికి నాకు ధైర్యం లేదు. ఆమె ఏమందో తెలుసా? ‘ఈ ఆధునిక యుగంలో వివాహంకి పునాది ఆస్తి హక్కులు అని మనం గ్రహించాలి. శారీరక అవశ్యకంగా పెళ్ళి తప్పకుండా కావాలి. నాకు మీ మీద ఏ హక్కూ వద్దు - మీ హృదయంలో నాకు జాగా కావాలి, అంతే! మీరొక పెళ్ళిచేసుకొని తక్కిన హక్కులు కావాలని కోరితే నాకేం ఆక్షేపణ లేదు!’ అని ఆమె అంది. ప్రేమించడానికి హక్కు ఉంటే చాలంటోంది! నాకేం బోధపడలేదు! ఆమె స్నేహం లేకుండా, సహవాసం లేకుండా నాకు బాధగా ఉంది . . . Intellectual Companion అని అంటారే, ఆమె అలాంటిది. నేనలా కలవరపడుతున్న సమయంలో నా తల్లిదండ్రుల ఒత్తిడి వలన

పెళ్ళికి నేను 'సరే' అన్నాను. అది నా పొరబాటే . . . అది పెళ్ళనే సందర్భం వలన నేను చేసిన పొరబాటు . . ."

అప్పుడు వంటగదిలో, తలుపువెనుక రాజం వెక్కు వినిపించింది; శంకర్ తిరిగిచూసాడు.

"నా పెళ్ళి తరువాత కూడా ఆమె నన్ను చూడడానికి రాలేదు; నేనే వెళ్ళిచూసాను. దానిగురించి రాజంకి బాహటంగా చెప్పాను. నేను తనకే సొంతం అని నమ్ముకున్న రాజం మనసులో పిడుగు పడింది. ఏడుస్తూ, దెబ్బలాడుతూ, పుట్టింటికి వెళ్ళిపోయింది . . . ఆమె ఎక్కడవున్నా ఆమెకి నా భార్య అనే హక్కు ఉంది . . . ఆమె జీవితం ఇలా నిశ్చలంగా ఉండడం చూసి నాకు చాలా బాధగా ఉంది . . . ఆమెకి ఇష్టం వచ్చినప్పుడు ఈ హక్కుని రద్దుచేసి, పారేయవచ్చు . . . అందువలన ఆమెకి ఒక కొత్త జీవితం ఆరంభమౌతుంది . . . "

"చాలు, మరేం అనవద్దు! . . . " అని తలుపు వెనుకనున్న రాజం తన్ను మించి అరిచింది. అదిరిపడి శంకర్ తిరిగిచూసాడు. మీనా తలెత్తి చూసింది. వంటగదినుంచి, చీరకొనతో కళ్ళని తుడుచుకుంటూ, హాలుకి వచ్చిన రాజం చంటిపాపలాగ వెక్కి వెక్కి ఏడ్చింది.

"నేనేదో తొందరపడి కోపంతో వచ్చేసినతరువాత మీరిలాగే ఉంటారని ఎదురుచూడలేదే! 'నా భర్త నాకే సొంతం!' అని నేను వచ్చేయడం నేను చేసిన పొరబాటు . . . నన్ను క్షమించండి . . . మీరు మగవారు . . . ఏమైనా చెయ్యగలరు . . . మిమ్మల్ని సవరించకుండా కోపించుకోడం నా పొరబాటే . . . "

"'మగజాతికి ఒక న్యాయం, స్త్రీ జాతికి ఇంకొక న్యాయం' అని నేను అనడం లేదు . . . రాజం, విను . . . మనకి జన్మ అనేది ఒకే ఒక సారి, అవునా? అందులో పెళ్ళి వలన, లేక మరే కారణాలవలన, మనం బాధపడి తీరాలా? సాధ్యమంతవరకూ మానవుడు యోగ్యుడుగా - అదే సమయం - నిమ్మళంగా జీవించాలి. కాని అత్యంతమైన ఒక పరిస్థితి అని వస్తే దాన్ని అతను మీరాలి . . . దానికి ఆధారమైన శాస్త్రంని మార్చాలి . . . "

“ . . . వొద్దు, ఏదీ మార్చవద్దు! ఒక రోజు మీరు తప్పకుండా వస్తారని నేను కాచుకొనివున్నాను . . . మీరు నాకోసం రాకపోయినా నేను మీ ఆశ్రయంలో ఉన్నానని నాకు సంతోషంగా ఉంది . . . నాకది చాలు . . . ” అని అంటూన్న రాజంని చూసి మీనా తేరిపార చూసింది.

“మీనా, నువ్విలా అవడానికి తనే కారణం అని బావగారు అన్నారు కదూ, అందులో నాకూ వాటా ఉంది. తప్పో, మెప్పో, నేను నా భర్తతో ఉండివుంటే, నీ లేత మనసులో నేను విషమనే విత్తు పాతివుండను . . . నన్ను క్షమించు, మీనా!” అని వేడుకున్నరాజం భర్త దగ్గరకి వచ్చి ఆవేశంతో “మీతో నేను వెళ్ళనా?” అని అడిగింది.

“తప్పకుండా! . . . రావొద్దని నేను అనలేదే? జీవితంని పాడుచేసుకోవడానికి ఎవరికీ హక్కు లేదు . . .నీ సంతోషంకి ఎది చెయ్యాలన్నా అది చెయ్యడానికి నేను సిద్ధంగా ఉన్నాను . . . నా సంతోషం ఏమిటో నువ్వూ గ్రహించాలి, లేకపోతే మనిద్దరం వేరవేరుగా జీవించడమే మంచిది.”

“ఆ జీవితం ఇక చాలు! . . . ” అని రాజం వంటగదికి వెళ్ళింది. మేడమీదనుంచి కృష్ణయ్యర్ దిగివచ్చారు.

“నాన్నగారూ, నేను ఊరుకి వెళ్తున్నాను . . . ” అని రాజం అతనికి చెప్పింది.

“మంచిది . . . చాలా సంతోషం . . . తొందర ఎందుకమ్మా? రేపు వెళ్ళవచ్చు, మీ ఆయనకి చెప్పు . . . ”

“అవును, రేపే వెళ్ళాలి . . . ఇక ఇవాళ ఏ బండీ లేదే?” అని చెప్పి రాజం మేడమెట్లమీద పరుగెత్తింది. మీనాకూడా ఆమెను వెంబడించింది.

“మీనా, నేనే పొరబాటు చేసాను! ఇన్ని సంవత్సరాలూ అతనితో జీవించివుంటే అతను మారి నాకే సొంతమైవుంటారు . . . నేనే అతన్ని వదిలేసాను . . . ఏమైనా, నాకేకదా అతనిపై హక్కు ఉంది? నిజంగా అతనేం అంత చెడ్డమనిషి కాదు! ఎందుకంటే అతను నన్ను మోసం చెయ్యలేదు . . . అతను నిజం చెప్పినప్పుడు నేనే కోపించుకున్నాను. . . ” అని సంతోషంతో రాజం తడబడుతూ చెప్పింది.

“మీనా, నువ్వూ ఆలోచించి నీ మనసు మార్చుకో . . . ” అని గభీమని వెక్కుతూ రాజం బతిమాలింది.

మీనా నిదానంగా రాజం చేతులు పట్టుకొని చెప్పింది: "రాజం, నీ భర్తతో వెళ్తున్నావని నువ్వు సంతోషంతో ఉన్నావు. అంత సంతోషం నాకూ ఉంది. నా నిర్ణయం మార్చుకోవడంలో ఏ అర్ధమూ లేదు. ఎందుకంటే ఒక రోజు సూర్యుడిని చూడగానే వికసించి, చంద్రుడిని చూడగానే ముడుచుకొని, మరుదినం సూర్యుడిని చూసి వికసించేవన్నీ తామరపువ్వులు కావు. నేను ఒకే ఒకసారి వికసించే పువ్వు. నువ్వు వెళ్ళి బుద్ధిమంతురాలుగా కాపురం చెయ్ . . . నన్ను మరిచిపోకు, తరచుగా ఉత్తరాలు రాయి . . . " అని ఉల్లాసంతో మాటాడింది; రాజం ఏడ్చింది.

రిస్టువాచీని చూసి, 'తొమ్మిది గంటలయిపోయిందే, ఇక ప్రయాణం రేపే . . . ' అని మూలుగుతున్న శంకర్ తన తోలు పెట్టెనుంచి కలం, కాగితం బయటకి తీసి రాయసాగాడు.

"ప్రియమైన సుగుణా[2]: ఈ ఉత్తరం వచ్చే వేళకి నేను వచ్చివుండాలి. Train miss చేసేసాను, రేపు వస్తాను. నా మరదలుతో చాలా సేపు మాట్లాడాను, కాని లాభం లేదు. నువ్వొక ధ్రువం, అలాగే ఆమె కూడా ఒక ధ్రువం. ఆమెలో ప్రవహించేది నిష్కల్మషమైన, పురాతన, తమిళజాతి రక్తం. కొత్త ఊహలు తరుముకుంటూ వస్తున్నప్పుడు అందులో ఏ మార్పు రాదు. ఇక్కడ నేను వచ్చినందువలన ఒకే ఒక ఫలితం. నేను వస్తున్నప్పుడు నా భార్యకూడా నాతో వస్తుంది. నా తల్లిదండ్రులకీ రాస్తున్నాను. వాళ్ళు సంతోషిస్తారుకదా? తక్కినవన్నీ, మనం కలుసుకున్న తరువాత చెప్తాను . . .

ఇలాగ, శంకర్"

ఆ ఉత్తరంని రాసి ముగించి, దాన్ని కవరులో పెట్టి, శంకర్ మరొక ఉత్తరం రాయబోతుంటే . . .

"వచ్చినప్పుడునుంచీ మీరు ఇలాగే కూర్చున్నారు, వెళ్ళి దుస్తులు మార్చుకోండి" అనే కంఠధ్వని విని అతను తలెత్తి చూసాడు. అతని ఎదుట ఉయ్యాల తీగలమధ్య మొహం కప్పుకున్న రాజం మెరిసే కళ్ళతో, చిరునవ్వుతో కనిపించింది. అతను సహజంగా, చిరునవ్వుతో అన్నాడు: "సరేలే, ఈ ఉత్తరం రాసిన వెంటనే . . . "

---

[2] ఈ సుగుణ పాత్రని జయకాంతన్ నవల 'నలుగురు నడిచేదే బాట!' లో మనం విపులంగా చదవగలం

‘‘ఉత్తరం ఎవరికి?

‘‘ఇప్పుడు రాసేది నీ మామగారికి . . . ’’

‘‘ఇంతకుముందు రాసినది?’’ అని రాజంకి అడగాలనిపించింది; ఆమె అడుగుతుందని అతనూ ఎదురుచూసాడు. కాని ఆమె దానిగురించి అడగనేలేదు!

********

**(మూలం: ప్రచురణ, ఆనంద వికటన్, 1961)**

# అంతరంగం పవిత్రమైనది

“ఒక నిమిషం ఉండండి, నేను పిలుస్తాను . . . మీరెవరు మాటాడుతున్నారు?” అనే ప్రశ్న వినగానే పళ్ళు కొరుకుతూ యువకుడు జవాబు చెప్పాడు: “నేను అతని కొడుకు వేణు.”

కొంచెం సేపు తరువాత అతని తండ్రి కంఠధ్వని టెలిఫోనులో మోగింది: “హలో, నేనే సుందరం . . . ”

అంతవరకూ వేణుని ఆవరించుకున్న ధైర్యం, ద్వేషం, తారుమారైపోయి అతని పెదిమలు, గుండె వొణికాయి; మాటలు సరిగ్గా పెగల్లేదు. కాని సర్దుకొని మాట్లాడాడు: “నేను వేణు మాటాడుతున్నాను . . . మీతో కొంచెం మాటాడాలి . . . ఒంటరిగా మాటాడాలి . . . ”

“సరేలే . . . ఇంకా కొంచెం సమయంలో నేను ఇంటికి వచ్చేస్తాను . . . ”

“లేదు . . . దాని గురించి ఇంట్లో మాట్లాడడానికి నాకిష్టం లేదు . . . మీరు గాని అక్కడే ఉన్నారంటే నేను పది నివిషాలలో వచ్చి మిమ్మల్ని కలుసుకుంటాను . . . ”

“ Oh, I see! సరే, రా . . . ”

“Thanks . . . ”

రిసీవరుని కింద పెట్టిన తరువాత వొంగివస్తున్న చెమటని వేణు తుడుచుకున్నాడు; గుండె ఇంకా వొణుకుతూనే ఉంది; తను దేనిగురించో మాట్లాడాలని నిశ్చయం చేసుకొని. ఒక బ్రహ్మాండమైన పనికి సిద్ధమౌతున్న ధోరణిలో తన అఱచెయిలో ఒక గుద్దు ఇచ్చి తన రోషం తెలియజేసాడు:

“హూం . . . ఇది నా బాధ్యత! ఈ కుటుంబం ప్రతిష్ట కాపాడడం నా బాధ్యత! ఒక పిల్లవాడు - తన కొడుకే - తన్ను - నిందించే ధోరణిలో తన ప్రవర్తన చెడిపోయిందని అతనికి తెలియవద్దూ? ఇది చాలా అవమానకరమైన సంగతే! కాని, నేను నా కోపం చూపించక, న్యాయం గురించి మాట్లాడి, అతని సిగ్గుచేటు అతనికే బయటపెట్టాలి . . . ‘అలాగేం కాదు!’ . . . ‘ఇదీ’, ‘అదీ’ అని అతను

తలాయించుతారు! కాని అతని డ్రాయరులో ఉన్న ఆ ఉత్తరం - కర్మ!, కర్మ! - ప్రేమ లేఖ - నా చెయిలో ఉందే! 'నువ్వు దొంగతనంగా మారు తాళంచెవితో నా డ్రాయరు తెరిచావ్!' అని అతను అరుస్తారు . . .  అతని దొంగచాటు ప్రేమ వ్యవహారం తెలియాలని నేను చేసినది ఏం పెద్ద పొరబాటు కాదు . . . నిన్నరాత్రి అతను దొంగతనంగా ఆమెతో రెండవ షో సినిమాకి వెళ్ళారని తెలిసింది; ఆ తరువాతే నేను అతని గదిని సోదా చెయ్యాలని నిశ్చయించాను . . . ”

- వేణు తొందర తొందరగా  దుస్తులు ధరించి బయలుదేరే సమయంలో Ladies Club కి బయలదేరుతున్న అతని తల్లి రమణియమ్మాళ్ ఎదుట కనిపించింది.

కొన్ని రోజులుగానే వేణు ప్రవర్తన, సంభాషణ ఒకలాగ ఉన్నాయని ఆ మాతృ హృదయం గ్రహించింది.

ఇప్పుడు గభీమని వాడిని చూడగానే వాడి ఆకృతి చూసి ఆమె కలవరపడింది.

'వీడేం సరిగ్గా భోంచేస్తున్నడా, నిద్రపోతున్నాడా? ”  అనే అనుమానం ఆయాసకరమైన వేణు మొహం చూడగానే ఆమెకు కలిగింది; వాడు బాగా చిక్కిపోయాడు, నల్లబాటిపోయాడు. క్షవరం చేసుకోలేదు, అందువలన రోమం కూడా దట్టంగా పెరిగిపోయింది. ఏ కారణం వలనో వాడు మనోవ్యధతో బాధపడుతున్నాడని ఆవిడ తెలుసుకుంది.

'వాడిప్పుడు యువకుడు; వేణుకి ఏమైనా అంతరంగ ప్రశ్నలు ఉండవచ్చు. అందులో నేను జొరపడడం అనాగరికం' అనే అవగాహనతో ఆమె అతన్ని చేరుకుంది.

“ఏమిట్రా వేణు . . . ఎక్కడ బయలుదేరావ్?” అని ముద్దుగా వాడి భుజం తాకింది; వాడికి చిరాకు కలిగింది.

“కొంచెం పని ఉంది . . . ” అని మోటుగా జవాబు చెప్పాడు.

“What’s wrong with you? Whatever it is, can I help you?”

“Thanks . . . ” అని చెప్పి, ఆమెను దాటి వెళ్తున్న వేణుని తల్లి ఆపింది.

“వెళ్ళు . . . లోపలికి వెళ్ళు . . . వంటగదిలో అవ్వ special గా ఏదో sweet చేసిందట . . . అదేదో నువ్వూ taste చెయ్ . . . ” అని ఉపచారం చేసి, తనకీ ఆలస్యం అవుతుందని వాచీని చూసి తెలుసుకొని ఆమె నిష్క్రమించింది.

వేణు ఒక నిమిషం తల వంచి ఆలోచించాడు.

‘ఈ అమ్మ ఒక జడ్డి; నాన్నగారు ఎంత హుషారుగా ఆమెను మోసం చేస్తున్నారు!’ అని వేణుకి అర్ధమైంది. అంతేకాక, ఈ వయస్సులోనూ తల్లి చేసుకునే అలంకారం - నగలు, మొహం నిండా ఒత్తుకున్న పౌడరు, పెదిమలకి రంగు, ఆ పొడుగాటి జాకెట్టు; కీచు స్వరంలో ఆమె పలికే ఇంగ్లీషు మాటలు - ఇవన్నీ వాడిని రెచ్చగొట్టాయి.

అప్పుడే convent నుంచి తిరిగి వచ్చిన అతని ఇద్దరు సహోదరులు, ఆరేళ్ళ చెల్లెలు సోఫాలో కూర్చొని జోడులు, వాచీలు తీస్తున్నారు. వాళ్ళని చూడగానే వేణు గుండెలో జాలీ, దుఃఖమూ, లేచాయి.

‘పూచిలేని తల్లి, పాపిష్టియైన తండ్రి ఈ పిల్లల భవిష్యత్తుని ధ్వంసం చేస్తారు’ అనే ఆలోచన రాగానే . . . ‘ఇక నేను చేసేదేముంది?’ అని వేణు కలవరపడ్డాడు.

‘తప్పకుండా నేను ఏమైనా చేసి తీరాలి! అది నా బాధ్యత! నేనేం పిలవాడినా? నాకిప్పుడు 21 నిండాయి . . . Legally, I am an adult!’

చివాలున వేణుకి తన్ను పెంచిన తాత, నాయనమ్మ జ్ఞాపకంలో వచ్చారు.

‘మంచివేళ! నేను ఈ చెడు వాతావణంలో పెరగలేదు . . . ’

** ** **

వేణు తండ్రి సుందరం, తల్లి రమణి ఇరవై ఐదు సంవత్సరాలముందు కాలేజీలో చదువుతున్న రోజుల్లో ప్రేమించి పెళ్ళిచేసుకున్నారు. ఇద్దరూ వేరే వేరే జాతికి చెందినవారు కాబట్టి సుందరం తన తల్లిదండ్రులని విరోధించుకొని రమణిని పెళ్ళాడారు.

రమణీ అమ్మాళ్ బాల్యంలోనే convent లో చదివి ఆంగ్లేయుల ధోరణిలో పెరిగింది. ఆమె కుటుంబం పుష్కళంగా పాశ్చాత్య నాగరకతలో పెరిగింది. ఆ రోజుల్లో సుందరంకి ఆమెపట్ల కలిగిన ఆసక్తికి అదే కారణం అనవచ్చు.

ఆ అభిరుచి వలన తల్లిదండ్రులని మలుపుకొని సుందరం కులాంతర వివాహం చేసుకున్నారు. ఆ తరువాత రెండు సంవత్సరాలు తల్లిదండ్రులతో సుందరంకి ఎటువంటి సంపర్కమూ లేదు; రెండు సంవత్సరాల తరువాత వేణు పుట్టాడు.

పుత్ర వాత్సల్యం త్యజించి కాలం గడుపుతున్న సుందరం తండ్రి గణపతియా పిళ్ళై, అతని భార్య విశాలం మనవడిని చూడడానికి గ్రామంనుంచి రైలెక్కి, పట్నంకి పరుగెత్తుకొని వచ్చారు. క్రమేణ విరోధభావం తగ్గుతూ వచ్చింది. సుందరం, అతని తల్లిదండ్రుల మధ్య బంధుత్వంకి వారధిగా వేణు మెలిగాడు.

వేణుకి ఆరేళ్ళు నిండగానే గణపతియా పిళ్ళై మనవడుని తన సంరక్షణలో పెంచుతానన్నారు. “ఎవరో కులాంతర స్త్రీకి మా ఆచారంకి తగినట్టుగా పెంచిన మా అబ్బాయిని పోగొట్టుకున్నాం!” అని పరితపించే గణపతియా పిళ్ళై, పాపనివృత్తికి మనవడుని దత్తు చేసుకున్నారు. వేణు తాతగారి ఇంటిలోనే పెరిగాడు, చదువుతున్నాడు. తల్లిదండ్రుల ఇల్లు అనేది తను ఎప్పుడైనా శెలవులు గడిపే జాగాలాగ వాడికనిపించింది.

సుందరం తండ్రి గణపతియా పిళ్ళై వీర శైవులు, తమిళ భాషలో పండితులు. గొప్ప శివ భక్తులు. అతని భార్య విశాలం గత నూరేళ్ళ స్త్రీ వాదంకి ఆఖరి ప్రతినిధి; భర్త ఎదుట కూర్చోడం, మాటాడం - ఇవన్నీ ఆవిడకి నిషేధం.

వేణు ఎప్పుడైనా శెలవులకి తల్లిదండ్రులని చూడడానికి వచ్చినప్పుడు వాళ్ళ జీవిత శైలి, దుస్తులు ఒక విదేశీయ ధోరణిలో వాడికి కనిపించాయి. ఆ ఇంటిలో వేణు తన్నొక పరాయి మనిషిగా ఎంచుకున్నాడు. బాల్యంలో ఆ అనుభవం గురించి తాతగారికీ, నాయనమ్మకీ వివరించి, నవ్వుతూ, వెక్కిరింతగా మాటాడేవాడు. ఆ తరువాత, తన తాత, నాయనమ్మతో, తన తల్లిదండ్రులని సరిపోల్చుకున్నాడు. అతని మనసులో అతని తాత, నాయనమ్మ ఆదర్శ దంపతులుగా, మన భారతీయ సంప్రదాయంకి సముచితంగా, కనిపించారు.

ఎంత ప్రేమ, అభిమానం ఉన్నా వేణుకి తన తల్లిదండ్రులపై గౌరవం కలగలేదు.

వేణు హైస్కూల్ చదువు ముగించుకొని, సమీపంలో ఉన్న చిదంబరం నగరంలో కాలేజీలో చేరాడు. అతని చదువు ఎంత ఆధునికమైనా, అతని జీవిత శైలి ఎటువంటి నవీనతకి గురి అవలేదు.

ఇప్పుడు కాలేజీ చదువు ముగించుకొని వేణు చెన్నైకి వచ్చి కొన్ని నెలలే అయ్యాయి.

వాడికి తాతగారిని, నాయనమ్మని వదిలి రావడానికి రవంతైనా ఇష్టం లేదు.

"నేనేం ఉద్యోగం చెయ్యనక్కరలేదు . . . చదువుకున్నవాళ్ళందరూ నగరాలకి వెళ్ళడంవలనే మన దేశం ఇలాగుంది . . . నేనిక్కడే ఉండి వ్యవసాయం చూసుకుంటాను" అని వేణు తాతగారికి పదే పదే చెప్పాడు; నాయనమ్మకీ ఆ ఆలోచన నచ్చింది.

కాని చాలా సేపు కళ్ళు మూసుకొని ఏటవాలైన కుర్చీలో విశ్రాంతి తీసుకుంటున్న తాతగారు భార్యకి చెప్పారు: "నీకేం మతి పోయిందా, వాడితో కలిసి నువ్వూ మాటాడుతున్నావ్? మన అబ్బాయిని వదిలి ఉన్నప్పుడు మనకెలా అనిపించింది? ఇప్పుడు అలాగేకదా వాడి తల్లిదండ్రులకి ఉంటుంది? చదువుకని ఇన్నిరోజులూ వేణు మనతో ఉన్నాడు; మరిప్పుడు కన్నవాళ్ళ అబ్బాయిగా వాడు అక్కడకి వెళ్లి ఉండడమే న్యాయం."

"నేనక్కడకి రాలేదని ఎవరూ ఏడవడం లేదు!" అని వేణు జోక్యం చేసుకున్నాడు.

"వేణు! నువ్వు మాతో ఉంటే నీ కంటే మాకే ఎక్కువ సంతోషం అని నేను వేరే చెప్పాలా? ఇప్పుడు కొన్నిరోజులు అక్కడకి వెళ్ళు, తరువాత ఏం జరుగుతుందో చూద్దాం . . . నేనిలాగ మాటాడుతున్నాను, కాని నువ్వు రైలెక్కి వెళ్ళిన తరువాత మేమెలా రోజులు గడుపుతామో? దానికేం? . . . నువ్వు శెలవులకి వెళ్తున్నట్టు అక్కడ కొన్నిరోజులు ఉండు . . . ఏమంటావ్, సరేనా?" అని అతను నొక్కి చెప్పిన తరువాత వేణు చెన్నైకి రావడానికి సమ్మతించాడు.

ఇంతకు ముందు శెలవులకి వచ్చి వేణు నెలలు తరబడి తల్లిదండ్రులతో ఉన్నప్పుడు ఏర్పడని విసుగు ఇప్పుడు రెండు వారాల్లో వచ్చేసింది; వాడికేదీ నచ్చలేదు.

తన తల్లిదండ్రులు డైనింగ్ టేబుల్లో కూర్చొని భోంచెయ్యడం; పొద్దున్న ఎనిమిది గంటలవరకూ తన తండ్రి నిద్రపోవడం; అతను పరుగెత్తుకొని వచ్చి తత్‌క్షణమే తల్లికి సేవ చెయ్యడం - ఇవన్నీ చూసి వేణుకి జుగుప్స కలిగింది.

అతని మనసులో అరవై సంవత్సరాలు నిండిన వయస్సులో ప్రొద్దున్నే లేచి, స్నానం చేసి, పసుపు, కుంకుమంతో వికసిల్లే నాయనమ్మ మొహం తరచుగా లేచింది; ఆవిడ ఈ వయస్సులోనూ తాతయ్యకి సేవ చేసే మహత్వం

గుర్తుచేసుకొని, ఆ జ్ఞాపకంలో వచ్చిన ప్రతీ ఘటనలోనూ వేణు తన తల్లిదండ్రుల ప్రవర్తన పరిశీలించి చూసాడు.

'ఈ నాన్న పెళ్ళాంకి మంచి దాసుడు!' అని వాడికనిపించింది. 'ఈ అమ్మ ఇష్టం వచ్చినప్పుడు సినిమాకి. Ladies Club కి వెళ్తోంది, ఆమెను ఎవరూ ఏమీ అడగరు. అలాగే నాన్నగారు గురించి ఆవిడకి ఏ చింతా లేదు! ఛీ, ఇదేం సంసారం!' అని వేణు విసుగ్గున్నాడు.

'సరేలే, మనకేం పోయింది, తాతగారి మాట విని ఇక్కడకి వచ్చాం, కొన్నిరోజులుండి గ్రామంకి తిరుగు ప్రయాణం' అని ఉంటున్న వేణు మనసులో ఇంకా తీవ్రంగా కోపం, జుగుప్స కలుగజేసే ఘటన కిందటి వారం జరిగింది.

రాత్రి ఎనిమిది గంటలు; టెలిఫోనులో ఎవరో పిలిచారు. అప్పుడు సుందరం మేడమీదున్నారు; వేణు రిసీవరు తీసుకున్నాడు.

"హలో?" టెలిఫోను నంబరు చెప్పాడు.

"నేనే, వత్సలా మాటాడుతున్నాను . . . కాలేజీలో meet చెయ్యాలని వచ్చాను, మీరు అంతకు ముందే వెళ్ళిపోయారు . . . ఇవాళ Sound of Music ఆఖరి రోజని అంటున్నారు . . . ఇవాళ night show వెళ్దామా? . . . ఏం, ఏమీ మాటాడరేం?"

వేణుకి అంతా అయోమయంగా ఉంది. ఆరంభంలో 'ఇదొక wrong number!' అనే అనుమానం కలిగినా, 'కాలేజీలో meet . . . ' అన్న మాటలు వినగానే అది త్వరలో మాయమైపోయింది! మరేం తోచక రిసీవరుని టెలిఫోనుమీద పెట్టేసి వేణు ఆ గదినుంచి పారిపోయాడు. ఏకాంతంగా ఇంకొక గదికి వచ్చి కూర్చున్నాడు; మనసులో చంచలం అలాగే ఉంది.

'నాన్నగారిని తప్పిస్తే వయసు వచ్చిన మగవాడు ఆ ఇంటిలో లేడనే ధైర్యంతో, మామూలుగా, ఒకావిడ పిలిచారు - అదే ఆ వత్సలా . . . ' అని వేణు దృఢంగా నమ్మాడు.

కొంచెం చేపట్లో మళ్ళీ టెలిఫోను మోగింది, మొగుతూనే ఉంది; వేణు తన జాగానుంచి కదల్లేదు.

మేడమీదనుంచి దిగివచ్చి సుందరం టెలిఫోను రిసీవరు తీసుకున్నారు.

"హలో?" అతను టెలిఫోను నంబరు చెప్పారు.

వేణు మెల్లగా లేచివచ్చి టెలిఫోను ఉన్న హాలుకీ, తను ఉన్న గదికీ మధ్య ఉన్న బల్లమీద చెవిని ఒత్తుకొని విన్నాడు. అవును, గూఢచారిలాగ పొంచియుండి విన్నాడు; అతని తండ్రి ఇంగ్లీషులోనో మాటాడుతున్నారు.

"లేదే . . . నేను మేడమీద ఉన్నాను . . . "

" . . . ."

" It's all right"

" . . . ."

"ఒక వేళ మా పెద్దబ్బాయేమో? . . . అవును, వాడు ఊరులో ఉన్నాడు . . . ఇప్పుడే . . . అవును . . . "

" . . . ."

"మరెవరూ adults లేరే! . . . "

" . . . ."

"సరే . . . I can handle it . . . Okay . . . "

" . . . Nine-thirty . . . Is it okay?"

" . . . Don't worry!"

" . . . ."

"What are you talking?"

" . . . ."

" Good-bye . . ."

సంభాషణ సమాప్తమయే సమయంలో వేణు తన గది నుంచి మెల్లగా జారుకున్నాడు.

ఆ ఘటన తరువాత ఇవాళ వరకూ వేణు సుందరం మొహంలో పడలేదు; ఒకే ఇంటిలో ఉన్నా, చమత్కారంగా అతను తన్ను చూడకుండా తప్పించుకున్నాడు.

కొన్నిరోజులముందు ఇంటిలో ఎవరూ లేనప్పుడు వేణు మేడలో తన తండ్రి గదికి వెళ్ళాడు. అతని అనుమానం ఖాయపరచడానికి మరి కొన్ని నిదర్శనలు కావాలి.

మారు తాళంచెవితో తండ్రి మేజా, డ్రాయరు, అన్నీ వేణు తెరచి చూసాడు. ఒక దొంగలాగ ప్రవర్తించడంలో అతనికి అవమానం అనిపించలేదు. అంతకంటే గొప్ప

అవమానం భరించడానికి అతనికి కొన్ని విషయాలు తెలిసిన తరువాత తను చేసిన పని న్యాయమే అని నమ్మకం కలిగింది.

‘నాకెందుకు భయం? పొరబాటు చేస్తున్నది నాన్నగారు, నేను కాదు! అతనితో దీనిగురించి మాటాడి అతన్ని దిద్దాలి, అది నా బాధ్యత . . దీనిగురించి ఎలాగ అతనితో మాటాడడం? ఇంట్లో మాటాడితే అమ్మకి తెలిసిపోతుందే? ఇంటి బయట మరెక్కడైనా అతన్ని కలుసుకోవాలి . . . అతను గాని నా మాట వినకపోతే? దానిగురించి తరువాత ఆలోచిద్దాం! ముందు ధైర్యంగా  అతన్ని ఎదుర్కోనాలి, హెచ్చరించాలి!” అని  రాత్రి పగలు దీనిగురించి ఆలోచిస్తూ, బాధ పడుతూ, ఆఖరికి నిన్న వేణు ఒక నిర్ణయంకి వచ్చాడు:

“ఏమైనా సరే, రేపు దీనిగురించి అతనితో మాటాడి తీరాలి. నాకెందుకు భయం? నేనేం పిల్లవాడినా? I am now a adult!”

** ** **

సముద్రతీరంకి ఆనుకొని, ఇటీవల కొత్తగా వేసిన వీధిలో సుందరం తన మోరీస్ మైనర్ కారు నిలిపారు. అతని పక్కనే కూర్చున్న వేణు కారు తలుపు తెరచుకొని కిందకి దిగాడు. అతని చూపు దూరంలో కెరటాలమీద వాలింది. గాలిలో తన పంచెని సర్దుకొని, ముందుకు నడుస్తూ, ఇసుకమీద నిల్చున్నాడు. గత పదినిమిషాలుగా అతని మనసు  - నాన్నగారిని కాలేజీలో కలుసుకొని  ఇక్కడ వచ్చిచేరినవరకూ - సంభాషణ ఎలా ఆరంభించాలని కలవరపడుతూ ఉంది. ఎంత పెద్ద పొరబాటు చేసివున్నా ఒక తండ్రితో అతని కొడుకు అతినీచంగా మాటాడకూడదనే హెచ్చరికతోబాటు, తనకి వచ్చే కోపంలో తను అమరిక కోల్పోవడం సాధ్యం అని భయమూ వేణుకి కలిగింది.

కారునుంచి దిగిన సుందరం తన కోటుని మడతబెట్టి సీటుమీద పడేసి, కిటికీలు పైకెత్తి, కారుని తాళం వేసి వచ్చారు.

వేణు పక్కన నిలబడి తన వాచీ చూసుకొని వాడి చెవులకి వినిపించినట్టు “ఐదు గంటలే అయింది!” అని అతను తనలో చెప్పుకున్నారు.

“అవును. అందువలనే గుంపుగా ఎవరూ కనిపించడం లేదు!” అని వేణు ఒక నకిలీ నవ్వు నవ్వాడు.

సముద్రతీరంలో ఇసుకమీద వెలుతురు ఇంకా అలాగే ఉంది.

ఇద్దరూ మౌనంగా ఇసుకమీద నడిచారు. చూసినవారికి ఆ ఇద్దరూ తండ్రి, కొడుకుగా కనిపించరు, ఒక గురువు, శిష్యుడులాగ ఉన్నారు. ఇద్దరి ముఖాల్లోనూ చాలా పోలికలున్నాయి. తండ్రికంటే ఎత్తుగా ఉన్నా అతనిలాగ కండ లేకపోవడం వలన వేణు స్వరూపం కొంచెం పల్చగా కనిపిస్తోంది.

తల వొంచి నడుస్తూ వేణు ఇసుకలో దృఢంగా పాతుకున్న తన పాదాలు చూసాడు.

అతని మనసులోని భారం పెరుగుతూనే ఉంది. కలవరంతోబాటు కోపం అతన్ని గభీమని ఉక్కిరిబిక్కిరి చేసేసింది; మొహం ఎఱ్ఱబారి పోయింది. వేణు పెదిమలు బిగించి, కఱచుకున్నాడు.

అతని చూపు దూరంలో ఆ కెరటాలమీద వాలినప్పుడు ఆతని కన్నుల చివర తేలుతున్న నీళ్ల బొట్లు గాలిలో కలిసిపోయి కనుబొమ్మలు బాగా తడిసిపోయాయి.

సుందరం అతన్ని అభిమానంతో చూసారు. ఒక సారి దగ్గారు; వేణు అతన్ని తిరిగి చూసినప్పుడు వాడిని శాంతపరచే విధంగా చిరునవ్వు నవ్వారు; వాడి పెదిమలు వొణికాయి.

“ఇక్కడ కూర్చుందామా?” అని సుందరం అడిగారు.

వాడేం జవాబు చెప్పకుండా కూర్చున్నాడు.

- ఎలా ఆరంభించడం?

వేణు అతని మొహం తేరిపారి చూస్తూ, ఆ తరువాత తల వొంచి ఆలోచిస్తూ, ఇసుకమీద గిలికుతూ కొంచెం సేపు గడిపాడు.

వాడు తనతో ఏకాంతంలో దేనిగురించి మాట్లాడడానికి వచ్చాడని సుందరం ఊహించగలిగారు. ఆ టెలిఫోను సంభాషణ తరువాత, ఒక వారం వరకూ, తను వేణుని చూడలేదనే ప్రజ్ఞ అతనికీ ఉంది. దాని వలన వేణుకి బాధ కలిగిందని, ఒక యువకుడు అనే కారణం వలన వాడు సభ్యతతో తన్ను నిరాకరిస్తున్నాడని అతనికి అర్ధమైంది.

దానిగురించి వేణు తనతో మాట్లాడడానికి రావడం అతనికేం తృప్తిగా లేదు. కాని ఒక పిరికివాడులాగ ఆ ఘర్షణని తోసిపుచ్చకూడదు అని అతను ఇప్పుడు సిద్ధంగా ఉన్నారు.

కాని అతను తనే దానిగుంచి ఏమీ మాటాడలేదు.

వేణు తనలో తనే మాటాడుకున్నట్టు గొణుక్కున్నాడు; ఆంగ్ల భాషలో మాట్లాడాడు: “I am sorry . . . This is a shameful thing . . . ” ఆ తరువాత అతన్ని అడిగాడు: “నేను దేనిగురించి మాడాడుతున్నానని మీకు బోధపడిందా?”

అతను ఎటువంటి తడబాటు లేకుండా ‘బోధపడింది’ అని తలూపారు.

అతనిలో ఎటువంటి సంకోచం కనిపించకపోవడంతో వేణుకి ఆవేశం వచ్చేసింది.

“మీరిలాంటి మనిషి అని నేను నమ్మలేకున్నాను . . . ” వేణు ఉద్రేకంతో బిగుపైన చేతులు పిసుక్కున్నాడు. గాలిలో జుత్తు గడ గడ వణకుతూంటే, మనసులో లేచిన భావనలు అణచుకొని ఒక నిట్టూర్పు వదిలాడు.

“Venu! Don’t be silly . . . నువ్వేం పిల్లవాడివా? . . . కొంచెం ఆలోచించు” అని సుందరం వాడి భుజంలో తట్టారు.

“Yes, Yes . . . I am an adult” అని వేణు పళ్లు కొరికాడు; ఆ తరువాత ఆంగ్ల భాషలోనే మాట్లాడాడు.

-ఒక విదేశీయ భాషలోనే ఒక తండ్రి, కొడుకు, మధ్య ఇలాంటి సంప్రదింపులు సాధ్యం అని వాడి అభిప్రాయం కాబోలు!

“ఆ టెలిఫోను ఘటన మీకు జ్ఞాపకం ఉందా? ఆ రోజునుంచి నేను మిమ్మల్ని చూస్తూనే ఉన్నాను . . . నా నాన్నగారు ఇలాంటి స్త్రీ లోలుడుగా ఉంటారని నేను కల్పనకూడా చెయ్యలేను! . . . ఇది మన కుటుంబంకి సంబంధించిన ప్రశ్న కదా? ఇది మీకూ, మీ వయస్సుకీ తగని ప్రవర్తన కాదా? ఈ అమ్మ ఉందే, అది ఒక జడ్డి! మీరు జీవితమంతా అమ్మని ఇలాగే మోసం చేస్తున్నారు!” ఇంతసేపూ వేణు మాటలు మౌనంగా వింటూ, సిగరెట్టు కాలుస్తున్న సుందరం, గభీమని ఇప్పుడు జోక్యం చేసుకున్నారు.

“Please! నీ అమ్మ గురించి ఏమీ మాటాడవద్దు! నువ్వు - నీకు ఇష్టం వచ్చినట్టు - ఎది చెప్పినా, సరే, నేను ఓపికతో వింటాను, కాని నీ అమ్మ గురించి

ఏమీ అనవద్దు! నీకంటే నాకు దానిగురించి బాగా తెలుసు . . . నీకు నాగురించి ఏమిటి తెలుసో దానికంటే ఆమెకు నాగురించి తెలుసు . . . మేం ఇరవైఐదు సంవత్సరాలుగా కాపురం చేస్తున్నాం, ఆఖరివరకూ చేస్తాం . . . సరే, మరేం చెప్పాలో చెప్పు . . . నేను వింటాను . . . ”

“మీరు అమ్మని మోసం చేస్తున్నారు . . . నాతో అదేం వీలుకాదు!”

సుందరం నవ్వారు: “ నిన్ను మోసం చేసి నాకేంకావాలి?”

“ఆ టెలిఫోను ఘటన మాత్రం గుర్తు చేసుకొని నేను మీ గురించి మాటాడడం లేదు. మీరు రెండవసారి ఫోనులో మాటాడినప్పుడు ఆ సంభాషణ నేను విన్నాను. ఆ తరువాత రాత్రి తొమ్మిది గంటలకి కారులో వెళ్ళారుగా? . . . మీ ఇద్దరినీ నేను cinema theatre లో చూసాను . . . అందువలనే మీ గదిలో మీ మేజా డ్రాయరు, అన్నీ తెరచి చూసాను . . . మీ ప్రేమలేఖలు ఒక ఫైలులో చూసాను . . . అందులో ఇదొకటి!” అని కోపంతో తన జేబునుంచి ఒక కాగితం తీసి అతనిముందు విసిరాడు.

ఆ తరువాత వేణు మొహం వేరే దిశలో తిప్పుకున్నాడు. కళ్ళు తడిసిపోయి ఏడ్పు ఊపిరి ఆడకుండా చేసింది.

సముద్రతీరంలోని వీధుల్లో దీపాలు వెలగడం ఆరంభమైంది. బయట, ఇసుకలో, జనసమూహం బాగా పెరిగిపోయింది. కొందరు వీళ్ళ దిశలో వస్తున్నారు. వాళ్ళందరూ దాటి వెళ్ళినంతవరకూ ఇద్దరూ మౌనంగానే ఉన్నారు; ఆ తరువాత వేణు మాట్లాడాడు.

“మీరు నన్ను కన్న తండ్రి . . . మీకు ఇవన్నీ చెప్పడానికి నిర్బంధం వచ్చేసిందని నాకు బాధగా ఉంది. ఇకనైనా మీరు మీ పొరబాటు దిద్దుకోవాలి . . . అందుకే నేను చెప్తున్నాను . . . ”

అంతకు మించి మరేం చెప్పాలో తెలియక వేణు మౌనం వహించాడు. సుందరం ఒక నిట్టూర్పు వదిలి తలెత్తి ఆకాశంని చూస్తున్నారు. వీడిదగ్గర దీనిగురించి తను ఏం మాట్లాడాలి అనే ప్రశ్నకంటే ఏమిటి మాట్లాడకూడదు అని అతను తీవ్రంగా ఆలోచించారు.

వేణు గభీమని అతన్ని అడిగాడు.

"తాతగారు నాకు చెప్పివున్నారు - మీరూ, అమ్మా ప్రేమించి పెళ్ళిచేసుకున్నారని . . . ఈ ప్రేమ వ్యవహారాలన్నీ ఆఖరికి ఇలాగే అవుతాయి కాబోలు?" అని నిందగా, హేళనగా, అడిగి అతని మొహం చూసాడు.

సుందరం సిగరెట్టు ఊదుతూ, కొంచెం తల వాల్చి, ఆలోచించారు. ఒక నిట్టూర్పు వదిలి, తలెత్తి, వేణుని చూసారు. దేనిగురించో వాడితో మాట్లాడాలని నిర్ణయించి, ఆఖరికి, 'వయసు వేరు అనుభవం వేరు; అలాగే అనుభవం వేరు, దానివలన వచ్చే వివేకం వేరు' అని గుర్తు చేసుకొని, తను చెప్పదలచుకున్నది వదిలి మరొకటి గురించి వాడిని అడిగారు.

"సరే, ఇప్పుడు  నిన్ను బాధించే ప్రశ్న ఏమిటి? చెప్పు, వింటాను."

అతనిలాగ అడగ్గానే వేణుకి ఒక పక్క కోపమూ, ఇంకొక పక్క 'ఇతనెందుకు ఇలా ఐపోయారు!' అని జాలీ కలిగాయి; నవ్వుతూ ఆరంభించాడు:

"నాన్నగారూ, మీరొక ప్రొఫెసరు . . . గౌరవమైన కుటుంబంలో పుట్టినవారు; నలుగురు పిల్లలకి తండ్రి. ఈ వయసులో మీకు విటుడని తలవంపు వస్తే మీ కుటుంబం పేరూ, ప్రతిష్ట, ఏమౌతుంది? దాని గురించి  మీ అబ్బాయి బాధ పడడడం పొరబాటు అంటున్నారా? వాడికి అందులో సంబంధం లేదంటున్నారా?"

వేణు మాటాడుతున్నప్పుడు సుందరం వాడి మొహాన్ని సూటిగా చూసారు. వాడి మొహంని ఒక పక్క వెలుతురు, ఇంకొక పక్క అంధకారం ఆక్రమించుకొని ఉన్నాయి. కాని వాడి చూపు నాలుగు దిశలా చెదరిగొట్టినట్టు అతనికనిపించింది.

"వేణు, నువ్వు 'నేను adult!' అంటున్నావ్ . . . అది నిజం . . . కాని నీలో ఆ వయస్సుకి తగిన అమరిక కనిపించడం లేదే? . . . అసలు ఒక తండ్రిగా నా వ్యక్తిగత విషయాలు నేనెందుకు నీతో పంచుకోవాలి? నీకు నా సామాజిక అంతస్తు, కుటుంబం గురించి బాధగా ఉందని అంటున్నావ్ . . . మంచిది . . . కాని నా పేరూ, ప్రతిష్టకి ఏ  భంగమూ రాదు! విను, వాటిని నిలబెట్టుకోడానికి  నీకంటే నాకు ఎక్కువ ఆసక్తి ఉంది;  అలా ఏమైనా నష్టం వస్తే అది నేను చూసుకుంటాను . . . ఆ నమ్మకం నాకు ఉందని నేను నీకెలాగ రుజువు చెయ్యాలి? ఎందుకు రుజువు చెయ్యాలి?"

సుందరం కంఠధ్వని పట్టుదలతో, బలంగా మ్రోగింది. అందులో ఏమాత్రం అలుక, అపరాధ భావం లేకుండా అతను తనతో మాట్లాడడం చూసి వేణుకి ఒక నిమిషం తనేదో పొరబాటు చేస్తున్నట్టు అనుమానం కలిగింది. కాని ఇంత వయసు మళ్ళిన ఒకతను ఒక అమ్మాయితో వ్యభిచార సంబంధం పెట్టుకొని ఇంత ధైర్యంగా తన దగ్గర మాటాడుతున్నారనే భావన రాగానే వాడికి కోపం ఇంకా ఎక్కువైంది.

" 'ఎందుకు రుజువు చెయ్యాలి?' అని అడుగుతున్నారా? నేను మీ భార్యకు పుట్టాను. మీరు ఆమెకు ద్రోహం చేస్తున్నారు!" అని వేణు పళ్ళు కొరికాడు.

"అది దీనిగురించి నన్ను అడగమని నీకు ఫిర్యాదు చేసిందా?"

"లేదు . . . "

"మరి నువ్వెందుకు హద్దు మీరి మా దాంపత్యంలో చొరబడుతున్నావ్?"

"I am your son! . . . అది నా బాధ్యత! . . . "

"No, son, no! నీకా బాధ్యత లేదు! My dear boy, ఇందులో జోక్యం చేసుకోడానికి నీకు అధికారం లేనే లేదు . . . "

వేణు పెదిమలు కొరుక్కున్నాడు; ఏడుపు వచ్చేసింది. అతన్ని ఇష్టం వచ్చినట్టు తిట్టేసి, ఇక అతన్ని చూడకుండా, ఉన్న బంధం తెంచుకొని ఎక్కడైనా పారిపోదామా అని ఆలోచించాడు.

వేణు సంకటం, మనోవ్యధ చూసి సుందరంకి జాలి కలిగింది. తనకి సంబంధించని, తను భరింపలేని విషయాలని, లక్ష్యం చెయ్యకుండా, తోసిపుచ్చే త్రాణ లేకపోవడం వలనే ఆ పశి హృదయం ఇలాగ కలవరపడుతోందని అతను గ్రహించారు. అభిమానంతో వాడు చెయిని అందుకున్నారు.

"వేణు!"

పశి బిడ్డ చిరచిరలాడినట్టు వేణు అతని చెయిని వదల్చుకున్నాడు. ఇప్పుడు వాడికి ఏడుపు నిజంగానే వచ్చేసింది. కాని దాన్ని ఆపుకొనే ప్రయత్నంలో అతన్ని అడిగాడు:

"నాన్నగారూ . . . నాకిది చాలా అవమానకరంగా ఉందే? . . . మీరెందుకు ఇలాంటి పనులు చేస్తున్నారు?"

అతను తనలో తనే నవ్వుకున్నారు.

"My dear boy! నువ్వు మీసం గిరగిరమని తిప్పుకుంటున్నావ్ . . . వయసు చెల్లిన యువకుడంటున్నావ్, మరెందుకు ఇలా నన్ను అడుగుతున్నావ్? నీ ఆవేశం నాకు బోధపడింది . . . నాగురించి నీకు చెడ్డ భావన ఉందంటే, దాన్ని మనసులో అలాగే ఉంచుకో . . . క్రమేణ ఎది సరి, ఎది తప్పు - ఎంతవరకు ఎది సరి, ఎది తప్పు - అని నీకు బోధపడుతుంది. నువ్వు చేసిన పనులన్నీ నీ మీదున్న అభిమానం వలన ఒక తండ్రిగా నేను క్షమించుతున్నాను . . . బాగా ఆలోచించు . . . నాన్నగారి వ్యక్తిగత విషయాలు తెలుసుకోవాలని అతని కొడుకే గూఢాచారిగా పని చెయ్యడం, దొంగతనంగా అతని అంతరంగంలో జొరపడడం ఎంత సిగ్గుచేటు! నేను ఇప్పుడు నీ పరిస్థితిలో ఉంటే దీనికోసం నా జీవితమంతా సిగ్గుతో బాధ పడతాను . . . "

అతను తన్ను క్షమించారని, తన పొరబాటుకి తను సిగ్గుపడాలని అతనన్న మాటలు వేణుకి అర్థం కాలేదు. కాని ఇక అతనితో మాట్లాడి అతని మనసు మార్చడమో, అతను తన పొరబాటుని ఒప్పుకోవడమో అసాధ్యం అని వేణు గ్రహించాడు.

** ** **

"అమ్మా!"

ఆ దంపతుల సంతానంలో రమణిని అమ్మా అని, సుందరంని నాన్నగారని పిలిచేది వేణు మాత్రమే. తక్కిన పిల్లలకి వాళ్ళు Mummy, Daddyయే!

మేడమీద వరాండాకి వచ్చి నిలబడి వేణు "అమ్మా!" అని పిలిచినప్పుడు రమణీ అమ్మాళ్, నిదానంగా, ఏటవాలైన కుర్చీలో, Julian Huxley రాసిన ఒక పుస్తకంలో ఒక పేరా ఉత్సాహంతో చదువుతోంది.

వేణు పుస్తకం అట్టని చురుగ్గా చూసి తనలో వల్లించుకున్నాడు: "Knowledge, Morality and Destiny."

"అమ్మా, నేను మిమ్మల్ని disturb చేస్తున్నానా . . . ?"

"ఛీ, ఛీ, ఎందుకీ formality? రా, రా . . . ఇలాగ కూర్చో . . . " అని రమణీ అమ్మాళ్ వాత్సల్యముతో పిలిచింది.

వేణు వరండాలో ఉన్న ఒక కుర్చీని లాగ్గొని, అందులో కూర్చున్నాడు.

వాడికి ఏం మాటాడాలని అర్థం కాలేదు. రమణీ అమ్మాళ్ అభిమానంతో, గభీమని తనకు ఇంత పెద్ద వయస్సులో కొడుకు ఉన్నాడనే విభ్రాంతిలో తృప్తితో , వాడిని చూసింది; వేణు చెయిలోని గోరులు పీకుతూ, తల వంచి, ఏదో ఆలోచిస్తున్నాడు.

ఇన్నిరోజుల తరువాత తన మనసుని నొప్పించే ఏదో ప్రశ్న గురించి వేణు తనతో చర్చించడానికి వచ్చాడని ఆ తల్లి సంతోషించింది.

కాని వాడి సంకోచం చూసి తనే సంభాషణ మొదలుపెట్టింది:

"ఏమిట్రా వేణు . . . నీకిక్కడ life bore కొట్టుతోందా?"

"హూం . . . " అని అంటూ తలెత్తి చూసిన వేణు " . . . Bore కొట్టుతోందని కాదు . . . నాకీ life ఏ మాత్రం నచ్చనే లేదు! ఏమైనా నేను moffussil type కదా? మీరందరూ నాగరికంగా - ultra నాగరికంగా - జీవిస్తున్నారు, అది నాకు విరుద్ధంగా ఉంది . . . " అని చెప్పి మళ్ళీ తల వొంచి అఅచెయిలో వేలుతో గీతలు గీయడం ఆరంభించాడు.

కొంచెం సేపు మౌనం వహించి రమణీ అమ్మాళ్ మాటాడింది:

" . . . అసలు నీ తత్తరపాటు ఏమిటో నాకు అర్థం కావడం లేదు . . . ఇన్ని సంవత్సరాలూ మేం ఎలా జీవించామో, అలాగే మేం ఇప్పుడూ జీవిస్తున్నాం అని నాకనిపిస్తోంది . . . కొత్తగా ఏ ultra నాగరికతా ఇక్కడ రాలేదని నాకనిపిస్తోంది . . . నీ మనసులో ఏముందో స్పష్టంగా నువ్వు చెప్తే, నాకు బోధపడుతుంది . . . " అని ఆమె అడిగినప్పుడు వేణు మనసులోని అలజడకి కారణమేమిటని ఆవిడకి ఆయాసం కలిగింది.

"అసలు 'ఇక్కడకి ఎందుకురా వచ్చాం?" అని నాకనిపిస్తోంది . . . ఎవరో పరిచయం లేని వాళ్ళ ఇంటికి వచ్చినట్టుంది . . . మీ, ప్రేమా, అభిమానం నాకు పైకి మినుకుగా కనిపిస్తున్నాయి . . . మీరందరూ కపట జీవితం గడుపుతున్నారు . . . నేను తాతగారి ఇంటికి తిరిగి వెళ్ళిపోదామని ఆలోచిస్తున్నాను . . . " అని వేణు అన్న మాటలు ఆమె ఓపికతో వింటోంది.

ఆ తరువాత ఇద్దరూ మౌనంగా ఉన్నారు. అప్పుడు మధ్యాహ్నం, సమయం పదకొండు గంటలు. ఇల్లంతా నిశబ్దంగా ఉంది; వంట గదిలో వంటమనిషి నిద్రపోతోంది. ఇంటిలోనూ, బయట వీదిలోనూ, ఎటువంటి సందడీ లేదు.

"వేణు . . . గభీమని నీకీ ప్రశ్న ఎలా వచ్చింది? తాతగారి ఇంటి జీవితంకి, మన పరిసరాలకి చాలా భేదం ఉందని నాకు తెలుసు . . . కాని, న్యాయంగా, నీ వయసుకి ఆ జీవితమే కదా bore కొట్టాలి? అభిరుచి అనే మాట వస్తే దానికి మూల కారణం మన అలవాటే కదా? ఐనా, ఇదేకదా నీ ఇల్లు? నీకిష్టం వచ్చినట్టు నువ్వు ఇక్కడ జీవించడానికి నిన్నెవరైనా ఆక్షేపించారా? ఏది ఎలాగున్నా ఇతరుల స్వతంత్రతలో జొరపడి, అధికారం చెలాయించే ధోరణి మన ఇంట్లో ఎవరికీ లేదు. నీకు గుర్తుందా? మీ తాతగారూ, నాయనమ్మా, ఇక్కడకి వచ్చి ఊరుకి బయలుదేరినప్పుడు నువ్వూ 'వాళ్ళతో నేను వెళ్తాను!' అని హఠం చేసావ్! . . . వాళ్ళకీ నిన్ను తీసుకువెళ్ళాలని ఆశ! . . . నీ ఆశకోసమే నేను నిన్ను వాళ్ళతో పంపించాను . . . పిల్లల స్వతంత్రతకి ఈ ఇంటిలో అటువంటి మర్యాద ఎప్పుడూ ఉంది . . . మరి, నీకెందుకు బాధ? . . . వేణు, ఇక్కడ నీ స్వతంత్రతకి ఏమైనా అడ్డు ఉందా, చెప్పు . . . " అని ఆమె అడగ్గానే వేణు తల్లిని తేరిపాఱి చూసాడు.

"అంటే నీకు ఊరుకి తిరిగి వెళ్ళిపోవాలనిపిస్తే, అందుకు ఏదో కారణం ఉండాలి, అవునా?" అని రమణి అమ్మాళ్ లేతగా నవ్వుతూ అడిగింది.

"అవును, వేరే కారణం ఉంది . . . " అని చెప్పిన తరువాత తన మనసుని చిత్రవధ చేస్తున్న తన తండ్రి ప్రవర్తనగురించి నిజం ఆమెకు తెలియజేయడానికి మాటలు రాకుండా వేణు పెనుగులాడాడు.

"వేణు, అది మాత్రం కాదు. నువ్వు ఏమేమో అన్నావ్ . . . మా ప్రేమా, అభిమానం దగా, మాది కపట జీవితం అని అంటున్నావ్, అదేమిటో చెప్పు . . నీకెందుకు అలాంటి ఆలోచన వచ్చింది? అందరి జీవితంలోనూ పైకి మినుకుగా కనిపించే విషయాలు కొన్ని ఉంటాయి, నువ్వు దేనిగురించి మాటాడుతున్నావ్? నీ మనసు ఇంత లోతుగా నొచ్చుకుందన్న మాట! ఏం జరిగిందో చెప్పు . . . "

అప్పుడే వేణు తన చొక్కాయి జేబునుంచి ఒక రుమాలు తీసి తన ముక్కు, మొహం తుడుచుకున్నాడు. మొహమంతా ఎఱ్ఱబారిపోయింది.

"అమ్మా . . . నాకు నాన్నగారి ప్రవర్తన నచ్చలేదు," అని అంటూ ఆకాశాన్ని చూడడానికి వేణు మొహం మళ్ళించుకున్నాడు. తల్లి ఏమీ జవాబు చెప్పలేదు. ఆ ధైర్యంతో ఆమెను తిరిగి చూడకుండా మాట్లాడ సాగాడు.

"నీకూ, నాన్నగారికీ విరోధం వస్తుంది, నా వలన ఈ కుటుంబంలో శాంతి పాడవుతుంది అనే భయంతో నేనింతవరకూ కలవరపడుతూ రోజులు గడిపేసాను. కాని చెడిపోయే కుటుంబంలో శాంతి ఎన్నిరోజులు కొల్లపోకుండా ఉంటుంది? అమ్మా, అతను నీకు ద్రోహం చేస్తున్నారు . . . ఇది తెలిసిన తరువాత కూడా నేను దీన్ని నీదగ్గర దాచానంటే ఆ ద్రోహంకి నాకూ వాటా ఉందన్నమాట! అందువలనే ఈ అవమానకర కుటుంబంలో ఉండడానికి నాకు రోతగా ఉంది . . . నేనా అతన్ని సవరించగలను? సాధ్యమైతే నువ్వు అతన్ని సరిదిద్దు! అది మీ సొంత ప్రశ్న . . . నేను వెళ్తాను . . . " అని చెప్పేసి అంతకు మించి తల్లి మొహం చూడడానికి ధైర్యం లేక వేణు అక్కడనుంచి పరుగెత్తాలని ఆతరతతో కనిపించాడు.

వాడికి మనసులో - 'తల్లి ఏడుస్తుందేమో? ఏడుస్తూనే అతని గురించి తన్ను ఏమైనా వదరుబోతు మాటలు అడుగుతుందేమో? పట్టరాని కోపంతో తనకి ద్రోహం చేసిన భర్తని తిట్టి, శపించుతుందేమో? ఇంతకాలమూ అనుమానంతో మనసులో తను దాచుకున్న సంగతి ఇప్పుడు కొడుకు వరకూ తెలిసిపోయిందని అవమానంతో అల్లాడుతుందేమో? - అనే భయంతో, ఒక నేరస్తుడు లాగ ఆమె దగ్గరనుంచి తప్పించుకొని పారిపోలాలని ఉంది.

కాని "వేణు!" అని నిమ్మళంగా, ఆవేశం వలన శ్రమ పడుతున్న కంఠధ్వనితో అతని తల్లి పిలుపు విని వాడు కదల్లేదు.

ఆమె మొహంలో తను ఎదురుచూసిన జాడ ఏదీ కనిపించలేదు. ఆమె అనురాగంతో "రా, ఇలా వచ్చి కూర్చో" అని అనగానే వేణు కుర్చీనుంచి లేచినవాడు మళ్ళీ కూర్చున్నాడు.

"నువ్వేమో నీ వ్యక్తిగత ప్రశ్నగురించి ఏదో చెప్తావనుకున్నాను . . . ఇంతకీ ఇది మీ నాన్నగారి ప్రశ్న అన్నమాట! బాగుంది . . . " అని ఆవిడ నవ్వింది.

"అంటే ఇంతకు ముందే నీకు దీనిగురించి తెలుసా?" అని సణుగుతున్నట్టు వేణు అడిగాడు.

"వేణు, అవన్నీ తెలుసుకోవాలని నాకు ఇష్టం లేదు . . . " అని ఆమె అన్న మాటల్లో ఒక గంభీరత కనిపించింది.

ఆవిడ ఇంకా చెప్పింది:

"ఇదిగో, విను . . . అతను నీకు తండ్రి, నాకు భర్త . . . ఆ బంధం ఎంత నిజమో, అదే విధంగా అతనొక ప్రొఫెసరు, ఒక విద్యావంతుడు; ఈ సమాజంలో అతనికి అంతస్తు, గౌరవం, ఉన్నాయి . . . అవునా?"

వేణు మరేం అనక ఊరుకున్నాడు.

ఆవిడే మళ్ళీ మాటాడింది:

"అతని గురించి నువ్వు గర్వపడడానికి ఎన్నో కారణాలున్నాయి. కాని నువ్వేమో అవన్నీ వదిలేసి - దేనిగురించి నీకు పూర్తిగా ఏమీ తెలియదో, ఎది అతని అంతరంగ విషయమో - దాన్ని సూక్ష్మంగా చూసి అవమాన పడుతున్నావ్! అదేనా నీకు కావాలి? . . . "

వేణుకి పట్టరాని కోపం వచ్చేసింది. "అమ్మా, నేను అన్నీ పూర్తిగా తెలుసుకునే మాటాడుతున్నాను . . . I have proof! I can prove it! . . . అతను ఫోనులో మాట్లాడినది నేను నా చెవుల్లో విన్నాను . . . అందువలనే ఆ రాత్రి సినిమా theatre కి వెళ్ళి ఈ కళ్ళతో చూసాను . . . అతని గదిలో ఉన్న డ్రాయరులో ఒక ప్రేమ లేఖ ఉందే, దాన్ని నేను అతని మొహంలో విసిరినప్పుడు అతనే కాదని అనలేదే?"

"Oh! It's a shame on you! Proof ఉందట, proof! పేరు మోసిన మనుషులని, ప్రసిద్ధమైన పెద్దలని అపనింద చెయ్యడానికనే కొన్ని అశ్లీల పత్రికలున్నాయిగా, వాళ్ళ దగ్గరా proof ఉంది! గౌరవనీయులు ఎందుకు వాటిని నిరాకరిస్తారు? ఒక వ్యక్తికున్న ప్రతిష్ట, యోగ్యత - ఇవన్నీ వదిలేసి అతని అంతరంగ బలహీనతలగురించే మాటాడమే వాళ్ళకి లక్ష్యంగా ఐపోయింది! అందువలన సమాజంకి, నాగరికతకి, ఏం లాభం, చెప్పు? అందువలనే మనకి ఆ పత్రికలని చూస్తేనే జుగుప్స . . . ఇప్పుడు నువ్వు చేసిన పనికీ, దానికీ, ఏం భేదం చెప్పు . . . నువ్వూ వాళ్ళలాగే proof ఉందని అంటున్నావ్! I feel very sorry

for you . . . What a shame! . . . It's a shame on you!" అని అంటూ రమణి అమ్మాళ్ తన రెండు చెవులని మూసుకుంది.

"నువ్వు నిజంగానే ఇవన్నీ చేసావా? . . . వేణు, అతను ఎంత పెద్దవారు . . . అతన్ని నువ్వు ఇంత నీచంగా . . . " ఆ మాటలు అంటూంటే ఆమె దేహమూ, మనసూ, అల్లాడిపోయాయి.

'ఇదేం మనిషి? ఇదేం భార్య?" అని బోధపడక వేణు నివ్వెరపడిపోయాడు.

"అమ్మా, నీ మంచికోసం, ఈ కుటుంబ గౌరవం కోసం - నేను చేసేది పొరబాటు అని తెలిసే- అతన్ని సరిదిద్దాలని అలాగ చేసాను" అని వేణు ఆమెను ఓదార్చాలని ప్రయత్నించాడు.

"వేణు, I feel sorry for you . . . అతని గురించి కాదు . . . నీ గురించి . . . నువ్వు చేసినది ఎంత పెద్ద పొరబాటు! ఒక తండ్రితో అతని కొడుకు . . . అయ్యో, నేను నమ్మలేకున్నాను! . . . "

"అతను నీకు ద్రోహం చేస్తున్నారు అని తెలిసి కూడానా . . . "

"That's my problem!" అని ఆమె జోక్యం చేసుకుంది. "అది మా సొంత ప్రశ్న! మా దాంపత్యంలో - అంతరంగంలో - జొరపడడానికి నీకేం హక్కు ఉంది?" అని అడిగినప్పుడు ఆమె దేహమంతా వొణికింది.

"చెప్తాను, విను . . . మేం ఇరవైఐదు సంవత్సరాలు నెమ్మదిగా కాపురం చేస్తున్నాం - అది ఆఖరివరకూ అలాగే సాగుతుంది . . . అందువలనే ఆ శాంతిని, సంతోషంని పాడుచేసేది ఎద్దైనా సరే, అందులో నేను జోక్యం చేసుకోవడం నాకు ఇష్టం లేదు . . . నాకూ కొంచెం తెలుసు, ఐతేనేం? అతనికి నన్ను మించిన సహకారి మరెవరూ లేరు . . . నువ్వు చెప్పావుగా - దానిగురించి నాకూ మనసులో కొంచెం దుఃఖం ఉంది." ఈ మాటలు పలికినప్పుడు - ఎంత ప్రయత్నించినా, ఆమె హృదయంలో గడ్డ కట్టుకొనివున్న శోకం - మెల్లగా కరిగే సూచనలు కనిపించాయి. కళ్ళద్దాలని తీసి, ధారధారగా కారుతున్న కన్నీళ్ళని తుడిచి, లేచి, వరాండాలో కొంచెం సేపు నిలబడి, తన్ను స్థిరపరచుకొని, ఆమె మళ్ళీ వేణుకి ఎదుట వచ్చి కూర్చుంది.

“వేణు, నువ్వు అనుకున్నట్టు జీవితమనేది అంత సులభంగా మనకి బోధపడదు. అందులో చాలా ఘర్షణలు, చిక్కులున్నాయి. వాటిమధ్య ఒక కుటుంబంని నిమ్మళంగా నడపాలి; అది ఒక కళ. ఒర్పు, సహనం, లేకపోతే - ప్రేమకి, మమకారంకి అర్ధమే లేదు. నీలాగ నేను చేసాననుకో . . . ఈ కుటుంబంలో శాంతి, అతని గౌరవం పాడవడానికి నేనే కారణమైవుంటాను. నా possessiveness కోసం నా స్వాధీనంలో అతను ఉండాలని ఈ కుటుంబంలో శాంతి, అతని గౌరవం, నా పిల్లల భవిష్యత్తు తాకట్టు పెట్టడానికి పూనుకుంటే, నా స్వార్థం ఎంత నీచం! . . . ఇలాగ అనడం వలన నేనేమో రహస్యంగా శోకం అనుభవిస్తూ నా రోజులు గడుపుతున్నానని కల్పించుకోవద్దు! కాని మనసులోనూ రవంత శోకం లేకపోలేదు; పూర్తిగా సంతోషం కావాలంటే అదేం అంత సులభంగా సాధ్యం కాదుగదా?. .

“ఇక్కడ నాకు నోరు తెరిచి మాటాడానికి హక్కు ఉందా, లేదా అనే ప్రశ్న లేదు. ‘అందువలన ఏమిటి ఫలం?’ అని ఆలోచించవద్దా? ‘మనకేం నష్టం?’ అని నేను ఆలోచించి చూసాను. వేణు, నేను దానిగురించి మాటాడకపోవడం ‘ఒక సభ్యత’ అని తెలుసుకో . . . అవును, ఒకరిని మనం గౌరవిస్తున్నాం అంటే ఏమిటి అర్థం? అతని అంతరంగం - privacy - తెలుసుకోవాలని మనం బలవంతంగా ప్రయత్నించకుండా ఉండడమే! ఇంకొకరిమీద ప్రేమానురాగాలు చూపడమంటే - అతని అంతరంగంలో ఒక బలహీనత ఉందని మనకి తెలిసినా, అతనిలో ఉన్న ఇతర అర్హతలు, హక్కులు, అతని గౌరవంని ఏ మాత్రం తక్కువ చెయ్యలేదని, ఆ లోపమూ అందులో ఉందని గ్రహించడమే . . .

“అవును, ఒకరి అంతరంగం ఎంత పవిత్రమైనది! Venu, it’s something sacred! ఇందులో రెండవ మనిషి జొరపడడం - అది ఎవరైనా సరే - అనాగరికమైన పని!”

“అమ్మా, నువ్వు అతని భార్య కాదా?

“So, what? ఆ హక్కుని నేను దుర్వినియోగం చేస్తే ఆ హక్కుని వెనక్కి తీసుకోడం సాధ్యం కదా?”

"నీ విషయంలో అతనలా ఉంటారా?"

"'ఉంటారా?' అని అడుగుతున్నావా? వేణు, అతను ఉన్నారు. ఒక భర్త తన భార్యని, లేక ఒక భార్య తన భర్తని, అనుమానించి అంతరంగంలో విషయాలన్నీ హద్దు మీరి పరీక్షించి చూడడానికి ఎటువంటి కారణమూ లేదు. ఒకే ఒక కారణముంది: వాళ్ళు తమకి ఆ హక్కు ఉందని నమ్ముతున్నారు . . .

"భర్త-భార్యా-కొడుకు-తల్లి-తండ్రి - వీళ్ళందరూ ఒక బంధుత్వంకి లోబడినవారే - కాని ప్రతి ఒక్కరూ ఒక separate individual unit, అవునా? ఒక్కొక్క జీవికి ఒక అపూర్వమైన అంతరంగం ఉంది. వేణు, దాన్ని మనం గౌరవించాలి! ఒకరిమీద గణ్యత చూపాలంటే మనం వాళ్ళ అంతరంగంకి -చాలా జాగ్రత్తగా - మర్యాద చూపాలి . . . నీ నాన్నగారు గురించి నీ మనసులో ఏమనుకున్నావ్? నువ్వు అతన్ని అడిగినట్టు నేనతన్ని అడగ్గలనా? అలా ఊహించడమే నావల్లకాదు! . . . అబ్బా, నువ్వెంత పని చేసావ్! . . .

". . . మీ నాన్నగారు చాలా strong man . . . అతనిది తప్పకుండా భరించగలరు . . . అతనికి తన బలహీనతలు దాటే త్రాణ ఉంది . . . వేణు, జీవితమనేది చాలా చిక్కైనది . . . దానిగురించి మనం బాగా తెలుసుకోవాలి . . . ఈ పుస్తకం చదివిచూడు . . . ఇటువంటి భావనలు విశాలమైన దృక్పథంకి దోహదం చేస్తాయి."

వేణుకి అంతా తారుమారుగా ఉంది. వాడి మనసులో తాతగారు, నాయనమ్మ మాత్రం ఆదర్శ దంపతులుగా కనిపించారు.

** ** **

కొన్నిరోజుల తరువాత ఒక సాయంత్రం సుందరం కాలేజీనుంచి వచ్చి దుస్తులు మార్చుకొనే సమయం, రెండు రోజుల ముందు ఎవరికీ చెప్పకుండా ఇంటినుంచి పారిపోయిన వేణు రాసిన ఉత్తరం రమణి అమ్మాళ్ అతనికి ఇచ్చింది.

అందులో ముఖ్యమైన ఆఖరి వాక్యాలు ఇవి:

"నాకు తాతగారి మనవడుగా ఉండడానికే అర్హత ఉంది. వచ్చేసాను. మీ జీవిత నియమాలు తెలియక నేను పొరబాటు చేసివుంటే నన్ను క్షమించండి."

- వేణు

ఉత్తరం చదివిన తరువాత ఇద్దరూ ఒకరినొకరు అర్ధపుష్టితో చూసుకున్నారు.

"మార్పుని ఎదిరించేవారు డెబ్బైయేళ్ల వయస్సుకు పైగా ఉండాలనే నియమం లేదు. . . . ఇరవై ఏళ్ల వయస్సులోనూ ఉండవచ్చు . . . " అని చెప్పి సుందరం నవ్వారు.

రమణి అమ్మాళ్ కొంచెం సేపు వేదనతో రెప్ప వాల్చకుండా అతన్ని చూసింది. కళ్ళు ఎట్టిబారి మకమకలాడాయి.

ఆమె అగాధమైన తన దుఃఖంని ఒక చిరునవ్వుగా మార్చుకొని అతన్ని అడిగింది: "ఇప్పుడు కూడా . . . మీరు . . . మీరు . . . " వొణుకుతున్న ఆమె పెదిమలు తన బుగ్గలో అదుముకున్నట్టు సుందరం ఆమెను కౌగిలించుకున్నారు.

- ఆ తరువాత జరిగివన్నీ వాళ్ళ అంతరంగ వ్యవహారాలు!

********

**(మూలం: ప్రచురణ, ఆనంద వికటన్, 1969)**

# ఒక హీరోకి ఒక హీరోయిన్

నిలువుటద్దం ముందు నిల్చొని కోసిన జుత్తుని దువ్వెన వెనకభాగంతో గట్టిగా నొక్కుకుంటూ చుట్టు వెంఢ్రుకలని మరింతగా మెరుగుపరిచే ప్రయత్నంలో సీతారామన్ గత పదిహేను నిమిషాలు లీనమైవున్నాడు.

గదినిండా వాసన తైలం, snow, పవుడరు, అత్తరు - వీటి సుగంధం వ్యాపించివుంది.

అద్దం పక్కనే, ఒక చిన్న మేజాపైన, అతని అలంకార వస్తువులన్నీ అలాగే పడి ఉన్నాయి. వాటి మధ్య అతని shaving set - అశుభ్రంగా, మురికిగా, అలాగే సబ్బు నురుగుతో - కనిపిస్తోంది. తన ముస్తాబుకి సీతారామన్కి అర్ధగంటకి పైగా పట్టింది, కాని ఆ shaving set ని శుభ్రపరచడానికి అతనికి సమయం, ఓపిక, లేవు. అందుకు అగత్యమూ లేదు; అలాంటి పనులు చెయ్యడానికే కాచుకున్నట్లు మధురం ఉంది.

మధురంకి మనసులో తన భర్త గురించి చాలా గర్వం, అభిమానం.

రోజూవారి ఉదయం కాఫీ గ్లాసుతో అతని మంచం పక్కన నిలబడి భర్తని లేపినప్పుడు . . . ఇంతసేపూ హాయిగా నిద్రపోతున్న అతన్ని చూస్తే ఆమెకు ఒక విధమైన అభిమానం . . .

ఇంటిపనులన్నీ పూర్తిచేసి కొళాయిముందు నిలబడి ఎటువంటి మడతలు లేని అతని దుస్తులని ఇంకొకసారి ఉతికినప్పుడు వాటిమధ్య తడిసిపోయిన ఒక సిగరెట్టు పేకెట్టు కనిపిస్తే చాలు, తన ఎదుట కనిపించని భర్తని గుర్తుచేసుకొని మధురం నవ్వుతుంది . . . అప్పుడు కూడా ఆమెకి ఎంత ఆహ్లాదం! . . .

ప్రతీరోజూ భర్త ఆఫీసుకు బయలుదేరినప్పుడు అతనికి ఒక రుమాలు అందించి ఇంతకుముందు ఇచ్చిన రుమాలు ఏమైందని అడిగినప్పుడు అతను జడ్డిగా నవ్వుతాడే . . . అది చూసి మధురంకి ఒక విధమైన ఆనందం! . . .

ఇద్దరు పిల్లలకి తండ్రియైన తన భర్తలో ఇటువంటి నిరంకుశ భావం చూసిన తరువాత కూడా మధురం అలసట, విసుగు లేకుండా, ప్రతీ దినం సంతోషం, సంతృప్తితో అతనికి సేవ చేస్తోంది. అందులో ఉన్న రహస్యం ఏమిటి?

ఇద్దరికి తెలిసినది ఏదీ రహస్యం కాదు. అందువలన అది మధురంకే తెలుసు! అవును, అది అతనికి తెలియదేమో? దానిగురించి ప్రజ్ఞ, తలంపు ఉంటే, తన్ను చూసి చూసి మురిసిపోతూ ఆమె చేస్తున్న సేవలన్నీ అంగీకరించి నీటుగా తన ఇష్టం వచ్చినట్టు మెలగడం ఆ భర్తకెలా ఎలా సాధ్యం!

కాని మధురంకి అతని వాలకం ఉపేక్షగా తోచదు. అతను ఎప్పుడూ అలాంటి మనిషే అని ఆమె మనసులో ఉంది. అతని తీరు, మాటలు, చూపు, ధోరణి - అన్నీ భారీగా, గంభీరంగా కనిపించడం వలన అది ఇతరులకి ఉదాసీనతగా కనిపిస్తుందట! అతనిగురించి ఆమెకి బాగా తెలుసట!

“సీతారామన్ చాలా అదృష్టవంతుడు!” అని అతని సహోద్యోగులు చెప్పుకుంటారు; కాని వాళ్ళకి అతని భార్యగురించి ఇవేమీ తెలియవు.

ఆఫీసులో అందరూ అతన్ని ‘హీరో సీతారామన్’ అనే పిలుస్తారు.

అతను వాళ్ళ ఆఫీసు కార్యక్రమాల్లో, నాటకాల్లో, పాల్గొంటాడు, హీరోగానే నటిస్తాడు. ఆ అర్హత తన్ను తప్పిస్తే మరెవరికీ లేదని అతని నమ్మకం; ఆఫీసులోనూ అందరూ అదే అంటున్నారు.

‘హీరో సీతారామన్’ కి అందం ఉంది, అదృష్టం ఉంది; అతనికి తప్పకుండా సినిమాలో ఒక చాన్సు దొరుకుతుందట.

ఆ ఆఫీసులో తను ఒక గుమాస్తాగా పని చేస్తూ తనవలనే ఆ ఆపీసుకి గౌరవం అనే ధోరణితో సీతారామన్ తన జాగాలో కూర్చొనివుంటాడు. ఏ పనీ చెయ్యకుండా నవ్వు, అహంకారంతో అతను ఉబుసుపోకకు కబుర్లు చెప్పుకొనిపోతుంటే అందరూ వింటారు. ఏ పనీ చెయ్యని అతని వెనుక కూర్చొని శ్రమతో రాస్తూ పళ్ళు ఇలికరించే ఇతర గుమాస్తాలకి అది మజాగా ఉంటుంది.

అక్కడ పని చేసే జూనియర్ క్లర్కులు - పెళ్ళికానివారు కూడా - రెండు పిల్లలకి తండ్రి అయిన నలభైయేళ్ళ సీతారామన్ లాగ దుస్తులు ధరించడానికి, సినిమాలు చూడడానికి, ఖర్చులు చెయ్యడానికి తమకి సాధ్యం కాదని అంగలార్చుకొనేవారు.

వాళ్ళకేం తెలుసునా ఇతనిలా ఉండడానికి అసలు కారణం - అతను ఇద్దరు పిల్లలకి తండ్రిగానూ, మధురంలాంటి ఒక స్త్రీకి భర్తగానూ ఉండడం వలనే అని?

వాళ్ళకి తెలియనక్కరలేదు, తెలియకపోయినా ఏ బాధా లేదు. మధురం కోసమైనా అతనికి ఆ అవగాహన లేకపోయినా ఏ బాధా లేదు. కాని తన ఆత్మగౌరవంకి అతనికి ఈ అంతర్బుద్ధి ఉండవద్దూ?

'హీరో సీతారామన్' దృష్టిలో అతని జీవితం, ఉద్యోగం, కుటుంబం, భార్య - ఇవన్నీ చాలా అలక్ష్యంగానే ఉన్నాయి. ఆతనికున్న ఆదర్శమంతా ఒకటే ఒకటి! తనకి సినిమాలో దొరకబోయే ఆ హీరో ఛాన్సు!

అతను ఆఫీసులో జీతం పుచ్చుకొని తన్ను ఒక నవయుగ యువకుడుగా అలంకరించుకొని గభీమని ఒకరోజు రాబోయే ఆ సినిమా ఛాన్సుకి కాచుకున్నట్టు తన జాగాలో కూర్చుంటాడు; చాలామంది జీవితంలో అటువంటి అదృష్టం చోటుచేసుకుందట!

అతని కళ్ళల్లో మరెదైనా సరే - నిత్యమూ - ఒక అలక్ష్య భావనే ప్రకాశించుతుంది.

ఆ కళ్ళు చాలా అందంగా ఉన్నాయని మురిసిపోయి అతని అందం, ఖ్యాతి చూసి పరవశించిన టైపిస్టు కమల ఈ హీరోకి తగిన హీరోయిన్ గా కొన్ని మాసాలముందు జరిగిన ఒక ఆఫీసు నాటకంలో నటించింది.

ఇదిగో, ఇప్పుడు గదిలో అద్దం ముదు నిలబడి అలంకరించుకొనే ఈ హీరోని చూసి మురిసిపోతున్నట్టే ఆ రోజు ఆ నాటకంలో ఆమెతో తన భర్తని చూసి మధురం హర్షించింది.

తన మెడలో వేలాడుతున్న మైనర్ చెయిన్ అందరికీ కనిపించే విధంగా సీతారామన్ సిల్కు జిబ్బా, అందమైన పాదరక్షలని దాచి పొరలుతున్న పంచె మొదలైన భూషణాలతో అద్దం నుంచి కొంచెం వెనక్కి జరిగి తన పూర్తి ఆకారాన్ని చూసుకున్నప్పుడు - ఆ గదిలో, ఒక మూల, పొగ, చెమట కప్పేసిన మొహాన్ని,

తడిసిన చేతులని చీర మొనతో తుడుచుకుంటూ నిలబడిన మధురంని - అద్దంలో గమనించాడు.

అతను తన్ను చూస్తున్నాడని తెలుసుకొని మధురం నిలువుటద్దంలో అతని రూపం చూసి నవ్వింది. నవ్వుతూ అతని దగ్గరకి వచ్చి మాటాడింది. "చూడండి, ఈ నెల నుంచి మీ భోజనంకి నేనొక ఏర్పాటు చెయ్యాలని నిశ్చయించాను. మీరు ఇంటిలో భోజనం చెయ్యమంటే వినరు. ప్రొద్దున్నే టిఫన్ తరువాత ఏవేవో హోటల్లో భోజనం చేస్తే మీ ఒళ్ళు ఏమౌతుంది?" అని ఆమె చెప్తూంటే సీతారామన్ ఆమె మాటలేవీ తను వినలేదనే ధోరణిలో ఆమె పక్క తిరిగి తన ఎదుట నిలబడిన మధురం భుజాలమీద తన రెండు చేతులు ఆనుకొని ఆమెను రెప్పవాల్చకుండా చూసాడు; ఆ చూపులో అరుదుగా ఒక లోతైన ఆలోచన తేలుతున్నట్టనిపించింది.

"ఏమిటలా చూస్తున్నారు?" అని బిడియం ఆవరించుకున్నట్టు మధురం తల వొంచింది.

"నీవేమో అన్నావ్, నేను సరిగ్గా వినలేదు . . . " అని తన మనసులో ఉన్నది చెప్పలేక సీతారామన్ మాటవరుసకి ఏదో అన్నాడు.

"అదేంటి, పెద్ద ఆలోచన? కొత్త నాటకంకి ఏమైనా ఏర్పాట్లు జరుగుతున్నాయా?" అని ఆమె నవ్వుతూ అడిగినప్పుడు, అలా కాదని సీతారామన్ తలూపినప్పుడు అతని నుదుటమీదున్న జుత్తు కదిలే అందం చూసి, ఆహ్లాదంతో మధురం వివరించింది:

"మీరెందుకు హోటల్లో భోంచేసి ఒళ్ళు పాడు చేసుకోవాలని నేనొక వంటమనిషిని ఏర్పాటు చేసాను. ఇక రేపునుంచి సూటిగా మీ ఆఫీసుకే భోజనం వచ్చేస్తుంది. ఏమంటారు? సరేనా?"

తన ఏర్పాటు విని భర్త తన్ను పొగడుతాడని మధురం ఎదురుచూడలేదు. అతను కూడా "దానికేం, అలాగే చెయ్ . . . " అని ఉపేక్షతో చెప్పి మళ్ళీ తనేదో చెప్పడానికి వెనకాడుతున్నట్టు ఆమె భుజాలమీదున్న చేతులు తీయకుండా "మధురం . . . " అని వాత్సల్యంతో పిలిచాడు.

"ఏమిటి కావాలి?" అని ఆమె ప్రేమతో అడిగింది; సీతారామన్ చిరునవ్వు నవ్వాడు.

ఆఫీసుకి వెళ్ళినప్పుడెల్లా తొందర తొందరగా ఈలపాట పాడుతూ, ఆమెను చూడకుండా పరుగెత్తే సీతారామన్ ఇవాళ అరుదుగా తన ఎదుట సంకోచంతో ఎందుకు నిల్చొని ఉన్నాడని తెలియక మధురం కలవరపడింది.

సీతారామన్ మౌనంగా ఆలోచిస్తూ తన సంచి తెరిచాడు. నిన్ననే ఇంటి ఖర్చులకి ఇవ్వవలసిన తన జీతం గరించి అతనికి ఇప్పుడే గుర్తుకి వచ్చింది. ఆ రొక్కం ఆమెకి అందించాడు. ఆమె తీసుకొని లెక్కబెట్టింది: యాభై రూపాయలు!

'ఇదేంటి? ఇంతేనా?' అని అడుగుతున్నట్టు మధురం అతన్ని చూసింది; అతను మళ్ళీ  నవ్వాడు. ఆమె కూడా తృప్తితో నవ్వేసింది.

అంతే! ఆ విషయం తీరిందన్నమాట!

ఇటువంటి భర్త జీతంని నమ్మి కాపురం చెయ్యడమెలా సాధ్యం? . . .

** ** **

మధురం తల్లి తను కన్నుమూసినప్పుడు ఈ ఇల్లు తన కూతురుకి అప్పగించింది. మధురం దాని ముందు భాగం తనకని ఉంచుకొని వెనుకతట్టుని మూడు విభాగాలుగా చేసి అద్దెకి ఇచ్చింది. రెండు ఆవులు కొని అద్దెకున్నవారికి పాలు అమ్మింది.  తన ఇద్దరి పిలల్లని, భర్తని పోషించడానికి తను పడే కష్టాలు గురించి ఆమె లెక్కచెయ్యలేదు, అదే ఆమెకి హాయిగా ఉంది. కాని 'నా భర్తకి వచ్చే 175 రూపాయల జీతం అతనెలా ఖర్చు చేస్తున్నారు?' అని ఆమె మనసులో ఒక ప్రశ్న లేచినప్పుడు 'సరేలే, మగవారికి ఎన్నో ఖర్చులుంటాయి . . . ' అని ఆ చిరునవ్వుతోనే మధురం అన్నీ మరిచిపోతుంది. కాని దాన్ని రవంతైనా భర్తకి ఆమె తెలియజేయకపోవడం పొరబాటు కదా?

"అందుకే నేనంటున్నాను - ఉత్తికే డబ్బు ఖర్చు, ఎందుకు మీరు ఒళ్లు పాడుచేసుకోవాలని . . . మధ్యాహ్న భోజనం హోటల్లో ఆరంభించిన తరువాత మీరు బాగా చిక్కిపోయారు . . . రేపునుంచి నేను వంటమనిషిని ఏర్పాటు చేసేసాను . . . " అని మధురం  పదే పదే ఆ సంగతి గురించి మాటాడుతుంటే సీతారామన్ ఇక ఓర్చలేక కెవ్వుమని అరిచాడు:

“సరేలే, నువ్వు చెప్పినది నేను విన్నాను . . . ఇక నువ్వు పంపించినదే తింటాను . . . ఏ హోటలుకీ వెళ్ళను, సరేనా?” అని కేకలు పెడుతూ అతను ఆఫీసుకి బయలుదేరాడు.

తను చెప్పినది అపార్థంగా తీసుకొని భర్త వెళ్ళడం చూసి - ఆఫీసుకి వెళ్ళే సమయంలో అతనికి కోపం వచ్చిందని - మధురం కలవరపడుతూ నిల్చుంది.

కాని కోపంతో వేగంగా నిష్క్రమించిన సీతారామన్ అరుదుగా - ఆమెకి ఆశ్చర్యం కలిగే విధంగా - ఒక క్షణం ద్వారం దగ్గర నిలబడ్డాడు; ఆ ఒక క్షణంలో నిమ్మళంగా ఆమెను తిరిగిచూసాడు.

మధురంకి కళ్ళంట నీళ్ళు తిరిగాయి; తల వొంచి అలాగే నిల్చోంది.

అతను ఆమెను చేరి, ఆమె భుజాన్ని గట్టిగా పట్టుకొని, ఊపాడు. “మధు, నీకు బాధగా ఉందా?” అని ప్రేమతో అడిగాడు.

మధురంకి ఆశ్చర్యం ఇంకా ఎక్కువైంది.

“నాకెందుకు బాధ?” అని అంటూ తడిసిన కళ్లతో మధురం నవ్వింది. తన భర్త ఏదో నెపం గురించే ఈ నాటకం ఆడుతున్నాడని గ్రహించి ‘ఇతనికి నా దగ్గర ఏమిటి కావాలి?’ అని ఆలోచిస్తూ తన చెయిలోని రూపాయల నోట్లుని చూస్తూ నిలబడింది.

“మధు . . .మధు . . . లోపలికి రా, నీతో ఒక సంగతి మాట్లాడాలి . . . ” అని సీతారామన్ నకిలీ సంతోషంతో ఆమె భుజంమీద చెయివేసి ఆమెతో గదిలోకి తిరిగివచ్చాడు. ఆమెను పిలిచినప్పుడు, గదిలో ప్రవేశించినప్పుడు ఉన్న ఉత్సాహం గభీమని తగ్గిపోవడంతో ఏదో తీవ్రమైన ఆలోచనలో పడి మంచంమీద కూర్చున్నాడు.

“అదేమిటో చెప్పండి” అని మధురం అతని ఎదుట నిలబడినప్పుడు ఆమె చెయిలో ఆ రూపాయల నోట్లు ఉన్నాయి. అదే అతను అడుగుతున్నాడేమో, అడిగితే ఇచ్చేయాలి అని మధురం సిద్ధంగా ఉంది.

“మరేం లేదు . . . నేను బాగా ఆలోచించిన తరువాతే . . . నీకూ ఇది మంచిదే . . . ” అని అంటూ చెప్పవలసిన సంగతి చెప్పలేక అతను బాధ పడుతుంటే మధురం ఒక చిరునవ్వు నవ్వి అతని పక్కన వచ్చి కూర్చుంది.

“ఏంటి ఇలా మీరు మింగుతున్నారు . . . హూం, చెప్పండి, ఏమిటి కావాలి? అని అతని గడ్డంని తనవైపు తిప్పింది. ‘మీరు ఎదడిగినా సరే, ఇస్తాను’ అనే అభయం ఆమె కళ్ళలో మెరిసింది. అప్పుడు కూడా సీతారామన్ మౌనంగా తల వొంచి ఉండడం చూసి “సరే, నాకు ఇంటి పనులు బోలెడు ఉన్నాయి . . .” అంటూ మధురం లేచింది.

“ఉండు . . . ఉండు . . . ” అని ఆమె చెయిని పట్టుకొని, దగ్గరకి లాగి, కౌగిలించుకున్న సీతారామన్ ఆవేశంతో వొంగి ఆమె మొహం చూసాడు.

“మధు, నువ్వు నాకు చెప్పలేదూ - ‘నా సంతోషం, నీ సంతోషం’ అని?” ఆమె చెవిలో అతను గుసగుసలాడినప్పుడు ఆ శ్వాసం ఆమె బుగ్గల్ని వేడిచేసింది.

“ఇప్పుడెందుకు దానిగురించి - మీరు ఆఫీసుకి వెళ్తున్నప్పుడు?” అని మధురం అతని పట్టునుంచి వదలించుకోవాలని ప్రయత్నించింది.

ఆమె మనసులో ‘ఈ మహానుభావుడు ఈ నెల ఖర్చులు కొంచెం ఎక్కువగానే చేసేసారు కాబోలు . . . నాకిచ్చిన డబ్బు మళ్ళీ కావాలని ఈ నాటకమా? ఈ యాభై రూపాయలు లేకపోతే నాకేం నష్టం? అతన్ని చూస్తే నాకు జాలిగా ఉంది . . . ఇతను తన జీతంని పూర్తిగా ఎలాగ ఖర్చు చేస్తున్నారు?’ అని ఆలోచించినా - ఒక మగవాడిని, అందులోనూ తన భర్తని, అతని ఆదాయం గురించి అడగడానికి తనకి అధికారం లేదని, అలాగ అడగడం అనుచితమని ఆమెకి తెలుసు కాబట్టి వేదనతో అతన్ని చూసి నవ్వింది.

అతను ఆమె చెవులుని తన పెదిమలతో తాకుతూ మాట్లాడుతున్నాడు:

“మధు, నువ్వు నాకొక సాయం చెయ్యాలి . . . సాయమంటే అది నాకు మాత్రం చేసే సాయం కాదు . . . అందుకే నిన్ను అడగడానికి నాకెలాగో ఉంది . . . నీకు తెలుసుగా మా ఆఫీసు టైపిస్టు కమల? . . . ” అని అంటూంటే అతని ప్రార్ధన గద్గదస్వరంగా మారిపోయింది.

“ఎవరు? మీ హీరోయిన్ కమలావా?” అని మధురం ఎగతాళిగా అడిగింది.

‘ . . . హూం, ఇతను చేసే ఖర్చులు చాలక ఆమెకి కూడా అప్పు ఇస్తున్నారు కాబోలు, ఎవరికి తెలుసు?’ అని మధురం మనసులో సణుగ్గుంది. ‘మీ హీరోయిన్ కమలావా?’ అని తను అడిగిన ప్రశ్నకి అతని జవాబు ఎదురుచూసింది.

ఆ రోజు - నాటకం ముగిసి - ఇంటికి వచ్చినప్పుడు "మన హీరోయిన్ ఎలాగుంది?" అని అతను మధురంని అడిగినప్పుడు -

"మీరేమంటున్నారు - 'మన హీరోయిన్' అంటే ఎవరు?" అని మధురం నకిలీ కోపంతో మొహం ముడుచుకున్నప్పుడు -

"మధు . . . విను, నాటకంలో మాత్రం ఆమె నాకు హీరోయిన్ . . . కాని నా జీవితంలో నిజమైన హీరోయిన్  నువ్వే కదా?" అని ఆ జవాబునే మధురం మళ్ళీ ఎదురుచూసి ఆ ప్రశ్న అడిగింది.

కాని సీతారామన్ జవాబు ఇవ్వకుండా ఏదో ఆలోచిస్తూ తల వొంచి "అవును, ఆ కమల గురించే చెప్తున్నాను . . . ఆమె ఇవాళ మధ్యాహ్నం నిన్ను చూడడానికి ఇక్కడికి వస్తుంది . . .  నువ్వే ఆమె అడిగిన సాయం చెయ్యాలి . . . నాకోసం చేస్తావా? ఆమెకి నువ్వంటే చాలా నమ్మకం . . . దానికి తగినట్టుగా నువ్వు ఏం చెప్పినా చేస్తుంది . . . పాపం, ఆమెకి మరెవరూ లేరు . . . "  అని అతను ఆ కమలగురించి అంత సానుభూతితో మాట్లాడడం చూసి మధురంకి చికాకు కలిగింది.

"సరేలేండి, ఆమె రానీ . . . మీకూ ఆలస్యం అవుతోంది" అని మధురం సంభాషణ మార్చింది.

"సరే, నేను వస్తాను" అని సీతారామన్ ఇష్టం లేక వెళ్తున్నట్టు నిష్క్రమించాడు.

మధురంకి ఏమీ బోధపడలేదు. ఆమె మనసులో ఆ రోజు సీతారామన్ హీరోయిన్ గా నటించిన కమల  పసి మొహం కనిపించింది. 'ఇతనెందుకు ఆమెకి అప్పు ఇవ్వాలి?' అనే అనుమానం లేవగానే, "ఛీ, ఛీ, నేనెందుకు ఒక అమ్మాయిగురించి ఇలాగ తప్పుగా ఆలోచిస్తున్నాను?' అని మధురం తన్ను తానే నిందించుకుంది.

అదే ఆమె స్వభావం. తన భర్త గురించి, ఇంటి ప్రశ్నల గురించి, పిల్లల అల్లరిగురించి - వీటన్నిటికీ ఒక విధంగా సమాధానం వెతకడం ఆమెకి బాగా తెలుసు.

లేకపోతే ఇటువంటి జ్ఞాపకాల్లో ఆమె చిక్కుకుంటే ఎలాగ? ఇంకా ఒక గంటలో ఆమె ఇద్దరు పిల్లలు బడినుంచి ఆకలితో వచ్చేస్తారు . . .

సబ్బు పొడరుతో నానబెట్టిన - భర్త, పిల్లల దుస్తులు - ఉతకాలి . . .

వంటగదిలో బియ్యం ఉడుకుతోంది . . .

ఆవులకి మేత చేర్చిబెట్టాలి . . .

'అబ్బా, ఎన్ని పనులున్నాయి!' అనే దిగులు, అవన్నీ చెయ్యాలనే ఆకాంక్ష ఆమెకు వచ్చాయి.  అంతే, ఆ క్షణం ఆమె తక్కినవన్నీ మరిచిపోయింది. మొట్టమొదటి పనిగా భర్త అలాగే పడేసిన shaving set ని తీసుకొని బాత్ రూమ్ కి నడిచింది.

** ** **

మధ్యాహ్నం రెండు గంటల తరువాతనే మధురంకి కొంచెం విశ్రాంతి. ఆ ఒక గంటకి తక్కువ అవకాశంలో హాలు మధ్య, వెనుకతట్టుకి వెళ్ళే ద్వారంకి తిన్నగా పిల్లగాలి వచ్చే గడపలో నేల చీరని పరిచి మధురం నిద్రపోతుంది. ఇక నిద్ర చాలని కొంత సేపట్లో లేచి, మొహం కడుక్కొని వచ్చి, జడ అల్లుకోడానికి కూర్చుంటుంది. ఆ సమయం తప్పితే మళ్ళీ తల దువ్వుకోడానికి ఆమెకి వీలవదు. అందుకని సరేలే అని ఊరుకుంటే ఎలాగ? అతను వచ్చినప్పుడు తను కొంచెం సొగసుగా కనిపించవద్దూ? అందుకే మధ్యాహ్నం మూడు గంటలకి మధురం తన అలంకరణ పూర్తి చేసుకుంటుంది.

అంటే . . . అతని రాకని మధురం మూడు గంటలనుంచే ఎదురు చూస్తుందని కాదు. నాలుగు గంటలకి పువ్వులు అమ్మేవాడు వస్తాడు. అది వాడుక! రెండు అమ్మాయిలు ఉన్నారుగా? వాళ్ళని కలుపుకొని మధురం పువ్వులు కొంటుంది. వాళ్ళకోసమే తను పువ్వులు కొంటున్నట్టు చెప్పుకుంటుంది, కాని అదేం అంత నిజం కాదు.

సాయంకాలం ఆమె అనేక సార్లు  ఇంటి ముందుకు వచ్చి నిలబడి వీధిని చూస్తూ తిరిగి వెళ్తుంది. అతను ఉదయం  అలంకరించుకున్నప్పుడు మధురం చింపిరి జుత్తుతో, మురికి బట్టలతో ఉంటుంది. 'ఇదేనా ఆమె?' అని ఇంట్లోకి ప్రవేశించగానే ఒక క్షణంలో అతను నిలబడి చూడవద్దూ?

కాని చాలా సార్లు ఆమెను అతను గమనించకుండానే వెళ్తాడు; ఆమె అతని ఉపేక్షని లెక్కచెయ్యదు. కొన్ని సమయాల్లో అతను ఆమె సింగారం చూసి నవ్వుతాడు; ఆ ఎగతాళి ఆమెకి అర్థం కాదు.

** ** **

మధ్యాహ్నం మూడుగంటలకి హాలులో గోడమీద అద్దంని ఆనుకుంటూ మధురం జడ అల్లుకున్నప్పుడు, వాడుకగా తల ముందు భాగంలో కనిపించే ఆ నెరసిన వెండ్రుకని చూసుకుంది. అక్కడ తైలం పూసుకొని దువ్వుకుంటే ఆ నెరసిన జుత్తు ఇక మరి కనిపించడంలేదే!

మధురం తైలం పూసుకున్నప్పుడే ఆ కమల వచ్చింది. ఆ హీరోయిన్ కమల తన నెరసిన వెండ్రుకని చూడకూడదనే తొందరలో మధురం దువ్వెనని తీసుకొని గబగబమని లోపలికి పరుగెత్తుకొని వెళ్ళి గదిలోని నిలువుటద్దం ముందు నిలబడి దువ్వుకున్నప్పుడు తనకు తానే అడుక్కుంది: 'ఏం, ఎందుకు? ఆమె చూస్తే ఏంపోయింది? ఆమె నా నెరసిన వెండ్రుక చూడకూడదని నాకెందుకు ఇంత ఆతురత?'

అంటే . . .

ఆ హీరోకి తగినట్టు హీరోయిన్ గా నటించే ఆ కమలకి , ఆ హీరో తన జీవితంలో ఇలాంటి అనుచితమైన హీరోయిన్ తో కాపురం చేస్తున్నాడని తెలియకూడదు అనే బెంగ కారణమా?

కమల ఇంటిలోకి ప్రవేశించింది.

"రామ్మా . . . అవాళ నాటకంలో నిన్ను చూసాను, అంతే . . . మా ఇంటికి రాకూడదా? ఇదిగో, కూర్చో, వస్తాను . . . " అని అంటూ తన తల ముందు భాగం ఉన్న జుత్తుని దువ్వెనతో మూడు సార్లు బాగా నొక్కుకుంటూ, మధురం స్నేహభావంతో ఆమెకు స్వాగతం చెప్పింది.

"నిలబడతావేం, కూర్చో!" అని ముందు గదిలో ఉన్న రెండు సోఫాలలో ఒకటి చూపి, మధురం తనూ ఒక సోఫాలో కూర్చుంది.

ఎవరైనా కొత్తగా ఇంటికి వచ్చారంటే మధురం అక్కడే వాళ్ళని కూర్చోబెట్టి మాటాడుతుంది.

ఆమె ఎదుట కూర్చున్న కమల చుట్టుపక్కలని చూసి "పిల్లలు కనిపించరేం?" అని అడిగింది.

"స్కూల్ నుంచి ఇంకా రాలేదు."

"ఓ, చిన్నమ్మాయి కూడా వెళ్తోందా స్కూలుకి?"

"అవును. దాన్ని ఇప్పుడే చేర్చాను. ఒక రోజు వెళ్తుంది, ఇంకొక రోజు 'వెళ్ళను' అని హఠం చేస్తుంది!" అని చెప్పి మధురం నవ్వింది. అది విని కమలకూడా నవ్వింది. ఆ తరువాత ఒక క్షణం ఇక ఏం మాట్లాడాలో తెలియక మధురం తన రెండవ కూతురుగురించి మాటాడింది. "స్కూలుకి వెళ్ళకపోతే అది ఇంటిలో చేసే అల్లరి ఇలా అలా కాదమ్మా . . . పెద్ద పిల్ల చాలా సాధువు. ఇదోమో ఇలాగుంది. అసలు బట్టలే వద్దంటుంది. స్కూలునుంచి రాగానే గౌనును ఒక పక్క, జట్టిని మరొక పక్క పీకి పారేసి ఇల్లంతా కేకలు పెడుతూ తిరుగుతుంది . . . నేనూ దాన్ని కొట్టాను, బాదాను . . . వింటేనా?" అని నవ్వుతూ వివరించింది.

"అవును మరి, పిల్లలంటే అలాగే . . . " అని అంటూ కమల తన చెయిలోని సంచినుంచి ఒక బిస్కట్టు డబ్బా, రెండు పెద్ద చాకలెట్ పేకెట్లు తీసి సోఫామీద పెట్టింది.

'అప్పు అడగడానికి వచ్చినది ఇవన్నీ ఎందుకు కొనితేవాలి?' అని మధురం ఆలోచించింది.

'మొట్టమొదటిసారిగా ఒకరింటికి వెళ్ళినప్పుడు వట్టి చేతులుతో వెళ్తే ఎలాగ?' అనే ఆలోచనతో తన స్వభావంకి తగినట్టు నిత్యమూ సమాదానం వెతికే మధురం "ఇవన్నీ ఎందుకమ్మా?" అని అడిగింది.

"అదేంటి అక్కయ్యా - నేనేవరో గెస్టులాగ మీరు మాటాడుతున్నారే?" అని అధికార భావంతో కమల మధురంని చూసింది.

మధురం కృతజ్ఞతతో, చిరునవ్వు నవ్వుతూ కమలని, ఆమె అలంకరణ - చీర, శిఖ, నగలు, ఇవన్నీ - పరిశీలించి చూసింది. మధ్య ఒక సారి లేచి వంటగదికి వెళ్ళి కాఫీకి పొయ్యి వెలిగించి మళ్ళీ ముదు గదికి వచ్చి కూర్చుంది.

ఇంత సేపైన తరువాత కమల తను వచ్చిన కారణం గురించి మాట్లాడలేదని మధురం తనే సంభాషణ ఆరంభించింది,

"అతను ఉదయం నాకు చెప్పి వెళ్ళారు . . . " అని మధురం అనగానే కమల మొహంలో దిగులు చోటుచేసుకుంది. "అతను ఏమిటి చెప్పి వెళ్ళారు?" అని అడిగింది.

"మరేం లేదు, నువ్వు వస్తావని చెప్పారు . . . ఆ తరువాత నీకెవరూ లేరని చెప్పారు . . . నేనతన్ని అడగాలని అనుకున్నాను, కాని అప్పుడు సమయం

దొరకలేదు . . . సరే, పోనీ . . . ఇప్పుడు నువ్వు ఎక్కడ ఉన్నావ్? ఏది నీ సొంత ఊరు? తల్లిదండ్రులు లేకపోయీనా బంధువులెవరైనా ఉంటారుకదా?"

కమల మధురం ప్రశ్నలకి వెంటనే జవాబు ఇవ్వలేదు. ఒక నిమిషం మౌనంగా తల వొంచి కూర్చుంది; వొంచిన తల ఇంకా ఇంకా వొంగింది; మెడలోని ఎముకలు బెణికాయి; చెవుల మొన ఎర్రబోయింది.

ఆమె తలెత్తి చూసినప్పుడు తడిసిపోయిన కమల కన్నులు చూసి మధురం అదిరిపడింది.

తనేదో పొరబాటుగా అడిగేసిన భయంతో మధురం ఆమెను చేరుకొని "ఎందుకమ్మా ఏడుస్తావ్?" అని చింతతో అడిగింది.

"మీరు నా తోబుట్టిన అక్కయ్య అనే అభిమానంతో నేను మిమ్మల్ని చూడడానికి వచ్చాను . . . " అని గద్గదస్వరంలో చెప్పిన తరువాత మరేం మాట రాకుండా కమల కింద పెదిమని కఱచుకుంది.

"కన్నవాళ్ళని బాల్యంలోనే పోగొట్టుకొని మామయ్య ఇంటిలో ఎన్నో కష్టాలు అనుభవించాను. ఆఖరికి ఎలాగో చదువు ముగించి ఒక పనిలో చేరి ఆ నరకంనుంచి తప్పించుకున్నాను . . . ఒక హాస్టలలో ఉంటూ - అనాధగా, ఒంటరిగా, ఇంకా ఎన్ని రోజులు ఈ బతుకు?" అని ఎర్ర ముక్కు వొణుకుతూ ఆమె అడిగినప్పుడు మధురంకి ఆమె శోకం బోధపడింది.

"ఏం, ఎందుకు? ఒక పెళ్ళి చేసుకొని నువ్వు హాయిగా ఉండలేకపోయావా? నీకేం తక్కువ? నాలాగ ఉన్నవాళ్ళు చెప్తే అందులో న్యాయముందనిపిస్తుంది . . . నీకెందుకు విచారం?" అని మధురం ధైర్యం ఇచ్చింది.

కమల ఒక నిట్టూర్పు వదిలింది.

"అవన్నీ బంధువులు, బాధ్యత గల పెద్దలు ఉంటేనే జరుగుతాయి, నాకలాగ ఎవరూ లేరే? . . . సరే, నా ఇరవై ఆరు సంవత్సరాల జీవితంలో అందుకు నాకు ప్రాప్తం లేదని తెలుసుకున్నాను, ఇలాగే నా జీవితం గడిపేయాలని నిశ్చయించాను. ఎటువంటి ఆసరా లేని నాకు అన్ని విధాలా సాయం చెయ్యడానికి మా ఆఫీసులో ఉండేది ఇతనే -

మిస్టర్ సీతారామన్ -మరెవరూ లేరు . . . ” అని ఆమె చెప్పి ఆగగానే ఇద్దరూ ఒకరినొకరు బాగా చూసుకున్నారు.

గభీమని మధురం మనసులో ఒక విపరీతమైన ఆలోచన లేచింది! అది బయటకి రవంతైనా కనిపించలేదు. పైకి కనిపించని, ఎటువంటి చలనం చూపని అది ఆమెను ఒక క్షణం రిమ్మెత్తింపజేసి కమలని ఆరసించే విధంగా చూడనిచ్చింది. తను చెప్పవలసిన సంగతి చెప్పకుండానే మధురం అది గ్రహించిందని కలతతో కమల ఆమెను రెప్పవాల్చకుండా చూసింది.

‘ఆమె సమ్మతించకపోతే? తన్ను తిట్టి తరుముతే? తన పరువు పాడు చెయ్యాలని ఊరులో అందరినీ పిలిచి న్యాయం అడుగుతే?’ క్రమేణ ఈ ఆలోచనలు ఒకటి తరువాత ఒకటి తోచగానే, గభీమని కమల ఏడుస్తూ తన మొహం కప్పుకుంది.

‘నువ్వెందుకు ఏడుస్తున్నావ్?’ అని మధురం అడగలేదు. కమల మధురంని చేరుకొని ఆమె చెయిలో తన మొహం ఒత్తుకున్నప్పుడు మధురం అలాగే నిల్చుంది.

కమల మధురం చేతులు గట్టిగా పట్టుకొని, ఏడుస్తూ, స్పష్టంగా చెప్పేసింది: “అక్కయ్యా, నాకు మీ జీవితంలో వాటా కావాలని అడుగుతున్నాను.”

ఏడ్పు అనే ఆయుధం ధరించి ఆ ఖడ్గంని తటాలున మధురం గుండెలో కమల లోతుగా పాతేసింది.

“ఈ అనాధకి మీరే దారి చూపాలి. నా పరువు, ప్రతిష్ట మీ చెయిలో ఉన్నాయి. మీకు నేను చేసిన ద్రోహం క్షమించాలి. మీ బిడ్డ పేరు, నా కడుపులో ఉన్న బిడ్డ పేరా, అక్కయ్యా?”

దిగగొట్టిన ఖడ్గంని తీసి మళ్ళీ ఆమె దూర్చినప్పుడు మధురం తన మనోబలంని పూర్తిగా కూడబెట్టుకొని, పళ్ళు కొఱుకుతూ, కన్నులు మూసుకొని భరించింది.

“మీ కృతజ్ఞత నేను బతికివున్నంతవరకూ మరిచిపోను . . . మీకూ, మన కుటుంబంకి . . . ” అని ఆమె చెప్తూ పోతుంటే మధురం జోక్యం చేసుకొని ఆమెని ఆపి నిమ్మళంగా గొణుక్కుంది:

"చాలు, కమలా, చాలు! . . . అయ్యో, ఇది నేను భరించలేను! . . . " అని గాయపడినట్టు సోఫాలో వాలి మధురం తలని ఇలా అలా తిప్పుతూ బాధపడింది. అర్ధగంటవరకూ ఆమె లేవలేదు; కళ్ళు విప్పలేదు.

తను చెప్పవలసినదేదో చెప్పడమైంది. ఇక మధురం ఆమోదం ఎదురుచూస్తూ కమల మనసులో దిగిలుతోనూ, బయట ఒక విభ్రాంతితోనూ కూర్చుంది.

మదురం పరిస్థితి చూసి కమల మనసులో భయమూ, విచారమూ చోటుచేసుకున్నాయి. తను ఎదురుచూసినట్టు మధురం కోపించుకొని తన్ను దూషించలేదు, శపించలేదు. ఇంత మంచి హృదయంని నలగగొట్టినందుకు కమల అపరాధ భావంతో వెక్కి వెక్కి ఏడ్చింది.

చాలా సేపు మౌనంగా ఏడ్చిన తరువాత కమల మధురం దగ్గరకి వచ్చి "అక్కయ్యా . . . అక్కయ్యా . . . " అని ఏడుస్తూపే పురిగొల్పింది.

ఏమీ జరగనట్టు మధురం స్పష్టమైన మొహంతో, దృఢ నిర్ణయంతో లేచి నిక్కబొడుచుకొని సోఫాలో కూర్చుంది; ఆమె రెండు కన్నులూ తామర రేకుల్లాగ ఎఱ్ఱబారిపోయాయి.

"నువ్వెందుకమ్మా ఏడుస్తావ్? ధైర్యంగా ఉండు . . . " అని చెప్పి మధురం తన గదికి వెళ్ళింది; ఆమెకు ఎందుకో ఏకాంతం కావాలనిపించింది. గదిలోని మంచంని, పక్కనే ఉన్న భర్త బట్టలని తేఱిపార చూసింది.

ఆమె తన రెండు చేతులూ వెనక కట్టుకొని గదిలో ఇలాగ అలాగ సంచరించడం కమల హాలునుంచి గమనిస్తూవుంది.

మధురం నిలువుటద్దం ముందు నిల్చుంది. ఆమె భర్త తన్ను అలంకరించుకుంటాడే అదే జాగాలో నిలబడి తన్ను చూసుకుంది. తొందర తొందరగా ఆమె దువ్వుకున్న తలలో ముందున్న నెరసిన వెంఢ్రుకలు ఇప్పుడు స్పష్టంగా కనిపించాయి. ఆమె మొహం నల్లబారిపోయింది; తను బలిసిపోయినట్టు, వయసుకి మించిన ఆకారంని చూస్తున్నట్టనిపించింది.

'అతనెలా ఉన్నారు? ఆ రోజు చూసినట్టే . . . ' అని ఆలోచిస్తూ మధురం హాలులో ఉన్న కమలని చూసింది.

'ఈమె అతనికి తగిన చెలికత్తె . . .  నేను ముసలిదానిగా ఐపోయాను . . . కాని, అదెలా సాధ్యం? అతనికంటే చిన్నదైన నేనెందుకు ఇలా అతనికంటే వయస్సులో పైబడినట్టు కనిపిస్తున్నాను? అవును, నా ముసలితనం వయస్సువలన కాదు, అది నా తెలివితక్కువతనం వలన . . . అజ్ఞానంతో బుద్ధి లేక . . . ' చిరచిరలాడుతూ మధురం పళ్ళు పటపటమని కొరుక్కుంది.

జీవితమంతా అతని జ్ఞాపకంలో ఆమె తన్ను మరిచిపోయింది. అతను తన్ను అలంకరించుకొని యౌవనంలో మునిగి ఆనందించడం చూసినప్పుడెల్లా తన్ను ఆవరించుకున్న  ముసిలితనంని ఆమె గ్రహించలేకపోయింది.

ఇప్పడే ఆమె అవన్నీ ఆలోచించి చూసింది. ఆమె మనసుని ఇప్పుడు  హింసించే బాధ తన భర్తని ఇంకొక స్త్రీ అపహరించందని కాదు. 'నేను ఎంత జడ్డిగా, ఒక అబద్ధంని నమ్ముకొని నా జీవితంలో మధురమైన వేళలన్నీ పాడుచేసుకొని మోసం పోయాను!' అనే కటువైన సత్యం ఆమెకి ఇప్పుడు కొట్టవచ్చినట్టనిపించింది; అలాగే దిగ్భ్రాంతితో నిల్చుంది.

ఆమె నిట్టూర్పు వదలింది. చెప్పడానికి మరేముంది? కాని ఆమె మాటాడింది:

'కుటుంబ భారమంతా నేనే మోసాను, మరి జుత్తు నెరసక ఉంటుందా ఏమిటి? అతనిలాగ నేను ఏ చింతా లేకుండా ఉన్నానా? అన్నీ నేనే చూసుకున్నతరువాత అతను ఎప్పుడూ హీరోగానే రాణించారంటే అందులో ఆశ్చర్యమేముంది? నాకు నాగురించి ఏ గుర్తూ లేదు, అతని జ్ఞాపకం చాలు . . . కాని అతనికి? నేను మాత్రం చాలా? ఇది ఎంత పెద్ద మోసం! ఎంత పెద్ద దోపిడీ! నా జీవితంని తలచుకుంటే నాకు రోతగా ఉంది . . . ఛీ, ఛీ, ఇక అతని మొహం చూసే పాపంకూడా నాకు వొద్దు! ఆ పాడు కల అయిపోయినట్టే!" అని నోటిమాటగా మూలుగుతూవుంది.

ఆమె హాలుకు వచ్చి కమల ఎదుట కూర్చొని, ఆమెను దయతో చూస్తూ మాటాడింది.

"కమలా, నీ తలరాతకి నేనేం చెయ్యగలను? . . . నువ్వు నా జీవితంలో వాటా కావాలంటున్నావ్  . . . అసలు, నేనేం జీవించాను, చెప్పు? నేను చేతులెత్తి నిన్ను ప్రార్థిస్తున్నాను . . . దయచేసి నా జీవితంని పూర్తిగా తీసుకో . . . నేను పదిహేను

సంవత్సరాలు అతనితో జీవించాను, దానికి ఫలం పూజ్యం అని నాకు ఇప్పుడే తెలిసింది . . . అబ్బా, నేను పడిన బాధలు ఎన్ని! నరే, పోనీ, నువ్వు వెళ్ళి ఇక అతనికి ఈ ఇంటిలో జాగా లేదని చెప్పేయ్ . . . ఇక అతని మొహం చూస్తే నేను కేకలు పెట్టి చచ్చిపోతాను! . . . ద్రోహం అనుభవించడం కూడా అంత కష్టమైన పని కాదమ్మా, కాని ద్రోహి నవ్వు చూడడం మహా ఘోరం! విను, నేనూ, నా పిల్లలు ఎవరి దయా ఎదురుచూసి జీవించలేదని తెలుసుకో. ఈ పదిహేను సంవత్సరాలూ అతనిమీదున్న నమ్మకంవలన నేను జీవించానేమో, కాని అతన్ని నమ్మి ఇక్కడ ఎవరూ జీవించలేదు, అది అసాధ్యం . . . అతనలాటి మనిషి . . . సరే, వెళ్ళు! అతన్ని ఇక్కడ రావొద్దని చెప్పేయ్ . . . నీ తలరాతకి నేనేం చెయ్యగలను? ఈ హీరోయిన్ కథ ఐపోయింది . . . ఇప్పుడు అతనికి ఇంకొక హీరోయిన్ కావాలి, అవునా?" అని అడుగుతూ మధురం లేచింది.

ఆమె మాటల్లో ఉన్న స్పష్టత, నిశ్చలత గమనించి - ఆమె చెప్పేది వట్టి భావావేశం వలన కాదని - కమలకి బోధపడింది. కమల తల వొంచి, చెయిలోని గోర్లు పీకుతూ కూర్చుంది. లేచిన మధురం దయతో కమలని చూసింది.

'మీరు నా తోబుట్టువు లాగ . . . ఈ అనాథకి దారి చూపండి . . . ' అని కొంచెం సేపు ముందు కమల బతిమాలిన మాటలు మధురం గుర్తుచేసుకుంది.

"కమలా, నన్ను అక్కయ్యగా భావించి నీకు దారి చూపమన్నావ్ . . . నేనేం చెయ్యగలను? అప్పుడు మా అమ్మ ఉండేది. నేను ఇతన్నే పెళ్ళిచేసుకుంటానని హఠం చేసాను . . . మా అమ్మ నాకెన్నో బోధనలు చేసింది, నేను వినలేదమ్మా!" అని మధురం తన తల్లిని తలుచుకుంది.

"ఇలాగేదో జరుగుతుందని తెలిసే కాబోలు మా అమ్మ తన సొంత ఇల్లుని మరెవరికీ ఇవ్వకుండా నాకు ఇచ్చింది. కమలా, నాకూ, నా పిల్లలకీ తిండి పెట్టేది ఈ ఇల్లే - ఈ ఇల్లూ, రెండు ఆవులు . . . ఆ ఆవులమీద చూపవలసిన అభిమానంని, ఈ ఇంటిమీద చూపవలసిన భక్తిని - ఇన్ని సంవత్సరాలు - నేను దుర్వినియోగం చేసాను . . . " అని తనకు తానే మాట్లాడుకున్నట్టు కనిపించిన మధురం గభీమని చిరచిరలాడుతూ గర్జించింది: "ఇది నా ఇల్లు! ఈ గడపని ఎవరూ దాటకూడదు!"

ఆమె అరుపు, ఆకారం చూసి కమల అదిరిపడింది.

తను ఇంకా అక్కడ నిలబడితే కమల ప్రత్యక్షంలో, కోపంతో, తన అంతరంగ భావనలు ఒలకబోయడం సాధ్యం అనే భయంతో మధురం లేచి, తన గదికి వెళ్ళి తలుపు మూసుకుంది.

మూసిన ఆ తలుపుని కమల రెప్పవాల్చకుండా చూసింది; తన మొహం చేతులతో కప్పుకొని వెక్కి వెక్కి ఏడ్చింది.

ఆమె ఎందుకు ఏడ్చింది? తన తలరాత గురించా?

'ఈ హీరోయిన్ కథ ఐపోయింది . . . ఇప్పుడు అతనికి ఇంకొక హీరోయిన్ కావాలి . . . ' అని వైరాగ్యంతో అతన్ని నిరాకరించిన మధురంని కమల గుర్తుచేసుకుంది.

'అబ్బా, స్త్రీ అంటే ఇలాగ ఉండాలి!' అని ఆమెను కమల మనసార పొగడింది.

తనలాగ మధురం చదువుకోలేదు; తనలాగ ఎక్కడికి వెళ్ళినా ఒక టైప్ రైటర్ ముందుకూర్చుంటే నెలకి 175 రూపాయలు ఖాయం అనే అభయం ఆమెకు లేదని గ్రహించిన తరువాతే కమలకి తనూ అనాధ కాదు, తనకీ ఎవరినీ బతిమాలవలసిన అగత్యం లేదనే నమ్మకం కలిగింది.

'నా జీవితం ఇంకా పాడైపోవాలా?' అనే ప్రశ్నకి జవాబుగా అతని ఆకారం ఆమె మనసులో లేచింది; ఆ కళ్ళలో కనిపించే ఉదాసీనత ఇప్పుడు ఆమెకి బోధపడింది.

'ఇంత మంచి భార్యని, ఆమె సేవ, ఆమె ప్రేమ, ఆమె ఔదార్యం - ఇవన్నీ అనుభవించిన తరువాత - అతను ఎంత పని చేసాడు!' అని ఒక మూడవ మనిషిలాగ ఆలోచించగానే గభీమని ఆమెకు అతనిమీద ద్వేషం కలిగింది.

ఆ ద్వేషం విషంలాగ పెరిగింది.

అవును. అతన్ని ప్రేమించడానికి ప్రత్యేకంగా కమలకి ఎటువంటి కారణమూ లేదు. అదొక బలహీనత. ఆలోచించి చూస్తే అతన్ని అసహ్యిచుకోడానికి - ఇటీవల, కొన్ని నెలల్లో - వెయ్యి కారణాలున్నాయని కమల గుర్తుచేసుకుంది.

మధురం చెప్పలేదూ - 'ఇది ఎంత పెద్ద మోసం! ఎంత పెద్ద దోపిడీ! నా జీవితంని తలచుకుంటే నాకు రోతగా ఉంది . . .' అని? ఆ మాటల్లోని గాఢత్వం, అర్థం గ్రహించి, ఆలోచించిచూస్తే కమలకీ తన కళ్ళు తెరచినట్టనిపించింది.

కమల తలెత్తి కూర్చుంది; ఆమె కన్నులలో ఉదాసీనత ప్రకాశించింది.

'రెండు పిల్లల తల్లికి లేని దిగులు నాకూ, ఇంకా పుట్టని నా శిశువుకి వచ్చేస్తుందా? అలాగేమైనా జరిగితే ఇతనేం దాన్ని భరించి ఆపుతారా, ఏమిటి? సరేలే, ఈ రెండవ హీరోయిన్ కధ కూడా అయిపోయినట్టే . . . ' అని గొణుక్కుంటూ కమల handbag నుంచి కాగితం, కలం తీసి, దృఢమైన మనసుతో, పెదిమలు కఱచుతూ ఉత్తరం రాయడం ఆరంభించింది.

** ** **

రాత్రి ఏడుగంటలవరకూ ఆ పార్కులో సీతారామన్ కమలకోసం కాచుకొని ఉన్నాడు. ఆరు గంటలకి శుభవార్తతో తన్ను చూడడానికి వస్తానని చెప్పిన కమల ఇంకా రాలేదని అతను గాభరా పడలేదు. జీవితంలో తనకి విజయం తప్పిస్తే మరేదీ లేదనే జడ్డి నమ్మకం అతనికి ఉండడం వలన ఇప్పుడుకూడా అతను పూర్ణ నమ్మకంతో ఉన్నాడు.

'ఆర్జించడానికి ఒక భార్య, సేవ చెయ్యడానికి మరొక భార్య' అనే తన స్వార్థం యీడేరుతుందని ఆహ్లాదంతో అతను వాడుకగా ఈలపాట పాడుతూ రాత్రి ఎనిమిది గంటలకి ఇంటికి వచ్చి చేరాడు; ఇద్దరు స్త్రీలు తనకి వేడుకగా స్వాగతం చెప్తారని అతనికి కుతూహలం.

అతను ఇంటి ముందు గదిలో ప్రవేశించినప్పుడు కమల కనిపించలేదు; మధురమూ లేదు. ఇద్దరు అమ్మాయిలు మాత్రం ఉన్నారు. పెద్దమ్మాయి ఉమా సోఫాలో కూర్చొని పాఠం చదువుతోంది. చిన్న అమ్మాయి లతా వివస్త్రగా సోఫా వెనక నిల్చొని ఉమా జడని లాగుతూ అల్లరి చేస్తోంది.

ఆ సోఫా మీద ఒక బిస్కట్టు డబ్బా తెరచి ఉంది; బిస్కట్లు చెల్లాచెదరి ఉన్నాయి.

సీతారామన్ ఇంట్లోకి ప్రవేశించగానే వంటగదిని తటాలున మూసే ధ్వని అతనికి గుండెలో ఎవరో తన్నినట్టు అనిపించింది.

అతను వంటగదివైపు నడిచాడు.

మూసిన తలుపుని తట్టి “మధూ . . . మధూ . . . ” అని పిలిచాడు.

లోపల, తలుపుమీద ఆనుకొని మధురం నిల్చొని ఉందని తెలిసింది.

ఆమె మాటలు స్పష్టంగా వినిపించాయి.

"నువ్వుగాని మగవాడైతే, పరువు గల మనిషి అంటే - నా ఇంట్లోకి ప్రవేశించ కూడదు! ఇక్కడ మీకు జాగా లేదు!"

"మధు, తలుపు తీయ్! నా మాట విను . . . " అని ఏడుస్తున్నట్టు సీతారామన్ బతిమాలాడు.

"తలుపు తీయను! మీ మొహం చూస్తే . . . అయ్యో, వొద్దు, మొగుడు మొహంలో ఉమ్మిన భార్య అనే అపకీర్తి నాకు వొద్దు!"

సీతారమన్కి చెంపమీద వాయించినట్టనిపించింది. మొహమంతా చెమట పట్టేసింది. జీవితంలో మొట్టమొదటిసారిగా ఒక ముఖ్యమైన విపరీతం అతను అనుభవించాడు.

అతనికి కోపమూ వచ్చింది.

"ఏమే, ఏమంటున్నావ్? నేను వెళ్ళనంటే ఏం చేస్తావ్?"

గాజు పాత్రలు బద్దలైనట్టు లోపలనుంచి మధురం బిగ్గరగా నవ్వింది. ఆ తరువాత - నవ్వుతూనే - చెప్పింది: "మంచిది. ఇక్కడే ఉండండి. ఈ రెండు పిల్లలకి - ఒకటి తండ్రి, లేకపోతే తల్లి కావాలి . . . మీరే ఉండండి . . . " అని ఆమె అంటూంటే వంటగదిలో ఉన్న బట్టల తాడుని బలంగా ఈడ్చే ధ్వని సీతారామన్ చెవులకి వినిపించింది.

అతనికి చేతులూ, కాళ్ళూ వొణికాయి. X-ray పఠం లాగ మూసిన తలుపు వెనుక జరిగేది అతని కళ్ళకి తెలిసింది. తన్ను చూసిన ప్రతీ క్షణమూ మధురం కంఠం బిగించుకుంటుందని తెలుసుకొని అతను హోరున ఏడ్చాడు.

"మధురం, నేను వెళ్తాను, ఇదిగో వెళ్తున్నాను . . . " అని తలుపుమీద రెండు సార్లు బాదుతూ సీతారామన్ అరిచాడు.

"వెళ్ళు!" అని ఏక వచనంలో చెప్పి చెయిలో ఉన్నతాడుని మధురం మూసిన తలుపుమీద కొట్టినప్పుడు అతనికి ఆమె ఆవేశం, ద్వేషం బోధపడింది.

'నేను చస్తాను అని అనగానే అతనిలా వాపోవడానికి కారణం నామీదున్న అభిమానం కాదు - ఈ రెండు పిల్లల భారం తన నెత్తిమీద పడుతుందనే పిరికితనం' అని గుర్తు చేసుకొని మధురం "ఛీ" అని ఇంకొక సారి జుగుప్సతో తన దేహం దులుపుకుంది.

- ఇప్పుడే - మొట్ట మొదటి సారి - తన స్వభావంకి తగినట్టుగా ఏ విధమైన 'సమాధానం' వెతక్కుండా అతని బలహీనత మధురం సూటిగా తెలుసుకుంది.

సీతారామన్ తొందర తొందరగా తన గదికి పరుగెత్తుకొని వెళ్ళాడు; తన బట్టలన్నీ రెండు సూట్ కేసులలో నింపుకొని హాలుకి వచ్చాడు.

అప్పుడు టపా పెట్టెలో ఒక ఉత్తరం కనిపించింది. సూట్ కేసులని నేలమీద పెట్టి ఆ ఉత్తరం చదివాడు.

పిల్లలిద్దరూ తమ పరిసరాల్లో ఏం జరుగుతుందని తెలియం కమల కొనితెచ్చిన బిస్కట్లు, చాకలెట్లు తింటున్నారు. పెద్దమ్మాయి ఒక పెద్ద Cadbury చాకలెట్ని కఱచి, దాన్ని పక్కనే పెట్టుకొని చురుకుగా ఏదో రాస్తోంది.

చిన్నమ్మాయి పిల్లినడకతో ఆమె దగ్గర వచ్చి ఆ చాకలెట్ని తీసుకొని తనూ ఒకసారి కఱచింది.

"ఏమే, ఎందుకు నాది తీసుకుంటున్నావ్? నాన్నగారూ, చూడండి . . . " అని ఉమా దగ్గర ఉన్న తండ్రిని పిలిచింది.

ఆమె కూత వినగానే చిన్నమ్మాయి లతా తను కఱచిన చాకలెట్ని మళ్ళీ ఉమా పక్కన పెట్టేసి దూరంలో నిల్చుంది. ఉమ్మా దాన్ని తీసుకొని, రెండు సార్లు ఇలాగ అలాగ చూసి "ఛీ!, ఇది ఎంగిలి, నాకు వొద్దు!" అని లతాకే దాన్ని తిరిగి ఇచ్చేసింది.

లతా దాన్ని తీసుకొని ఏం చెయ్యాలో తెలియక కొంచెం సేపు అలాగే నిల్చుంది.

అక్కయ్య అది తనకి ఇవ్వగానే - ఎంగిలి తినకూడదని, తను ఇంతకు ముందు తిన్నది ఎంగిలి అని గ్రహించిన వెంటనే లతా కూడా "ఛీ!, ఇది ఎంగిలి, నాకు వొద్దు!" అని చెయిలో ఉన్న ముక్కని పారేసి నోరు తుడుచుకుంది.

ఆ ఎంగిలి చాకలెట్ ముక్క సీతారామన్ కాళ్లముందు వాలింది.

అది అతను చూసాడు. చెయిలో ఉన్న ఉత్తరంని నలిపేసి తన రెండు సూట్ కేసులని ఎత్తుకొని గబ గబ మని గడప చేరుకున్నాడు.

"ఉమా, ఇలా రా, నాన్నగారు ఊరుకి వెళ్తున్నారు . . . " అని అరుస్తూ లతా నగ్నంగా గడప దగ్గరకి వచ్చింది. ఉమా కూడా ఆమె వెనుక వచ్చింది.

వీధిలో దిగిన సీతారామన్ తిరిగి చూడగానే ఇద్దరు పిల్లలూ తలమీద చేతులెత్తి వాడుకగా “నాన్నగారూ . . . టా, టా . . . ” అని సైగ చేసారు.

సీతారామన్ కన్నులు - నిత్యమూ ఉదాసీనతతో మెరుస్తూ, ఆ ఉదాసీనతని ఒక భూషణంగా ధరించి, దాన్నే ఒక వినోదంగా అందరూ చూసి అతన్ని హీరోగా కొనియాడిన అవే కన్నులు - ఇప్పుడు బాగా తడిసిపోయాయి!

********

**(మూలం: ప్రచురణ, ఆనంద వికటన్, 1964)**

# కొత్త ప్రతిమలు

మేడగదిలో ఇందు కనిపించలేదని ఆమె గారాబంగా పెంచే పిల్లి ఇల్లంతటా తిరుగుతోంది. వసారా మార్గాన ఆమెను వెతుక్కుంటూ, గోడపక్కన నడుస్తూ, మెట్ల దగ్గరకి వచ్చి నిలబడి, కిందవున్న హాలుని వొంగి చూసింది ఆ నల్ల పిల్లి.

సాయంకాలం ముగిసి చాలాసేపయింది. కాని దీపాలేవీ వెలిగించక ఇంటి ముందు హాలులో, ఒక మూల, ఒక స్టూలుమీద, ఎవరికో భయపడి పొంచివున్నట్టు కూర్చొనివున్న ఇందుమతి తల్లి కుంజమ్మాళ్, తలెత్తి మేడ వసారాని చూసింది.

చీకటిలో నిప్పులాగ మండుతున్న ఆ పిల్లి కళ్లని చూడగానే ఆమెకి హడలు. ఈ పిల్లికూడా 'ఇందు ఎక్కడ? ఇందు ఎక్కడ?' అని కోపంతో ఆమె మీద దూకి, తన పంజాలతో పొడవడానికి సిద్ధమవుతున్నట్టు, కేకలు పెడుతూ మేడమెట్లు దిగి వచ్చింది.

ఆ పిల్లి కూత ఆమెకి 'మానవ కూత' లాగ అగుపించడంతో కుంజమ్మాళ్ తన రెండు చెవులూ మూసుకుంది; ఆమె కళ్ళకి ఆ పిల్లి కళ్ళు ఆమె భర్త కళ్ళులాగ బెదిరించాయి.

ఈ సమయంలో తన భర్త మొహం ఊహించడానికే ఆమె దేహం గింజుకుంది.

కూతలు పెటుతూ మేడమెట్లు దిగివచ్చిన ఆ నల్ల పిల్లి కుంజమ్మాళ్ కాలు చుట్టూ తిరిగి తిరిగి వచ్చి సంతాపంతో ఏడ్చింది. కుంజమ్మాళ్ వొంగి దాన్ని చెయిలో తీసుకుంది; మొహంతో ఒత్తుకొని ఏడ్చింది. తన్ను చూసినప్పుడెల్లా తరిమే ఆవిడలో ఈ కొత్త అలవాటు చూసి ఆశ్చర్యపడినట్టు ఆ పిల్లి ఊరుకుంది.

ఆ పిల్లి దురవస్థని ఆమె అలక్ష్యం చెయ్యవచ్చు. ఇలాగే ఇతరుల దురవస్థని అలక్ష్యం చెయ్యడానికి తనకి అధికారం లేకపోయినా, వాళ్ళకి నచ్చజెప్పి వాళ్ళ

ప్రతిపక్షం ఎదుర్కొనే విజయం తనకి సాధ్యమా అని ఆలోచించినప్పుడు కుంజమ్మాళ్ అదిరిపడింది.

ఆ అదురు, భ్రమ మధ్య ఆమె చెయినుంచి గెంతి నేల వాలిన పిల్లి మళ్ళీ ఇందుని వెతుక్కుంటూ ఇంటి వెనుకతట్టుకి పరుగెత్తింది.

ఆ పిల్లి కూత విని కుంజమ్మాళ్ వేదన అనుభవించింది.

పాపం, ఎవరితోనూ చనువు లేక, మేడమీదున్నగదిలో ఒక ఖైదీలాగ నాలుగు సంవత్సరాలుగా శిక్ష అనుభవిస్తున్న ఇందుకి ఈ పిల్లి ఒక మంచి సహవాసిగా ఉండేది. ఆ నాలుగు సంవత్సరాల ప్రారంభంలో - తను చేసిన నేరం, తను అనుభవించే శిక్షలోని ఘోరం బోధపడని రోజుల్లో - ఇందు  రోజంతా పాడుతూ, పిల్లితో ఆడుతూ ఉండేది; ఆ తరువాత, కొంత కాలంలో ఆటా, పాటా తగ్గిపోయి, నిత్యమూ చదువుతూ ఉంది.

చెల్లెలు విజయా లైబ్రరీనుంచి కట్టలు కట్టలుగా పుస్తకాలు తీసుకొనివచ్చి అక్కకి ఇచ్చింది. కాని ఇటీవల ఇందు తనకెందులోనూ అభిరుచి లేనట్టు, తన దేహంలో తనే కృశించిపోతున్నట్టు, నిత్యమూ ఏదో ఆలోచిస్తూ, ఆకాశాన్ని తేరిపార చూస్తూ, నిట్టూర్పులు వదులుతూ రోజులు గడిపింది. అప్పుడు ఆమెని ఓదార్చుతూ ఆమె ఏకాంతంని మార్చినది ఈ నల్ల పిల్లే. ఇందు కూడా తన మానసిక వ్యధలమధ్య ఈ పిల్లికి పాలుపెట్టి, పోషించి, గారాబంగా పెంచింది. మరి, దాన్ని వదలి వెళ్ళడానికి ఆమెకి మనసెలా వచ్చిందో? వెళ్ళినప్పుడు దీనిగురించి ఆలోచించివుంటుందా? వెక్కి వెక్కి ఏడ్చిందే, అందులో ఈ నల్ల పిల్లికీ వాటా ఉందా? ఆమె అనలేదూ - “నేను ఎవరికోసం నా జీవితం త్యాగం చెయ్యను!” అని?

‘అది చెప్పినది అలా ఉండనీ, ఆ పని చెయ్యడానికి నాకెలా ధైర్యం వచ్చింది?’ అనే భ్రమతో కుంజమ్మాళ్ కన్నులు కదిలాయి.

తను చేసిన పని సరైన పనే, కాని సరైన పనులన్నీ చెయ్యడం సాధ్యమా? ఆ పని చెయ్యడానికి తనకి ధైర్యం ఇచ్చిన ఆ క్షణాలని కుంజమ్మాళ్  మనసార దీవించింది. అందువలన కలిగే పరిమాణాలు ఊహించి ఇప్పుడు దిగిలు పడుతున్నప్పుడుకూడా, ‘అది సరైన పనే’ అని ఆమె పూర్తిగా నమ్మింది. కాని ఆ పరిస్థితిగాని  ఇప్పుడు సంభవించుతే - ఈ నిమిషం  తనకా ధైర్యం ఉండదని ఆమెకి అనిపించింది. అంటే, ఆ

నిమిషంలో ఏర్పడిన ఒక నిర్బంధం, ఆ సమయం, ఆమెని ఒక కొత్త ప్రతిమగా చేసి, ఆ కొత్త ధైర్యం ఇచ్చి తన పని సాధించుకుందన్న మాట!

అలాగే, ఒకప్పుడు ఏర్పడిన నిర్బంధం వలనే నాలుగు సంవత్సరాలముందు, తన పదిహేడో వయస్సులో ఇందు వాడితో పారిపోయిందని ఆమెకి అనిపించింది. అవును, ఒక న్యాయంని అనుసరించి కొన్ని నిర్బంధాలు ఏర్పడతాయి. ఆ నిర్బంధాలు ఏర్పడిన నిమిషాలు వదులుకున్నా వాటి న్యాయాలు స్థిరంగా నిలిచిపోతాయి.

ఇందుకి ఏర్పడిన ఆ నిర్బంధం నాలుగు సంవత్సరాల తరువాతే తను గ్రహించడం జరిగిందనే ఆలోచన రాగానే 'నాలాగే నా కుటుంబ సభ్యులుకూడా గ్రహించగలరా?' అనే భయం ఆమెకి కలిగింది.

'ఇందు ఎక్కడ? ఇందు ఎక్కడ?' అని అరుచుకుంటూ మళ్ళీ ఆ నల్ల పిల్లి తన కళ్ళలో నిప్పులు కక్కుకుంటూ ఆమె ఎదుటవచ్చి నిలబడింది.

ఇంకా కొంచెం సమయంలో తన్ను చుట్టుముట్టుకొనే కుటుంబ సభ్యులకి ఆమె ఏం జవాబు చెప్తుందో?

ఈ కుటుంబంమీద ఆమెకే అధికారం. బాధ్యత ఉన్నాయి. కాని కుటుంబం అనే బృందంలో తను తనకివ్వబడిన అధికారంని మించినట్టు ఆమెకి భయం కలిగింది; అందరిముందూ తనొక దోషిగా నిలబడుతున్నట్టు భ్రమ.

పారిపోయిన - తన దీవెనతో పంపించబడిన ఇందు తప్ప - ఇప్పుడు బయటకి వెళ్ళిన ఇతర కుటుంబ సభ్యులందరు -ఒక్కొక్కరుగా - తప్పకుండా తిరిగివస్తారు.

కోవిలకి వెళ్ళిన అత్తగారో, ట్యూషన్ కి వెళ్ళిన అంబియో, కాలేజీకి వెళ్ళి ఊరంతా తిరిగి, ఏవేమో కారణాలు చెప్పుకుంటూ ఇంటికి వచ్చే విజయావో, లేకపోతే ఈ సమయంలో క్లబ్బులో పేకాట ఆడుతున్న ఆమె భర్తయో - వాళ్ళలో ఎవరినో ఒకరిని ఆమె ముందు కలుసుకుంటుంది; ఆఖరికి మొత్తంగా అందరినీ ఆమె ఎదుర్కోవాలి!

కుంజమ్మాళ్కి మళ్ళీ మొహమంతా చెమట పట్టేసింది.

ఇల్లంతా ఒకటే చీకటి; దీపాలు వెలిగించాలనే తలంపుకూడా ఆమెకి లేదు.

ముసలమ్మే ముందు వచ్చింది.

రొజంతా వర్షం కురియడం వలన కోవిల ఆవరణలో ఎక్కడ చూసినా అడుసు, బురద; అంతేకాదు, ఆగిన వర్షం మళ్ళీ కురుస్తుందనే సూచనలు కనిపించడం వలన, అలవాటుగా జరిగే హరికథని ఇవాళ కోవిల లోపల - శాస్త్రంకని - క్లుప్తంగానే జరిపి, ముగించేసారు; లేకపోతే ముసలమ్మే ఆఖరికి వస్తుంది.

కాంపౌండు గేటు తెరుచుకోని ఇంట్లోకి ప్రవేశించిన నాన్నమ్మ ఇల్లంతా చీకటిమయమని తెలియగానే "ఏమే, కుంజమ్మా, చీకట్లో నువ్వేం చేస్తున్నావ్? ఇదేం current cut కాబోలు! ఇందూ . . . ఇందూ . . . నువ్వు ఫోను చేసి కనుక్కున్నావా?" అని కేకలు పెడుతూ, చీకటిలో తడుముకుంటూ, మేడమెట్ల గోడని ఒక చెయితో పట్టుకొని, కుడికాలుని ఇంకొక చెయితో భరించుకొని గబగబమని మీదకి వెళ్ళింది.

ఒక రోజుకి వందసార్లు ఈ మేడ ఎక్కి దిగినా ఆవిడకి అలసట అంటూ ఏమీ రానేరాదు. ఆ ఇంటిలో ఆవిడదే చిన్న స్వరూపం. ఆవిడ రామభద్రన్ తల్లి అంటే అందరూ వింతగా చూస్తారు, నవ్వుకుంటారు. రామభద్రన్కి మేడ ఎక్కడమంటే భయం. ఒకసారి ఎక్కి దిగితే చాలు శ్వాసం గింజుకుంటుంది. రెండు సంవత్సరాలు ముందు అతనికి రక్కపోటు, నీరసమైన హృదయం అని డాక్టర్లు చెప్పిన తరువాత అతను కారుని పదిహేను మైళ్ళ వేగంకి మించి నడపడం మానుకున్నారు. అందువలన అతనికీ, మేడకీ ఏ సంబంధమూ లేదు. కుంజమ్మాళాకి మేడని తలుచుకుంటే రోత - ఇందు అంటే ఆమెకి అంత ద్వేషం అన్నమాట. విజయాకి చదుపుకోడానికి వసతిగా కిందనే ఆమెకని ఒక గది ఉంది. నాన్నమ్మ, అంబి మేడమెట్లు ఎక్కి దిగడానికి ఎప్పుడూ వెనకాడరు. ఎక్కి దిగినప్పుడు విసుగు కనిపించకూడదని అవ్వ పాడుతున్నట్టు "ఇందూ . . . ఇందూ" అని పిలుస్తుంది.

ముద్దుగా గారాబంగా నాన్నమ్మ మనవరాలిని పిలవడం విన్నప్పుడెల్లా కుంజమ్మాళ్ మోహం ముడుచుతుంటుంది. ఆ పేరు వింటేనే చాలు, అంత ద్వేషం. నాలుగు సంవత్సరాలముందు ఎక్కడికో పారిపోయిన ఇందుని - నలభైఐదు రోజుల తరువాత - ఒక రోజు కనిబెట్టి, తీసుకొని వచ్చి ఆ గదిలో రామభద్రన్ బంధించారే - ఆ రోజు మేడమీదకి వెళ్ళి, ఆమె ఎదుట నిలబడి, పెదిమలు కొఱుకుతూ, రెండు చేతులూ

ఆమె ఎదుట చాటి, "చచ్చిపోవే! . . . ఛీ, ఛీ, పరువూ, ప్రతిష్ట పోయిన తరువాత ఎందుకీ బతుకు!" అని తిట్టేసి వచ్చిందే, అంతే, ఆ తరువాత కుంజమ్మాళ్ ఇందుతో సూటిగా మాటాడడం ఇవాళే జరిగింది - రెండు గంటల ముందు.

నాన్నమ్మ మేడమీదకి వెళ్ళి గదులూ, వసారా అన్నీ తిరిగి చూసి, తక్కిన ఇళ్ళలో దీపాలు వెలగడం చూసి "ఊరంతా వెలుతురులో ఉందే? . . మన ఇంటిలో మాత్రం ఏమైంది?" అని అడుగుతూ, గోడని తడుముకుంటూ స్విచ్ నొక్కింది.

నిగనిగమని ప్రకాశించిన ఆ కాంతిలో గది అల్లకల్లోలంగా కనిపించింది; రెండు బీరువాల తలుపులు ఎవరో దోచుకుపోయినట్టు తెరిచివున్నాయి; బట్టలు, వస్తువులు, తారుమారుగా నేలపై పడివున్నాయి.

"ఇందూ . . . ఏమే ఇందూ!" అని పిలుస్తూ మేడమెట్లు దిగివచ్చిన ముసలమ్మ వంటగదిలో కొంచెం వెలుతురు గమనించింది. "కుంజమ్మా . . . ఎవరూ కనిపించరేం? ఇందూ, నువ్వు వంటగదిలో ఉన్నావా?" అని అడుగుతూ ఆమె వంటగది వైపు నడిచినప్పుడు ఆమె వీపు వెనుక . . .

"ఇందు లేదు . . . " అని దుఃఖం భరించే ధ్వని చీకటిలో వినిపించగానే, ముసలమ్మ అలాగే నిల్చొని, మొహం తిప్పి చూసింది. చీకటిలో ఏమీ కనిపించలేదు. గోడని తడుముకుంటూ స్విచ్ నొక్కింది.

"చీకట్లో ఏంచేస్తున్నావ్?" అని కుంజమ్మాళ్ దగ్గరికి నాన్నమ్మ వచ్చింది. కుంజమ్మాళ్ దుఃఖంతో, పెదిమలు గుంజుకుంటూ ఒక క్షణం తలెత్తి, ఏడ్పు ఆపి, అత్తగారిని చూసింది; కొన్ని క్షణాలు ఏమీ అనకుండా ఎఱ్ఱబారిన కళ్ళని మూయకుండా చూస్తూనే ఉంది. ముసలమ్మ ఏమీ అడక్కుండా, సామాన్యంగా తనకేదో బోధపడినట్టు, నడుముని ఒక చెయితో ఆనుకొని, మౌనంగా, కలవరపడుతూ కుంజమ్మాళ్ మొహం చూసింది.

"ఇందు ఎక్కడ?" అని గొంతు సవరించుకుంటూ, తన రెండు బుగ్గలు అరచేతులతో నొక్కుకుంటూ నాన్నమ్మ అడిగింది.

"వాడు వచ్చాడు; వాడితో వెళ్ళిపోయింది . . . " అని గరగరమనే ధ్వనిలో చెప్పింది కుంజమ్మాళ్.

"ఆ పాపిష్టి వెధవ ఇక్కడ ఎందుకు వచ్చాడు? నువ్వెందుకు దాన్ని పోనిచ్చావ్? దాని నాన్న క్లబ్బులో ఉంటాడుకదా, వాడికెందుకు నువ్వు ఫోను చెయ్యలేదు? ముందు వాడిని జెయిల్లో పెట్టాడు . . . ఈసారి వాడిని ఉరి తీసేస్తాడేమో, ఎవరికి తెలుసు? నువ్వేమో ఇంత తెలివిమాలిన పని చేసేసి, పిచ్చెత్తినట్టు ఇక్కడ కూర్చొని 'అది వాడితో వెళ్ళిపోయింది . . . ' అని అంటున్నావ్!" అని నానమ్మ చేతులు పిసుక్కుంటూ, నెత్తిని బాదుకుంటూ, అంగలార్చుకుంటూ, పక్కనేవున్న సోఫాలో కూర్చుంది.

కుంజమ్మాళ్ తను అన్నిటికీ తెగించినట్టు, తనకి ఎటువంటి భయమూ లేనట్టు, తల వొంచి, మౌనంగా ఆలోచించింది. నాన్నమ్మ అంగలార్పు సద్దుమణుగిన తరువాత కుంజమ్మాళ్ నేలని తన కాళ్ళతో తొముకుంటూ, స్పష్టంగా మాటాడింది.

"వాడ్ని జెయిల్లో పెట్టాం; వాడు చెయ్యని నేరాలన్నీ వాడిమీద మోపి, వాడికి దొంగ అనే పట్టం కట్టి అందుకు ఇందువే వాడికి ఎదురుగా సాక్ష్యం చెప్పాలని బలవంతం చేసి, నాలుగేళ్లు జెయిల్లో పెట్టాం. ఆఖరికి మనం ఏమిటి అనుభవించాం? మన అమ్మాయి గతి ఏమైందని ఆలోచించవద్దా? నగలకోసం ఒక మైనర్ అమ్మాయిని వాడు అపహరించాడని మనం అంటున్నాం; ఒక నెలకి మించి వాళ్ళిద్దరూ కలిసి జీవించారనే సంగతి మనం దాచినా - ఊరులో నమ్మేవారు ఎవరు? మనకి ఎంత డబ్బూ, ఆస్తి ఉందని చూపించినా పెళ్ళి సంబంధంకి వచ్చేవారందరూ విజయాకోసమే వస్తున్నారు, ఇందుకోసం ఎవరికీ అక్కర లేదు . . . ఇక మనం ఇందుని ఏం చెయ్యాలి? మీ అబ్బాయి దాన్ని ఉరితీసేస్తారు . . . అతనికి వచ్చిన కోపంలో అతనే దాన్ని చంపేస్తారు . . . సరే, ఆ తరువాత? దానితో మనకున్న ఇందూ ప్రశ్న తీరిపోతుందా? ఆమె మనకి ఒక ప్రశ్న అని మరిచిపోవడం ఎలాగ? ఆ ప్రశ్న పరిష్కరించడానికి ఈ నాలుగు సంవత్సరాలూ మనం ఏం చేసాం? ఇక ఏం చెయబోతున్నాం? కొంచెం ఆలోచించండి . . . " అని దీర్ఘంగా ఆలోచించి, ఆలోచించి కుంజమ్మాళ్ చెప్పిన మాటలు శ్రద్ధతో, కలతతో వింటున్న నాన్నమ్మకి మనసులో కొత్తగా కొన్ని భావనలు లేచాయి.

మళ్ళీ కొన్ని నిమిషాలు ఇద్దరూ మౌనం వహించి తల వొంచి కూర్చున్నారు. గభీమని ఇద్దరూ ఒకేసారి తలెత్తి ఒకరినొకరు చూసుకున్నారు. ఇప్పుడు నాన్నమ్మ

కళ్ళకి తన కోడలు తెలివిమాలిన పని చేసినట్టు కనిపించలేదు. కాని ఇంతసేపూ కుంజమ్మాళ్ని ఆవరించుకున్న భయం, 'ఇక మనం ఏం చెయ్యాలి?' అనే ఆ భ్రమ - ఇప్పుడు ముసలమ్మని కూడా పట్టుకొని బాధించాయి.

"అసలు ఏం జరిగింది? నువ్వెందుకు అలా చేసావ్, ఇక మనం ఏం చెయ్యాలి? నాకు దిగిలుగా ఉందే . . . అది పారిపోయినప్పుడు - అందుకు నువ్వూ, నేనూ కారణమని వాడు అనలేదూ? నువ్వూ, నేనూ వాడి ఆఫీసు నౌకరుని ఆఫీసు పని చెయ్యకుండా, వాడిని పిలిచి ఇంటిలో అన్ని పనులూ చెయించుకున్నామట! రాత్రీ, పగలూ అని చూడక, ఆ వేణుని ఇంట్లో కూర్చోబెట్టి, టిఫనూ, కాఫీ, భోజనం, ఇచ్చి ఇచ్చి, ఈ కుటుంబంలో ఒకడుగా చేసామట! ఇలాగ ఎన్నో అన్నాడు, ఇప్పుడు వచ్చి నిన్ను అడుగుతాడు . . . ఏమే, నీకేం భయం లేదా?" అని తన దేహం వొణుకుతూంటే, వొణికిన చేతులతో, ముసలమ్మ కోడలిని తాకింది.

కుంజమ్మాళ్ ధైర్యం ఇచ్చే ధోరణిలో తన చెయిని తాకిన అత్తగారి చెయిని పట్టుకొని నిట్టూర్పు వదిలింది; ఆమె మనసులో ధైర్యం చోటుచేసుకుంది.

భయంతో వొణుకుతున్నవారికికూడా తమకంటే ఎక్కువగా భయపడే ఇంకొక మనిషిని చూస్తే ధైర్యం కలుగుతుంది. భయమూ, శోకమూ తగ్గాలంటే వాటిని ముందు ఇతరులతో పంచుకోవాలి; కుంజమ్మాళ్ గింజుకోడం అందువలనే. తన దిగిలుని పంచుకోవడానికి ఎవరూ లేరని, ఎవరిగురించి ఆమె భయపడుతుందో ఆ భర్తే వచ్చేస్తారనే భీతితో ఆమె ఇంత సేపూ అల్లాడుతోంది.

ఇప్పుడు తనలాగ నాన్నమ్మ మనసులోనూ 'పారిపోయిన ఇందు శిక్ష అనుభవించింది, కాని ఆమె భవిష్యత్తుకి ఈ కుటుంబంలో ఎవరూ ఏమీ చెయ్యలేదు' అనే గూఢమైన భావన చోటుచేసుకుందని కుంజమ్మాళ్ గ్రహించింది. గభీమని కొన్ని గంటలముందు వంటగదినుంచి బయటకి వచ్చినప్పుడు ఇందు, వేణు నిలబడివున్న వసారా ప్రాంతాన్ని ఆమె కళ్ళు తేరిపార చూసాయి.

ఆమెకీ మొదట వాడిని చూడగానే తన కూతురు బతుకు పాడుచేసిన పాపి ఎందుకు వచ్చాడని పట్టరాని కోపం వచ్చింది.

అప్పుడు బయట భారీగా వర్షం కురుస్తోంది. చినుకులు ఆపాలని వసారా ముందు భాగంలో వేలాడుతున్న పెదురు అడ్డు వెనుకనున్న ఒక బెంచి మీద వాడు కూర్చొని ఉన్నాడు; ఇందు వాడి పక్కనే అధికారంగా నిలబడి, చీరకొనతో మొహం మూసుకొని వెక్కివెక్కి ఏడుస్తోంది.

కళ్ళంట నీళ్ళతో, పెదిమలు వొణుకుతూ వాడు చెప్తున్నాడు: "నాకు జెయిల్లో ఉన్న ప్రతీ నిమిషమూ ఇదే ఆలోచన: 'బుద్ధి లేక ఒక అమ్మాయి బతుకు నేను పాడుచేసాను, అందుకే ఈ శిక్ష అనుభవిస్తున్నాను'. కాని నామీద దొంగ అనే నేరం మోపి, నీ నగలకోసం నేను నీతో పారిపోయానని అన్నారే! . . . అదెలాగో పోనీ! . . . నువ్వుకూడా అందుకు వెనకాడి సాక్ష్యం చెప్పావ్ . . . అది విని నాకు నీమీద కోపం రాలేదు, జాలియే కలిగింది . . . 'ఈ పిల్లని ఇలాగ ఈడ్చుకొని వెళ్తే ఇలాంటి శిక్ష న్యాయం అనుభవించవలసిందే!' అని నాకనిపించింది. కాని, ఇందు, నిజమేమిటో చెప్పు . . . మనమిద్దరం ఏదో వెర్రితనం వలన, ఇద్దరూ ఏకీభవించిన తరువాతనే పారిపోవడం జరిగింది, అవునా? ఇప్పుడు అది పిచ్చిగా కనిపించినా అప్పుడు అదొక పనిత్రమైన ప్రేమ అని మనకనిపించింది. ప్రేమికులకి కడుపు, ఆకలి ఉంటాయని మనకి గుర్తు లేదు. ఎక్కడికో వెళ్ళి, ఏ పనీ దొరకక ఆకలితో బాధపడుతుంటే నువ్వే నీ నగలిచ్చి అమ్మమన్నావ్ . . . నేను ముందు వద్దన్నాను, నీకు గుర్తుందా? 'నేనే మీకు సొంతం అని వచ్చాను, మరి ఈ నగలు మీకు సొంతం కావా?' అని నువ్వు అడిగావ్ . . . అవేం ఉత్తి మాటలంటున్నావా? . . . ఇప్పుడు నువ్వు పిల్ల కాదు, నీకు మంచి చెడూ తెలుసు . . . ఇప్పుడు చెప్పు, నీ నగలకోసమే నీకు నేను మోసం చేసానంటున్నావా? ఇందూ, ఇందూ, ఏడవకు . . . " అని పాత ఘటనలు వాడు గుర్చ్ చేస్తూంటే ఇందు భరించలేక ఏడ్చింది.

"వేణు, నన్ను క్షమించు . . . నేను నా పిరికితనం వలన నీమీద పెద్ద నేరం మోపాను, నీ శిక్షకి నేనే కారణం . . . అదొక మహా పాపమని అప్పుడు నాకనిపించలేదు, ఆ పాపం ఇప్పుడు నేను అనుభవిస్తున్నాను . . . చచ్చేవరకూ దాన్ని అనుభవించుతాను . . . " అని ఆమె ఏడ్చింది.

“ . . . ఇందు, ఏడవకు . . . నువ్వు నాకు  ఏ హానీ చెయ్యలేదు . . . నీ మనసులో అలాంటి భావన   లేదంటే అది నాకు చాలు . . . ఏడవకు . . . ” అని వాడు ఆమె భుజం తాకి ఓదార్చాడు.

ఒక క్షణంలో కుంజమ్మాళ్ కోపం అణగింది; వాళ్ళ సంభాషణకి అడ్డురాకుండా ఒక మూల ఆమె అలాగే నిల్చుంది.

‘వీడెవరి అబ్బాయో? ఎంత మంచి పిల్లవాడు, ఈ వేణు! నా కూతురుమీదున్న ప్రేమ వలన, నా భర్త కోపంకి, హఠంకి బలి అయి, నాలుగు సంవత్సరాలు అన్యాయంగా జెయిలులో శిక్ష అనుభవించి,   ‘నువ్వు నాకు ఏ హానీ చెయ్యలేదు . . . ’ అని తనకి ఎదురుగా సాక్ష్యం చెప్పిన అమ్మాయికి చెప్తున్నాడే?’ అని ఆలోచించినప్పుడు ఆమె కళ్ళు తడిసిపోయాయి.

అదే సమయం వాడు ఆమెకి చెప్తున్నాడు:

“నాకు విధించబడిన శిక్షనుంచి నాకు రోజువారీ,  మెల్లమెల్లగా స్వాతంత్ర్యం, దొరికింది. అదే సమయం,  ఇందూ, నీ కుటుంబంలో నువ్వు ప్రతీరోజూ శిక్ష అనుభవిస్తున్నావని నేను మరవనే లేదు. మనిద్దరం కలిసి చేసిన పొరబాటుకి - అదొక నేరం - నేను శిక్ష అనుభవించేసాను. కాని, ఇందూ,  నీకు విమోచనం అంటూ లేనేలేదా? నువ్వెలా బాధపడుతున్నావని నాకు తెలుసు . . . ఇక నేను ఏం చెయ్యాలని చెప్పు . . . చెప్పు, ఇందూ . . . ” అని వాడు అంగలార్చుతుంటే,  ఇందూ ఏడుస్తూనే, తడబడుతూ మాట్లాడింది:

“మనం కలిసి చేసినది - ఆ రోజు చేసినది - నేరం కావొచ్చు . . . అందుకు కారణం మనమిద్దరం ఆ రోజు అది చెయ్యడం వలనే . . . అప్పుడు నా జీవితంని నిర్ణయించే వయస్సు నాకు లేదు  . . . అప్పుడు నేను చేసిన పనివలన నా జీవితం పాడయిపోయింది . . . ఇప్పుడు నేను అదే పని చెయ్యకపోతే నా భవిష్యత్తు పాడయిపోతుంది . . . నా జీవితం  నువ్వే చెడగొట్టావని అనుకున్నా, నాకు ఇంకొక జీవితం ఉందంటే అది నిన్ను తప్ప మరెవరూ నాకు ఇవ్వలేరు . . . కాని నువ్వు నాకు చేసిన పొరబాటుకి మళ్ళీ నన్ను వెతుక్కుంటూ వస్తావని నేను ఎదురుచూడలేదు . . . ” అని  ఆవేశంతో మరేం మాటా నోటినుంచి రాకుండా ఇందు ప్రయాసపడింది.

లోపల హాలులో నిలబడి వింటున్న కుంజమ్మాళ్ గోడమీద మోహం ఒత్తుకొని, రహస్యంగా, పెక్కి పెక్కి ఏడ్చింది.

"ఇందూ, నువ్వేమంటున్నావ్? నేను అనుకుంటున్నట్టే నువ్వు కూడా . . . " అని సంతోషంతో, ఆతురతతో వేణు అడిగాడు.

ఆమె కళ్ళు తుడుచుకుంటూ అతన్ని చూస్తూ, ఏడ్చిన ఎఱ్ఱబారిన మొహంతో, నెమ్మదిగా నిట్టూర్పు వదలి, చిరునవ్వు నవ్వింది.

మూసిన ఆమె కళ్ళనుంచి నీళ్ళు కాఱాయి.

"వేణు, నేను నీతో వచ్చేస్తాను . . . చాలు, నాకు ఈ నరకం చాలు! అమ్మ తరచుగా నన్ను 'చచ్చిపోవే', 'చచ్చిపోవే' అని తిట్టుతోంది . . . నేను కూడా 'ఆత్మహత్య చేసుకుందామా?' అని చాలా సార్లు ఆలోచించాను, కాని ఎందుకో నాకది చేతకాదు . . . " అని ఒక రోజు జరిగిన ఘటన ఇందు గుర్తుచేసుకుంది.

వేణు కూడా మోచెయితో కళ్ళు తుడుచుకొని ఒక దగ్గు దగ్గాడు.

"వేణు, మంచి వేళ, నేను తొందరపడి ఆత్మహత్య చేసుకోలేదు. నువ్వు వస్తావని నేను కలలో కూడా ఆశించలేదు . . . కాని, ఇప్పుడు నాలో ఒక ఆలోచన . . . నాకు తెలియకుండానే అలాంటి నమ్మకం వలనే నేను ఇన్నిరోజులూ జీవించానేమో? లేకపోతే ఇన్నిరోజులూ ఈ దేహంలో ప్రాణం ఉండడానికి మరేం కారణమూ లేదు . . . సరే, నేను నీతో వచ్చేస్తాను . . . కాని ముందులాగ ఎవరికీ తెలియకుండా మనం రహస్యంగా వెళ్ళవద్దు . . . బాహటంగానే వెళ్దాం, నాకు వయస్సు వచ్చేసింది!" అని ఆమె మాటలు వింటున్న వేణు ఇందు సాహసం చూసి ఆశ్చర్యపడుతున్నట్టు కళ్ళు బాగా తెరిచి ఆమె మొహం చూసాడు.

ఆ మొహం - నాలుగు సంవత్సరాలముందు తను చూసిన లోకజ్ఞానం లేని, అమాయకురాల మొహం కాదు. జీవితంలో చాలా దెబ్బలు నొచ్చుకొని, నిరాశ, వేదన, అవమానం అనే నిందలు భరించి, అంతంకాని ఏకాంతంలో పడి, ఇప్పుడే - కాలక్రమంలో - ఒక కొత్త ప్రతిమగా ఉద్భవించినట్టు కనిపిస్తోంది. ఆ మొహంలో నిర్భయం, పట్టుదల మెరుస్తున్నాయి. బోళాతనంకి పోలికగా ఏమీ కనిపించని ఆ కళ్ళలో భవిష్యత్తుని ధైర్యంగా ఎదుర్కొనే తీక్షణ్యం నిగనిగమని వెలుగుతోంది.

'ఈమె ఒక కొత్త ప్రతిమ! ఈమెని మోసగించి నేను తీసుకొని వెళ్ళానని చెప్తే ఈ లోకంలో ఎవరూ నమ్మరు! ఈమెతో స్నేహం కలుపుకొని, ఏ భయమూ లేకుండా, తలెత్తి ముందుకు సాగాలి!' అనే నమ్మకంతో వేణు గంభీరంగా లేచి నిలబడ్డాడు.

అప్పుడే హాలులో గోడకి అంటుకొని నిలబడివున్న కుంజమ్మాళ్ని వాడు చూసాడు. ఆమెను చూడగానే అతని మనసులో ఒక తల్లిని చూసిన అనురాగమే లేచింది. ఎన్నిసార్లు ఆవిడ వాడికి భోజనం వడ్డించింది!

వేణు చేతులు కలిపి ఆమెకి నమస్కరించాడు.

ఆమెకి కనికరంతోబాటు ఏడ్పుకూడా వచ్చింది. కాని ఏడుస్తూనే, తన కనికరంని అణచుకొని, "నువ్వెందుకురా వచ్చావ్? నా కొంప ముంచడానికా? వెళ్ళు . . . వెళ్ళు . . ." అని బెదిరించింది.

ఇందు తల తిప్పి తల్లిని చూసింది.

"అమ్మా . . . " అని పిలిచింది. మరేమాటా పెగల్లేదు. "నేనూ వెళ్తానమ్మా . . . " అని ఏడ్చింది.

" . . . అవును, వెళ్తావులే . . . ఎంత సాహసం!" అని కూతురు చెయిని పట్టుకొని ఆమెను కుంజమ్మాళ్ మేడమెట్ల దగ్గఱకి తోసింది. "మేడమీదకి వెళ్ళు! అక్కడే నీకు మళ్ళీ చెరసాల! వేణూ, నువ్విప్పుడు వెళ్తావా, లేకపోతే పోలీసుని పిలవనా?" అని వేణుని సూటిగా చూసి బెదిరించింది.

ఆమెకి కనికరంతోబాటు ఏడ్పుకూడా వచ్చింది. కాని ఏడుస్తూనే, తన కనికరంని అణచుకొని, "నువ్వెందుకురా వచ్చావ్? నా కొంప ముంచడానికా? వెళ్ళు, వెళ్ళు . . ." అని తరిమింది.

ఇందు తల తిప్పి తల్లిని చూసింది.

"అమ్మా . . . " అని పిలిచింది. మరేమాటా పెగల్లేదు. "నేనూ వెళ్తానమ్మా . . . " అని ఏడ్చింది.

" . . . అవును, వెళ్తావులే . . . ఎంత సాహసం!" అని కూతురు చెయిని పట్టుకొని ఆమెను కుంజమ్మాళ్ మేడమెట్ల దగ్గఱకి తోసింది. "మేడమీదకి వెళ్ళు! అక్కడే నీకు

మళ్ళీ చెరసాల! వేణూ, నువ్విప్పుడు వెళ్తావా, లేకపోతే పోలీసుని పిలవనా?" అని వేణుని సూటిగా చూసి బెదిరించింది.

తల్లిని నిమ్మళంగా చూస్తూ ఇందు చెప్పింది: "అమ్మా, చట్టం మీకుమాత్రం సొంతం కాదు. నాకు విరుద్ధంగా నన్ను ఈ ఇంటిలో బంధించడానికి మీకు అధికారం లేదు. నువ్వు పోలీసుని పిలు, నేను నీకు బోధపరుస్తాను!" అని ఇందు మాటలు విని కుంజమ్మాళ్ ఉలికిపడింది.

"అమ్మోయ్, నిన్ను కన్నపాపంకి ఇది తక్కువే! నీకు నీ తల్లిదండ్రులకంటే వీడే గొప్ప, అవునా?" అని కుంజమ్మాళ్ వాపోయింది.

"బాగా చెప్పావ్! కూతురుమీదున్న ప్రేమ వలనే నాన్నగారు నన్ను ఈ ఇంటిలో శాస్వతంగా ఖైదీగా పెట్టారు! అందుకేగా నువ్వూ మేడమీద నా శవం ఎప్పుడు కనిపిస్తూందా అని కాచుకొని వున్నావు? చాలు, నాకు మా ప్రేమానురాగాలు వద్దు! మీ హఠంకి నేను బలి అవను! నాన్నగారు రానీ, నేను వెళ్ళి తీరుతాను!" అని ఇందు ఆవేశంతో అరిచింది.

వేణు గడప దగ్గర, చినుకులతో తడిసిపోవడం లెక్క చెయ్యక, నిలబడ్డాడు.

కుంజమ్మాళ్  మెట్లదగ్గర ఇందుని, గడపదగ్గర వేణుని మళ్ళీ మళ్ళీ తిరిగి చూసింది.

కూతురు ఆవేశం ఆమెకి బోధపడింది. అది చెప్పినది నిజం. అది చచ్చిపోవాలని ఎన్నిరోజులు తను ప్రార్థన చేసింది? ఆ ఘోరం గుర్తు రాగానే ఆ తల్లి పడిన వేదన . . .

'అది చావాలని వేడుకొనే తల్లి, ఆమెని ప్రాణంతో చంపుతున్న తండ్రి, ఆ కుటుంబంలో ఉదాశీనతో, ఎవరికీ ఆమెతో పొత్తు లేనట్టు కనిపించే పక్షపాతం - వీటిమధ్య ఇందుకి సద్గతి ఇవ్వగలవాడు ఈ వేణువే కదా?' అని ఆ నిమిష నిర్బంధంలో ఆ తల్లి గూఢంగా ఆలోచించింది. ఆమె వాడిని తరమడం, బెదిరించడం ఆత్మార్ధ మనసువలన కాదు. పైపైన, వట్టిపోయిన హఠం వలనే తనూ ఆ ఇద్దరిమధ్యా నిలబడుతున్నట్టు ఆమెకి బోధపడింది.

ఆ నిమిషంలోని నిర్బంధంకి ఎంత శక్తి!

"వెళ్ళాలంటే, ఇప్పుడే వెళ్ళు! . . . ఇప్పుడే పారిపో! బాహటంగా వెళ్తుందట! నువ్వు పారిపోతే బాహటంగా అందరికీ తెలిసిపోతుందిలే! . . . నిన్నెవరూ ఇప్పుడు ఆపడం లేదు! ఆపేవాళ్ళు రాకముందే వెళ్ళిపో!" అని ఏడుస్తూ కుంజమ్మాళ్ చెప్పినది విని వేణు, ఇందు స్తంభించి నిలబడ్డారు. కుంజమ్మాళ్, మొహం మూసుకొని, ఏడుస్తూ, ఇంకా చెప్పింది: " నాకు బోధపడిందిలే . . . నువ్వు వెళ్ళడం న్యాయమే . . . ఇక్కడ మరేం నాటకం వద్దు! మీ నానాన్నగారికి అస్వస్థగా ఉంది, అతను దీన్ని భరించలేరు . . . అతనితో నీకు ఏ ఘర్షణా వద్దు, అందుకే నేను చెప్తున్నాను . . . నువ్వు ఇప్పుడే వెళ్ళు!" అని రెండు చేతులూ చాటి బతిమాలింది.

"అమ్మా . . . అమ్మా . . . " అని గుండె బద్దలైనట్టు అరుస్తూ పరుగెత్తుకొని వచ్చి ఇందు తల్లి చేతుల్లో వాలింది.

-అటువంటి ఆదరణ పొంది, అనురాగం అనుభవించి ఎంత కాలమైంది!

ఇద్దరూ ఏడ్చి ముగించిన తరువాత తమ తమ పనులకోసం తొందరపడ్డారు.

ఇందు మేడమీదకి పరుగెత్తింది.

కుంజమ్మాళ్ ఏంచెయ్యాలో తెలియక, భ్రమతో, గోడమీద తల ఆనుకొని, కళ్ళు మూసుకొని, మూలనున్న ఒక స్టూల్ మీద కూర్చుంది.

కొంచెం సేపు తరువాత చెయిలో ఒక సూటి కేసుతో తన ఎదుట నిలబడి, "అమ్మా . . . " అని వాత్సల్యంతో పిలిచిన ఇందుని కళ్ళు తెరిచి చూసింది.

తన పాదాలముందు వాలి నమస్కరించిన కూతరుని కౌగిలించుకొని, దీవించింది!

"ఇందూ, విను . . . ఎది జరిగినా అది మన ప్రారబ్ధం! దేవుడు నీకు సాయం చేస్తాడు . . . నువ్వు ఎక్కడున్నా నాకొక చీటీ రాస్తూవుండు . . . నేను నీకోసం దేవుడ్ని వేడుకుంటాను, నేను మరేం చెయ్యగలను, చెప్పు! నన్ను క్షమించు! నావలన నీకెన్ని కష్టాలు, నన్ను క్షమించు!" అని కూతురు బుగ్గని పట్టుకొని బతిమాలింది.

"అమ్మా, నేనే నీకు నేనంటే ద్వేషం అని ఇన్నిరోజులూ అనుకున్నాను!" అని తల్లిదగ్గర క్షమాపణ కోరుతూ ఇందు కన్నీరు కార్చింది.

అప్పుడే వాడు -వేణు - మెట్లెక్కి లోపలికి వచ్చాడు.

"ఇందూ, ఇదేంటి?" ఆమె చెయిలోని పెట్టె చూసి వేణు అడిగాడు. "వద్దు . . . నీకేం కావాలో నేనది సంపాదించి ఇవ్వగలను . . . నువ్వు కట్టుకున్న చీరతో రా . . . నీమీదున్న నగలన్నీ ఇచ్చేసి రావాలి . . . " అని వాడు అనగానే తృప్తితో ఇందు చెవుల్లోని కమ్మలు తీయడం ఆరంభించింది; ఆ తరువాత, క్రమంగా, ముక్కుపొడక, గాజులు, గొలుసు తీసి, చెయినిండా తల్లి ముందు చాటింది.

నిరాడంబరమైన చెట్టులాగ నిల్చున్న కూతురు స్వరూపం చూడలేక కుంజమ్మాళ్ మొహం తిప్పుకున్న కుంజమ్మాళ్ చెయి చాటి ఆ నగలు తీసుకోలేదు.

ఇందు మౌనంగా వాటిని గోడకి చివరన పెట్టెమీద ఉంచి "అమ్మా . . . " అని మళ్ళీ పిలిచింది.

కుంజమ్మాళ్ మళ్ళీ ఇందు ఉత్త మెడని చూసింది. "ఇందూ, మరిచిపోవద్దు! ఏదైనా ఒక కోవిలలో, దేవుడి ముందు . . . ఇలాంటిది ఒకటి కట్టుకో! ఆడవాళ్ళకి ఆదే ఒక గొప్ప నగ!" అని తన మెడలోని మాంగల్య దారం చూపింది.

"సరే, అమ్మా . . . " అని మళ్ళీ ఇందు తల్లి కాళ్ళముందు పడి ఆమెను నమస్కరించినప్పుడు, వేణు కూడా దగ్గరికి వచ్చి కుంజమ్మాళ్ పాదాలు ముట్టుకొని నమస్కరించాడు.

"వెళ్లి రండి, బాగా వర్ధిల్లండి . . . దేవుడు మిమ్మల్ని కాపాడుతాడు . . . " అని కుంజమ్మా ఇద్దరినీ మౌనంగా దీవించింది.

బయట వర్షం ఆగింది. సాయంకాలం ముగిసింది. వాళ్ళిద్దరూ కొత్త ప్రపంచం వైపు బయలుదేరారు. గడపని దాటి వీధిలోకి దిగినంతవరకూ ఇందు కాళ్ళు ఊగీసలాడాయి. వీధిలో కాలుబెట్టగానే, కాళ్ళని బంధించిన కట్టు తెగినట్టు -ముందు నడుస్తున్న వాడిని చేరుకోడానికి - ఆమె నడకలో వేగం కనిపించింది. వీధి మూల చేరుకున్నప్పుడు ఆమె మళ్ళీ ఒక సారి తిరిగి చూసింది. దూరంలో కనిపించే తల్లి మొహం కన్నీళ్ళలో మరుగుపడింది. కుంజమ్మాళ్ చూపులోనూ ఆమె మాయమైంది.

ఇంటిలోకి వచ్చిన కుంజమ్మాళ్ గోడమూలనున్న పెట్టె, దానిమీదున్న నగలు చూసి నిట్టూర్పు వదిలింది. "ఇలాంటి పని నేనెలా చేసాను?" అని నివ్వెఅపడుతూ, తేరిపార చూస్తూ, చీకటిలో ఆ స్టూలుమీద కూర్చుంది.

మంచి వేళ, అత్తగారు అందరికీ ముందుగా వచ్చిందని కుంజమ్మాళ్కి ఒక విధంగా ఊరట కలిగింది. ఇంతకు ముందు జరిగిన ఘటనని ఆమె ఏదీ వదలకుండా వివరించినప్పుడు ఆవిడ అప్పుడప్పుడు చీరకొనతో తన కళ్ళు తుడుచుకుంది.

అత్తగారు ఒక పురాతన లోహంవంటివారే, కాని ఈ కలియుగంలో కఠినమైన కొట్లాటలలో ఆవిడ మాతృహృదయం కరిగింది! ధీర్ఘంగా ఆలోచించిన తరువాత యదార్ధ జీవితంలో కలిగే నిర్బంధాలకి సర్దుకొని ఆమె కోడలుతో ఏకీభవించి మాట్లాడింది. ఐనా, భయంతోనూ, దుఃఖంతోనూ, ఏడ్చిందికూడా. 'కాలం ఇలాగ చెడిపోయిందే!' అని శపించింది కూడా. 'కుటుంబ గౌరవంని నాశనం చేసిన అమ్మాయిని ఇంటినుంచి వెళ్ళగొట్టడం సరైన పనే!' అని ఒక విధమైన కోపంతో కోడలు చేసిన నిర్ణయంని ఒప్పుకుంది. కాని తన మొండి, కోపిష్టి కొడుకు స్వభావంని గుర్తుచేసుకున్నప్పుడు ఆమెకి భీతి కలిగింది.

జరిగినదంతా నాన్నమ్మకి వివరించినప్పుడు వీధిలో ఒక స్కూటర్ వచ్చి ఆగింది. దాన్ని ఒక నిమిషం ఇఋకుగా విన్న కుంజమ్మాళ్ నాన్నమ్మకి చెప్పింది: "విజయా వస్తోంది . . . కాలేజికి వెళ్ళిన అమ్మాయి ఇంటికి వచ్చే టైము చూడండి . . . " అని విసుగ్గుంది.

అప్పుడే గడియారం ఎనిమిది గంటలు కొట్టింది.

తిరిగి చూసిన నాన్నమ్మ, ఏవరినీ చూడక, "విజయావా, ఎక్కడ?" అని అడిగింది.

"ఇప్పుడేగా వీధి మొనలో వాడు దాన్ని స్కూటర్ లో దింపాడు? అది వస్తుంది, . చూడండి . . . " అంది కుంజమ్మాళ్.

"ఎవడు?" అని నానమ్మ అడిగింది.

"ఎవడో? ఎవరికి తెలుసు, వాడినే అడగాలి! . . . నాకేం తెలియదని దాని మనసులో ఉంది . . . ఇది ఇంకా ఎన్ని నాటకాలు ఆడబోతుందో? ఇది దానిలాగ పారిపోలేదంటే దానికి కారణం ఇందువే కారణం! దాని కష్టాలు చూసిందికదా? అబ్బా, ఇలాంటి నాన్నగారికి ఇటువంటి అమ్మాయిలు! . . . దేవుడా, నా గ్రహచారం ఇలా ఉంది!" అని కుంజమ్మాళ్ వాపోతుంటే విజయా వచ్చింది.

వచ్చినది చాలా తొందర తొందరగా తన గదికి వెళ్ళడం తల్లీ, నాన్నమ్మ తేరిపార చూసి, నిట్టూర్పు వదిలారు.

కొంత సమయంలో ట్యూషన్ కి వెళ్ళిన అంబి తిరిగి వచ్చాడు.

గదిలో దుస్తులు మార్చుకొని వచ్చిన విజయా తల్లీ, నాన్నమ్మల మధ్య జరుగుతున్న సంభాషణ విని ఏం జరిగిందో ఊహించుకొని బెంగతో “అమ్మా, నాన్నగారు వస్తే నువ్వు ఏం చెప్తావ్? ఇందు నిన్ను బాగా చిక్కులో పెట్టి వెళ్ళిపోయిందే?” అని అంటూ తన చెయిని ఛాతీమీద పెట్టుకొని వొణికింది.

“అవునులే, నీకు నాన్నగారంటే చాలా భయంకదూ?” అని తల్లి ఆమెను ఎత్తిపొడిచింది.

“నేనేం చేసాను?” అని మూతి ముడుచుకొని విజయా నాన్నమ్మ వెనుక దాక్కొంది.

“నువ్వేం చెయ్యలేదులే! . . . ఏమీ చెయ్యకుండా ఉండు . . . ” అంది నాన్నమ్మ.

ఒక నిమిషం మౌనం వహించి విజయా విచారంతో తల్లిని అడిగింది: “అమ్మా, ఇక ఇందూ రానే రాదా? ఇక మనం దాన్ని చూడనే చూడమా? ఇందూ, నా వలన నీకెన్ని కష్టాలు! నీతో నేను ఎన్నిసార్లో చిరచిరలాడాను!” ఈ సమయంలో తన కుటుంబంని శాస్వతంగా నిరాకరించి ఎక్కడికో ప్రయాణం చేస్తున్న తన అక్కని గుర్తు చేసుకొని విజయా బాధ పడింది.

ఇవన్నీ చూస్తున్న అంబీకి ఏదో ఘటన జరిగిందని బోధపడింది కాని దాని అవగాహన గ్రహించే శక్తి వాడికి ఆ వయస్సులో లేదు. ‘నిజంగానే ఇందు మన ఇంటిలో లేదా?’ అని తెలుసుకోవాలని వాడు ఆమె గదికి వెళ్ళి, దీపం వెలిగించి, నడుములో చెయి ఆనుకొని నాలుగు మూలలూ ఒకసారి పరిశీలించాడు.

అంతవరకూ ఒక మూల పడుకొనివున్న ఆ నల్ల పిల్లి, ‘ఇందు లేదు!’, ‘ఇందు లేదు!’ అని వాడి దగ్గర మొర పెడుతున్నట్టు, అరుచుకుంటూ వాడి కాళ్ళని చుట్టుకుంది.

** ** **

ఆ రాత్రి ఇందు గారాబంగా పెంచిన పిల్లికి అంబీయే పాలిచ్చి పోషించాడు. మేడ వసారాలో దానికోసం ప్రత్యేకంగా ఉన్న గిన్నెలో పాలు పోస్తున్నప్పుడు కాంపౌండు గేటుముందు నాన్నగారి కారు వచ్చి ఆగింది.

కుంజమ్మాళ్ పరుగెత్తుకొని వెళ్ళి గేటు తెరిచింది.

కింద తప్పకుండా ఒక భయంకరమైన జగడం జరుగబోతుందని ఊహించిన అంబీ ఇక 'మేడమెట్లు దిగనేకూడదు' అని నిర్ణయించి, పాలు గిన్నెతో ఇందు గదికి వెళ్ళాడు. పాలు తాగిన పిల్లి మిగిలిన పాలు కావాలని అరుచుకుంటూ వాడిని వెంబడించింది.

నాన్నగారు వచ్చారని తెలియగానే విజయా, భయంతో గుండె కొట్టుకుంటూ, తన గది తెలుపుని ఒక రెండు అంగుళాలకి మాత్రం తెరిచి, దాని ద్వారా ఒక కన్నుతో హాలుని చూస్తూ దాక్కుంది.

నాన్నమ్మ మాత్రం కోడలికి రక్షణగా ఆమెతో ఉంది.

కారుని షెడ్డులో భద్రపరచిన తరువాత లోపల వచ్చిన రామభద్రన్, కోటునికూడా విప్పకుండా తన భారీ శరీరాన్ని హాలు సోఫాలో వాల్చి తన టైని సడలించుకున్నారు. "Fan వెయ్!" అని భార్యని బిగ్గరగా ఆజ్ఞాపించారు. చల్లని గాలిని అనుభవిస్తూ ఆమెకి చెప్పారు:

"కుంజు, ఇదిగో, విను, నాకు చపాత్తీ వద్దు! క్లబ్ లో ఒక చిన్న డిన్నర్ . . . ముందు నేను వద్దన్నాను, కాని 'ఒక రోజే కదా, పరవాలేదు . . . ' అని విసు compel చేసాడు, భోంచేసేసాను . . . " అని నాలుగైదు ఇళ్ళకి వినబడే విధంగా బిగ్గఱగా, ఉత్సాహంగా అరిచారు రామభద్రన్. అతనికి ఎప్పుడు అధికోన్నత స్వరంలోనే సంచారం చేసే అలవాటు. కంఠధ్వని తగ్గించి మాటాడడం చేతకాదు. కంఠమెత్తి అరుస్తేనే మాటలు వస్తాయి. అంతేకాదు, అతనికి సామాన్య అంశాలన్నా అతీతమైన ఉత్సాహం లేక కోపం; ఈ రెండు హద్దులమధ్య వ్యవహరించలేక, భావవృత్తికి లోబడే కారణం వలన అతను మనశ్శాంతి అంటే ఏమీటో తెలియకుండానే జీవించారు.

అతను ఇంటిలో ఉన్నారంటే ఎప్పుడూ సందడే; పిల్లి కళ్ళు; చెవులకి రెండు పక్కలా దట్టమైన పెండ్రుకలు; అతని ఆకారం, కంఠం ఎవరినైనా జడిపించుతుంది. అతన్ని చూసి భయపడినా ఎదుట నిలబడి మాట్లాడే ధైర్యం ఎవరికైనా ఉందంటే, అది

అతని తల్లికి మాత్రమే. అతని పక్కన నిలబడితే అతని మోంజెయికి కూడా ఎదగని ఆ నాన్నమ్మే! "ఎందుకురా ఇలా అరుస్తావ్?" అని ఆవిడ అడుగుతే, "నీకేం తెలీదమ్మా . . . " అని జవాబు చెప్పి అతను మళ్ళీ అరుస్తారు. కోపం వచ్చినా, సంతోషం కలిగినా, అది అలాగే అతనిలో అణగిపోతుంది.

కోటు విప్పుతూనే "సరే, మందు తీసుకురా . . . " అని అతను అరిచారు. డాక్టరు ఆజ్ఞని మించి విందు భోజనం చేసిన భయం అలాగే ఉంది. కుంజమ్మాళ్ ఒక గ్లాసులో పాలు, అరచెయిలో మాత్రలు తెచ్చి అతనికి ఇచ్చింది. తరువాత అతని కాలులో ఉన్న బూట్సు తీయడానికి అతని కాళ్ళముందు కూర్చుంది. రామభద్రన్, తలెత్తి, నోరు తెరిచి మాత్రలు మింగి, ఒక గుక్కెడు పాలు తాగినప్పుడు అతని పిల్లి కళ్ళు గోడని ఆనుకున్న ఆ సూట్ కేసుని తేరిపారి చూసాయి. నోటిలోనిది మింగినవెంటనే "ఇదేం పెట్టి? ఇదెలా ఇక్కడికి వచ్చింది" అని అతను బెదిరించారు.

కుంజమ్మాళ్ కన్నులు ఒక క్షణం మాపుకున్నాయి; సర్దుకొని, సంతాపంతో అతని మొహం చూస్తూ, ఒక అడుగు వెనకాడి, హీన స్వరంతో చెప్పింది: "ఇందు వెళ్ళిపోయింది . . . వాడు వచ్చాడు, వాడితో . . . " అని ఆమె చెప్పి ముగించడానికి ముందే అతని చెయిలోని పాలు గ్లాసు కుంజమ్మాళ్ కుడి చెవికి పక్కన రింగుమని ఎగిరి వచ్చి, గోడమీద వాలింది.

విశ్వరూపం ఎత్తినట్టు అతను లేచి నిలబడ్డారు. అతని పిల్లి కళ్ళు పులి కళ్ళుగా అయపోయాయి.

"అప్పుడు మీరందరూ ఏం చేస్తున్నారు?" అని అతని కూత ఆ వీధిలో ఉన్నవారందరినీ అడుగుతున్నట్టు ఘోషించింది. అక్కడున్నవారెవరూ అతనికి జవాబు చెప్పలేదు, అతనూ ఎదురుచూడలేదు.

అతను తన బూట్సు కాలుని నేలమీద గట్టిగా బాదారు. "అది వెళ్ళిపోయిందట, ఇది నాకు చెప్తోంది! అవును, మరి . . . మీలాంటి పెట్టిబాగులు ఉంటే దాన్నెందుకు, నిన్నుకూడా ఈడ్చుకొని వెళ్ళివుంటాడు! . . . హూం, అదెక్కడికి పారిపోతుంది? చూడు, తెల్లవారేముందే దాన్ని తీసుకువస్తాను . . . " అని బిగ్గరగా శపథం చేసారు. రామభద్రన్.

"ఇప్పుడు నువ్వు ఎక్కడికిరా వెళ్తున్నావ్?" అని అతన్ని అడిగింది, అతని వెనుకనే వచ్చిన తల్లి.

"నేను ఎక్కడికీ వెళ్ళలేదు, పోలీసుకి ఫోను చేస్తున్నాను" అని అంటూ రామభద్రన్ ఫోను ఉన్న మేజాని చేరుకొని రిసీవరు అందుకున్నారు. అతను డయలు తిప్పడానికి ముందే, చాలా శ్రమతో కుంజమ్మాళ్ చెప్పింది: "పోలీసు ఏం చేస్తుందని? ముందులాగ అది మైనరు పిల్ల కాదే?"

రామభద్రన్ తిరిగి, కుంజమ్మాళ్ని ఒక చూపు చూసి చెప్పారు: "దానిమీద వెయ్యి రూపాయలకి పైగా నగలున్నాయే . . . అందువలనే దానితో పారిపోయాడాని నేను అప్పుడే రిపోర్ట్ చేసాను . . . " అని అంటూ డయలు తిప్పడం ఆరంభించారు.

"ఇదిగో మీ వెయ్యిరూపాయల నగలు . . . అన్నీ - ఒక తిరుగడ కూడా వద్దని - ఒలుచుకొని అది వెళ్ళిపోయింది . . ." అని తను చెయి నిండా తెచ్చిన నగలు మేజామీద పెట్టి కుంజమ్మాళ్ ధైర్యంగా నిలబడింది.

అతను మోజెయితో ఆ నగలు తోసారు.

"పిచ్చిదానా! నువ్వు నాకు చట్టం నేర్పుతున్నావా? దొంగని దొంగ అని కోర్టు నిశ్చయించుతుంది! 'వాడు దొంగ' అని నేను చెప్తే వాళ్ళు పట్టుకుంటారు . . . " అని అతను మూర్ఖంగా అనగానే కుంజమ్మాళ్ కూడా అదే మూర్ఖంతో అతనికి చెప్పింది:

"మీరు 'వాడు దొంగ' అని అంటే నేను 'కాదు!' అని సాక్ష్యం చెప్పుతాను."

రామభద్రన్ తల కోపంతో దహించింది.

కుడి చెయిలో ఫోను రిసీవరుతో, ఎడం చెయితో, ఒక పట్టులో, ఆమెను చితకగొట్టడానికి సిద్ధమైనట్టు అతను చెయెత్తి లేచినప్పుడు అతని తల్లి పరుగెత్తుకొని వచ్చింది.

"ఎందకురా దెయ్యం పట్టినట్టు నిలబడతావ్? కొంచెం ఓర్పుతో ఆలోచించు . . ." అని ఆవిడ కొడుకుని బతిమాలింది.

అతని చూపు ఆమెని దాటి తల్లి వెనుక నిల్చున్న కుంజమ్మాళ్ మీద పడింది.

"అమ్మా, జరుగు . . . నాకు విరుద్ధంగా సాక్ష్యం చెప్తుందట ఇది . . . " అని గర్జిస్తూ అతను, ఎగిరి, కుంజమ్మాళ్ని పట్టుకున్నారు.

రామభద్రన్ చెయిని పట్టుకొని అతని తల్లి అరిచింది: “అవునురా, నేనూ చెప్తాను! ముందు నన్ను చంపు! నేనే ఇందుని పంపాను, నన్ను చంపేయ్ . . . ” అని దెయ్యం పట్టినట్టు అరిచింది.

అతని కళ్ళు గిరగిర తిరిగాయి.

‘ఇది సహించలేని ఒక ద్రోహం. ఊపిరి ఉన్నంతవరకూ తను భరించలేని ఒక అవమానం జరుగుతోంది. తనచుట్టూవున్న బంధువులే - కన్న తల్లి, పెళ్ళాడిన భార్య, తన పిల్లలు - కుట్ర చేసి తనకి శాశ్వతమైన విరోధులైపోయారు!’ అనే భావనతో అతనిలో అలవాటుగా లేచే ఆ బిగ్గర కంఠధ్వని కంఠంలోనే చిక్కుకొని, అణగిపోయింది.

విపరీతమైన ధ్వనిలో బొబ్బరిస్తూ అతను టెలిఫోనుని గట్టిగా నేలమీద బాదారు. మరు క్షణం అతని ఆజానుబాహ దేహం వేటువేసిన ఒక వృక్షంలాగ కూలిపోవడం చూసి కుంజమ్మాళ్ పరుగెత్తుకొని వెళ్ళి అతన్ని పట్టుకుంది.

“రాము! . . . రాము! . . . ” అని ముసలమ్మ వాత్సల్యంతో అరిచింది.

“మరేం లేదు . . . మూర్ఛబోయారు . . . ” అని అత్తగారికి ధైర్యం ఇచ్చిన కుంజమ్మాళ్, డాక్టరుకి ఫోను చెయ్యడం అసాధ్యమని నేలమీద పడివున్న చితికిన ఫోను చూసి తెలుసుకుంది. చేతులు పిసుక్కుంటూ “అంబీ, నువ్వు వెళ్ళి డాక్టర్ని పిలుచుకురా!” అని మేడమీదకి పరుగెత్తింది.

అంబీ మేడమీదనుంచి పరుగెత్తుకొని వచ్చాడు. ఒక క్షణం ఏమీ బోధపడక, సోఫా మీద కాళ్ళు చాటి పడుకున్న నాన్నగారిని చూసాడు. మరుక్షణం వీధిలో దిగి, డాక్టరుకోసం చీకటిలో పరుగెత్తాడు.

“అంబీ, నేనూ వస్తానురా . . . ” అని అంటూ విజయా వాడికి తోడుగా పరుగెత్తింది.

నాన్నమ్మ తను రోజూ పూజంచే అన్ని దేవుళ్ళనీ వేడుకుంటూ కన్నీరు కార్చింది.

కుంజమ్మాళ్ దేవుడు తనకి అనుగ్రహించిన ఒకే చిహ్నాని - మంగళ సూత్రం - కళ్ళలో ఒత్తుకుంటూ డాక్టరుకోసం కాచుకొని ఉంది.

మేడమీద వసారాలో నిల్చున్న నల్ల పిల్లి తల వొంచి కింద ఏం జరుగుతుందని చూసింది.

** ** **

అసలు మనిషి ఒక పురాతన లోహమే. కాలమే అతనికి కొత్త కొత్త ప్రతిమలు ఇచ్చి పోషించుతోంది. జీవితంలో ఏర్పడే నిర్బంధాలకి లోబడినవారు వంగుతారు; వంగలేనివారు పగిలిపోతారు.

వంగినా, పగిలినా, కాలం కొత్తకొత్త ప్రతిమలని సృష్టి చేసి మానవ జీవితంని కొనసాగించుతోంది.

ఈ కుటుంబం కాలంకి అనుగుణంగా వంగిందా, లేక పగిలిందా?

డాక్టరు రానీ, తెలిసిపోతుంది!

********

**(మూలం: ప్రచురణ, ఆనంద వికటన్, 1965)**

# ఎన్ని కోణాలు! ఎన్ని చూపులు!

గభీమని గతిలేని ఒక స్థితిలో ఏకాంతంగా, ఎవరూ ఓదార్చలేనట్టు, నిరాదరువుగా తన్ను వదిలేసినట్టు రాజలక్ష్మి అల్లాడిపోయింది.

గడచిన అర్ధగంటనుంచి ఇంటి ముందు హాలులో ఒక సోఫాలో చంచల మనసుతో కూర్చున్న యజమానిని చూసి వంట మనిషి శంకరి అవ్వ మెల్లగా నడిచివచ్చి ఆవిడ పక్కన నిల్చుంది.

తను వచ్చి నిలబడినది గుర్తించక ఏదో ఆలోచనలో మునిగిపోయిన రాజలక్ష్మిణిని చూసి "ఏమే రాజం, నువ్వెలాగో ఉన్నావ్, నీకేమైందే?" అని అవ్వ అభిమానంతో అడిగింది.

"ఏమీ లేదు. ఉత్తికే కూర్చొనివున్నాను . . . మీ పనులు మీరు చూసుకోండి," అని అంది రాజం.

అవ్వ ఒక క్షణం రాజలక్ష్మిని తేరిపారి చూసింది. వెంటనే ఒక చిరునవ్వు నవ్వి,"ఓహో, ఈ రెండురోజులూ పిల్లలతో ఇంటికి వచ్చిన అమ్మాయలూ, అల్లుళ్లూ అందరూ వెళ్ళిపోయారని నీకు బాధగా ఉందా? బాగుందమ్మా నీ న్యాయం! మహారాజులాగ అబ్బాయికి ఒక పెళ్ళి చేసి ఈ ఇంటిలోని పిల్లల్ని ముద్దాడకపోయావా? కూతుళ్ళ  పిల్లల్ని కలకాలం నమ్ముకుంటే ఎలాగ?" అని ఒక ప్రశ్నని సాగదీసి అడుగుతూ వంటగదికి  నడిచింది.

అవ్వ చెప్పినది నిజం, కాని రాజలక్షి మొహంలో కనిపించే కలవరంకి అది పూర్తి కారణం కాదు.

ఆవిడ కొమార్తెలు, పిల్లలు చాలా సార్లు - తరచుగా - ఇంటికి వస్తూ పోతూనే ఉన్నారు. పండుగలు, పర్వాలు అంటే చాలు, ఇద్దరు కొమార్తెలు, అల్లుళ్ళు ఇక్కడే మకాం. అందువలన వాళ్ళకి లాభం; రాజలక్ష్మికి, ఆమె కొడుకు మురళీకి తృప్తి. జ్యేష్ట

కుమారుడు - ఒకడే కొడుకు - ముప్పైయైదు నిండినా బ్రహ్మచారిగా, నెలా వెయ్యిరూపాయలకిపైగా జీతంతో, కారూ, బంగళాతో ఉన్నప్పుడు అతని చెల్లెళ్ళు ఎలాగ ఒంటరిగా మెట్టినిల్లులో ఉండడానికి ఇష్టపడతారు? వాళ్లు ఇష్టపడినా, ఆ తల్లి ఊరకే ఉంటుందా?

అందువలనే ఆ ఊరులోనే నివసించే తన కొమార్తెలు, పిల్లలు అర్ధగంట ముందు తమ తమ ఇంట్లకి తిరిగివెళ్ళిపోయారనే కారణం వలన తనకి బాధగా ఉందని శంకరి అవ్వ అజ్ఞానంతో పలికిన మాటలు గుర్తు చేసుకొని రాజలక్ష్మి తనలో నవ్వుకుంది.

మంచి వేళ! సుబ్బు శాస్త్రి వచ్చినప్పుడు, ఆ ఘటన జరిగినప్పుడు, శంకరి అవ్వ మద్యాహ్నం వంటపనులు ముగించుకొని ఇంటి వెనుక భాగంలో గుఱకపెట్టి నిద్రపోతోంది.

అవ్వ ఆ ఇంటికి దాదాపు ఒక దూరపు బంధువే. కాని ఆ ఆ ఉనికికి తగినట్టుగా గుణాలు చోటుచేసుకోవడం సహజమే కదా? అందువలన నౌకరులకి కొన్ని సంగతులు తెలియకపోవడం మంచిదే!

కాని ఆ ఇంటిలో జరిగే ప్రతీ చలనం, ముఖభావం చూసిన క్షణమే మనసుని పూర్తిగా గ్రహించే నైపుణ్యం ఆవిడకి ఉంది! శంకరి అవ్వ అన్నీ తెలుసుకుంటుంది, ఒక అభిప్రాయమూ తనలో ఏర్పరచుకుంటుంది, కాని దేనిగరించి ఎవరితోనూ మాటాడదు! అవును, ఆవిడ ఆ ఇంటిలో కేవలం ఒక వంటమనిషి మాత్రం కాదు! ఏ నౌకరు యజమానిని 'ఏమే' అని పిలవగలదు?

రాజలక్ష్మి ఎదుట మేజామీద రెండు నోటు పుస్తకాలున్నాయి.

అవి రెండూ రెండు వేరే వేరే జాతకాలు. మేజామీదున్న తన అందమైన బంగారు ఫ్రేం కట్టిన కళ్ళద్దాలని తీసుకొని, ధరించి, ఆ రెండిటినీ ఆవిడ విడిచి విడిచి చూసింది. ఆ తరువాత వాటిలో ఒకటి తీసుకొని మేజా అరలో భద్రపరచింది; ఆ రెండవ జాతకంని జుగుప్సతో చూసింది.

"ఈ సంబంధం వొద్దు, ఇది జరగనే కూడదు!" అని దృఢంగా గొణుక్కుంటూ, కళ్ళద్దాలని తీసి తలెత్తి చూసినప్పుడు ఆవిడ చూపు గోడమీదున్న, గతించిన తన భర్తపై వాలింది; అతను తన్ను తేరిపారి చూస్తున్నట్టనిపించింది.

ఆ ఫోటో చూసినప్పుడు - పదేళ్ళ మీనా, ఆరేళ్ళ కమల - తన ఇద్దరు కొమార్తెలని నిరాదరువుగా వదిలేసి అతను కన్ను మూసిన రోజుల్లో తనకేర్పడిన బాధ్యతలు, వాటిని భరించి తను ముందుకు సాగడానికి నమ్మకం, విశ్వాసం ఇచ్చిన మురళి బాల్యరూపం ఆవిడకి గుర్తులోకి వచ్చింది.

వాడే ఇన్ని శ్రమల మధ్య, నిరుపేద జీవితంలో ప్రయాసపడుతూనే ఇవాళ ఉన్న ఈ అంతస్తుకి పెరిగి ఆ నమ్మకం, కలలు, కల్పనలు, సఫలం చేసాడు. ఇరవై ఐదు సంవత్సరాలు నిండకుండానే ఒక తండ్రి స్థానంలో వాడెలాగ ఓర్పు, బాధ్యతలు వహించి తన చెల్లెళ్ళకి తగిన వరులకోసం వెతికాడు! ఇవాళ మీనా, కమల తమ అంతస్తుకు పైగా అనుభవించే భర్తలు, సుఖప్రద కాపురాలు, ఆ రోజుల్లో కల్పనకూడా చేసి ఉండరే?

అప్పడాలు వొత్తుతూ, శంకరి అవ్వకి వంటలో సాయంకని ఆవిడతో వెళ్తూ, పెనుగులాడిన తనకి ఈ రోజు కారు, బంగళా, పట్టు చీరలు, బంగారు ఫ్రేం కట్టిన కళ్ళద్దాలు, ఉన్నాయంటే అందుకు మూల కారణం మురళీయే కదా? ఆ రోజుల్లో మనుగడ కోసం తను నమ్ముకున్న శంకరి అవ్వకి ఇప్పుడు తనింట్లోనే వంట మనిషిగా ఆశ్రయం ఇచ్చి తన్ను ఈ ఇంటి యజమానిగా గౌరవంగా జీవించడానికి దోహదం చేసినది ఎవరు?

అందువలనే రాజలక్ష్మికి మురళి మీద - తన కొడుకే ఐనా - గొప్ప మాన్యత, గౌరవం ఉన్నాయి. వయసు ముప్పై అయిదు నిండినా తన పెళ్ళి గురించి ఏ ఆలోచనా లేకుండా రాత్రి పగలూ పని చేస్తూ ధనం, పేరు, ప్రతిష్ట, వోగు చేస్తున్న వాడితో పెళ్ళి గురించి మాటాడానికి రాజలక్ష్మికి ధైర్యం లేదు.

అంత గౌరవప్రద కుమారుడు ఇప్పుడు పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించి, తనే ఒక అమ్మాయి జాతకంని సుబ్బుశాస్త్రికి ఇచ్చి పొందిక చూడమని చెప్పాడని సుబ్బుశాస్త్రియే ఆ మధ్యాహ్నం ఆవిడకి చెప్పినప్పుడు తన జీవితం సఫలమైందని రాజలక్ష్మి ముప్పొంగిపోయింది.

సుబ్బుశాస్త్రిగారు ఈ కుటుంబంకి సంబంధించినంతవరకూ ఊరకే జోస్యులు మాత్రమేకాదు. ఈ కుటుంబం శ్రేయంలో అతనికి మంచి ఆసక్తి ఉంది. మురళి తండ్రికి

అతను ఆత్మీయ మిత్రుడుకూడా. అందువలనే అతని ద్వారా ఈ సంగతి తన కుటుంబ సభ్యులకి తెలియజేయాలని మురళి నిశ్చయించాడు.

ఆ మధ్యాహ్నం - మురళి చెప్పినట్టు - కమల, మీనా తమ భర్తలతో ఇంటికి వచ్చినప్పుడు - ఆ రెండు జాతకాల పొందిక గురించి మాట్లాడి, అందరి అభిప్రాయాలు తెలుసుకోవాలని వచ్చిన శాస్త్రిగారు జాతకాల పొందిక వివరించడంతో తన బాధ్యత తీరిపోయిందని భావించలేదు.

"ఇది శ్రేష్ఠమైన పొందిక," అని అతనన్న మాటలు వినగానే, రాజలక్ష్మి అమ్మాయి ఎవరు అని ఆలోచించకుండా, "ఇప్పుడైనా పెళ్లిచేసుకోవాలని దేవుడు మురళికి బుద్ధి ఇచ్చాడే, మంచిది" అని సంతోషంతో ఒక నిట్టూర్పు వదిలింది. అదే సమయం పెద్ద కూతురు కమల భర్త మొహం చిరచిరలాడడం సుబ్బుశాస్త్రి గమనించారు.

తల్లీ, చెల్లెళ్ళని నేరుగా కలుసుకోకుండా ఒక మూడవ మనిషి ద్వారా తను చూసిన అమ్మాయి గురించి అన్నయ్య తమకు తెలియజేయడంలో కమల, మీనాకి మురళి చేష్టలో ఉపేక్ష కలిగింది.

తన సంతోషం, సంతృప్తి మరెవరూ పంచుకోలేదని కలవరపడి రాజలక్ష్మి ప్రతీ ముఖం చూసింది. ఆ అసంతృప్తికర నిశ్శబ్దంలో మీనా భర్త మాటాడాడు: "ఈ పెళ్ళికి మీ అబ్బాయికి బుద్ధి ఇచ్చినది - మీరనుకుంటున్న దేవుడు కాదు కాదండి! అది శని భగవంతుడు!"

"అయ్యో, ఇదేం అపశకునం!" అని రాజలక్ష్మి రెండు చెవులూ మూసుకుంది.

అప్పుడే సుబ్బుశాస్త్రి గరగరమని శబ్దం చేస్తూ మాటాడారు. "మురళి నన్ను జాతకాల పొందిక మాత్రం చూడమన్నాడు. ఇవాళ మురళి ఎంత అంతస్తులోవున్నాకూడా వాడు నా అన్యోన్యమైన స్నేహితుడు శివరామన్ కొడుకేకదా? ఆ శివరామన్ ఒక పేద గుమాస్తాపే, కాని అతని కుటుంబం ఆచారమైన, గౌరవమైన కుటుంబం అని అందరికి తెలుసు. ఆ గౌరవంకి భంగం రాకూడదని నాకుంది. అదే మీ అల్లుడుగారు కూడా చెప్తున్నారు. అమ్మాయి గురించి అతనికి తెలుసు అని నా అభిప్రాయం. అవునా?" అని అతను అడగడానికి ముందే మీనా భర్త, "అదేం "పెద్ద రహస్యం కాదే? ఆ అమ్మాయిని చూసి ఊరంతా నవ్వుతున్నారే? అది మరెవరో కాదు,

ఈ నోటిసులోని అడ్రసు చూడండి! మన కాలనీలోనే Sixth Main Street లో ఉన్న Playback Singer ప్రమీళనే మీ అన్నయ్య ఎంచుకున్నాడు!" అని మండిపడుతూ మీనాకి వివరించాడు.

"ఇదేం గ్రహచారం!" అని రాజలక్ష్మి నెత్తిని బాదుకుంది.

అవును. ఆ గాయకి ప్రమీళ గురించి ఊరులో అందరూ అధికంగానే మాటాడుకుంటున్నారు. ఆ మాటల్లో ఎంత నిజం ఉందని మాటాడేవారికి, వింటున్నవారికి, ఏ చింతా లేదు.

ఆ సాయంకాలం, బయలుదేరి వెళ్ళేవరకు, రాజలక్ష్మి కొమార్తెలు, అల్లుళ్ళు, ఆ ప్రమీళ గురించి తెలిసిన, తెలియని, కబుర్లు మళ్ళీ మళ్ళీ మాటాడుకున్నారు:

'దాసోహం' అని వశమైపోయి, ఆమె ఇంటిలోనే నిలకడగా బస చేస్తూ, ఆమె దయలో బతికే ఆ మన్నార్గుడి రాజగోపాలన్ గురించి;

వాడు బాగా తాగేసి కారుని నడిపే విధం గురించి;

గిండి రేసులో డబ్బు తగలపెట్టి వాడు తిరిగివచ్చినప్పుడు నిషాలో, ప్రజ్ఞ తప్పి సైదాపేట్ వంతెన దగ్గర ఎదుట వచ్చే లారీతో ఢీకొట్టుకొని మరణించిన విపత్తు గురించి;

ప్రమీళ మీదున్న మోహం వలన తన భార్యని, పిల్లని వదలిబెట్టి, ఆమె కోసం తన ఆస్తిని పోగొట్టుకున్న వివరాల గురించి . . .

ఇవన్నీ తమకిష్టం వచ్చినట్లు వారందరు మాటాడుతుంటే రాజలక్ష్మి బెంగతో, తల వంచి, మౌనంగా వింటోంది.

ఆఖరికి వాళ్ళందరు సెలవు తీసుకున్నప్పుడు "వచ్చే ఆదివారం మురళీ పుట్టినరోజు. మీరందరూ రండి!" అని రాజలక్ష్మి అల్లుళ్ళకి చెప్పింది.

అప్పుడే కమల భర్త నిర్మొహమాటంగా జవాబు చెప్పాడు:

"ఇక మేం మీ ఇంటికి రావడానికి ముందు ఈ పెళ్ళి సంబంధం గుంచి మీ నిర్ణయం ఏమిటో మాకు తెలియాలి," అని చెప్పి తన తోటల్లుడిని చూసి, "నేనన్నది సరేనా?" అని అడిగాడు. అతను మాత్రమే కాదు, మీనా, కమల కూడా అతనితో ఏకీభవించి "అమ్మా, విను, ఈ పెళ్ళి సంబంధం అన్నయ్య మానుకోవాలి. లేకపోతే ఈ ఇంటికీ, మాకూ పొత్తులేదని అన్నయ్యకి చెప్పేయ్!' అని వక్కాణించి చెప్పేసారు. గభీమని

గతిలేని ఒక స్థితిలో ఏకాంతంగా, ఎవరూ ఓదార్చలేని పరిస్థితిలో రాజలక్ష్మిని వదిలేసి అందరూ వెళ్ళిపోయారు.

'వాళ్లు చెప్పినది సరే,' అనే భావనతో తన కొడుకుతో ఈ పెళ్ళి సంబంధం గురించి ఎలా మాట్లాడి, ఈ ప్రయత్నం ఆపడం?" అని ఆలోచిస్తూ రాజలక్ష్మి చాలా సేపు హాలులో, సోఫాలో కూర్చొనివుంది.

వంటగదిలో పనిచేస్తున్న శంకరి అవ్వ మాటి మాటికి రాజలక్ష్మిని చూస్తూవుంది.

ఆవిడ మనసులో "ఛీ, ఈ ఆడజన్మకి ఎంత స్వార్థం! దీనికి తనూ, తన కొమార్తెలు హాయిగా ఉంటే చాలు! వాడు ఎంత కఠినంగా పని చేసి ముసలాడైపోయినా ఇది ఎప్పుడూ ఇలాగే ఉంటుంది! . . . వాడికి పెళ్ళి అని వినగానే, ఈ కూతుళ్ళు మూతిముడుచుకున్నారు! పోనీలే, వాళ్ళు పెళ్ళైయి వేరే ఇళ్ళలకి వెళ్ళిపోయారు, మరి కన్న తల్లికి కూడానా? ఇప్పుడేం కొంప మునిగిపోయిందని రాజం ఇలా అల్లాడుతోంది? 'కొడుక్కి పెళ్ళి!' అనే సంతోషం మొహంలో రవంతైనా కనిపించదే? దేవుడా, ఆడపిల్లల్ని ఎందుకు ఇంత బలహీనంగా సృష్టించావ్?" అని ఆ మధ్యాహ్నం జరిగిన ఘటనలని అస్పష్టంగా గ్రహించిన అవ్వ తనలో చిరచిరలాడింది.

ఇలాగే జీవితంలో ఒకరి గురించి ఒకరు తమకి తెలిసిన ఒకే కోణంనుంచి, ఒక భాగం మాత్రం అవగాహన చేసుకొని, ఒక నిర్ణయంకి వచ్చి, అదే ఒక సమస్తమైన నిర్ణయం అని నొక్కిచెప్తుంటారు.

** ** **

వాడుకగా శంకరి అవ్వ వంటపనులన్నీ పూర్తిచేసుకొని రాత్రి ఎనిమిదన్నర గంటలకి వసారాలో పడక విరిచి నిద్రపోయింది. వయసు చెల్లిన కాలంలో కఠినంగా చాకిరీ చెయ్యడం వలన పడుకున్న కొన్ని నిమిషాలలోనే ఆవిడ నిద్రపోతుంది. కాని ఇవాళ మధ్యాహ్నం మాత్రమే కాదు, ఇప్పుడుకూడా . . . ఆవిడ గురక మాత్రం వదలుతోంది.

తొమ్మిది గంటలు అవగానే బంగళాకి ముందున్న చెట్లమీద కాంతిని వెదజల్లుతూ మురళీ కారు గేటుముందు వచ్చి ఆగింది. మురళీ తనే కారునించి దిగివచ్చి గేటు తలుపులు తీసి, కారుని షెడ్డులో పెట్టి, ఇంట్లోకి వచ్చి, మేడమెట్లు ఎక్కి తన గదికి

వెళ్ళాడు. పావుగంట తరువాత దుస్తులు మార్చుకొని డైనింగ్ హాలుకి వచ్చాడు. ఆ తరువాతే రాజలక్ష్మి సోఫానుంచి లేచి వచ్చింది.

వాడికి అన్నం వడ్డించినప్పుడు, ఆమె తన్ను చూడనప్పుడు, కొడుకు తల్లిని చూసాడు; వాడు భోజనం చేస్తున్నప్పుడు, తన్ను చూడనప్పుడు, తల్లి వాడిని చూసింది. చూపుల ద్వారానే తల్లీ, కొడుకు భావనలని ఊహించుకున్నట్టనిపించింది.

ఆ మౌనంలోని భారంని కొంచెం తగ్గించాలని మురళీయే ముందు మాటాడాడు: "కమలు, మీను ఎన్ని గంటలకి వెళ్ళారు?"

"నువ్వు రావడానికి ఆలస్యమవుతుందని చెప్పావుకదా? . . . అందువలన కాచుకోవద్దని మధ్యాహ్నమే వెళ్ళిపోయారు."

డైనిగ్ హాలులో సంభాషణ ఆరంభమగగానే వసారాలో నిద్రపోయే శంకరి అవ్వ గురక శబ్దం తక్కుతూ వచ్చింది.

"మధ్యాహ్నం సుబ్బుశాస్త్రిగారు వచ్చారు."

ఒంగిన తల ఎత్తకుండా మురళీ 'హుమ్' అన్నాడు.

అవ్వ నిద్రపోతోందని ఖాయం చేసుకున్నతరువాతే రాజలక్ష్మి ఆ సంగతి గురించి మాటాడం ఆరంభించింది:

"అతను ఆ జాతకం గురించి మాటాడానికే వచ్చారు. జాతకాల పొందిక బాగానే ఉందన్నారు, కాని . . . "

భోజనం చేస్తున్న మురళీ తలెత్తి చూసాడు. అదే సమయం వసారాలో తేలికగా వినబడుతున్న గురక శబ్దం పూర్తిగా ఆగిపోయింది.

"ఆ పిల్లగురించి ఊరులో అందరూ గాలిమాటలాడుతున్నారు . . . నీకు తెలీదేమో? . . . తెల్లగా కనిపిస్తే అది స్వచ్ఛమైన పాలని నీ నమ్మకం . . . మీనా భర్త కూడా ఆక్షేపించారు . . . వాళ్ళెవరికీ ఈ సంబంధంలో ఇష్టం లేదు . . . అసలు అమ్మాయి ఎవరని నాకు ముందు తెలీదు, నువ్వు ఇలాంటి అమ్మాయి జాతకం తెస్తావని నేను ఊహించగలనా? ఇన్నిరోజుల తరువాత నువ్వు నీ పెళ్ళి గురించి ఆలోచిస్తున్నావని నేను మురిసిపోయాను . . . అవును, నీకు దాని కులగోత్రాల గురించి ఏమైనా

తెలుసా?" అని తొందరగా, ఆవేశంతో రాజలక్ష్మి అడగ్గానే మురళి ఒక చిరునవ్వు నవ్వి నిదానంగా జవాబు చెప్పాడు.

"తెలుసు అని అన్నవాళ్ళందరికీ ఎంతవరకు తెలుసని నాకు తెలుసు; నీ ఉద్దేశం ఏమిటో చెప్పు!"

"ఈ పెళ్ళి సంబంధం మానుకోపోతే 'ఈ ఇంటికీ, మాకూ పొత్తులేదని అన్నయ్యకి చెప్పు!' అని చెప్పేసి మీనా వెళ్ళింది . . . . "

"మీనా అలాగ చెప్పిందా? బాగుంది!" అని ఆమె కోపంని విని ఆనందించినట్టు మురళి నవ్వాడు.

"మీనా మాత్రం కాదు . . . అందరూ అలాగే మాటాడారు . . . ఇక ఈ ఇంటి గుమ్మం కూడా ఎక్కడం జరగదన్నారు . . . సుబ్బుశాస్త్రికి కూడా ఈ సంబంధంలో తృప్తి లేదు . . . "

తన తల్లి అందరి అసంతృప్తి, నిరాకరణ వివరించి చెప్పడం సహించలేక మురళి తటాలున అడిగాడు: "అమ్మా, సుబ్బుశాస్త్రి, పప్పుశాస్త్రి సంగతి అలాగే ఉండనీ . . . నాకు నీ అభిప్రాయమే ముఖ్యం . . . అది నువ్వే నాకు చెప్పడానికి వెనకాడుతావని నేను సుబ్బుశాస్త్రికి చెప్పి పంపించాను. ఇక నీ మనసులో ఏముందో చెప్పు!"

కొంచెం సేపు గూఢంగా ఆలోచిస్తున్నట్టు రాజలక్షి మౌనం వహించి ఆ తరువాత మాటాడింది: "వాళ్ళు చెప్పేది న్యాయమని నాకనిపిస్తోంది. మన గౌరవంకి ఈ సంబంధం వొద్దు అని నా అభిప్రాయం." అలా అన్న తరువాత తన సందేశం ఖాయపరిచే ధోరణిలో "అదే నా అభిప్రాయం!" అని ముగించింది.

"ఓ, అలాగా? సరే, అమ్మా, నువ్వు చెప్పినట్టే నేను చేస్తాను. ఈ పెళ్ళి జరగదు!" అని చెప్పి, మురళి భోజనం ముగించి చెయి కడుక్కోడానికి పెరడుకి వెళ్ళాడు.

మురళి ఒక నిమిషం తల వంచి ఆలోచించాడు; తల్లి మొహాన్ని తేరిపార చూసాడు; ఏదో ఆలోచనలోపడి తల ఊపాడు.

"మురళీ, నేనూ బాగా ఆలోచించాను: నీకు నలుగురుకి బుద్ధి చెప్పే త్రాణ ఉంది. చిన్న వయసులోనే నువ్వు చాలా బాధ్యతలు తీసుకొని పెద్ద మనిషిగా పెరిగావ్. నువ్వుకూడా ఇలాంటి పొరబాటు చెయ్యగలవా అని నేనూ బాగా ఆలోచించాను . . .

ఎంత పెద్ద మనిషి అయినా, నాలుగైదుసార్లు బాగా ఆలోచించి ఒక పని చెయ్యాలని నిశ్చయించినవారు కూడా ఇటువంటి విషయంలో ముందాలోచన లేకుండా తొందర పడతారు. అందుకే నేను ఇంత నిశ్చయంగా ఈ పెళ్లి వద్దంటున్నాను. కాని నీకు ఈ నెల పెళ్ళి జరగాలి. ఎంతమంది పోటీపడతూ తమ పిల్లలతో నీకోసం కాచుకొని ఉన్నారని నీకు తెలుసా?" అని ఆమె అనగానే మోహం తుడుచుకుంటున్న మురళి చెయిలోని తువ్వాలును పిసుకుతూ, తల వంచి, గరగరమని మాటాడాడు:

"అమ్మా, నీ మనసులో ఏముందో, ఇతరుల అభిప్రాయం ఏమిటో నేను తెలుసుకున్నాను. నీ మాట నేను వింటాను. ఇతరుల గురించి నాకు లెక్కలేదు. కాని నువ్వు నా మనసుని గ్రహించాలి. నేనేం పిల్లవాడిని కాదు, ప్రేమా, ఇదీ, అదీ అని కల్పించుకొని బాధ పడడానికి. నాకేమో అనిపించింది - నువ్వు వద్దంటే సరే. కాని ఇంకొక పెళ్ళిగురించి నాకు ఏ ఆలోచనా లేదు. దానిగురించి మాటాడవద్దు!" అని మురళి అన్న మాటలు వినగానే రాజలక్ష్మికి గుండెలో ఎలాగో అనిపించింది.

"మరి ఇప్పుడు కాకపోతే మరెప్పుడు నీకు నీ పెళ్ళిగురించి ఆలోచన వస్తుంది?" అని ఆరాటంతో అడిగింది.

"సరే, అసలు ఆ ఆలోచన ఇక రానేలేదనుకో, దానిగురించి ఇప్పుడు ఎందుకు?" అని చిరచిరలాడుతూ తువ్వాలుని పారేసి హాలుకి మురళి వెళ్ళిపోయాడు.

అతను వెళ్తున్న దిశని చూస్తూ అలాగే నిలబడిన రాజలక్ష్మి మనసులో రకరకాల ఆలోచనలు లేచాయి. వాటి భారం సహించలేక కుమ్మరించాలని గబగబ హాలుకి పరుగెత్తింది.

సోఫాలో వాలి మూసుకున్న కళ్ళతో కూర్చున్న మురళీ ఎదుట నిలబడి రాజలక్ష్మి "నీకు ఈ సంబంధంలోఇంత పట్టుదల ఉందన్నమాట! అది చూస్తే నాకు భయమేస్తుంది. నువ్వెందుకు నీకు పెళ్ళే వద్దంటున్నావ్? . . . ఒకవేళ పెళ్ళి చేసుకోకుండా ఆ గాయకురాలుతో . . . " అని తాను చెప్పదలచుకున్నది బాహటంగా చెప్పలేక ప్రయాసపడింది.

"అయ్యో, అమ్మా, నువ్వేమంటున్నావ్?" అని దయతో తల్లిని చూస్తూ మురళి లేచి నిలబడ్డాడు. "అమ్మా, నేను శివరామన్ గారి కొడుకుని. ఈ కుటుంబం గౌరవం నిలబెట్టే

బాధ్యత నాకుంది. నన్ను నమ్మి, నీకేం భయం వద్దు!” అని హామీ ఇచ్చి మేడమీదున్న తన గదికి మురళి వెళ్ళాడు.

ఆ రోజు రాత్రంతా నిద్ర లేక రాజలక్ష్మి మానసిక వ్యధతో పెనగులాడింది.

తన అభిలాషకి నిరాకరణ కలిగిందని తను రవంతైనా బాధపడనట్టు మురళి ప్రవర్తించాడు.

తల్లి బెంగపడుతున్నట్టు తనకి పెళ్ళే వద్దని, సన్యాసి జీవితం కావాలని మురళి నిర్ణయించలేదు. అటువంటి పిచ్చి దశలు అతను దాటి చాలా కాలమైంది. ఇల్లు వదలితే అతనికి వాణిజ్య సంబంధంలో వెయ్యి ప్రశ్నలు; వాటిమధ్య సంగీతంలో అతనికి ఉన్న అభిరుచి వలన ఈ గాయకురాలుతో పరిచయం ఏర్పడింది. ఒక ఘట్టంలో ఆమె ఒంటరిపాటు తెలుసుకున్న తరువాత మురళి తన ఏకాంతమూ గ్రహించాడు. అందువలనే ‘ఈమె నాకు భార్య అవుతే?’ అని ఒక ఆలోచన అతనికి తట్టింది. ఆ గాయకురాలులో కనిపించిన స్వభావం, సహజ గుణాలు, అతనికి నచ్చాయి. అందరూ ఏకీభవించితేనే ఆమెను తన భార్యగా చేసుకోవాలని మురళికి మనసులో ఉంది, అంతే! మరే విధమైన ‘మెలో డ్రామా’ ఏదీ వాళ్ళిద్దరిమధ్యా జరగలేదు.

ప్రేమ అని అన్నప్పుడు జాతకాల్లో పొందిక ఎవరికి కావాలి?

** ** **

ఆ మరుదినం మురళి అలవాటుగా ఆఫీసుకి వెళ్ళిన తరువాత ఒంటరిగా ఉన్న రాజలక్ష్మి తనకీ, తన కొమార్తెలకి జీవనాధారం ఇచ్చిన కొడుకు వాంఛకి తను అడ్డుగా నిలబడి వాడి హృదయంని చితకగొట్టినందుకు అంగలార్చుకుంది.

అప్పుడు శంకరి అవ్వ తన పనుల మధ్య దొరికిన అవకాశంలో హాలుకి వచ్చింది.

“ఏమే రాజం, ప్రొద్దున్న ఒక గుక్కెడు కాఫీ తాగేసి ఇలా కూర్చున్నావ్! స్నానం ఎప్పుడు?” అని అడుగుతూ అవ్వ ఆమె ఎదుట సెమెంట్ నేలమీద చెయిని ఆనుకొని కూర్చుంది.

రాజలక్ష్మి అవ్వని చూసి ఒక నిట్టూర్పు వదిలింది, మరేం అనలేదు.

"ఏమిటే, అలా చూస్తున్నావ్?" అని అవ్వ దగ్గరకి జరిగివచ్చి ఆమె చెయిని అభిమానంతో తీసుకొని అదుముకుంది. రాజలక్ష్మి కళ్ళు చెమ్మగిల్లాయి. అంతే! అవ్వ ఇక భరించలేకపోయింది. దేహంలో ఒక వణుకు; బయట ఒక వెక్కు; గొంతు ఉక్కిరిబిక్కిరియైపోయింది; మొహమూ, పెదిమలూ ఎఱ్ఱబారిపోయాయి. తలకప్పుని పైకిలాగ్గొని, కళ్ళు అదుముకొని "నాకన్నీ తెలుసులే! 'దీనికెందుకు?' అని మీరు తోసిపెట్టినా, నేనుకూడా ఒక భూతంలాగ ఒంటరిగా ఈ ఇంట్లో ఉన్నా, మురళి మనసు నన్ను ఆవరించుకొని ఉంది! వాడికి పెళ్ళయి, ఆ దంపతులకి వడ్డించకుండా నేను చావను, అది జ్ఞాపకం ఉంచుకో! నాకు మరేం సంతోషం కావాలి? నాకు మరెవరున్నారు చెప్పు, కొడుకా, కూతురా?" అని అవ్వ తనకి మురళిపట్ల ఉన్న సౌజన్యం తెలియజేసింది.

"ఎప్పుడైనా ఒకరోజు మురళి వంటగదికి వచ్చి, 'ఏమండీ, ఇవాళ ఏమిటి వంట?' అని అబిమానంతో నన్ను అడుగుతూ ఒక అప్పడం కొఱుకుతాడు. నేనూ వాడికి చెప్తాను: 'కుఱ్ఱవాడులాగ నన్ను వెక్కిరించడం నీకు అలవాటైపోయింది; నీకు ఒక అమ్మాయిని చూసి పెళ్ళి చేసుకోవడం చేతకాదు! మీ అమ్మా ఈ జన్మలో చూడదు!" అని. అవును, వాడికి పెళ్ళవలేదంటే దానికి నువ్వే కారణం! . . . హుం, ఇవాళ మురళి బాత్ రూమ్ నుంచి వస్తున్నప్పుడు చూసాను, వాడి జుత్తు బాగా నెరసిపోయింది! రాజం, నీకు నీ కూతుళ్ళూ, మనవలు చాలు! . . .

"ఇప్పుడెందుకు నువ్వు కొంప మునిగినట్టు ఇలా కూర్చున్నావ్? నువ్వు చూసిన అమ్మాయి వొద్దని వాడు అనలేదే? ఇప్పుడు వాడు చూసిన అమ్మాయి వద్దని మీరందరూ అంటున్నారు . . . ఎవరెవరికి మనసులో ఏముందో? నువ్వు వాడిని కన్న తల్లి, అందుకే వద్దని చెప్పేసినా నీకు చాలా బాధగా ఉంది . . . " అని అన్నప్పుడు అవ్వ తనకొక కొడుకు లేడని గుర్తు చేసుకొని దుఃఖపడింది. దాన్ని మింగుతూ ఇంకా చెప్పింది: "ఇంత అదృష్టం ఉన్నా నువ్వు అల్లాడిపోవడం చూసి నాకెలాగో ఉందే!" అని చెప్పి సగంలో వదిలేసిన పనులు పూర్తిచేయడానికి మళ్ళీ వంటగదికి వెళ్ళింది.

అవ్వ ఏం వట్టి వంటమనిషి కాదుకదా?

ఒక క్షణంలో తాను కూడా ఒకప్పుడు అవ్వలాగ ఉన్నప్పుడు ఆవిడ తనకు చేసిన ఆదరణ రాజలక్ష్మి గుర్తుచేసుకొని హాలునుంచి వంటగదికి వచ్చింది.

"మీరన్నది నిజం . . . కాని వాడు చూసిన అమ్మాయిగురించి ఊరులో అందరూ ఏమేమో మాట్లాడుతున్నారే?" అని రాజలక్ష్మి అడగ్గానే, అవ్వ ఒక నిమిషం ఆలోచించి చెప్పింది.

"ఇదిగో, రాజం, విను . . . మురళీ ఏమీ తెలియని కుఱ్ఱవాడా? కొంచెం ఆలోచించు! వాడికి ఈ వయస్సులోనే జుత్తు నెరసిపోయిందంటే ఏమిటి కారణం? వాడికి ఎన్ని బాధ్యతలున్నాయి! వాడికి ఇప్పుడు అందంని చూసి మైమరచే వయస్సు కాదు; ఇంత తెలిసిన వాడికి ఈ అమ్మాయి ఇష్టమంటే దానికి తగిన కారణం ఉండితీరాలి! . . . మీకు ఇష్టం లేదని 'వద్దు!', 'వద్దు!' అని అనడానికి ఆ కమలాకి, మీనాకి, ఎంత ధైర్యం!" అని అవ్వ చిరచిరలాడింది.

"మీరేమంటున్నారు? అన్నయ్య పెళ్ళిలో వాళ్ళకేం హక్కు లేదంటున్నారా?" అని రాజలక్ష్మి అడ్డు ప్రశ్న వేసింది.

"హక్కు, ఏం హక్కు? 'అన్నయ్య పెళ్ళి గురించి వాళ్ళకి శ్రద్ధ ఉందా?' అని అడుగుతున్నాను! ఉంటే ఇంత హుటాహుటిగా వద్దని చెప్పేస్తారా? నేనంటున్నది ఇదే - ఎవరినీ సంప్రదించకుండా నిర్ణయం చేస్తే అది కోర్టులో చర్చ లేకుండా చేసిన తీర్పులాగ!"

అవ్వ మాటలు, వాదం విని రాజలక్ష్మి ఆవిడకి మురళీ గురించి, తన కుటుంబం గురించి ఎంత బంధం ఉందని గ్రహించింది. "ఆహా, మీరు బాగా చెప్పారు! మీ ఆయన కోర్టులో వకీలు గుమాస్తాగా పనిచేసారుకదూ? అందుకే మీరు ఇన్ని points తో మాటాడుతున్నారు! " అని శ్లాఘించి రాజలక్ష్మి హాలుకి తిరిగి వచ్చేసింది.

ఆదే సమయం ఆవిడ మనసులో ఒక మంచి తీర్పు చోటుచేసుకుంది.

** ** **

'ఆ ప్రమీళని పెళ్లి చేసుకోవాలనే ఆలోచన మురళికి ఎలా వచ్చింది? అందుకు ఒక మంచి కారణం ఉందంటే ఆ నిర్ణయంకి విరుద్ధంగా వాదించడానికి ఎవరికి అధికారం ఉంది? అది పొరబాటు అని ఎవరెవరో చెప్పడం విని, వాడి మనసుని గాయపరిచిన

తరువాత నాకెందుకీ బతుకు?" అని అనేక విధాలుగా ఆలోచించిన రాజలక్ష్మి 'సరే, ఆ ప్రమీళలో ఏ విశేషం ఉందో చూద్దాం,' అని ఆ సాయంకాలం ఎవరికీ చెప్పకుండా ఇంటినుంచి బయలుదేరింది.

ప్రమీళ ఇంటికి వెళ్ళే దారిలో 'ఎవరో ఒక అమ్మాయివలన నా కొమార్తెలు, ప్రియమైన నా మనవలు, నాకు దూరమైపోతారా?' అనే భయం రాగానే, ఇంటికి తిరిగి పోవాలని ఆమె ఒక నిమిషం ఆలోచించింది: 'నాకు నా కొడుకుమీద అభిమానం లేదా?'

"నీకు నీ కూతుళ్ళూ, పిల్లలు హాయిగా ఉంటే చాలు!" అని ఆ ఉదయం శంకరి అవ్వ చెప్పిన మాటలు రాజలక్ష్మి గుండెని ఎత్తిపొడిచాయి.

రాజలక్ష్మి ఆ ఇంటిలోకి ప్రవేశించినప్పుడు, హాలులో తంబూరాని భుజంమీద ఆనుకొని, కళ్ళు మూసి, ప్రమీళ పాడుతోంది. ఆమె గానంకి అడ్డుబాటు వద్దని రాజలక్ష్మి మౌనంగా ఒక నిమిషం నిలబడి ఆ ఇంటిలో చూడడానికి తన కళ్ళకి ఎది సాధ్యమో అవన్నీ చూసింది.

ప్రవేశించగానే కళ్ళకి స్పష్టముగా కనిపించే ధోరణిలో 'వాడి' ఫోటో, దాన్ని చుట్టుముట్టుకొనివున్న ఒక పూలదండతో కనిపించింది. తరచుగా తమలపాకు నమలడం వలన అతని పెదిమలు నల్లబారిపోయాయి. కంఠంలో గొలుసు, సిగ అలంకరణ చూడగానే ఇతనే ఆ 'మన్నార్గుడి మైనరు' అని ఎవరైనా ఊహించుతారు. ఆ తరువాత రెండు పక్కలా దీపాలమధ్య త్యాగయ్య పఠం; ఒక మూల, ఒక చిన్న మేజామీద కనిపించిన ఆ ఫోటో - ఆమె ప్రమీళ తల్లి - అయివుండాలి; ఇవన్నీ ఒక నిమిషంలో రాజలక్ష్మి అర్థంచేసుకుంది.

'నన్ను పాలింప నడిచివచ్చితివో?' అని మోహన రాగంలో ప్రమీళ పాడుతుంటే రాజలక్ష్మి ఆమెను అంచనా వేస్తున్నట్టు చూసింది.

'ఆమె ఏం గొప్ప అందగత్తె కాదు; వయసు ముప్పైకి పైగానే కనిపిస్తోంది. ఆమెలో కనిపించే ప్రత్యేకత గానం మాత్రమే . . .' అని రాజలక్ష్మి ఆలోచిస్తున్న సమయం ప్రమీళ గభీమని కళ్ళు తెరిచి, పాట ఆపి, తంబూరాని గోడకి ఆనించి, లేచివచ్చి రాజలక్ష్మికి స్వాగతం చెప్పింది; ఇవన్నీ ఒక నిమిషంలో జరిగాయి.

"క్షమించండి . . . నేను మిమ్మల్ని చూడలేదు . . . కూర్చోండి!" అని హాలులో ఉన్న కుర్చీలలో ఒకటి చూపించింది.

"సరేలే . . . నువ్వు పాడమ్మా . . . " అంది రాజలక్ష్మి.

"రోజంతా నేను ఒంటరిగా పాడుతున్నాను కదా? నాలాంటివారికి మీ రాక ఒక దోహదం; . . . మీరు ఎవరని నేను తెలుసుకోవచ్చా?" అని ప్రమీళ భవ్యంగా అడిగింది. ఆమె మనసులో వచ్చిన స్త్రీ స్థానిక లేడీస్ క్లబ్ వార్షిక ఉత్సవంలో తన పాట కచేరీ గురించి సంప్రదించడానికి వచ్చిందేమో అని అనుమానం కలిగింది.

"నేనే మురళీధరన్ తల్లిని" అని రాజలక్ష్మి అన్న మాటలు విని ప్రమీళ ఒక క్షణం నివ్వెరపడింది. చేతులు జోడించి, "మీరుగాని కబురు పంపించివుంటే నేనే వచ్చివుంటానే?" అని అంది.

"లేదమ్మా, నిన్ను ఇక్కడ చూడాలని నేనే వచ్చాను" అని అన్న తరువాత రాజలక్ష్మి మౌనంగా తల వంచింది. ఆ సమయం ఉపయోగం చేసుకోవాలని కాఫీ చెయ్యడానికి ప్రమీళ వంటగదికి పరుగెత్తింది.

కొంచెం సమయం తరువాత ఇద్దరూ మాటాడవలసిన విషయం మాత్రం మాటాడకుండా వేరే వేరే కబుర్లు పరివర్తన చేసుకున్నారు.

ఐదారు సంవత్సరాలకుముందు తనకి సినిమాల్లో పాడడానికి ఛాన్సు దొరికిందని, ఇప్పుడు స్థానిక సభల్లో పాటకచేరీలకి పిలుపులు వస్తున్నాయని ప్రమీళ చెప్పింది. అందువలన తనకెటువంటి నష్టం లేదని, తనకి, ఒంటరి మనిషిగా, అదే చాలు అని తన తృప్తి తెలియజేసింది.

ఆ తరువాత రాజలక్ష్మి ఆమెగురించి మరి కొన్ని కబుర్లు అడిగి తెలుసుకుంది. క్రిందటి సంవత్సరం ప్రమీళ తన తల్లి పోయిన తరువాత ఒక పనికత్తె సాయంతో ఒంటరిగా జీవించుతోంది అని తెలియగానే రాజలక్ష్మి "అవునులే, నీకెలా మురళి తెలుసు?" అని యదేచ్ఛగా, చిరునవ్వుతో అడిగింది.

ప్రమీళ కూడా నిధానంగానే జవాబు చెప్పింది. "ఒకసారి అతని ఆఫీసు వార్షిక ఉత్సవంలో నేను పాడాను. అంతకుముందే చాలా సార్లు అతన్ని కచేరీలలో చూసివున్నాను; అతనికి సంగీతంలో మంచి అభిరుచి ఉందని మాత్రం అనుకున్నాను.

ఆ తరువాతే అతనొక పెద్దమనిషి అనికూడా గ్రహించాను. నా అమ్మ జబ్బుతో మంచమెక్కినప్పుడు, నా కారుని తీసుకొని వెళ్ళిన రాజు అంకుల్ దుర్ఘటనలో పోయినప్పుడు ఇతని సాయం లేకుంటే నా గతి ఏమైవుంటుందో? ఇతనే దేవుడులాగ . . . " అని ఆమె చెప్తూంటే రాజలక్ష్మి తనకి మంచి తరుణం దొరికిందని, "అవును, రాజు అంకుల్ అని అన్నావుగా, అతనెవరు?" అని అడిగింది.

ప్రమీళ ఆ పఠం చూపించింది.

"అతను - నాకు బంధువు కాదు . . . అతను ఊరులో ఉన్నప్పుడు నా పాట వినడానికి బ్రహ్మ ప్రయత్నం చేసేవారు; మా పొరుగింటి మనిషి; బోలెడు ఆస్తి . . . మీరు వినివుంటారు - మన్నార్గుడి మైనర్ రాజగోపాలన్ అని పిలుస్తారు. మా నాన్నగారు పోయిన తరువాత మాకున్న ఇల్లుకూడా అప్పుల వలన పోయింది. నేనూ మా అమ్మా అనాధగా నిలబడినప్పుడు ఇతనే మమ్మల్ని మద్రాసుకి తీసుకొనివచ్చి, పరిచయం ఉన్న నలుగురుతో మాట్లాడి నాకు సినిమాలో పాడడానికి దోహదం చేసారు. నా ఆదాయం వందలకొలదీ పెరిగిందంటే అందుకు రాజు అంకుల్ దయ, సహాయం కారణం . . . " అని అంటూంటే రాజలక్ష్మి మొహం, చూపులో మార్పుని ప్రమీళ గమనించింది.

కొంచెం సేపు మౌనం వహించి, ఒక చిరునవ్వు కల్పించుకొని రాజలక్ష్మి మాటాడింది.

"నువ్వు నన్ను తప్పుగా అర్థం చేసుకోవద్దు . . . నీ గురించి తెలుసుకోవాలనే నేను ఇవన్నీ అడుగుతున్నాను . . . ఇతనిగురించి ఊరులో చెడ్డగా మాటాడుకుంటున్నారే? అవన్నీ మురళికి తెలుసా?" అని ఆ పఠం చూపి అడిగింది.

ప్రమీళ ఒక దీర్ఘమైన నిట్టూర్పు వదలి మాటాడింది: "అతని గురించి ఎవరైనా చెడుగా మాటాడలేదంటేనే ఆశ్చర్యం అనాలి. ఏదో ఒక చెడ్డ అలవాటంటే ప్రపంచంకి తెలియకపోవచ్చు. కాని అతని దగ్గర తీరా అన్ని దుర్గుణాలు చోటుచేసుకున్నాయే? మనేం చెయ్యగలం, చెప్పండి. అందుకు కారణం అతని పెంపకం, పెరిగిన పరిసరాలు, సహవాసం."

ప్రమీళ దుఃఖంతో అతని గురించి తనకు తానే గొణుక్కోవడం గమనించి రాజలక్ష్మి సముచితంగా, తొందరగా, ఒక ప్రశ్న అడిగేసింది: “సరే, ఇంత తెలిసిన తరువాత కూడా నీలాంటి అమ్మాయికి  ఎందుకు అతనితో పొత్తు ఉండాలి? అందువలన నీ జీవితంకి హాని కాదా?”

ప్రమీళ గూఢంగా ఆలోచిస్తున్నట్టు మౌనంగా తల వంచింది; ఆ కొంచెం సమయంలో రాజలక్ష్మిని ఆవరించుకున్న ప్రశ్నలూ, ఆవిడ వచ్చిన కారణమూ, ప్రమీళ పూర్తిగా గ్రహించింది.

ఆమె వివరించింది: “ప్రపంచంలో ఎవరూ పూర్తిగా చెడ్డవారు కాదు; పూర్తిగా మంచివారూ కాదు. చాలా చెడ్డవాళ్ళున్నారు, చాలా మంచివాళ్ళూ ఉన్నారు. ‘ఇందులో రాజు అంకుల్ చాలా చెడ్డవాళ్ళతో ఒకరు’ అని మీ అబ్బాయి తరచుగా అనేవారు. అటువంటి చాలా చెడ్డవాళ్ళతో దగ్గఱగా మెలగుతే వాళ్ళ దగ్గఱ కూడా మంచి గుణాలేపైనా ఉంటాయని అతను అనేవారు. అవును, అన్ని దుర్గుణాలున్న రాజు అంకుల్కి ఇతని వంటి ఒక ఉత్తముడు మిత్రుడుగా ఉన్నారే, అదొక మంచి ఉదాహరణం అని నేను అనుకున్నాను. చెడ్డవాళ్ళన్నప్పుడు వాళ్ళు అందరికీ చేడు చేస్తారని అనడంలో న్యాయం ఉందా? నన్నడిగితే రాజు అంకుల్ నాకు దోహదం చేసిన ఉదాత్త మనిషి . . . ఊరులో అందరూ ఏమేమో చెప్తారు . . . ”

అప్పుడు రాజలక్ష్మి జోక్యం చేసుకొని అడిగింది.

“అదెలాగమ్మా? నిప్పులేకుండా పొగ వస్తుందా?”

“బాగా చెప్పారు. నిప్పువలనేకదా పొగ? కాని అందరూ పొగని మాత్రం చూస్తున్నారు. నిప్పు ఉందని మరిచిపోతున్నారు. ఊరంతా అతనొక చెడ్డమనిషి అనే నింద పొగలాగ వ్యాపించి ఉంది. ఎంత చెడ్డమనిషి అయినా అతనిలోనూ మానవత్వం అన్నది ఉంటుందికదా - పొగ అని ఉంటే నిప్పు కూడా ఉన్నట్టు? చెడ్డవాళ్ళందరికీ మనసు అని ఒకటి ఉంది. అది బలహీనంగా ఉండడంవలనే వాళ్ళు చెడుని ఎదిరించలేకపోతున్నారు. నా అవగాహనలో రాజు అంకుల్ అటువంటి మనిషి . . . ఒకానొకప్పుడు అతను నాకు సాయం చేసి దాని గురించి ఏ చింతా లేకుండా జీవించారు . . .  ఐదు సంవత్సరాల తరువాత తన ఆస్తి అంతా పోగొట్టుకొని అనాథగా - నేను

శ్రేయస్సుగా ఉన్నానని తెలుసుకొని - నా ఇంటి ముందు వచ్చి నిల్చున్నారు. ఈ ఇల్లూ, కారూ, డబ్బు అతని దయవలనే నాకు దొరికాయని గుర్తుచేసుకని అతనికి ఎది కావాలో అవన్నీ నేను ఇచ్చాను. "ఏమే, నీకు మతి పోయిందా?" అని అమ్మ కూడా నన్ను తిట్టింది . . . అతని సాయం లేకపోతే మా బతుకు గ్రామంలో నలుగురు ఇంట్లో పాత్రలు తోముకొని ఉండవలసిందే అని అమ్మ రవంతైనా ఆలోచించలేదు . . .

"అతనికి నా దగ్గఱనుంచి కావలసినది డబ్బు మాత్రమే. నా దగ్గఱ అప్పుడు డబ్బు ఉంది, సరే అని ఇచ్చాను . . . ఊరులో అందరూ ఏమేమో చెప్పుకున్నారు . . . పొగని మాత్రం చూసినవారు - పొగని చూసి నిప్పు లేదనే బుద్ధిమంతులు ఏమన్నా ఎవరికి కావాలి? ఒక చెడ్డమనిషి సహాయం వలన నాకు ఈ అంతస్తు లభించింది. ఆ కృతజ్ఞత మరవకుండా అతనికి నేను తిరిగి సహాయం చేస్తే నా పేరు, ప్రతిష్ట పాడైపోతాయా? 'సరే, అలాగే కానీ!" అని నేను నిశ్చయం చేసుకున్నాను. నా అమ్మకే అది బోధపడలేదు. కాని నన్ను - నా ఆత్మని - గ్రహించినది మీ అబ్బాయి మాత్రమే . . .

"అందువలనే అతను నా జాతకం అడిగినప్పుడు అంతవరకూ అతనికి అటువంటి ఆలోచన ఉందని తెలిసి నేను మురిసిపోయాను. ఒక బుట్టడు పువ్వులని గభీమని నా తలమీద ఒలకబోసి దేవతలు దీవించినట్టనిపించింది. కాని ఈ పెళ్ళి జరుగుతుందని నాకు నమ్మకం లేదు . . . నేనూ ఆ రోజునుంచి దానిగురించే ఆలోచిస్తున్నాను. మొదట జాతకాల్లో పొందిక రావాలి; అంతకు మించి, పొందిక ఉన్నంత మాత్రాన పెళ్ళి అవాలని నియమం ఉందా ఏమిటి? అతను నాలాగ ఒంటరి మనిషి కాదు, అతని బంధువులు ఏమంటారో అని కలవరపడ్డాను. కాని ఒకటి . . . ఈ పెళ్ళి జరగ్గపోయినా నాకు సంతోషమే . . . అతనికి అటువంటి ఒక ఆలోచన వచ్చిందే, అది నాకు చాలు! నా గురించి సరిగ్గా, గౌరవంగా అత్మార్థంగా అతను తెలుసుకున్నారు . . . ఆ జ్ఞాపకంతోనే చాలారోజుల దాంపత్య జీవితం అనుభవించిన తృప్తి నాకు వచ్చేసింది . . . " అని అంటున్న ప్రమీళ తన ఎదుట ఉన్న రాజలక్ష్మి వెక్కుతూ, కళ్ళు తుడుచుకుంటూ, ఏడవడం చూసింది. 'ఎందుకు, నేనేం చెప్పాను?' అని అర్థం కాని కలతతో ప్రయాసపడింది.

“అమ్మా, నువ్వు ఇంత గొప్ప ఉత్తమురాలువి. నీ గురించి ఊరులో ఏమేమో మాటాడుకుంటున్నారు . . . దేవుడా, వాళ్ళని క్షమించు!” అని రాజలక్ష్మి తన కొమార్తెలు, అల్లుడ్లని గుర్తుచేసుకొని, ప్రమీళ చేతులు పట్టుకుంది.

“అమ్మాయీ, నిన్ను చూస్తే నాకెలాగో ఉంది. నీవంటి సుగుణవతికి ఈ అవస్థ రావడం ఎంత దురదృష్టం! నా అమ్మాయిలూ, అల్లుళ్ళూ ‘ఈ పెళ్ళి జరుగుతే ఇక మా సంబంధం తెంచుకున్నట్టే!’ అని చెప్పి వెళ్ళారు. ఒక మంచి పని చెయ్యాలంటే ఇటువంటి ఆక్షేపణలు వస్తే దాన్ని ఎందుకు మనం ఆపాలి? నా కొడుకు పొరబాటు చెయ్యలేదని నాకిప్పుడు బాగా బోధపడింది . . . జాతకాల్ల పొందిక కూడా బాగుంది . . . ” అని పొంగివస్తున్న కన్నీళ్ళని అణచుకొని రాజలక్ష్మి తన అనుమతి ఇవ్వడానికి ప్రయత్నించినప్పుడు ప్రమీళ ఆవిడని సముదాయించి తన నిర్ణయం తెలియజేసింది.

“మీకేం భయం వద్దు, విచారం వద్దు! జాతకాల్లో జోడు ఉంటే చాలంటున్నారా? ఈ పెళ్ళి జరగదు. ఎందుకంటే చుట్టరికాలు బలపరచి సంసారం వర్ధిల్లడానికే పెద్దలు పెళ్ళి అనే ఆచారం నియమించారు. అందుకని ఇప్పటి చుట్టిరికాలు పాడు చేయడం పొరబాటు కదా? నాకు నా తంబూరా ఉంది, సంగీత కళ ఉంది . . . మీలాంటి మంచివారి ఆదరణ, అభిమానం ఉంటే నాకు అంతకంటే మరేం కావాలి?”

“అలా అనకమ్మా. . . ఈ పెళ్ళి జరగాలని నాకుంది . . . నా మాట విను . . . చుట్టరికాలు అంత సులభంగా తెగించిపోవు . . . కొన్నిరోజుల్లో అందరూ మన గురించి తెలుసుకుంటారు . . . నేను ఇప్పుడే వెళ్ళి మురళీకి నా సమ్మతి చెప్తాను!” అని రాజలక్ష్మి తొందరగా లేచింది.

“వొద్దండీ . . . ఈ పెళ్ళి గురించి మరేం ప్రయత్నం వద్దు . . . ఇవాళ ఉదయం జాతకం తిరిగి ఇవ్వడానికి మీ అబ్బాయి వచ్చారు. ఈ పెళ్ళి వద్దని మేమిద్దరం మంచి మనసుతో ఏకీభవించాం. మీ కుటుంబంకి నావలన ఏమైనా చేడు రావటం నేను సహించను. నాగురించి ఊరులో అందరూ వింటున్న మాటలు ఎంతవరకు నిజమో, అబద్ధమో, ఎవరికి తెలుసు? కాని అవన్నీ నాగురించే కదా? అందువలనే మేం మా నిర్ణయం మార్చుకున్నాం. మనసు మార్చుకోవడం అన్నది ఒక సారే జరగాలి. అది నా

పక్షంలో జరగనీ!” అని స్పష్టంగా ప్రమీళ మాటలు విని రాజలక్ష్మి తన కన్నీళ్ళని దాచుకోవాలని మొహం వేరే దిశలో తిప్పుకుంది.

** ** **

ఆ ఆదివారం మురళీ పుట్టినరోజు వచ్చింది.

రాజలక్ష్మి కొమార్తెలు, అల్లుళ్ళు, పిల్లలు అందరూ ఇంటిలో గుమిగూడి ఉన్నారు.

అప్పుడు ఒక ఎవర్ సిల్వర్ టిఫన్ కారియర్ లో శంకరి అవ్వ మురళీ పుట్టినరోజుకని విశేషంగా తయారుతేసిన తినుబండారాలని నింపుకొని, ఆ వేసవికాల మండుటెండలో ఎవరినో చూడడానికి రాజలక్ష్మి బయలుతేరుతోంది.

“ఈ ఆడ జన్మకి స్వార్థం తప్పిస్తే మరే చింతా లేదు! దేవుడా, స్త్రీలని ఎందుకు ఇంత బలహీనంగా సృష్టించావ్?” అని శంకరి అవ్వ గొణుక్కుంది.

ఆవిడకి తెలిసిన కోణం, ఆవిడ చూసిన చూపు అలాంటివి. కాని జీవితమనేది ఎన్ని కోణాల్లో, ఎన్ని చూపుల్లో చూసినా అది ఎన్ని విధాలుగా కనిపించినా - అది ఏదో ఒక న్యాయం అనుసరించి, అన్నిటినీ ఆవరించే ఒక సంపూర్ణతేకదా?

********

**(మూలం: ప్రచురణ, ఆనంద వికటస్, 1965)**

# ఎన్ని కోణాలు! ఎన్ని చూపులు!

గభీమని గతిలేని ఒక స్థితిలో ఏకాంతంగా, ఎవరూ ఓదార్చలేనట్టు, నిరాదరువుగా తన్ను వదిలేసినట్టు రాజలక్ష్మి అల్లాడిపోయింది.

గడచిన అర్ధగంటనుంచి ఇంటి ముందు హాలులో ఒక సోఫాలో చంచల మనసుతో కూర్చున్న యజమానిని చూసి వంట మనిషి శంకరి అవ్వ మెల్లగా నడిచివచ్చి ఆవిడ పక్కన నిల్చుంది.

తను వచ్చి నిలబడినది గుర్తించక ఏదో ఆలోచనలో మునిగిపోయిన రాజలక్ష్మిణిని చూసి "ఏమే రాజం, నువ్వేలాగో ఉన్నావ్, నీకేమైందే?" అని అవ్వ అభిమానంతో అడిగింది.

"ఏమీ లేదు. ఉత్తికే కూర్చొనివున్నాను . . . మీ పనులు మీరు చూసుకోండి," అని అంది రాజం.

అవ్వ ఒక క్షణం రాజలక్ష్మిని తేరిపారి చూసింది. వెంటనే ఒక చిరునవ్వు నవ్వి,"ఓహో, ఈ రెండురోజులూ పిల్లలతో ఇంటికి వచ్చిన అమ్మాయలూ, అల్లుళ్లూ అందరూ వెళ్ళిపోయారని నీకు బాధగా ఉందా? బాగుందమ్మా నీ న్యాయం! మహారాజులాగ అబ్బాయికి ఒక పెళ్ళి చేసి ఈ ఇంటిలోని పిల్లల్ని ముద్దాడకపోయావా? కూతుళ్ళ  పిల్లల్ని కలకాలం నమ్ముకుంటే ఎలాగ?" అని ఒక ప్రశ్నని సాగదీసి అడుగుతూ వంటగదికి  నడిచింది.

అవ్వ చెప్పినది నిజం, కాని రాజలక్షి మొహంలో కనిపించే కలవరంకి అది పూర్తి కారణం కాదు.

ఆవిడ కొమార్తెలు, పిల్లలు చాలా సార్లు - తరచుగా - ఇంటికి వస్తూ పోతూనే ఉన్నారు. పండుగలు, పర్వాలు అంటే చాలు, ఇద్దరు కొమార్తెలు, అల్లుళ్ళు ఇక్కడే మకాం. అందువలన వాళ్ళకి లాభం; రాజలక్ష్మికి, ఆమె కొడుకు మురళీకి తృప్తి. జ్యేష్ట

కుమారుడు - ఒకడే కొడుకు - ముప్ఫైయైదు నిండినా బ్రహ్మచారిగా, నెలా వెయ్యిరూపాయలకిపైగా జీతంతో, కారూ, బంగళాతో ఉన్నప్పుడు అతని చెల్లెళ్ళు ఎలాగ ఒంటరిగా మెట్టినిల్లులో ఉండడానికి ఇష్టపడతారు? వాళ్లు ఇష్టపడినా, ఆ తల్లి ఊరకే ఉంటుందా?

అందువలనే ఆ ఊరులోనే నివసించే తన కొమార్తెలు, పిల్లలు అర్ధగంట ముందు తమ తమ ఇంట్లకి తిరిగివెళ్ళిపోయారనే కారణం వలన తనకి బాధగా ఉందని శంకరి అవ్వ అజ్ఞానంతో పలికిన మాటలు గుర్తు చేసుకొని రాజలక్ష్మి తనలో నవ్వుకుంది.

మంచి వేళ! సుబ్బు శాస్త్రి వచ్చినప్పుడు, ఆ ఘటన జరిగినప్పుడు, శంకరి అవ్వ మద్యాహ్నం వంటపనులు ముగించుకొని ఇంటి వెనుక భాగంలో గుఱకపెట్టి నిద్రపోతోంది.

అవ్వ ఆ ఇంటికి దాదాపు ఒక దూరపు బంధువే. కాని ఆ ఆ ఉనికికి తగినట్టుగా గుణాలు చోటుచేసుకోవడం సహజమే కదా? అందువలన నౌకరులకి కొన్ని సంగతులు తెలియకపోవడం మంచిదే!

కాని ఆ ఇంటిలో జరిగే ప్రతీ చలనం, ముఖభావం చూసిన క్షణమే మనసుని పూర్తిగా గ్రహించే నైపుణ్యం ఆవిడకి ఉంది! శంకరి అవ్వ అన్నీ తెలుసుకుంటుంది, ఒక అభిప్రాయమూ తనలో ఏర్పరచుకుంటుంది, కాని దేనిగరించి ఎవరితోనూ మాటాడదు! అవును, ఆవిడ ఆ ఇంటిలో కేవలం ఒక వంటమనిషి మాత్రం కాదు! ఏ నౌకరు యజమానిని 'ఏమే' అని పిలవగలదు?

రాజలక్ష్మి ఎదుట మేజామీద రెండు నోటు పుస్తకాలున్నాయి.

అవి రెండూ రెండు వేరే వేరే జాతకాలు. మేజామీదున్న తన అందమైన బంగారు ఫ్రేం కట్టిన కళ్ళద్దాలని తీసుకొని, ధరించి, ఆ రెండిటినీ ఆవిడ విడిచి విడిచి చూసింది. ఆ తరువాత వాటిలో ఒకటి తీసుకొని మేజా అరలో భద్రపరచింది; ఆ రెండవ జాతకంని జుగుప్సతో చూసింది.

"ఈ సంబంధం వొద్దు, ఇది జరగనే కూడదు!" అని దృఢంగా గొణుక్కుంటూ, కళ్ళద్దాలని తీసి తలెత్తి చూసినప్పుడు ఆవిడ చూపు గోడమీదున్న, గతించిన తన భర్తపై వాలింది; అతను తన్ను తేరిపారి చూస్తున్నట్టనిపించింది.

ఆ ఫోటో చూసినప్పుడు - పదేళ్ళ మీనా, ఆరేళ్ళ కమల - తన ఇద్దరు కొమార్తెలని నిరాదరువుగా వదిలేసి అతను కన్ను మూసిన రోజుల్లో తనకేర్పడిన బాధ్యతలు, వాటిని భరించి తను ముందుకు సాగడానికి నమ్మకం, విశ్వాసం ఇచ్చిన మురళి బాల్యరూపం ఆవిడకి గుర్తులోకి వచ్చింది.

వాడే ఇన్ని శ్రమల మధ్య, నిరుపేద జీవితంలో ప్రయాసపడుతూనే ఇవాళ ఉన్న ఈ అంతస్తుకి పెరిగి ఆ నమ్మకం, కలలు, కల్పనలు, సఫలం చేసాడు. ఇరవై ఐదు సంవత్సరాలు నిండకుండానే ఒక తండ్రి స్థానంలో వాడెలాగ ఓర్పు, బాధ్యతలు వహించి తన చెల్లెళ్ళకి తగిన వరులకోసం వెతికాడు! ఇవాళ మీనా, కమల తమ అంతస్తుకు పైగా అనుభవించే భర్తలు, సుఖప్రద కాపురాలు, ఆ రోజుల్లో కల్పనకూడా చేసి ఉండరే?

అప్పడాలు వొత్తుతూ, శంకరి అవ్వకి వంటలో సాయంకని ఆవిడతో వెళ్తూ, పెనుగులాడిన తనకి ఈ రోజు కారు, బంగళా, పట్టు చీరలు, బంగారు ఫ్రేం కట్టిన కళ్ళద్దాలు, ఉన్నాయంటే అందుకు మూల కారణం మురళీయే కదా? ఆ రోజుల్లో మనుగడ కోసం తను నమ్ముకున్న శంకరి అవ్వకి ఇప్పుడు తనింట్లోనే వంట మనిషిగా ఆశ్రయం ఇచ్చి తన్ను ఈ ఇంటి యజమానిగా గౌరవంగా జీవించడానికి దోహదం చేసినది ఎవరు?

అందువలనే రాజలక్ష్మికి మురళి మీద - తన కొడుకే ఐనా - గొప్ప మాన్యత, గౌరవం ఉన్నాయి. వయసు ముప్పై అయిదు నిండినా తన పెళ్ళి గురించి ఏ ఆలోచనా లేకుండా రాత్రి పగలూ పని చేస్తూ ధనం, పేరు, ప్రతిష్ట, వోగు చేస్తున్న వాడితో పెళ్ళి గురించి మాటాడానికి రాజలక్ష్మికి ధైర్యం లేదు.

అంత గౌరవప్రద కుమారుడు ఇప్పుడు పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించి, తనే ఒక అమ్మాయి జాతకంని సుబ్బుశాస్త్రికి ఇచ్చి వొందిక చూడమని చెప్పాడని సుబ్బుశాస్త్రియే ఆ మధ్యాహ్నం ఆవిడకి చెప్పినప్పుడు తన జీవితం సఫలమైందని రాజలక్ష్మి ముప్పొంగిపోయింది.

సుబ్బుశాస్త్రిగారు ఈ కుటుంబంకి సంబంధించినంతవరకూ ఊరకే జోస్యులు మాత్రమేకాదు. ఈ కుటుంబం శ్రేయంలో అతనికి మంచి ఆసక్తి ఉంది. మురళి తండ్రికి

అతను ఆత్మీయ మిత్రుడుకూడా. అందువలనే అతని ద్వారా ఈ సంగతి తన కుటుంబ సభ్యులకి తెలియజేయాలని మురళి నిశ్చయించాడు.

ఆ మధ్యాహ్నం - మురళి చెప్పినట్టు - కమల, మీనా తమ భర్తలతో ఇంటికి వచ్చినప్పుడు - ఆ రెండు జాతకాల పొందిక గురించి మాట్లాడి, అందరి అభిప్రాయాలు తెలుసుకోవాలని వచ్చిన శాస్త్రిగారు జాతకాల పొందిక వివరించడంతో తన బాధ్యత తీరిపోయిందని భావించలేదు.

"ఇది శ్రేష్ఠమైన పొందిక," అని అతనన్న మాటలు వినగానే, రాజలక్ష్మి అమ్మాయి ఎవరు అని ఆలోచించకుండా, "ఇప్పుడైనా పెళ్లిచేసుకోవాలని దేవుడు మురళికి బుద్ధి ఇచ్చాడే, మంచిది" అని సంతోషంతో ఒక నిట్టూర్పు వదిలింది. అదే సమయం పెద్ద కూతురు కమల భర్త మొహం చిరచిరలాడడం సుబ్బుశాస్త్రి గమనించారు.

తల్లీ, చెల్లెళ్ళని నేరుగా కలుసుకోకుండా ఒక మూడవ మనిషి ద్వారా తను చూసిన అమ్మాయి గురించి అన్నయ్య తమకు తెలియజేయడంలో కమల, మీనాకి మురళి చేష్టలో ఉపేక్ష కలిగింది.

తన సంతోషం, సంతృప్తి మరెవరూ పంచుకోలేదని కలవరపడి రాజలక్ష్మి ప్రతీ ముఖం చూసింది. ఆ అసంతృప్తికర నిశ్శబ్దంలో మీనా భర్త మాటాడాడు: "ఈ పెళ్ళికి మీ అబ్బాయికి బుద్ధి ఇచ్చినది - మీరనుకుంటున్న దేవుడు కాదు కాదండి! అది శని భగవంతుడు!"

"అయ్యో, ఇదేం అపశకునం!" అని రాజలక్ష్మి రెండు చెవులూ మూసుకుంది.

అప్పుడే సుబ్బుశాస్త్రి గరగరమని శబ్దం చేస్తూ మాటాడారు. "మురళి నన్ను జాతకాల పొందిక మాత్రం చూడమన్నాడు. ఇవాళ మురళి ఎంత అంతస్తులోవున్నాకూడా వాడు నా అన్యోన్యమైన స్నేహితుడు శివరామన్ కొడుకేకదా? ఆ శివరామన్ ఒక పేద గుమాస్తాపే, కాని అతని కుటుంబం ఆచారమైన, గౌరవమైన కుటుంబం అని అందరికి తెలుసు. ఆ గౌరవంకి భంగం రాకూడదని నాకుంది. అదే మీ అల్లుడుగారు కూడా చెప్తున్నారు. అమ్మాయి గురించి అతనికి తెలుసు అని నా అభిప్రాయం. అవునా?" అని అతను అడగడానికి ముందే మీనా భర్త, "అదేం "పెద్ద రహస్యం కాదే? ఆ అమ్మాయిని చూసి ఊరంతా నవ్వుతున్నారే? అది మరెవరో కాదు,

ఈ నోటిసులోని అడ్రసు చూడండి! మన కాలనీలోనే Sixth Main Street లో ఉన్న Playback Singer ప్రమీళనే మీ అన్నయ్య ఎంచుకున్నాడు!" అని మండిపడుతూ మీనాకి వివరించాడు.

"ఇదేం గ్రహచారం!" అని రాజలక్ష్మి నెత్తిని బాదుకుంది.

అవును. ఆ గాయకి ప్రమీళ గురించి ఊరులో అందరూ అధికంగానే మాటాడుకుంటున్నారు. ఆ మాటల్లో ఎంత నిజం ఉందని మాటాడేవారికి, వింటున్నవారికి, ఏ చింతా లేదు.

ఆ సాయంకాలం, బయలుదేరి వెళ్ళేవరకు, రాజలక్ష్మి కొమార్తెలు, అల్లుళ్ళు, ఆ ప్రమీళ గురించి తెలిసిన, తెలియని, కబుర్లు మళ్ళీ మళ్ళీ మాటాడుకున్నారు:

'దాసోహం' అని వశమైపోయి, ఆమె ఇంటిలోనే నిలకడగా బస చేస్తూ, ఆమె దయలో బతికే ఆ మన్నార్గుడి రాజగోపాలన్ గురించి;

వాడు బాగా తాగేసి కారుని నడిపే విధం గురించి;

గిండి రేసులో డబ్బు తగలపెట్టి వాడు తిరిగివచ్చినప్పుడు నిషాలో, ప్రజ్ఞ తప్పి సైదాపేట్ వంతెన దగ్గర ఎదుట వచ్చే లారీతో ఢీకొట్టుకొని మరణించిన విపత్తు గురించి;

ప్రమీళ మీదున్న మోహం వలన తన భార్యని, పిల్లని వదలిబెట్టి, ఆమె కోసం తన ఆస్తిని పోగొట్టుకున్న వివరాల గురించి . . .

ఇవన్నీ తమకిష్టం వచ్చినట్లు వారందరు మాటాడుతుంటే రాజలక్ష్మి బెంగతో, తల వంచి, మౌనంగా వింటోంది.

ఆఖరికి వాళ్లందరు సెలవు తీసుకున్నప్పుడు "వచ్చే ఆదివారం మురళీ పుట్టినరోజు. మీరందరూ రండి!" అని రాజలక్ష్మి అల్లుళ్ళకి చెప్పింది.

అప్పుడే కమల భర్త నిర్మొహమాటంగా జవాబు చెప్పాడు:

"ఇక మేం మీ ఇంటికి రావడానికి ముందు ఈ పెళ్ళి సంబంధం గుంచి మీ నిర్ణయం ఏమిటో మాకు తెలియాలి," అని చెప్పి తన తోటల్లుడిని చూసి, "నేనన్నది సరేనా?" అని అడిగాడు. అతను మాత్రమే కాదు, మీనా, కమల కూడా అతనితో ఏకీభవించి "అమ్మా, విను, ఈ పెళ్ళి సంబంధం అన్నయ్య మానుకోవాలి. లేకపోతే ఈ ఇంటికీ, మాకూ పొత్తులేదని అన్నయ్యకి చెప్పేయ్!' అని వక్కాణించి చెప్పేసారు. గభీమని

గతిలేని ఒక స్థితిలో ఏకాంతంగా, ఎవరూ ఓదార్చలేని పరిస్థితిలో రాజలక్ష్మిని వదిలేసి అందరూ వెళ్ళిపోయారు.

'వాళ్లు చెప్పినది సరే,' అనే భావనతో తన కొడుకుతో ఈ పెళ్ళి సంబంధం గురించి ఎలా మాట్లాడి, ఈ ప్రయత్నం ఆపడం?" అని ఆలోచిస్తూ రాజలక్ష్మి చాలా సేపు హాలులో, సోఫాలో కూర్చొనివుంది.

వంటగదిలో పనిచేస్తున్న శంకరి అవ్వ మాటి మాటికి రాజలక్ష్మిని చూస్తూవుంది.

ఆవిడ మనసులో "ఛీ, ఈ ఆడజన్మకి ఎంత స్వార్థం! దీనికి తనూ, తన కొమార్తెలు హాయిగా ఉంటే చాలు! వాడు ఎంత కఠినంగా పని చేసి ముసలాడైపోయినా ఇది ఎప్పుడూ ఇలాగే ఉంటుంది! . . . వాడికి పెళ్ళి అని వినగానే, ఈ కూతుళ్ళు మూతిముడుచుకున్నారు! పోనీలే, వాళ్ళు పెళ్ళైయి వేరే ఇళ్ళలకి వెళ్ళిపోయారు, మరి కన్న తల్లికి కూడానా? ఇప్పుడేం కొంప మునిగిపోయిందని రాజం ఇలా అల్లాడుతోంది? 'కొడుక్కి పెళ్ళి!' అనే సంతోషం మొహంలో రవంతైనా కనిపించదే? దేవుడా, ఆడపిల్లల్ని ఎందుకు ఇంత బలహీనంగా సృష్టించావ్?" అని ఆ మధ్యాహ్నం జరిగిన ఘటనలని అస్పష్టంగా గ్రహించిన అవ్వ తనలో చిరచిరలాడింది.

ఇలాగే జీవితంలో ఒకరి గురించి ఒకరు తమకి తెలిసిన ఒకే కోణంనుంచి, ఒక భాగం మాత్రం అవగాహన చేసుకొని, ఒక నిర్ణయంకి వచ్చి, అదే ఒక సమస్తమైన నిర్ణయం అని నొక్కిచెప్తుంటారు.

** ** **

వాడుకగా శంకరి అవ్వ వంటపనులన్నీ పూర్తిచేసుకొని రాత్రి ఎనిమిదన్నర గంటలకి వసారాలో పడక విరిచి నిద్రపోయింది. వయసు చెల్లిన కాలంలో కఠినంగా చాకిరీ చెయ్యడం వలన పడుకున్న కొన్ని నిమిషాలలోనే ఆవిడ నిద్రపోతుంది. కాని ఇవాళ మధ్యాహ్నం మాత్రంమే కాదు, ఇప్పుడుకూడా . . . ఆవిడ గురక మాత్రం వదలుతోంది.

తొమ్మిది గంటలు అవగానే బంగళాకి ముందున్న చెట్లమీద కాంతిని వెదజల్లుతూ మురళీ కారు గేటుముందు వచ్చి ఆగింది. మురళీ తనే కారునించి దిగివచ్చి గేటు తలుపులు తీసి, కారుని షెడ్డులో పెట్టి, ఇంట్లోకి వచ్చి, మేడమెట్లు ఎక్కి తన గదికి

వెళ్ళాడు. పావుగంట తరువాత దుస్తులు మార్చుకొని డైనింగ్ హాలుకి వచ్చాడు. ఆ తరువాతే రాజలక్ష్మి సోఫానుంచి లేచి వచ్చింది.

వాడికి అన్నం వడ్డించినప్పుడు, ఆమె తన్ను చూడనప్పుడు, కొడుకు తల్లిని చూసాడు; వాడు భోజనం చేస్తున్నప్పుడు, తన్ను చూడనప్పుడు, తల్లి వాడిని చూసింది. చూపుల ద్వారానే తల్లీ, కొడుకు భావనలని ఊహించుకున్నట్టనిపించింది.

ఆ మౌనంలోని  భారంని కొంచెం తగ్గించాలని మురళీయే ముందు మాటాడాడు: “కమలు, మీను ఎన్ని గంటలకి వెళ్ళారు?”

“నువ్వు రావడానికి ఆలస్యమవుతుందని చెప్పావుకదా?  . . . అందువలన కాచుకోవద్దని మధ్యాహ్నమే వెళ్ళిపోయారు.”

డైనిగ్ హాలులో సంభాషణ ఆరంభమగగానే వసారాలో నిద్రపోయే శంకరి అవ్వ గురక శబ్దం తక్కుతూ వచ్చింది.

“మధ్యాహ్నం సుబ్బుశాస్త్రిగారు వచ్చారు.”

ఒంగిన తల ఎత్తకుండా మురళీ ‘హుమ్’ అన్నాడు.

అవ్వ నిద్రపోతోందని ఖాయం చేసుకున్నతరువాతే రాజలక్ష్మి ఆ సంగతి గురించి మాటాడం ఆరంభించింది:

“అతను ఆ జాతకం గురించి మాటాడానికే వచ్చారు. జాతకాల పొందిక బాగానే ఉందన్నారు, కాని . . . ”

భోజనం చేస్తున్న మురళీ తలెత్తి చూసాడు. అదే సమయం వసారాలో తేలికగా వినబడుతున్న గురక శబ్దం పూర్తిగా ఆగిపోయింది.

“ఆ పిల్లగురించి ఊరులో అందరూ గాలిమాటలాడుతున్నారు . . . నీకు తెలీదేమో? . . . తెల్లగా కనిపిస్తే అది స్వచ్ఛమైన పాలని నీ నమ్మకం . . .   మీనా భర్త కూడా ఆక్షేపించారు . . . వాళ్ళెవరికీ ఈ సంబంధంలో ఇష్టం లేదు . . . అసలు అమ్మాయి ఎవరని నాకు ముందు తెలీదు, నువ్వు ఇలాంటి అమ్మాయి జాతకం తెస్తావని నేను ఊహించగలనా? ఇన్నిరోజుల తరువాత నువ్వు నీ పెళ్ళి గురించి ఆలోచిస్తున్నావని నేను మురిసిపోయాను . . . అవును, నీకు దాని కులగోత్రాల గురించి ఏమైనా

తెలుసా?" అని తొందరగా, ఆవేశంతో రాజలక్ష్మి అడగ్గానే మురళి ఒక చిరునవ్వు నవ్వి నిదానంగా జవాబు చెప్పాడు.

"తెలుసు అని అన్నవాళ్ళందరికీ ఎంతవరకు తెలుసని నాకు తెలుసు; నీ ఉద్దేశం ఏమిటో చెప్పు!"

"ఈ పెళ్ళి సంబంధం మానుకోపోతే 'ఈ ఇంటికీ, మాకూ పొత్తులేదని అన్నయ్యకి చెప్పు!' అని చెప్పేసి మీనా వెళ్ళింది . . . . "

"మీనా అలాగ చెప్పిందా? బాగుంది!" అని ఆమె కోపంని విని ఆనందించినట్టు మురళి నవ్వాడు.

"మీనా మాత్రం కాదు . . . అందరూ అలాగే మాటాడారు . . . ఇక ఈ ఇంటి గుమ్మం కూడా ఎక్కడం జరగదన్నారు . . . సుబ్బుశాస్త్రికి కూడా ఈ సంబంధంలో తృప్తి లేదు . . . "

తన తల్లి అందరి అసంతృప్తి, నిరాకరణ వివరించి చెప్పడం సహించలేక మురళి తటాలున అడిగాడు: "అమ్మా, సుబ్బుశాస్త్రి, పప్పుశాస్త్రి సంగతి అలాగే ఉండనీ . . . నాకు నీ అభిప్రాయమే ముఖ్యం . . . అది నువ్వే నాకు చెప్పడానికి వెనకాడుతావని నేను సుబ్బుశాస్త్రికి చెప్పి పంపించాను. ఇక నీ మనసులో ఏముందో చెప్పు!"

కొంచెం సేపు గూఢంగా ఆలోచిస్తున్నట్టు రాజలక్షి మౌనం వహించి ఆ తరువాత మాటాడింది: "వాళ్ళు చెప్పేది న్యాయమని నాకనిపిస్తోంది. మన గౌరవంకి ఈ సంబంధం వొద్దు అని నా అభిప్రాయం." అలా అన్న తరువాత తన సందేశం ఖాయపరిచే ధోరణిలో "అదే నా అభిప్రాయం!" అని ముగించింది.

"ఓ, అలాగా? సరే, అమ్మా, నువ్వు చెప్పినట్టే నేను చేస్తాను. ఈ పెళ్ళి జరగదు!" అని చెప్పి, మురళి భోజనం ముగించి చెయి కడుక్కోడానికి పెరడుకి వెళ్ళాడు.

మురళి ఒక నిమిషం తల వంచి ఆలోచించాడు; తల్లి మొహాన్ని తేరిపార చూసాడు; ఏదో ఆలోచనలోపడి తల ఊపాడు.

"మురళీ, నేనూ బాగా ఆలోచించాను: నీకు నలుగురుకి బుద్ధి చెప్పే త్రాణ ఉంది. చిన్న వయసులోనే నువ్వు చాలా బాధ్యతలు తీసుకొని పెద్ద మనిషిగా పెరిగావ్. నువ్వుకూడా ఇలాంటి పొరబాటు చెయ్యగలవా అని నేనూ బాగా ఆలోచించాను . . .

ఎంత పెద్ద మనిషి అయినా, నాలుగైదుసార్లు బాగా ఆలోచించి ఒక పని చెయ్యాలని నిశ్చయించినవారు కూడా ఇటువంటి విషయంలో ముందాలోచన లేకుండా తొందర పడతారు. అందుకే నేను ఇంత నిశ్చయంగా ఈ పెళ్లి వద్దంటున్నాను. కాని నీకు ఈ నెల పెళ్ళి జరగాలి. ఎంతమంది పోటీపడతూ తమ పిల్లలతో నీకోసం కాచుకొని ఉన్నారని నీకు తెలుసా?" అని ఆమె అనగానే మోహం తుడుచుకుంటున్న మురళి చెయిలోని తువ్వాలును పిసుకుతూ, తల వంచి, గరగరమని మాటాడాడు:

"అమ్మా, నీ మనసులో ఏముందో, ఇతరుల అభిప్రాయం ఏమిటో నేను తెలుసుకున్నాను. నీ మాట నేను వింటాను. ఇతరుల గురించి నాకు లెక్కలేదు. కాని నువ్వు నా మనసుని గ్రహించాలి. నేనేం పిల్లవాడిని కాదు, ప్రేమా, ఇదీ, అదీ అని కల్పించుకొని బాధ పడడానికి. నాకేమో అనిపించింది - నువ్వు వద్దంటే సరే. కాని ఇంకొక పెళ్ళిగురించి నాకు ఏ ఆలోచనా లేదు. దానిగురించి మాటాడవద్దు!" అని మురళి అన్న మాటలు వినగానే రాజలక్ష్మికి గుండెలో ఎలాగో అనిపించింది.

"మరి ఇప్పుడు కాకపోతే మరెప్పుడు నీకు నీ పెళ్ళిగురించి ఆలోచన వస్తుంది?" అని ఆరాటంతో అడిగింది.

"సరే, అసలు ఆ ఆలోచన ఇక రానేలేదనుకో, దానిగురించి ఇప్పుడు ఎందుకు?" అని చిరచిరలాడుతూ తువ్వాలుని పారేసి హాలుకి మురళి వెళ్ళిపోయాడు.

అతను వెళ్తున్న దిశని చూస్తూ అలాగే నిలబడిన రాజలక్ష్మి మనసులో రకరకాల ఆలోచనలు లేచాయి. వాటి భారం సహించలేక కుమ్మరించాలని గబగబ హాలుకి పరుగెత్తింది.

సోఫాలో వాలి మూసుకున్న కళ్ళతో కూర్చున్న మురళీ ఎదుట నిలబడి రాజలక్ష్మి "నీకు ఈ సంబంధంలోఇంత పట్టుదల ఉందన్నమాట! అది చూస్తే నాకు భయమేస్తుంది. నువ్వెందుకు నీకు పెళ్ళే వద్దంటున్నావ్? . . . ఒకవేళ పెళ్ళి చేసుకోకుండా ఆ గాయకురాలుతో . . . " అని తాను చెప్పదలచుకున్నది బాహటంగా చెప్పలేక ప్రయాసపడింది.

"అయ్యో, అమ్మా, నువ్వేమంటున్నావ్?" అని దయతో తల్లిని చూస్తూ మురళి లేచి నిలబడ్డాడు. "అమ్మా, నేను శివరామన్ గారి కొడుకుని. ఈ కుటుంబం గౌరవం నిలబెట్టే

బాధ్యత నాకుంది. నన్ను నమ్ము, నీకేం భయం వద్దు!" అని హామీ ఇచ్చి మేడమీదున్న తన గదికి మురళి వెళ్ళాడు.

ఆ రోజు రాత్రంతా నిద్ర లేక రాజలక్ష్మి మానసిక వ్యధతో పెనగులాడింది.

తన అభిలాషకి నిరాకరణ కలిగిందని తను రవంతైనా బాధపడనట్టు మురళి ప్రవర్తించాడు.

తల్లి బెంగపడుతున్నట్టు తనకి పెళ్ళే వద్దని, సన్యాసి జీవితం కావాలని మురళి నిర్ణయించలేదు. అటువంటి పిచ్చి దశలు అతను దాటి చాలా కాలమైంది. ఇల్లు వదలితే అతనికి వాణిజ్య సంబంధంలో వెయ్యి ప్రశ్నలు; వాటిమధ్య సంగీతంలో అతనికి ఉన్న అభిరుచి వలన ఈ గాయకురాలుతో పరిచయం ఏర్పడింది. ఒక ఘట్టంలో ఆమె ఒంటరిపాటు తెలుసుకున్న తరువాత మురళి తన ఏకాంతమూ గ్రహించాడు. అందువలనే 'ఈమె నాకు భార్య అవుతే?' అని ఒక ఆలోచన అతనికి తట్టింది. ఆ గాయకురాలులో కనిపించిన స్వభావం, సహజ గుణాలు, అతనికి నచ్చాయి. అందరూ ఏకీభవించితేనే ఆమెను తన భార్యగా చేసుకోవాలని మురళికి మనసులో ఉంది, అంతే! మరే విధమైన 'మెలో డ్రామా' ఏదీ వాళ్ళిద్దరిమధ్యా జరగలేదు.

ప్రేమ అని అన్నప్పుడు జాతకాల్లో పొందిక ఎవరికి కావాలి?

** ** **

ఆ మరుదినం మురళి అలవాటుగా ఆఫీసుకి వెళ్ళిన తరువాత ఒంటరిగా ఉన్న రాజలక్ష్మి తనకీ, తన కొమార్తెలకి జీవనాధారం ఇచ్చిన కొడుకు వాంఛకి తను అడ్డుగా నిలబడి వాడి హృదయంని చితకగొట్టినందుకు అంగలార్చుకుంది.

అప్పుడు శంకరి అవ్వ తన పనుల మధ్య దొరికిన అవకాశంలో హాలుకి వచ్చింది.

"ఏమే రాజం, ప్రొద్దున్న ఒక గుక్కెడు కాఫీ తాగేసి ఇలా కూర్చున్నావ్! స్నానం ఎప్పుడు?" అని అడుగుతూ అవ్వ ఆమె ఎదుట సెమెంట్ నేలమీద చెయిని ఆనుకొని కూర్చుంది.

రాజలక్ష్మి అవ్వని చూసి ఒక నిట్టూర్పు వదిలింది, మరేం అనలేదు.

"ఏమిటే, అలా చూస్తున్నావ్?" అని అవ్వ దగ్గరకి జరిగివచ్చి ఆమె చెయిని అభిమానంతో తీసుకొని అదుముకుంది. రాజలక్ష్మి కళ్ళు చెమ్మగిల్లాయి. అంతే! అవ్వ ఇక భరించలేకపోయింది. దేహంలో ఒక వణుకు; బయట ఒక వెక్కు; గొంతు ఉక్కిరిబిక్కిరియైపోయింది; మొహమూ, పెదిమలూ ఎఱ్ఱబారిపోయాయి. తలకప్పుని పైకిలాగ్గొని, కళ్ళు అదుముకొని "నాకన్నీ తెలుసులే! 'దీనికెందుకు?' అని మీరు తోసిపెట్టినా, నేనుకూడా ఒక భూతంలాగ ఒంటరిగా ఈ ఇంట్లో ఉన్నా, మురళి మనసు నన్ను ఆవరించుకొని ఉంది! వాడికి పెళ్ళయి, ఆ దంపతులకి వడ్డించకుండా నేను చావను, అది జ్ఞాపకం ఉంచుకో! నాకు మరేం సంతోషం కావాలి? నాకు మరెవరున్నారు చెప్పు, కొడుకా, కూతురా?" అని అవ్వ తనకి మురళిపట్ల ఉన్న సౌజన్యం తెలియజేసింది.

"ఎప్పుడైనా ఒకరోజు మురళి వంటగదికి వచ్చి, 'ఏమండీ, ఇవాళ ఏమిటి వంట?' అని అబిమానంతో నన్ను అడుగుతూ ఒక అప్పడం కొఱుకుతాడు. నేనూ వాడికి చెప్తాను: 'కుఱ్ఱవాడులాగ నన్ను వెక్కిరించడం నీకు అలవాటైపోయింది; నీకు ఒక అమ్మాయిని చూసి పెళ్ళి చేసుకోవడం చేతకాదు! మీ అమ్మా ఈ జన్మలో చూడదు!" అని. అవును, వాడికి పెళ్ళవలేదంటే దానికి నువ్వే కారణం! . . . హుం, ఇవాళ మురళి బాత్ రూమ్ నుంచి వస్తున్నప్పుడు చూసాను, వాడి జుత్తు బాగా నెరసిపోయింది! రాజం, నీకు నీ కూతుళ్ళూ, మనవలు చాలు! . . .

"ఇప్పుడెందుకు నువ్వు కొంప మునిగినట్టు ఇలా కూర్చున్నావ్? నువ్వు చూసిన అమ్మాయి వొద్దని వాడు అనలేదే? ఇప్పుడు వాడు చూసిన అమ్మాయి వద్దని మీరందరూ అంటున్నారు . . . ఎవరెవరికి మనసులో ఏముందో? నువ్వు వాడిని కన్న తల్లి, అందుకే వద్దని చెప్పేసినా నీకు చాలా బాధగా ఉంది . . . " అని అన్నప్పుడు అవ్వ తనకొక కొడుకు లేడని గుర్తు చేసుకొని దుఃఖపడింది. దాన్ని మింగుతూ ఇంకా చెప్పింది: "ఇంత అదృష్టం ఉన్నా నువ్వు అల్లాడిపోవడం చూసి నాకెలాగో ఉందే!" అని చెప్పి సగంలో వదిలేసిన పనులు పూర్తిచేయడానికి  మళ్ళీ వంటగదికి వెళ్ళింది.

అవ్వ ఏం వట్టి వంటమనిషి కాదుకదా?

ఒక క్షణంలో తాను కూడా ఒకప్పుడు అవ్వలాగ ఉన్నప్పుడు ఆవిడ తనకు చేసిన ఆదరణ రాజలక్ష్మి గుర్తుచేసుకొని హాలునుంచి వంటగదికి వచ్చింది.

"మీరన్నది నిజం . . . కాని వాడు చూసిన అమ్మాయిగురించి ఊరులో అందరూ ఏమేమో మాట్లాడుతున్నారే?" అని రాజలక్ష్మి అడగ్గానే, అవ్వ ఒక నిమిషం ఆలోచించి చెప్పింది.

"ఇదిగో, రాజం, విను . . . మురళీ ఏమీ తెలియని కుఱ్ఱవాడా? కొంచెం ఆలోచించు! వాడికి ఈ వయస్సులోనే జుత్తు నెరసిపోయిందంటే ఏమిటి కారణం? వాడికి ఎన్ని బాధ్యతలున్నాయి! వాడికి ఇప్పుడు అందంని చూసి మైమరచే వయస్సు కాదు; ఇంత తెలిసిన వాడికి ఈ అమ్మాయి ఇష్టమంటే దానికి తగిన కారణం ఉండితీరాలి! . . . మీకు ఇష్టం లేదని 'వద్దు!', 'వద్దు!' అని అనడానికి ఆ కమలాకి, మీనాకి, ఎంత ధైర్యం!" అని అవ్వ చిరచిరలాడింది.

"మీరేమంటున్నారు? అన్నయ్య పెళ్ళిలో వాళ్ళకేం హక్కు లేదంటున్నారా?" అని రాజలక్ష్మి అడ్డు ప్రశ్న వేసింది.

"హక్కు, ఏం హక్కు? 'అన్నయ్య పెళ్ళి గురించి వాళ్ళకి శ్రద్ధ ఉందా?' అని అడుగుతున్నాను! ఉంటే ఇంత హుటాహుటిగా వద్దని చెప్పేస్తారా? నేనంటున్నది ఇదే - ఎవరినీ సంప్రదించకుండా నిర్ణయం చేస్తే అది కోర్టులో చర్చ లేకుండా చేసిన తీర్పులాగ!"

అవ్వ మాటలు, వాదం విని రాజలక్ష్మి ఆవిడకి మురళీ గురించి, తన కుటుంబం గురించి ఎంత బంధం ఉందని గ్రహించింది. "ఆహా, మీరు బాగా చెప్పారు! మీ ఆయన కోర్టులో వకీలు గుమాస్తాగా పనిచేసారుకదూ? అందుకే మీరు ఇన్ని points తో మాటాడుతున్నారు! " అని శ్లాఘించి రాజలక్ష్మి హాలుకి తిరిగి వచ్చేసింది.

ఆదే సమయం ఆవిడ మనసులో ఒక మంచి తీర్పు చోటుచేసుకుంది.

** ** **

'ఆ ప్రమీళని పెళ్లి చేసుకోవాలనే ఆలోచన మురళికి ఎలా వచ్చింది? అందుకు ఒక మంచి కారణం ఉందంటే ఆ నిర్ణయంకి విరుద్ధంగా వాదించడానికి ఎవరికి అధికారం ఉంది? అది పొరబాటు అని ఎవరెవరో చెప్పడం విని, వాడి మనసుని గాయపరిచిన

తరూవాత నాకెందుకీ బతుకు?" అని అనేక విధాలుగా ఆలోచించిన రాజలక్ష్మి 'సరే, ఆ ప్రమీళలో ఏ విశేషం ఉందో చూద్దాం,' అని ఆ సాయంకాలం ఎవరికీ చెప్పకుండా ఇంటినుంచి బయలుదేరింది.

ప్రమీళ ఇంటికి వెళ్ళే దారిలో 'ఎవరో ఒక అమ్మాయివలన నా కొమార్తెలు, ప్రియమైన నా మనవలు, నాకు దూరమైపోతారా?' అనే భయం రాగానే, ఇంటికి తిరిగి పోవాలని ఆమె ఒక నిమిషం ఆలోచించింది: 'నాకు నా కొడుకుమీద అభిమానం లేదా?'

"నీకు నీ కూతుళ్ళూ, పిల్లలు హాయిగా ఉంటే చాలు!" అని ఆ ఉదయం శంకరి అవ్వ చెప్పిన మాటలు రాజలక్ష్మి గుండెని ఎత్తిపొడిచాయి.

రాజలక్ష్మి ఆ ఇంటిలోకి ప్రవేశించినప్పుడు, హాలులో తంబూరాని భుజంమీద ఆనుకొని, కళ్ళు మూసి, ప్రమీళ పాడుతోంది. ఆమె గానంకి అడ్డుబాటు వద్దని రాజలక్ష్మి మౌనంగా ఒక నిమిషం నిలబడి ఆ ఇంటిలో చూడడానికి తన కళ్ళకి ఏది సాధ్యమో అవన్నీ చూసింది.

ప్రవేశించగానే కళ్ళకి స్పష్టముగా కనిపించే ధోరణిలో 'వాడి' ఫోటో, దాన్ని చుట్టుముట్టుకొనివున్న ఒక పూలదండతో కనిపించింది. తరచుగా తమలపాకు నమలడం వలన అతని పెదిమలు నల్లబారిపోయాయి. కంఠంలో గొలుసు, సిగ అలంకరణ చూడగానే ఇతనే ఆ 'మన్నార్గుడి మైనరు' అని ఎవరైనా ఊహించుతారు. ఆ తరువాత రెండు పక్కలా దీపాలమధ్య త్యాగయ్య పఠం; ఒక మూల, ఒక చిన్న మేజామీద కనిపించిన ఆ ఫోటో - ఆమె ప్రమీళ తల్లి - అయివుండాలి; ఇవన్నీ ఒక నిమిషంలో రాజలక్ష్మి అర్థంచేసుకుంది.

'నన్ను పాలింప నడిచివచ్చితివో?' అని మోహన రాగంలో ప్రమీళ పాడుతుంటే రాజలక్ష్మి ఆమెను అంచనా వేస్తున్నట్టు చూసింది.

'ఆమె ఏం గొప్ప అందగత్తె కాదు; వయసు ముప్పైకి పైగానే కనిపిస్తోంది. ఆమెలో కనిపించే ప్రత్యేకత గానం మాత్రమే . . .' అని రాజలక్ష్మి ఆలోచిస్తున్న సమయం ప్రమీళ గభీమని కళ్ళు తెరిచి, పాట ఆపి, తంబూరాని గోడకి ఆనించి, లేచివచ్చి రాజలక్ష్మికి స్వాగతం చెప్పింది; ఇవన్నీ ఒక నిమిషంలో జరిగాయి.

"క్షమించండి . . . నేను మిమ్మల్ని చూడలేదు . . . కూర్చోండి!" అని హాలులో ఉన్న కుర్చీలలో ఒకటి చూపించింది.

"సరేలే . . . నువ్వు పాడమ్మా . . . " అంది రాజలక్ష్మి.

"రోజంతా నేను ఒంటరిగా పాడుతున్నాను కదా? నాలాంటివారికి మీ రాక ఒక దోహదం; . . . మీరు ఎవరని నేను తెలుసుకోవచ్చా?" అని ప్రమీళ భవ్యంగా అడిగింది. ఆమె మనసులో వచ్చిన స్త్రీ స్థానిక లేడీస్ క్లబ్ వార్షిక ఉత్సవంలో తన పాట కచేరీ గురించి సంప్రదించడానికి వచ్చిందేమో అని అనుమానం కలిగింది.

"నేనే మురళీధరన్ తల్లిని" అని రాజలక్ష్మి అన్న మాటలు విని ప్రమీళ ఒక క్షణం నివ్వెరపడింది. చేతులు జోడించి, "మీరుగాని కబురు పంపించివుంటే నేనే వచ్చివుంటానే?" అని అంది.

"లేదమ్మా, నిన్ను ఇక్కడ చూడాలని నేనే వచ్చాను" అని అన్న తరువాత రాజలక్ష్మి మౌనంగా తల వంచింది. ఆ సమయం ఉపయోగం చేసుకోవాలని కాఫీ చెయ్యడానికి ప్రమీళ వంటగదికి పరుగెత్తింది.

కొంచెం సమయం తరువాత ఇద్దరూ మాటాడవలసిన విషయం మాత్రం మాటాడకుండా వేరే వేరే కబుర్లు పరివర్తన చేసుకున్నారు.

ఐదారు సంవత్సరాలకుముందు తనకి సినిమాల్లో పాడడానికి ఛాన్సు దొరికిందని, ఇప్పుడు స్థానిక సభల్లో పాటకచేరీలకి పిలుపులు వస్తున్నాయని ప్రమీళ చెప్పింది. అందువలన తనకెటువంటి నష్టం లేదని, తనకి, ఒంటరి మనిషిగా, అదే చాలు అని తన తృప్తి తెలియజేసింది.

ఆ తరువాత రాజలక్ష్మి ఆమెగురించి మరి కొన్ని కబుర్లు అడిగి తెలుసుకుంది. క్రిందటి సంవత్సరం ప్రమీళ తన తల్లి పోయిన తరువాత ఒక పనికత్తె సాయంతో ఒంటరిగా జీవించుతోంది అని తెలియగానే రాజలక్ష్మి "అవునులే, నీకెలా మురళి తెలుసు?" అని యదేచ్ఛగా, చిరునవ్వుతో అడిగింది.

ప్రమీళ కూడా నిధానంగానే జవాబు చెప్పింది. "ఒకసారి అతని ఆఫీసు వార్షిక ఉత్సవంలో నేను పాడాను. అంతకుముందే చాలా సార్లు అతన్ని కచేరీలలో చూసివున్నాను; అతనికి సంగీతంలో మంచి అభిరుచి ఉందని మాత్రం అనుకున్నాను.

ఆ తరువాతే అతనొక పెద్దమనిషి అనికూడా గ్రహించాను. నా అమ్మ జబ్బుతో మంచమెక్కినప్పుడు, నా కారుని తీసుకొని వెళ్ళిన రాజు అంకుల్ దుర్ఘటనలో పోయినప్పుడు ఇతని సాయం లేకుంటే నా గతి ఏమైవుంటుందో? ఇతనే దేవుడులాగ . . . " అని ఆమె చెప్తూంటే రాజలక్ష్మి తనకి మంచి తరుణం దొరికిందని, "అవును, రాజు అంకుల్ అని అన్నావుగా, అతనెవరు?" అని అడిగింది.

ప్రమీళ ఆ పఠం చూపించింది.

"అతను - నాకు బంధువు కాదు . . . అతను ఊరులో ఉన్నప్పుడు నా పాట వినడానికి బ్రహ్మ ప్రయత్నం చేసేవారు; మా పొరుగింటి మనిషి; బోలెడు ఆస్తి . . . మీరు వినివుంటారు - మన్నార్గుడి మైనర్ రాజగోపాలన్ అని పిలుస్తారు. మా నాన్నగారు పోయిన తరువాత మాకున్న ఇల్లుకూడా అప్పుల వలన పోయింది. నేనూ మా అమ్మా అనాధగా నిలబడినప్పుడు ఇతనే మమ్మల్ని మద్రాసుకి తీసుకొనివచ్చి, పరిచయం ఉన్న నలుగురుతో మాట్లాడి నాకు సినిమాలో పాడడానికి దోహదం చేసారు. నా ఆదాయం వందలకొలదీ పెరిగిందంటే అందుకు రాజు అంకుల్ దయ, సహాయం కారణం . . . " అని అంటూంటే రాజలక్ష్మి మొహం, చూపులో మార్పుని ప్రమీళ గమనించింది.

కొంచెం సేపు మౌనం వహించి, ఒక చిరునవ్వు కల్పించుకొని రాజలక్ష్మి మాటాడింది.

"నువ్వు నన్ను తప్పుగా అర్థం చేసుకోవద్దు . . . నీ గురించి తెలుసుకోవాలనే నేను ఇవన్నీ అడుగుతున్నాను . . . ఇతనిగురించి ఊరులో చెడ్డగా మాటాడుకుంటున్నారే? అవన్నీ మురళికి తెలుసా?" అని ఆ పఠం చూపి అడిగింది.

ప్రమీళ ఒక దీర్ఘమైన నిట్టూర్పు వదలి మాటాడింది: "అతని గురించి ఎవరైనా చెడుగా మాటాడలేదంటేనే ఆశ్చర్యం అనాలి. ఏదో ఒక చెడ్డ అలవాటంటే ప్రపంచంకి తెలియకపోవచ్చు. కాని అతని దగ్గర తీరా అన్ని దుర్గుణాలు చోటుచేసుకున్నాయే? మనేం చెయ్యగలం, చెప్పండి. అందుకు కారణం అతని పెంపకం, పెరిగిన పరిసరాలు, సహవాసం."

ప్రమీళ దుఃఖంతో అతని గురించి తనకు తానే గొణుక్కోవడం గమనించి రాజలక్ష్మి సముచితంగా, తొందరగా, ఒక ప్రశ్న అడిగేసింది: "సరే, ఇంత తెలిసిన తరువాత కూడా నీలాంటి అమ్మాయికి  ఎందుకు అతనితో పొత్తు ఉండాలి? అందువలన నీ జీవితంకి హాని కాదా?"

ప్రమీళ గూఢంగా ఆలోచిస్తున్నట్టు మౌనంగా తల వంచింది; ఆ కొంచెం సమయంలో రాజలక్ష్మిని ఆవరించుకున్న ప్రశ్నలూ, ఆవిడ వచ్చిన కారణమూ, ప్రమీళ పూర్తిగా గ్రహించింది.

ఆమె వివరించింది: "ప్రపంచంలో ఎవరూ పూర్తిగా చెడ్డవారు కాదు; పూర్తిగా మంచివారూ కాదు. చాలా చెడ్డవాళ్ళున్నారు, చాలా మంచివాళ్ళూ ఉన్నారు. 'ఇందులో రాజు అంకుల్ చాలా చెడ్డవాళ్ళతో ఒకరు' అని మీ అబ్బాయి తరచుగా అనేవారు. అటువంటి చాలా చెడ్డవాళ్ళతో దగ్గఱగా మెలగుతే వాళ్ళ దగ్గఱ కూడా మంచి గుణాలేపైనా ఉంటాయని అతను అనేవారు. అవును, అన్ని దుర్గుణాలున్న రాజు అంకుల్కి ఇతని వంటి ఒక ఉత్తముడు మిత్రుడుగా ఉన్నారే, ఆదొక మంచి ఉదాహరణం అని నేను అనుకున్నాను. చెడ్డవాళ్ళన్నప్పుడు వాళ్ళు అందరికీ చేడు చేస్తారని అనడంలో న్యాయం ఉందా? నన్నడిగితే రాజు అంకుల్ నాకు దోహదం చేసిన ఉదాత్త మనిషి . . . ఊరులో అందరూ ఏమేమో చెప్తారు . . . "

అప్పుడు రాజలక్ష్మి జోక్యం చేసుకొని అడిగింది.

"అదెలాగమ్మా? నిప్పులేకుండా పొగ వస్తుందా?"

"బాగా చెప్పారు. నిప్పువలనేకదా పొగ? కాని అందరూ పొగని మాత్రం చూస్తున్నారు. నిప్పు ఉందని మరిచిపోతున్నారు. ఊరంతా అతనొక చెడ్డమనిషి అనే నింద పొగలాగ వ్యాపించి ఉంది. ఎంత చెడ్డమనిషి అయినా అతనిలోనూ మానవత్వం అన్నది ఉంటుందికదా - పొగ అని ఉంటే నిప్పు కూడా ఉన్నట్టు? చెడ్డవాళ్ళందరికీ మనసు అని ఒకటి ఉంది. అది బలహీనంగా ఉండడంవలనే వాళ్ళు చెడుని ఎదిరించలేకపోతున్నారు. నా అవగాహనలో రాజు అంకుల్ అటువంటి మనిషి . . . ఒకానొకప్పుడు అతను నాకు సాయం చేసి దాని గురించి ఏ చింతా లేకుండా జీవించారు . . .  ఐదు సంవత్సరాల తరువాత తన ఆస్తి అంతా పోగొట్టుకొని అనాధగా - నేను

శ్రేయస్సుగా ఉన్నానని తెలుసుకొని - నా ఇంటి ముందు వచ్చి నిల్చున్నారు. ఈ ఇల్లూ, కారూ, డబ్బు అతని దయవలనే నాకు దొరికాయని గుర్తుచేసుకని అతనికి ఎది కావాలో అవన్నీ నేను ఇచ్చాను. "ఏమే, నీకు మతి పోయిందా?" అని అమ్మ కూడా నన్ను తిట్టింది . . . అతని సాయం లేకపోతే మా బతుకు గ్రామంలో నలుగురు ఇంట్లో పాత్రలు తోముకొని ఉండవలసిందే అని అమ్మ రవంతైనా ఆలోచించలేదు . . .

"అతనికి నా దగ్గఱనుంచి కావలసినది డబ్బు మాత్రమే. నా దగ్గఱ అప్పుడు డబ్బు ఉంది, సరే అని ఇచ్చాను . . . ఊరులో అందరూ ఏమేమో చెప్పుకున్నారు . . . పొగని మాత్రం చూసినవారు - పొగని చూసి నిప్పు లేదనే బుద్ధిమంతులు ఏమన్నా ఎవరికి కావాలి? ఒక చెడ్డమనిషి సహాయం వలన నాకు ఈ అంతస్తు లభించింది. ఆ కృతజ్ఞత మరవకుండా అతనికి నేను తిరిగి సహాయం చేస్తే నా పేరు, ప్రతిష్ట పాడైపోతాయా? 'సరే, అలాగే కానీ!" అని నేను నిశ్చయం చేసుకున్నాను. నా అమ్మకే అది బోధపడలేదు. కాని నన్ను - నా ఆత్మని - గ్రహించినది మీ అబ్బాయి మాత్రమే . . .

"అందువలనే అతను నా జాతకం అడిగినప్పుడు అంతవరకూ అతనికి అటువంటి ఆలోచన ఉందని తెలిసి నేను మురిసిపోయాను. ఒక బుట్టడు పువ్వులని గభీమని నా తలమీద ఒలకబోసి దేవతలు దీవించినట్టనిపింటింది. కాని ఈ పెళ్ళి జరుగుతుందని నాకు నమ్మకం లేదు . . . నేనూ ఆ రోజునుంచి దానిగరించే ఆలోచిస్తున్నాను. మొదట జాతకాల్లో పొందిక రావాలి; అంతకు మించి, పొందిక ఉన్నంత మాత్రాన పెళ్ళి అవాలని నియమం ఉందా ఏమిటి? అతను నాలాగ ఒంటరి మనిషి కాదు, అతని బంధువులు ఏమంటారో అని కలవరపడ్డాను. కాని ఒకటి . . . ఈ పెళ్ళి జరగ్గపోయినా నాకు సంతోషమే . . . అతనికి అటువంటి ఒక ఆలోచన వచ్చిందే, అది నాకు చాలు! నా గురించి సరిగ్గా, గౌరవంగా అత్మార్ధంగా అతను తెలుసుకున్నారు . . . ఆ జ్ఞాపకంతోనే చాలారోజుల దాంపత్య జీవితం అనుభవించిన తృప్తి నాకు వచ్చేసింది . . . " అని అంటున్న ప్రమీళ తన ఎదుట ఉన్న రాజలక్ష్మి వెక్కుతూ, కళ్ళు తుడుచుకుంటూ, ఏడవడం చూసింది. 'ఎందుకు, నేనేం చెప్పాను?' అని అర్థం కాని కలతతో ప్రయాసపడింది.

“అమ్మా, నువ్వు ఇంత గొప్ప ఉత్తమురాలువి. నీ గురించి ఊరులో ఏమేమో మాటాడుకుంటున్నారు . . . దేవుడా, వాళ్ళని క్షమించు!” అని రాజలక్ష్మి తన కొమార్తెలు, అల్లుడ్లని గుర్తుచేసుకొని, ప్రమీళ చేతులు పట్టుకుంది.

“అమ్మాయీ, నిన్ను చూస్తే నాకెలాగో ఉంది. నీవంటి సుగుణవతికి ఈ అవస్థ రావడం ఎంత దురదృష్టం! నా అమ్మాయిలూ, అల్లుళ్ళూ ‘ఈ పెళ్ళి జరుగుతే ఇక మా సంబంధం తెంచుకున్నట్టే!’ అని చెప్పి వెళ్ళారు. ఒక మంచి పని చెయ్యాలంటే ఇటువంటి ఆక్షేపణలు వస్తే దాన్ని ఎందుకు మనం ఆపాలి? నా కొడుకు పొరబాటు చెయ్యలేదని నాకిప్పుడు బాగా బోధపడింది . . . జాతకాల్ల పొందిక కూడా బాగుంది . . . ” అని పొంగివస్తున్న కన్నీళ్ళని అణచుకొని రాజలక్ష్మి తన అనుమతి ఇవ్వడానికి ప్రయత్నించినప్పుడు ప్రమీళ ఆవిడని సముదాయించి తన నిర్ణయం తెలియజేసింది.

“మీకేం భయం వద్దు, విచారం వద్దు! జాతకాల్లో జోడు ఉంటే చాలంటున్నారా? ఈ పెళ్ళి జరగదు. ఎందుకంటే చుట్టరికాలు బలపరచి సంసారం వర్ధిల్లడానికే పెద్దలు పెళ్ళి అనే ఆచారం నియమించారు. అందుకని ఇప్పటి చుట్టరికాలు పాడు చేయడం పొరబాటు కదా? నాకు నా తంబూరా ఉంది, సంగీత కళ ఉంది . . . మీలాంటి మంచివారి ఆదరణ, అభిమానం ఉంటే నాకు అంతకంటే మరేం కావాలి?”

“అలా అనకమ్మా. . . ఈ పెళ్ళి జరగాలని నాకుంది . . . నా మాట విను . . . చుట్టరికాలు అంత సులభంగా తెగించిపోవు . . . కొన్నిరోజుల్లో అందరూ మన గురించి తెలుసుకుంటారు . . . నేను ఇప్పుడే వెళ్ళి మురళీకి నా సమ్మతి చెప్తాను!” అని రాజలక్ష్మి తొందరగా లేచింది.

“వొద్దండీ . . . ఈ పెళ్ళి గురించి మరేం ప్రయత్నం వద్దు . . . ఇవాళ ఉదయం జాతకం తిరిగి ఇవ్వడానికి మీ అబ్బాయి వచ్చారు. ఈ పెళ్ళి వద్దని మేమిద్దరం మంచి మనసుతో ఏకీభవించాం. మీ కుటుంబంకి నావలన ఏమైనా చేడు రావటం నేను సహించను. నాగురించి ఊరులో అందరూ వింటున్న మాటలు ఎంతవరకు నిజమో, అబద్ధమో, ఎవరికి తెలుసు? కాని అవన్నీ నాగురించే కదా? అందువలనే మేం మా నిర్ణయం మార్చుకున్నాం. మనసు మార్చుకోవడం అన్నది ఒక సారే జరగాలి. అది నా

పక్షంలో జరగనీ!" అని స్పష్టంగా ప్రమీళ మాటలు విని రాజలక్ష్మి తన కన్నీళ్ళని దాచుకోవాలని మొహం వేరే దిశలో తిప్పుకుంది.

** ** **

ఆ ఆదివారం మురళీ పుట్టినరోజు వచ్చింది.

రాజలక్ష్మి కొమార్తెలు, అల్లుళ్ళు, పిల్లలు అందరూ ఇంటిలో గుమిగూడి ఉన్నారు.

అప్పుడు ఒక ఎవర్ సిల్వర్ టిఫన్ కారియర్ లో శంకరి అవ్వ మురళీ పుట్టినరోజుకని విశేషంగా తయారుతేసిన తినుబండారాలని నింపుకొని, ఆ వేసవికాల మండుటెండలో ఎవరినో చూడడానికి రాజలక్ష్మి బయలుతేరుతోంది.

"ఈ ఆడ జన్మకి స్వార్థం తప్పిస్తే మరే చింతా లేదు! దేవుడా, స్త్రీలని ఎందుకు ఇంత బలహీనంగా సృష్టించావ్?" అని శంకరి అవ్వ గొణుక్కుంది.

ఆవిడకి తెలిసిన కోణం, ఆవిడ చూసిన చూపు అలాంటివి. కాని జీవితమనేది ఎన్ని కోణాల్లో, ఎన్ని చూపుల్లో చూసినా అది ఎన్ని విధాలుగా కనిపించినా - అది ఏదో ఒక న్యాయం అనుసరించి, అన్నిటినీ ఆవరించే ఒక సంపూర్ణతేకదా?

********

# నేనేం చెయ్యాలి చెప్పండి!

నలభై సంవత్సరాలైపోయాయి ఈ ఇంటికి నేను కోడలుగా వచ్చి . . . చేతినిండా ఒక గంప పిడతలతో నాన్నగారు నన్ను తీసుకొచ్చారు. అప్పుడు అమ్మ - అంటే మా అత్తగారు - ఉండేవారు, అత్తగారికి అత్తగారుగా, తల్లికి తల్లిగా . . . కన్నతల్లితో నేనున్నది ఐదు సంవత్సరాలేకదా? ఆ తరువాత అత్తగారికి కోడలేకదా? నాన్నగారు చావడిలో నన్ను దింపేసి అక్కడే నిలబడి తువ్వాలుతో మొహం కప్పుకొని పెక్కి పెక్కి ఏడుస్తున్నారు . . . నాకేం బోధపడలేదు . . . అప్పుడు పెరడులో నిలుచొని - అప్పుడే మొండితనం అతనిలో బాగా కనిపిస్తోంది - నాలికని బయటకి తీసి, చేతివేళ్ళని తెంచుతూ, ఆ పచ్చి ఇటిక నేలమీద బొంగరం వదలుతానని హఠం చేస్తున్న అతనే నా భర్త అని తెలియడానికి చాలా రోజులు పట్టాయి . . . ఐతే, దానికోసం అతను నా తలమీద కొట్టాలా? నేనుకూడా 'సరేరా' అని ఒకసారి బాగా వాయించాను. వంటగదిలోనున్న మా అత్తగారు పరుగెత్తుకొని వచ్చారు: "ఐయయ్యో, ఏమిటే ఇది? వాడు వీడు అంటున్నావు . . . " "మరి వాడెందుకు నన్ను కొట్టాలి?" ఆవిడకి ఒకటే నవ్వు . . . నన్ను కౌగిలించుకొని మా బంధుత్వం ఏమిటో వివరించి చెప్పారు . . . అన్ని సంగతులూ బోధపడే కాలం వస్తే అవే బోధపడతాయి. ఆలోచించిచూస్తే నాకే ఆశ్చర్యంగా ఉంది . . . నాకు మావారిమీద ఎందుకు ఇంత భయం వచ్చింది? భయం అంటే అది ఒక సంతోషమైన భయం . . . మర్యాదతో వచ్చే భయం . . . భయం అని కూడా అనలేం, అది ఒకవిధమైన భక్తి . . . ఎలాగో వచ్చేసింది . . . నలభై సంవత్సరాలుకి పైగా ఐపోయింది . . .

'ఇతన్ని పెళ్ళిచేసుకొని నేనేం సుఖపడ్డాను? నాకు ఇది ఉందా? అది ఉందా?' అని వాపోతూ ఎందమంది ఉన్నారు! అస్తమానం - ఈ చెరువుగట్టునుంచి ఆ కోవిల ప్రాకారం వరకూ మొరబెట్టుకొని తిరిగే వీళ్ళందరూ ఏం మనుషులో అమ్మా!

నాకెటువంటి కొరతా లేదు. అవును . . . కావాలంటే ఏ కోవిలలోనైనా మడి కట్టుకొని ఖచ్చితంగా చెప్తాను: నాకు ఎటువంటి కొరతా లేదు. ఐతే చూసినవాళ్ళు

అంటారు, నాకు పిల్లలు లేరనే సంగతి పెద్దగా చెప్తారు, చెప్తున్నారు. నేనుకూడా విన్నాను, ఎందుకు అబద్ధం చెప్పాలి? ఒకప్పుడు నేనుకూడా దానిగురించి బాధపడేదాన్ని, కాని అది ఎంత అజ్ఞానమని అర్థం చేసుకున్నాను. నేనే తెలుసుకోలేదు, మావారు నాకు బోధపరిచారు. అతనికే అది సాధ్యం; నోరు తెరిచారంటే ఎక్కడనుంచి ఆ సూత్రాలన్ని చెయ్యికట్టుకొని అతనిముందు నిలబడతాయో? మన శాస్త్రాలనుంచి, వేదాలనుంచి నిదర్శనాలు చూపించి ఎటువంటి ప్రశ్న ఐనా, ఎటువంటి అజ్ఞానులు తెలుసుకోవాలన్నా, తన మాటలతోనే ఇతను వాళ్ళకి జవాబు చెప్తారు. అలాంటి వాక్చాతుర్యం . . . అలాంటి జ్ఞానం . . . అది అతనికే సాధ్యం . . . ఏమో మావారి గురించి నేనేమో గొప్పగా పొగడుతున్నానని అనుకోకండి . . . అతన్ని పొగడడానికి తగిన జ్ఞానం నాకు లేదు . . . అటువంటి విద్వాంసుడికి నాలాంటి నిరక్షరకుక్షి భార్యగా వచ్చి చేరాను చూసారా? నేను దీనిగురించి అతనికి చెప్పాను, అతనొక ప్రసంగమే చేసేసారు . . . అతనికి నేను భార్యగావుండడం ఎంత ఉచితమని, అతనికి నావల్ల ఎంత సంతోషమో అని అతను నాకు చెప్పినదంతా నేను మీకు చెప్పగలనా? నేను అతనికి భార్యగా ఉండనీ, అందువలన అతన్ని పొగడడానికి నాకు అర్హతవుందని చెప్పగలమా?

మహా విద్వాంసులు శ్రీ ________________ అని చెప్తే ఈ రాజధానిలో అందరికీ తెలుసు. ఇతని ఖ్యాతి ఈ చెన్నపట్టంనుంచి కాశీవరకూ వ్యాపించివుంది.

ఇతనిదగ్గర చదువుకున్నవాళ్ళు - నాతో ఇంటిపనులు చేసినవాళ్ళు - ఎంతమంది కలెక్టరులుగాను, పెద్ద పెద్ద పనుల్లోనూ ఉన్నారు తెలుసా?

మనమే కని, మనమే పెంచి, పిల్లి, కుక్కల్లా జీవించాలా ఏమిటి?

ఇదిగో, ఇప్పుడుకూడా ఈ శంకరమఠం వాసరాలో పిల్లల్ని వరుసగా ఎదుట కూర్చోపెట్టుకొని ఇతను వాళ్ళకి విద్యాభ్యాసం చేస్తున్నారు. ఇతని నాభినుంచి వెలుబడే ఆ గంభీరమైన ధ్వని వింటే నా దేహం పులకరిస్తోంది! ఆ తరువాత ఆ పిల్లలందరూ సమశృతితో వల్లించుతుంటే . . . ఆ పిల్లలు అంత శ్రద్ధతో, భక్తితో, మృదువైన కంఠంతో, అతనిలాగే చెప్పాలని ప్రయత్నించి ఆ గాంభీర్యం లేక ఆ స్థాయిని మాత్రం అందుకోవాలని కడుపు కట్టుకొని, ఛాతీమీద చేతులువేసి ఉచ్చారణ చేస్తున్నారే . . .

అది చెవిలో పడితే నాకు కడుపులో ఏమో చేస్తుంది . . . ఇదేం కన్నవాళ్ళకి మాత్రం ఏర్పడుతుందా?

ఇతను అనేవారు: 'పిల్లల్ని కనడం ఏం పెద్దపని కాదు; వాళ్ళ కడుపు నింపడం ఏం పెద్దపని కాదు; పాండిత్యం, శీలం ఇచ్చి, ఒక పిల్లవాడిని జ్ఞానస్తుడుగా చేయడమే ఒక పెద్ద పని. మనందరం సాధారణ పిల్లల్ని కన్నవాళ్ళం అనే పేరుకంటే ఇటువంటి జ్ఞానస్తులని ఉత్పత్తి చేసేవాళ్ళం అనే పేరే శ్రేష్టమైనది.' ఇంకా ఏమేమో చెప్తారు, నాకు అవన్నీ తిరిగిచెప్పడం చేతకాదు. కాని అతను చెప్పేది ఎంత సత్యం అని నా మనసుకి అర్ధమవుతోంది . . .

ఇతనిదగ్గర చదువుకొని ఇప్పుడు చెన్నపట్టంలో ఏదో కాలేజీలో సంస్కృత ప్రొఫెసరుగా ఉన్నాడే చీమాచ్చు -వాడికి ఇప్పుడు పండితులు శ్రీనివాస శాస్త్రి అని పేరట! వినడానికి ఎంద ఇంపుగా ఉంది! కంటేనా? కన్న తల్లి ఈ ఊరులోనేవుంది . . . తన కొడుకు తన్ను సరిగ్గా చూడటంలేదని నిత్యమూ శపిస్తోంది . . .

మావారు ఒక్కొక్క సంగతి చెప్తున్నప్పుడు చమత్కారంగా వాదిస్తున్నట్టు అనిపిస్తుంది. ఐతే, గభీమని, అవాళ అతను ఎంత చక్కగా, ఉచితంగా చెప్పారన్నట్లు ఒక్కొక్క సంఘటన జరుగుతుంది.

ఆరోజు కోవిలకి వెళ్ళి వచ్చే దారిలో చీమాచ్చు తల్లి నన్ను ఆపి చీమాచ్చు తన్ను తిరిగికూడా చూడకుండా తన అత్తగారింటికి వెళ్ళిపోయాడని, వాడిని పెంచి, చదివించడానికి తను పడిన కష్టాలని కృతజ్ఞత లేకుండా మరిచిపోయాడని, ఏడుస్తూ వాడిని శపించుతూంటే నాకు అనిపించింది: 'ఇలాగ కనడం ఎందుకు? శపించడం ఎందుకు?' ఏమో ఆవిడకి సమాధానంగా నా తల ఊపాను కాని నాకంతా అర్ధమైంది: ఈ ముసలమ్మకి ఒకటే అసూయ! ఆవిడకి ఇక్కడ ఎటువంటి కొరతా లేదు, సౌఖ్యంగానేవుంది . . . కాని తను కన్న కొడుకు మూలం తక్కినవాళ్లు సుఖపడుతున్నారనే కోపమే ఈవిడ మనసుని బాధిస్తోంది . . . బాధ్యత కోరేవారు ఎందుకు మమకారం చూపలేక పోతున్నారు?

అన్నీ ఇతను చెప్తేనే నాకు బోధపడతాయి. లేకపోతే నేనుకూడా ఆ ముసలమ్మతో కలిసి ఆ చీమాచ్చుమీద ఒక పాటపాడి ఉంటాను . . .

ఇతను అన్ని విషయాలూ ఎంత కరాఖండిగా, దీర్ఘంగా విమర్శిస్తున్నారు! అందువలన తనకి నష్టమా, లాభమా అని కొంచెంకూడా ఆలోచించరు. ఎంతమంది తనతో ఒప్పుకుంటారు లేక ఒప్పుకోరు అనే విచారం అతనికి లేదు. అతని వాదంకి సరిరాని ఒక పనిని ఈ ప్రపంచమే అతని నెత్తిపై రుద్దుతే దాన్ని అలాగే తోసి పారేస్తారు. ఆ తరువాత తను అలా నిరాకరించడం ఎంత న్యాయమని ఈ ప్రపంచాన్నే లాగి పక్కన పెట్టుకొని వాదించడానికి సిద్ధమౌతారు. నేనూ ఇన్ని సంవత్సరాలుగా చూస్తున్నానుగా . . . ఒక్కరైనా సరే 'అదేమో స్వామి, మీరు చెప్పేది సరిగ్గా లేదు' అని ఇంతవరకూ అనలేదు . . .

వాళ్ళందరితో వసారాలో కూర్చొని ఇతను మాటాడుతుంటే నేను ఇతని వీపు వెనుక ఇంకొక గదిలోనుంచి వింటూవుంటాను. ఆతను చెప్పే చాలా మాటలు నాకు అర్థం కావు. ఇతను ఎలా ఇంగ్లీషు మాటాడుతున్నారు! నాకు తెలిసి ఇతను తన ఇరవై వయస్సులో ఇంగ్లీషు చదివారు. ఒకతనికి ఇతను సంస్కృత పాఠాలు నేర్పిస్తూ - అతనికి మావారికంటే వయసు కొంచెం ఎక్కువ -అతని దగ్గర ఇంగ్లీషు నేర్చుకున్నారు. ఇక్కడనుంచి కుంటకోణం వెళ్ళి ఏవేవో పరిక్షలుకూడా రాసారు.

ఇప్పుడు ఇతను రాసిన పుస్తకాలు అక్కడ విద్యార్థులకి పాఠపుస్తకాలుగా ఉన్నాయట.

పది సంవత్సరాలముందు కాశీలో ఏదో ఒక సదస్సుకి ఇతను వెళ్ళినప్పుడు నేనుకూడా వెళ్ళాను. ఇతన్ని గౌరవించి ఏమేమో బిరుదులు ఇచ్చారు. అదిచూసి నేను గర్వపడ్డాను; ఒక వెండి బిందెలో గంగా జలం తీసుకొనివచ్చి ఊరిలో అందరికీ పంచాను. నాకేం తక్కువ?

అప్పుడే కాశీనుంచి తిరిగివచ్చేటప్పుడు మేం చెన్నపట్టంలో చీమాచ్చు ఇంటిలో కొన్నిరోజులు గడిపాం. వాడు తన పెద్ద కారులో మమ్మల్ని రెయిల్ స్టేషన్ లో వచ్చి చూసాడు; మమ్మల్ని ప్లేట్ ఫారంలో నిలబెట్టి నమస్కారం చేసాడు; చెన్నపట్టంలో కారు లేకుండా ఏమీ వీలవదట. అప్పుడుకూడా ముందులాగే మావారి ఎదుట చేతులు కట్టుకొని మర్యాదగా ఏమేమో ప్రశ్నలు అడిగితే ఇతను బోధపరిచారు. కాని వాడిని

కాలేజీకి బయలుదేరినప్పుడు చూస్తే నాకే భయం వేసింది. దొరలాగ ఏమేమో తొడుక్కున్నాడు; ఇతనేమో వాడినిచూసి హోరున నవ్వారు.

తరువాత ఒకరోజు మా ఇంటిముందు ఒక పెద్ద కారు వచ్చి ఆగింది. ఎవరెవరో పెద్దమనుషులు - చీమాచ్చు ప్రొఫెసరుగా ఉన్నాడే ఆ కాలేజీలో పనిచేసేవారు - అందరూ వచ్చి మా ఇంటి వసారాలో కూర్చున్నారు. చీమాచ్చు మాత్రం తన సొంతయిల్లులాగ వంటగదివరకూ వచ్చేసాడు. నేను వాడిని "నువ్వెందుకు అప్పుడప్పుడు ఇక్కడికి వచ్చి మీ అమ్మని చూసుకోకూడదు?" అని అడిగాను. "అదేం నాకు చేతకాదు. 'నాతో వచ్చేయ్' అని అంటే అమ్మ వినదు" అని విచారంతో అన్నాడు; ఆ తరువాత తను వచ్చిన పనిగురించి చెప్పాడు:

వీడు పనిచేస్తున్న ఆ కాలేజీలో మావారిని పెద్ద ఉద్యోగంలో నియమించడానికి అక్కడ తపస్సు చేస్తున్నారట; కాని ఇతన్ని నేరుగా అడగడానికి వాళ్ళకి భయం. 'సరే, నేను మాటాడి అతను ఒప్పుకున్నట్లు చేస్తాను' అని ధైర్యం చెప్పి చీమాచ్చు ఇక్కడికి వాళ్ళని తీసుకొచ్చాడట . . . ఇంకా ఏమేమో చెప్పాడు . . . నాకుకూడా మావారు ఒప్పుకుంటారేమో అని ఒక ఆశ . . .

ఇతను రాగానే అందరూ వసారాలో కూర్చొని మాటాడారు, మాటాడారు, అలాగ మాటాడారు. నేను గదలోనుంచి వింటూనేవున్నాను. ఇతను చెప్పేది నాకు బోధపడలేదు. కాని ఒకటి అర్థమైంది. ఇతనిదగ్గర వాళ్ళ పప్పు ఉడకలేదు . . .

ఆఖరికి వాళ్ళందరూ వెళ్ళిన తరవాత నేను మావారిని అడిగాను: "మీరు ఈ ఉద్యోగంకి ఎందుకు సమ్మతించకూడదు? అక్కడ చదివేవారూ విద్యార్థులేకదా? మీకెందుకీ మొండితనం? పాపం . . . చీమాచ్చు చాలా ఆశతో, నమ్మకంతో వచ్చాడు!"

నా మాటలు విని ఇతను నవ్వారు.

ఈ నవ్వు ఇతనికి పుట్టుకతో వచ్చినది; అందులోనూ నా దగ్గరే ఆ నవ్వు.

ఇతను నవ్వుతూ చెప్పారు.

"చీమాచ్చులాగ నేనుకూడా వేషాలు వేసుకొని తిరగాలని నీకు ఆశగావుందా? నీకు తెలియదూ విద్యాభ్యాసం చేసేవాళ్ళు జీతం పుచ్చుకోకూడదని? పాఠం చెప్పేవాడికి కూలీ ఇచ్చినతరువాత శిష్యుడికి అతనిమీద ఎలాగ మర్యాద ఉంటుంది? ఆ

గురువుకూడా కూలీకోసం పనిచేసే మనిషైపోతాడు . . . అంతేకాదు; ఒక జండా పట్టుకొని, గోల పెట్టడానికి నన్ను పిలవకపోయినా, నన్ను ఆ గుంపుకి ఒక నాయకుడుగా ఉండమంటారు . . . నేనలాగ ఉండగలనా, నువ్వే చెప్పు . . . "

నేనేం చెప్పను? ఏమీ అనకుండా అతను చెప్పేది నోరుమూసుకొని విన్నాను.

నా ఊహలో అతను ఒక చొక్కా తొడుక్కొని నిలబడితేనే నాకు నవ్వు వస్తోంది! ఆ ఆలోచనే అర్థంలేకుండా ఉందికదా? నేనుకూడా ఇతనితోపాటు నవ్వేసి ఆ సంగతి వెంటనే మరిచిపోయాను.

ఇతనిగురించి ఇంత తెలిసికూడా అవాళ అతన్నిఅలాగ అడిగినందుకు నేను సిగ్గు పడ్డాను; అవును, ఈ నలభై సంవత్సరాలూ నేను జడ్డిగానే ఉన్నాను . . . అప్పుడప్పుడు ఏమైనా ఒక పిచ్చిపని చెయ్యడం . . . అదిచూసి ఇతను నవ్వడం . . . నా జన్మ ఇలాగే ఐపోయింది . . .

చూడండి . . . పదిరోజులముందు – ఇలాగే . . . ఇతనిదగ్గర చదువుకుంటున్న ఒక అబ్బాయి ఒక చీటీని నాదగ్గర తీసుకొని వచ్చాడు. "ఏమండీ, ఇది గవర్ణమెంటు నడిపే లాటరీ పోటి . . . ఒక రూపాయి మాత్రమే . . . ఇది దొరకడం కష్టం, నేను మీకోసం కొని తీసుకొని వచ్చాను" అని చెప్పాడు. నేనుకూడా ఏమీ ఆలోచించక 'పాపం, అబ్బాయి మనకోసం శ్రద్ధగా తెచ్చాడుకదా?' అని ఒక రూపాయి ఇచ్చి దాన్ని పుచ్చుకున్నాను.

ఆ అబ్బాయి దాని గురించి ఒక ప్రసంగమే చేసేసాడు; చాలామంది ఆ లాటరీ పోటిలో గెలిచి లక్షాధిపతులూగా మారిపోయారట. అందులో పేదవాళ్ళే గెలుస్తున్నారట. ఇంకా ఏమేమో చెప్పాడు. నేను ఊరికే తమాషాకోసం కొన్నాను. కాని ఆ సాయంకాలమే మావారు వసారాలో ఐదుగురో, ఆరుగురో మధ్య కూర్చొని ఆ లాటరీని ఖండించడంవిని నేను ఉలికిపడ్డాను.

గదిలోనుంచి ఇతని మాటలు వింటూంటే నాకు అలాగే నా రెండు బుగ్గలమీద ఎవరో బాగా వాయించినట్టనిపించింది.

అందులోనూ అవాళ ఇతను మాట్లాడడం మామూలుగా ఇతను నిదానంగా వాదం చేసేలాగ లేదు. ఈ ప్రపంచాన్నే శపిస్తున్నట్లు ఇతను ఆవేశంతో అరిచారు:

“ఈ దేశంలో ఇది జరగవచ్చా? జూదరి జూదం ఆడనీ, రంకుతనం చేసేవాళ్ళు రంకుతనం చెయ్యనీ . . . కాని రాజరికం చేసేవారూ, రాజ్యమేలేవారూ ఇలా చెయ్యవచ్చా? ఈ కలియుగంలో మనం నాశమవడానికి ఇదే నిదర్శనం! నీతి తప్పకుండా పరిపాలన చేసిన ఆ ధర్మరాజు ఎలాగ నాశమయ్యాడు? బాగా ఆలోచించండి . . . ధర్మరాజే జూదంవలన నాశమైపోయాడు. ‘జూదంలో గెలిచినా, ఓడిపోయినా, వాళ్ళ జీవితాలు వృధా!’ అనే సత్యాన్నేకదా మహాభారతం మనకి చెప్తోంది? జూదంలోనూ ఒక ధర్మం ఉంది, వినండి; సమ అంతస్తులో ఉన్నవాళ్ళే జూదమాడవచ్చు. అదీ ఒక పాపమే, కాని ఆ పాపానికి ఒక హద్దు ఉంది. రాజరికం చేసేవారూ, రాజ్యపరిపాలనకి బాధ్యత కలవారూ పామరజనులని ఇటువంటి మాయాజాలం చేసి జూదం ఆడుతున్నారే, ఇది న్యాయమేనా? అంతే, ఇక ప్రజల మధ్య ఎటువంటి వ్యవస్థా ఉండదు! ఇక దారిద్ర్యం వలన నాశమవడానికి బదులు జూదం మూలంగా ప్రజలు నాశమవుతారు! . . . తిరువళ్ళువర్ పేరులో వీధికి వీధికి శిలలు పెట్టి ప్రతిష్ఠచేస్తే సరిపోతుందా? అతనే జూదంగురించి రాసివున్నారే?” అని అంటూ ఇతను ఆ పది పద్యాలని వల్లించి అర్థంకూడా చెప్పారు; మహాభారతంనుంచికూడా శ్లోకాలు చదివారు. “ఖర్మ, ఖర్మ, . . . ఇక మీ బ్రతుకు అంతే!” అని నెత్తిమీద కొట్టుకున్నారు.

నాకు కడుపు తిప్పింది. ఎందుకురా ఈ వెధవ లాటరీ టికెట్టు కొన్నానని వాపోయాను. ఐనాకూడా ఇతను ఎందుకు ఇంత ఆవేశంగా దీన్నిగురించి వాదిస్తున్నారని నాకు బోధపడలేదు; ఇతను చొక్కా తొడుక్కోరు; అందువలన ఈ ప్రపంచంలో అందరూ ఇతనిలాగే చొక్కా లేకుండా, పిలకతో, పంచాంగం చూసే క్షవరం చేసుకోవాలని ఇతను వాదిస్తారా?నేను చేసిన పనికి నేనుకూడా సరైన వాదం నా మనసులో తయారుచేసుకున్నాను.

ఆ చీటీని పుచ్చుకొని ఇప్పుడు నాదగ్గర అదివుంటే దానివలన ఏం కష్టం? కాని మన దురదృష్టం వలన మనకి ఒక నూరు రూపాయలు వస్తే . . . అది ఊరంతా తెలియదూ?

అంతేకాదు. ఇతను ఇలాగ మాటాడుతుంటే నేను లాటరీ టికెట్టు కొన్నది తెలుస్తే అందరూ మావారి చిత్తశుద్ధిని అనుమానించరూ? అప్పుడు నేనేం చేస్తాను?

ఆ అబ్బాయి - నాకు చీటీ ఇచ్చినవాడు - చెప్పాడు. పత్రికలవాళ్లు, ఫోటోగ్రాఫర్లతో ఎటువంటి గ్రామమైనా వెతకి ఆ లాటరీలో గెలిచినవారిని కనుక్కుంటారట. చెన్నపట్ణంలో దీనికోసం పెద్ద ఉత్సవం జరిపి ఒక పెద్దమనిషి మూలంగా ఈ పురస్కారం ఇస్తారట. ఇదేం ఖర్మ, దేవుడా!

'సరే, ఏమో కొనేసాం, ఎందుకీ ఉత్త కల్పన?' అని ఇతని దగ్గర దీనిగురించి నేను ఏమాటా అనలేదు.

కావాలనే ఒకరోజు ఇతనికి అన్నం వడ్డించినప్పుడు నేనే ఆరంభించాను.

"అదేమిటి? ఏదో ప్రైజ్ టికెట్టు అంటున్నారు . . . ఒక రూపాయి ఇచ్చి కొన్నవాళ్ళకి ఒక లక్షరూపాయలు దొరుకుతాయట . . . గవర్ణమెంటులో ఉన్నవారే నడపడంవల్ల అందులో ఎటువంటి మోసం, దగా లేదంటున్నారు . . . పక్కింటి అమ్మాయి పది టికెట్టులు ఒకేసారి కొందట . . . అది . . . అదేమిటి?" అని అడిగాను.

"ఈ సంగతి మన వంటగదివరకూ వచ్చేసిందన్న మాట! అది ప్రభుత్వం జరిపే జూదం! అంతే, మరేం కాదు. కలరాలాగ ప్రజలని పీడించే ఒక వ్యాధి అది. కలరా, మసూచి వంటి వ్యాధులని నివరించడానికి పనిచేసే ప్రభుత్వమే ఇదికూడ చేస్తోంది. అందువలన వాళ్ళకి డబ్బు వస్తోందట, పేదలు లక్షాధిపతులవుతున్నారట . . . ఎలాగో పోనీలే . . . నువ్వూ, నేనూ లక్షాధిపతులవలేదని ఏడుస్తున్నామా? మనకేం దానిగురించి గొడవ?" అని అన్నారు.

"ఎవరైనా మీదగ్గర వచ్చి లక్షరూపాయలు ఇస్తే, 'వొద్దు!' అని చెప్పేస్తారా?" అని అడిగాను.

అతను నన్ను చూసి నవ్వారు; నాకు ఒకటే అవమానం; నా దేహం వొణుకుతోంది.

'నలభై సంవత్సరాలు నాతో కాపురం చేసిన నీకా ఇటువంటి సందేహం?' అని అడుగుతున్నట్టుంది అతని చూపు . . . నేను తల వంచుకున్నాను.

"మీరు 'వొద్దు!' అని చెప్తారు, అది నాకు తెలుసు . . . కాని ఎందుకు అలాగ చెప్పాలి అని నేను అడుగుతున్నాను. మీ ముత్తాతలకి మాన్యంగా వచ్చిన ఈ

ఇంటిలో, వర్షం వచ్చినప్పుడు పడమటి భాగం మూడు సంవత్సరాలుగా పగులు బారిన గోడలమధ్య పరదలో మునిగిపోతోందికదా - దాన్ని సరిచెయ్యడానికి దారి తెలియక మనం ఉన్నాం. మనకి డబ్బు అవశ్యకమేకదా? 'మనం ఎందుకు అదృష్ట లక్ష్మిని నిర్లక్ష్యం చెయ్యాలి?' అని ఆలోచిస్తున్నాను. అది తప్పంటారా?" అని అడిగాను.

"ఓ, నువ్వు మాటాడడం చూస్తే నీకు ఆ లాటరీ టికెట్టు కొనాలని ఆశ. అవునా?"

నేను బదులు చెప్పలేదు.

"పెర్రిదానా . . . పేర్రిదానా, ఆశ మానవునికి శత్రువు. లాటరీలో మనకి బహుమానం రాదనే కారణంవలన నేను అది తప్పు అని అనలేదు; అది అధర్మంగా చాలామంది కడుపుమంటతో సంపాదించిన డబ్బు అని అంటున్నాను. యోగ్య మార్గంలో కాకుండా వచ్చే డబ్బు పాపాలమూట కదా? నువ్వు మా ముత్తాతలగురించి చెప్పావు . . . వాళ్ళందరూ ఉంఛవృత్తి చేసి మహా మేధావులుగా జీవించారు . . . నాకు బాగా జ్ఞాపకముంది . . . మా నాన్నగారు ఇదే శంకరమఠంలో పగలంతా పిల్లలకి విద్యాభ్యాసం చేసేవారు; సాయంకాలం కాలక్షేపం చేసేవారు; ప్రొద్దూనే ఉంఛవృత్తికి వెళ్ళేవారు . . . ఇంకొక వేళకి మిగిలేటట్టు కాకుండా ఆ పాత్ర ఉంటుంది. శ్లోకాలు వల్లించుతూ వీధిలో నడుస్తారు . . . ఆ ఆ ఇంట్లోనుంచి పిల్లలు తమ చేతుల్లో బియ్యం తీసుకొనివచ్చి అతనికి బిక్ష ఇస్తారు . . . ఎందుకో తెలుసునా పిల్లలే బిక్ష ఇవ్వాలని నియమం పెట్టారు? పెద్దవాళ్ళ చేతులైతే ఒక నాలుగిళ్ళ తరువాత ఆ పాత్ర నిండిపోతుంది . . . తక్కినవాళ్ళందరూ వాళ్ళ వాళ్ల ఇంట్లో కాచుకొని ఉంటారే? వాళ్ళ కానుకని అడ్డగించిన పాపం వచ్చేస్తుంది కదా? అందువలనే ఆ పాత్ర నిండిన తరువాత ఎవరైనా బిక్ష ఇస్తే దాన్ని తీసుకోరు . . . బిక్ష ఇచ్చినవారిమీద అందులోనుంచి రెండు మూడు అక్షింతలు తీసి వాళ్ళ తలమీద పోసి ఆశీర్వాదం చెస్తారు . . . ఆ వంశంలో పుట్టిన పుణ్యం వలనే నాకు ఈ జ్ఞానం వచ్చింది . . . ఇంతకంటే మరే అదృష్టం కావాలని నాకు తెలియదు. ఈ నెమ్మదిని, ఆరోగ్యవంతమైన మనసుని ఎన్ని లక్షలు ఇవ్వగలవు? జూదం మూలంగా, డబ్బు ద్వారా ఈ ప్రభుత్వం లక్షాధిపతులని ఉత్పత్తి చేయవచ్చు కాని ఒక జ్ఞానస్థుడిని, ఒక చదుర్వేద పండితుడని వీళ్ళు ఇవ్వగలరా?" అని రోజంతా నాదగ్గర మాటాడారు.

ఇదంతా జరిగి పదిరోజులైపోయాయి. నేను చీటీగురించి పూర్తిగా మరిచిపోయాను.

నిన్న, ఆ పిల్లవాడు - నాకు ఆరోజు టికెట్టు అమ్మిన అబ్బాయి - ఒక పేపరుని తీసుకొనివచ్చి "ఇందులో గెలిచినవాళ్ల నంబర్లు వచ్చాయి . . . మీ టికెట్టు తీసుకురండి . . . చూద్దాం . . . " అని ఉత్సాహంతో అరుచుకుంటూ వచ్చాడు. మంచి వేళ! ఇతను అప్పుడు ఇంట్లో లేరు . . .

నాకు కడుపు తిప్పింది.

'దేవుడా, నన్ను కాపాడు!' అని నేను ప్రార్థించడంతో ఒక యుక్తి తోచింది.

"దాన్ని ఎక్కడపెట్టానో జ్ఞాపకం లేదురా," అని వాడితో ఒక అబద్ధం చెప్పేసాను. ఆ నంబరుకి ఏమైనా బహుమానం వస్తే ఈ ఊరులో అందరూ గుంపుగా మా యింటిముందు పుంజుకోరూ?

ఆ పిల్లవాడి మొహం అలాగే వాడిపోయింది. వాడు కోపంతో నన్ను చూస్తున్నట్టు ఆ పేపరుని పడేసి వెళ్ళిపోయాడు.

వాడు వెళ్ళిన తరువాత నేను ఆ పేపరుని తీసుకొని నా గదికి వెళ్ళి ఒంటరిగా దాన్ని చూసాను.

నాకు చదవడం తెలియదుగాని సంఖ్యలు అర్థమౌతాయి. ఒ సంఖ్యలముందు ఏవో అక్షరాలున్నాయి; అవేమో నాకు తెలియదు. కాని అదేలాగ నా చీటీలోవుందా అని వెదికిచూసాను.

దేవుడా! మొట్టమొదటే అదేలాగ రెండు అక్షరాలు! తరువాత అదేలాగ . . . మూడూ, ఏడు, సున్నా, ఒకటి, ఒకటి, ఆరు!

అంటే . . . ఆ లక్షరూపాయల బహుమానం నాకే వచ్చిందా . . . ఐయయ్యో, నేను ఇప్పుడు ఏం చేస్తాను?

మధ్యాహ్నం ఆయన రాగానే ఆ చీటీని తీసుకొనివెళ్ళి అతనికాలుకిందపెట్టి "నన్ను క్షమించండి!" అని ఏడ్చాను.

"నేనేమో ఏదో తమాషాకి ఆ అబ్బాయి అడిగాడని కొనేసాను; దీనిగురించి మీరు ఇంత కోపంగా ఉన్నారని నాకు కొన్నతరువాతే తెలిసింది. 'ఇందులో మనకేం బహుమానం వస్తుంది?' అని నేను అజాగ్రత్తగా ఉండిపోయాను. నాకు బహుమానం

రాకూడదని దేవుణ్ని కూడా ప్రార్థించుకున్నాను . . . మరి ఇప్పుడు ఇలా ఐపోయింది. మీరు నన్ను క్షమించి దీన్నీ, నన్నూ ఏలుకోవాలి . . ." అని బతిమాలాను.

అతను మళ్ళీ నవ్వారు. నవ్వుతూనే నన్ను ఎత్తి నిలబెట్టారు. మొహంలో నవ్వు మారనేలేదు. అతను అన్నారు:

"ఏమే, నువ్వు ఇప్పుడు లక్షాధిపతి ఐపోయావ్ . . . సభాష్! ఇది నాకు సంబంధం లేకుండా నువ్వే సంపాదించుకున్న ధనం; నువ్వెందుకు దీన్ని నా కాలుకిందపెట్టి ఈ పాపాన్ని నా తలలో రుద్ది నన్ను మోయమంటున్నావ్? నేను ఈ లక్షరూపాయలు వొద్దు అని చెప్పినది తమాషాకి కాదు; నిజంగానే, నాకది వొద్దు. నాకిప్పుడు ఉన్న బెంగ అంతా ఇదే: ముందులాగ కాక, అంటే ఇరవై సంవత్సరాలముందు ఉన్నట్లు, ఇప్పుడంతా వేదాభ్యాసం చేసేవాళ్ళు తగ్గుతూ వస్తున్నారు. ఇంకొక పది విద్యార్థులు దొరికితే నాకు చాలు; వాళ్ళు డబ్బువలన రాకూడదు, డబ్బుకోసమూ రాకూడదు . . . అది నీకు బోధపడదు . . . సరే, అది నీ ప్రశ్న. నేనెప్పుడూ ఉంఛవృత్తి చేసి జీవించే బ్రాహ్మణున్ని. మా నాన్నగారూ, తాతగారూ, ముత్తాతలూ - అందరూ ఆ మార్గంలోనే వచ్చారు. ఒక లక్షాధిపతికి భర్తగావుండే అంతస్తు నాకు లేదు . . . " అని ఏమేమో అంటున్నారు ఇతను.

"ఎందుకు మీరు మన ఇద్దరినీ ఇలా విడదీసి మాటాడుతున్నారు? . . . ఇప్పుడు నేనేం చెయ్యాలి అని చెప్పండి, అది నేను తప్పక చేస్తాను . . . నాకిలా జరుగుతుందని తెలియదు . . . జరిగిపోయింది . . . ఇక నేను ఏం చెయ్యాలి?" అని మళ్ళీ మళ్ళీ నేను అడుగుతున్నాను . . .

ఎటువంటి దయా, దాక్షిణ్యం లేనట్టు అతను మళ్ళీ నవ్వుతూ చెప్పారు:

"ఈ లాటరీ టికెట్టుని ఉపయోగించుకోవాలి అని నువ్వు నిశ్చయిస్తే అది నీ ఇష్టం. తిన్నగా వెళ్ళి ఫోటో తీసుకొని పత్రికలలో అది ప్రచారమై నువ్వు హాయిగా ఉండవచ్చు. నువ్వు ఎవరి భార్యవని చెప్పకూడదు . . . నీ తృప్తికోసం ఆ అబద్ధం చెప్పుకొని కాలం గడుపుకో . . . లేకపోతే 'ఈ మాయ వలలో నేను చిక్కకుండా ఉంటాను!' అని ఈ వెధవ టికెట్టుని చింపేయ్, అవును, దాన్ని చింపి పారెయ్! మరెవరికైనా ఇచ్చి దానికి వడ్డీ తీసుకొని జీవించితే అదీ పెద్ద పాపమే! పాపిష్టి మనసుకి ఇటువంటి ఆలోచనలు

వస్తాయి. వాటికి బలి అవకుండా ఎటువంటి కుటిలమైన దారిలోనూ పడకుండా ఆ టికెట్టుని చింపి పారెయ్. ఈ రెండు దారులూ నీ ఇష్టం. పాపమా, భాగ్యమా అని నిర్ణయించేది నువ్వే. ఇక నేను వెళ్ళాలి " అని అంటూనే వెళ్తున్నారే ఇతను . . .

ఇప్పుడు నేనేం చెయ్యను చెప్పండి . . . దేవుడా! ఒక లక్ష రూపాయలు! ఈ ఒక లక్ష రూపాయల్ని, అదృష్ట లక్ష్మిని ఎటువంటి దాక్షిణ్యం లేకుండా తోసి పారేయడం ఎలాగ? అతని చెయిలో పడితే చింపి పారేస్తారు! అది జ్ఞానులకి సులభం.

మనలాంటి అజ్ఞానులకి అది వీలవుతుందా, చెప్పండి!

ఎన్నో లక్షలకంటే ఇతను పెద్దవారే, నేను కాదనను. ఈ లక్ష రూపాయలని కాలి ధూళితో సమానంగా భావిస్తూ, ఉంఛవృత్తి చేసే ఇతనికి ఏ లోపమూ రాదు. అటువంటి మహనీయులతో సంసారం చేసి ఉంఛవృత్తి జీవితంలో పాల్గొన్న నాకుకూడా ఖ్యాతి లభిస్తుంది . . .

ఏది గొప్ప - డబ్బా, జ్ఞానమా? అది నాకు తెలియదు. కాని డబ్బు ఎలాగ, ఎంతవున్నా శాస్వతం కాదో అలాగే మానవులు కూడా. ఎంత జ్ఞానులైనా వాళ్ళ జీవితం శాస్వతం కాదే . . .

అలాగ తలచడమే, చెప్పడమే పెద్ద పాపం. కాని ఈ రోజుల్లో ఎటువంటి పతివ్రతకూడా తన భర్తతో తనూ దహనమవడం లేదే? ఒక వేళ నేను అలాగ ఉండవలసి వస్తే? శివ శివా . . .

ఇతను ఉంఛవృత్తి చేస్తే నాకేం గొప్ప? అందరూ నన్ను ఒక ముష్టిదనే అంటారు; కట్టిన భార్యని వీధుల్లో బిచ్చగత్తెగా వదిలేసారని ఈ మహా పండితుడుగురించి పోచికోలు కబుర్లు చెప్తారు . . .

ఇతనైతే దీన్ని చింపి పారేస్తారు, కాని నేనలా చెయ్యగలనా? కాని, అతనలా చెప్పి వెళ్ళిపోయారు . . .

ఇప్పుడు నేను ఆ చీటీతో నిలబడివున్నాను. ఇది నా చెయిలో బరువుగావుంది. నేనేం చెయ్యాలి చెప్పండి!

********

**(మూలం: ప్రచురణ, ఆనంద వికటన్, 1969)**

# Jayakanthan's works translated into English by Andy Sundaresan and available as E-books:

**జయకాంతన్ కథలు**

**బ్రహ్మోపదేశం**


**ఋషిమూలం**

**కోకిలా ఎంత పని చేసింది!**

**ఎన్ని కోణాలు! ఎన్ని చూపులు!**

**Publisher:**

**Kurinji Publications**
**10944 San Pablo Avenue # 610**
**El Cerrito, CA 94530-2377**
**Email:**
**rangan.sundaresan@gmail.com**



( 1934 - 2015 )

# ఈ కథల గురించి . . .

"ఈ సంపుటంలోని కథలన్నీ స్త్రీజాతి మహిమని చాటే కథలు. ఇవన్నీ జయకాంతన్ 1960-69 మధ్యకాలంలో రాసారు.

ఇందులోని ***ఎన్ని కోణాలు!ఎన్ని చూపులు!*** కథని ఈ సంపుటంకి సూచనగా పేరుపెట్టడం గమనార్హం . ఈ కథల్లో స్త్రీ పాత్రలని వివిధ కోణాల్లో, నానావిధమైన కథాంశాలలో - ఈ ఆధునిక ప్రపంచంలో ఎన్నో ఆటుపోట్లని ఎదురుకొంటూ తమని తామే రక్షించుకుంటూ తమ ఇంటినీ, తమ పిల్లల్ని మాత్రమే కాకుండా తమలోని సంస్కారాన్ని , సంప్రదాయాలని కూడా రక్షించుకుంటూ ముందుకు పోతున్న స్త్రీ జాతి ప్రతినిధులని - రచయత జయకాంతన్ సునిశితంగా ఆవిష్కరించారు.

ఎన్ని విభిన్నమైన పాత్రలు! స్త్రీ పురుషుల ఎన్ని మధ్య అంతరంగ సంఘర్షణలు,అసమానతలు!"

ముందు మాట నుంచి